
పురాణములు

# శ్రీ పరమేశ్వరి-దేవీ భాగవత వచనము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

“ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్” ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


“ మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి “

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీమత్పరదేవతాయైనమః

# శ్రీ పరమేశ్వరి

( వచనము )

దేవీభాగవతమునకు తెనుగున సంక్షిప్తరూపము



రచయిత

కవిశేఖర కొండేపూడి సుబ్బారావు

# సమర్పణము

నేనింతకు పూర్వము ద్విపదలో రచించిన శ్రీ మద్రామాయణ ఉత్తర రామాయణ, భారత, కృష్ణభాగవత, దేవీ భాగవతములను భగవత్సమానులు సర్వ జగదారాధ్యులునగు శ్రీవాల్మీకి వ్యాసమహర్షుల దివ్య సంస్మృతిచిహ్నములుగా సమర్పించితిని. ఈ పరమేశ్వరి గ్రంథము కూడ అట్లేవారి పవిత్ర సంస్మృతి చిహ్నముగా భక్తి పురస్సరముగ సమర్పించు చున్నాను.

శ్రీకర మున్నతాశయ విశిష్టము సర్వజనప్రమోద సౌ
ఖ్యాకర మార్యధర్మ పరమార్థముపై విలసిల్లు రామగా
థాకమనీయ కావ్యకవితన్ భువికిచ్చిన పుణ్యరాశి వా
ల్మీకికి కేలుమోడ్చి ప్రణమిల్లెద నాదికవీంద్ర మూర్తికన్.

వాసిత ధర్మమార్గ విభవాత్ముడు సర్వపురాణకర్త ప్ర
జ్ఞాసముపేతు డుజ్జ్వలయశః కలితుండ ఖిలాగమార్థ వి
న్యాసము తేర్పఱించిన మహామహితాత్ము డనంత శేముషీ
భాసురమూర్తి వ్యాసభగవానుని కంజలి లెట్టి మ్రొక్కెదన్.

ఆవాల్మీకియు వ్యాసమౌనియును దివ్యప్రాభవుల్ భారత
క్ష్మావిఖ్యాతికి మూలకారణులు లోకక్షేమ కార్యైక దీ
క్షావేశ ప్రథమాన మూర్తులు జగత్ సంపూజ్యు లా మౌని రాట్
సేవా సంస్మృతి కీపురాణరచనల్ చిహ్నమ్ములై పొల్చుతన్.

# విషయసూచిక


స్కంధము 1 పుటలు 1–17
నైమిశారణ్యము 1
సూతుడు శౌనకాదులకు
దేవీ భాగవతము బోధించుట 1
దేవీమహిమ 2
మణిద్వీప వర్ణనము 3
వ్యాసుని పుట్టుక
దేవీభాగవతప్రచారము 7
శ్రీ శుకుని జననము
వైరాగ్యము 8
శుక జనక సంవాదము 10
ధృతరాష్ట్రాదుల జననము 13
కౌరవ పాండవులు 14
శ్రీశుకుడు పరీక్షిత్తునకు దేవీ
భాగవత ముపదేశించుట 15
జనమేజయుడు వ్యాసుని బోధ
వలన దేవీభక్తుడగుట 16
స్కంధము 2 పుటలు 18–32
శ్రీమహావిష్ణువునకు జగదంబ
అనుగ్రహము 18
మధుకైటభ చరిత్రము 19
హయగ్రీవావతారము 22
వేదములు దేవిని స్తుతించుట 23
శక్తిస్వరూపము 24
త్రిమూర్తులకు దేవీదర్శనము 26
త్రిమూర్తులకు దేవి
ఉపదేశము 29
శ్రీహరి దేవీయజ్ఞ
మొనరించుట 31
స్కంధము 3 33–52
బ్రహ్మాండోత్పత్తి త్రిగుణ
స్వభావము 33
దేవీపూజా విధానము 34
కన్యాపూజ 36
కర్మసిద్ధాంతము 38
శ్రీవిష్ణువునకు భృగుముని
శాపము 40
శ్రీరాముడు దేవినర్చించుట 41
శ్రీకృష్ణావతారము 41
జగదీశ్వరికి భూదేవి మొఱ 4
శ్రీకృష్ణుడు దేవిని ప్రార్థించుట 4
దైత్యులవిజృంభణ 4
దేవేంద్రుని బాధలు దేవికరుణ
ప్రహ్లాదుడు పరమేశ్వరిని
ప్రార్థించుట
స్కంధము 4
దేవినిష్పక్షపాతకరుణ
దేవేంద్రుడు పదభ్రష్టుడగు
దేవేంద్రుని బ్రహ్మహత్యా
దోషము–వృత్రాసుర వధ

| | | | |
|---|---|---|---|
| నహుషుడు స్వర్గ మేలుట | 56 | ధూమ్రలోచన చండ ముండుల వధ | 88 |
| శచీదేవిపై పరమేశ్వరి కరుణ | 58 | రక్తబీజుని వధ | 98 |
| దేవీతత్వము-కర్మప్రభావము | 60 | శుంభ నిశుంభుల వధ | 90 |
| ఆడీ బక యుద్ధము | 62 | దేవీరూపములు: | |
| హైహయులు | 62 | దేవీపూజకుపుణ్యదినములు | 92_98 |
| పర్వత నారదులు | 63 | దేవీభక్తులు | |
| సన్మార్గ విధము కలియుగము | 64 | సత్యవ్రతుడు | 98 |
| తారా శశాంకము | 66 | సుదర్శనుడు | 101 |
| ఊర్వశీ పురూరవులు | 67 | సురథుడు | 105 |
| వసువుల చరిత్ర | 70 | బృహద్రథుడు | 107 |
| దేవకీ వసుదేవులు | 71 | సుకన్యాచ్యవనులు | 108 |
| శ్రీవిష్ణువు అవతార క్రమము | 72 | స్కంధము-6 | 112-128 |
| దేవదైత్యాంశావతరణము | 73 | సృష్టిక్రమము | 112 |
| మాయా ప్రభావము | 74 | శ్వేతవరాహావతారము | |
| స్కంధము. 5 | | వసుధోద్ధరణము | 113 |
| వకేశవులు | 76 | మనువుల పాలనము | 114 |
| పీశక్తి | 77 | సప్తద్వీపములు | 114 |
| మహిషాసుర వృత్తాంతము | 78 | లోకాలోక పర్వతము | 116 |
| మహిషుని విజృంభణ | 78 | ఊర్ధ్వఅధో లోకములు | 117 |
| దేవీ ప్రాదుర్భావము | 81 | జంబూద్వీపము- | |
| మహిషుడు దేవిని కామించుట | 83 | భరతవర్షము | 118 |
| తామ్ర చక్షుర బిడాల అసిలోమ | | గ్రహ సంచారము | 116 |
| బాష్కల దుర్ముఖుల వధ | 83 | దేవమనుష్య కాలమానములు | 121 |
| మహిషాసుర వధ | 85 | సూర్యచంద్రరాజవంశములు | 123 |
| శుంభ నిశుంభుల విజృంభణ | 86 | మన్వంతరములు | 123 |
| కాళికా ప్రాదుర్భావము | 87 | | |

సత్యవ్రతుడు రాజనీతి 125
త్రిశంకుడు-హరిశ్చంద్రుడు 126
స్కంధము-7 128-134
సురగర్వాప హరణము 129
గౌతముని ప్రశస్తి
గాయత్రి ప్రభావము 131
స్కంధము-8 135-145
సనకాదులకు దేవిదర్శనము 135
లక్ష్మీ విష్ణువులు 135
పతీదేవి యోగాగ్ని
కాహుతి యగుట 135
దేవీపీఠములు 137
గౌరీ శంకరులవివాహము
తారకాసురవధ 138
దేవీగీతలు 138
దేవీ విశ్వరూపము 140
భక్తి జ్ఞాన కర్మయోగములు 141
దేవీవ్రతములు
ఉత్సవములు 143
స్కంధము-9 146 151
పంచ ప్రకృతి వివరణము 146
రాధాకృష్ణులు 147
ప్రకృతి అరాధనము 148
సరస్వతీకవచము 149
స్కంధము-10 151-171
లక్ష్మీగంగాసరస్వతుల
జన్మకథ 152
వసుధా మహత్త్వము 154
గంగాభ్యుదయము 155
గంగా విష్ణు సంబంధము 156
భూమిపై గంగావతరణము 159
వేదవతి 159
సీత 160
తులసీశంఖచూడులు 162
సావిత్రి 167
ఇంద్రుడులక్ష్మీపూజసేయుట 168
సురభి చరిత్ర 169
రాధాదుర్గలపూజావిధానము 172
స్కంధము-11
సదాచారములు 172
రుద్రాక్షమహిమ 173
గాడిదకథ 174
గుణనిధికథ 174
శిరోవ్రతము-విభూతిమహిమ 175
దుర్వాసుని కథ 176
ఊర్ధ్వపుండ్రము 177
వైశ్వదేవము 178
సంధ్యోపాసన 179
యోగాభ్యాసము 180
మితాహారము 182
స్కంధము-12
గాయత్రీ మంత్రము' స్తవము,
సహస్ర నామములు 183
ఫలశ్రుతి 197

# అవతారిక

శ్రీపరమేశ్వరియను శీర్షికగల ఈ గ్రంథము వ్యాసమహర్షికృత దేవీభాగవతమునకు ఆంధ్రవచనమున సంక్షిప్త రూపము. 1986 సంవత్సరములో దేవీ భాగవతమును విపులముగ ద్విపదలో దాదాపు 800 పుటల గ్రంథమును వ్రాసిప్రచురించితిని. ఆగ్రంథమునకు బహుళ ప్రజాదరణ లభించినది. అయినను దేవీ పురాణము సులభగ్రాహ్యముగ చదువు కొనుటకై వచనమున ఒక కథారూపమున నున్నచో భాషయందు ప్రవేశమెక్కువగ లేని సామాన్యులకు కూడ ఉపయోగకరముగ నుండునని పలువురు తమ అభిప్రాయమును వెలిబుచ్చుటచే దేవీ పురాణమును సంక్షిప్తముగ ఇపుడు రచించితిని. శ్రీగీతామృత, రామాయణ భారత కృష్ణభాగవతాది అనేక గ్రంథములిది వఱకు వ్రాసితిని ఆకావ్యసుమాలలో ఇది నూతన పుష్పము దేవీ భాగవతమునగల సర్వవిషయములును సంక్షిప్తముగ ఇందున్నవి. కథాసంవిధానము మఱింత ఆకర్షణీయముగ నుండునను తలంపుతో ఒకటి రెండు విషయములు ఒక స్కంధము నుండి మఱియొక స్కంధమునకు మార్చబడినవి. ఉదాహరణకు, దేవీ నివాసమగు మణిద్వీప సౌందర్య వర్ణనము దేవీవైభవమును దెలుపు ప్రథమస్కంధమునందే చేర్పబడినది. దేవీ మహత్త్వము, దేవీ మంత్రమహిమను దెలుపు భక్తుల కథలు వీలయినంత వరకు ఒక చోటికి చేర్పబడినవి, అందందు కొన్ని ముఖ్యవిషయములకు వివరణములతో బాటు, భక్తుల నిత్యపారాయణకు పయోగపడు దేవీ సహస్రనామములు చివరి స్కంధమున నీయబడినవి. నిత్య ప్రార్థన కనువగు శ్రీదేవీ దండకము కూడ కలదు, పఠితలీ విషయములను సహృదయముతో గ్రహింతురుగాక.

దేవీభాగవత వచనగ్రంథము లీటీవల తెలుగు నం దపుడపుడు వచ్చుచునే ఉన్నవి వానిలో ఈ గ్రంథమొకటి.

దేవికథలు, ఎన్నిసారులు వినినను మరల మరల వినవలయుననిపించు, మధుర మహనీయ గాథలు. ఎందఱెన్ని విధములు ఎన్ని తడవలు వ్రాసినను పవిత్రమై జగత్ క్షేమంకరమై విలసిల్లు ఆ జగన్మాత చరిత్రము, వ్రాయదగినదే. మానవాభ్యుదయమునకు తోడ్పడు నీతులను ధర్మములను ప్రజలకు సుబోధకముగ తెలుపుటకే వేదోక్త ధర్మములను కూడ కలిపి మన పూర్వఋషులు మహాపురాణముల రచించి మనకు పెన్నిధులుగ నిచ్చిరి. వారిలో ఈ దేవిభాగవతమొక్కటి.

వరుసగ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల భార్యలగు సరస్వతి లక్ష్మి, పార్వతియు దేవి ప్రధానాంశలే. దేవి ప్రభావముచే వారి భార్యల వలన లభించు శక్తియే హేతువుగ ఆ త్రిమూర్తులు వారి వారి కార్యములగు జగత్ సృష్టి పోషణలయము లొనర్చుటకు సమర్థులగు చున్నారనినచో ఆ పరమేశ్వరి మహిమ ఎట్టిదియో ఊహింపవచ్చును. మ్మిపేఱుగ వచింప నవసరము లేదు.

ఆ దేవియే పరమేశ్వరి, సావిత్రి, గాయత్రి, అఖిల శక్తి స్వరూపిణి. ఆశక్తియే సకల చరాచర భూత సంతతికాధారము శరణ్యము. ఆయమ సర్వజగత్కారిణి, సర్వజగదారాధ్య. ఆమె అనుజ్ఞ లేనిదే తృణమైనను కదలదు, ఆమె అనుగ్రహమున్నచో తృణమైనను మేరు సమానమై విలసిల్లును. భక్తుల నెప్పుడేరీతిగ

రక్షింప వలయునో అమెకే యెఱుక లోభమోహాది దుర్గుణదూరు సత్ప్రవర్తనులు, సదాచారులు దేవీపూజ జపతత్పరులు నగు భక్తుల యోగ మములామె స్వయముగ వహించి చూచు చుండును. ఆ పరమేశ్వరి అనుగ్రహము ఇహ పరానంద దాయక మను ఒకమాటచాలును. అజగదంబమహిమ నెఱుగుటకు.

ఈ గ్రంథమునకు ప్రముఖులైనవారు వ్రాసిన పరిచయము'' తోబాటు, పూర్వము నాచే వ్రాయబడిన దేవీభాగవత ముపై వచ్చిన కవిపండితుల అభిప్రాయములలో కొన్ని భాగములిందు పునర్ముద్రింపబడినవి,

దేవి మహిమను, దేవి నామమంత్ర జపప్రభావమును తెలుపు ఈ గ్రంథము యొక్క ప్రయోజనమునంది ఆంధ్ర ప్రజానీకము దేవి అనుగ్రహమునకు పాత్రులగుదురుగాక అని ఆశించుచు, నాయీ రచన సర్వవిధములను సఫలము కావలయునని మనః పూర్వకముగ ఆ పరమేశ్వరికి నమస్కృతులర్పించుచు ప్రార్థించు చున్నాను-

విభవ సం॥ర చైత్ర శు॥ పాడ్యమి. ఉగాది, గ్రంథకర్త

6-4-89

శ్రీ శ్రీ శ్రీ

వసంతరావు వేంకటరావు
కేంద్ర సాహిత్య అకాడెమీ సభ్యులు

"దేవీభాగవతము" విజ్ఞానసర్వస్వం వంటిది. అందులో సృష్టి స్థితి లయాలగురించి, కాలంగురించి, దేవతామూర్తుల గురించి బహురూపాలలో ప్రవర్తించు శక్తులగురించి, మానవుడు చేయవలసిన కార్యక్రమాలగురించి, ఆరాధనావిధానాలగురించి అనేకానేక విషయాల వివరణఉంది అది చదివేటప్పుడు, భారత భాగవత రామాయణాలకున్న ప్రాచుర్యందేవీ భాగవతానికి ఎందుకు లేకపోయిందా అనే సందేహంకలుగుతుంది, ఉద్గ్రంధమై, అవగాహనకు వీలుకలిగించే అనువాదాలు లేకపోవడము కారణమని తోస్తుంది.

ఆ లోటుతీర్చడానికో అన్నట్లుశ్రీ సుబ్బారావుగారు దేవీభాగవతాన్నిపూర్తిగా ద్విపదలో రచించమేడకాకుండా. అదికూడా సామాన్యులకు అందుబాటులో ఉండుటకు "పరమేశ్వరి"ని వచనమున క్లుప్తీకరించేరు, సరళమైనభాష చదువరిని సునాయాసంగా తీసుకొనిపోయేశైలి; ఇవి ఈగ్రంథప్రధానలక్షణాలు.

వృత్తిరీత్యా ఎకౌంటెంటు అయినా బలవత్తరమైనప్రవృత్తిమాత్రం కవితాలోకంలో స్వైరవిహారంచేయగల శక్తి ప్రసాదించింది. శ్రీమద్భగవద్గీత, రామాయణకృష్ణభాగత మహాభారతాదికొన్ని స్వతంత్ర గ్రంథములను ఉత్కృష్ట ప్రాచీనగ్రంథరాజాలను అనువాదాలుగా, ద్విపదలుగాను, గద్యపద్యరూపాలలో అందించడమేకాక సమకాలీన విఖ్యాత కవులచేరచింపించి" ప్రసన్నభారతి" గా ఒక సంకలనాన్ని ప్రచురించిన దేవీభక్తులు. వారి అవిచ్ఛిన్న కృషికి ధన్యవాదాలు.

వసంతరావు వేంకటరావు

క్రాంద్రేగుల సూర్యనారాయణమూర్తి
అడ్వకేటు స్టాండింగు కౌన్సిలు ఎండోమెంట్సు వుడా
శ్రీ భారతీతీర్థ ప్రధానకార్యదర్శి                విజయనగరము

సుప్రసిద్ధ కవిచంద్రులు శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు వ్రాసిన "శ్రీ పరమేశ్వరి" గ్రంథమును చదివి పరమానంద భరితుడ నైతిని. వీరిదివరలో వ్రాసిన దేవీభాగవతము ద్విపద కావ్యమునగల అన్ని విషయములు ఇందున్నవి, భాషాప్రవేశమంతగాలేని సామాన్యులకుగూడ అందుబాటులో ఉన్న సులభశైలి గ్రంథమిది. సర్వసంపత్కరమైన పవిత్ర శాస్త్రము.

శ్రీ సుబ్బారావుగారు బహుగ్రంథకర్తలు. శ్రీమద్రామాయణ భారత భాగవత దేవీభాగవతములు, శతకములు, పద్యగద్య గ్రంథములెన్నియో వ్రాసి కీర్తిగడించిన ఉత్తమ కవులు. వీరి గీతామృతము ఆంధ్ర జగత్ప్రసిద్ధి గనినది.

విజయనగరమున దాదాపు డెబ్బది యేండ్లనుండి వర్ధిల్లుచున్న విద్యాసాంస్కృతిక సాహిత్య సంస్థ శ్రీభారతీ తీర్థ. శ్రీ సుబ్బారావుగారి నిర్విరామ సాహిత్య కృషిని రచనా నైపుణ్యమును గుర్తించి వీరికి "కవిభూషణ" బిరుదము నొసగి శ్రీభారతీతీర్థ సన్మానించినది.

ఇట్టి ధార్మిక గ్రంథములు వ్రాయుచు ఒకప్రక్క భాషకు మఱొకప్రక్క ప్రజలకు సేవచేయుచున్న శ్రీ సుబ్బారావుగారు చరితార్థులు. వారికి ఆంధ్రప్రజానీక మెంతయో ఋణపడి యున్నది శ్రీ సరస్వతీ కృపవలన శ్రీ సుబ్బారావుగారు దీర్ఘాయుస్సంపదలు కల్గి ఇట్టి సద్గ్రంథము లింకను వ్రాయుదురుగాక.

బ్రాహ్మీభూషణ, పండిత రత్న, విద్యాభాషాప్రవీణ
రాంభట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి ఎం. ఏ, పి. ఓ. ఎల్.

శక్తియే జగదారాధ్య. ఆమెయే సర్వజనసంపూజ్య. మూర్తిత్రయాభివంద్య. శక్తియే ప్రధానదైవతము. తదితరు లప్రధానులు. అట్టి శక్తియగు దేవినిగూర్చి విశదముగ జెప్పిన గ్రంథమే దేవీభాగవతము-

దీనిని ద్విపదకావ్యముగా మలచినవారు శ్రీశ్రీ కొండేపూడి సుబ్బారావుపంతులుగారు. ద్విపదలో అతిస్పష్టముగ పురాణము నంతయు వివరించిరి. వీరి రచన కుంటుపడకుండ ధారావాహిక ముగ ప్రవహించును. రహస్యాతిరహస్యములైన మంత్రములు కవచములు స్తోత్రములు దేవీనామావళి వయోభేదమున గల్గు నామములు శక్తిసామర్థ్యములు బహువిధములుగానున్నవి. వానిని విడువక కడు జాగరూకతతో ఇందు పొందుపరచిరి,

భగవద్గీతకు తెలుగు పద్యతాత్పర్యములతో అనువాదము, శ్రీమద్రామాయణ ఉత్తరరామాయణ, విష్ణుభాగవత, మహాభారత, వేంకటేశ్వర కర్ణామృతాది గ్రంథము లెన్నియో వీరు వ్రాసిరి., ప్రతిభావ్యుత్పత్తులు రెండును సమానస్థాయిలోనుండి కల్పనాచాతుర్యము మృదుమధుర పదజాలముతో వీరి కవిత అతిమధురముగ నుండును.

ఆ పరాభట్టారిక శ్రీ సుబ్బారావుగారికి అన్నివిధముల ఆయురారోగ్య ఐశ్వర్యాదుల నొసంగి సంరక్షించుగాతమని ఆశీర్వదింతును.

విద్వత్కవిశేఖర, సాహిత్యాలంకార, విద్వాన్,
ఆచార్య దివాకర్ల రామమూర్తి

శ్రీ భారతీయ సంస్కృతి నందనారామములో నిత్యనవ్యములై పరిమళమువీడక సర్వ సువర్ణసుమనస్సంజ్ఞేయములయిన కల్పకములు పురాణములు. వ్యాసభగవానుని రచనలగు మహాపురాణములలో శ్రీ దేవీభాగవతమొకటి.

అట్టి మహాపురాణమయిన దేవీభాగవతమును సులభ బోధ్యమగు భాషలో మనోహరమగు ద్విపదలో శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు రచించి ధన్యులైనారు. శ్రీ సుబ్బారావుగారు మహర్షిప్రతిపాదిత సంస్కృత్యుపాసకులు. లోకశ్రేయమే లక్ష్యముగా గలవారు. కవులు వ్యుత్పన్నులు. అట్లగుట వలననే శ్రీమద్రామాయణ కావ్యమును శ్రీమద్భరతేతిహాసమును (కృష్ణ) భాగవత పురాణమును, ఇంకను అనేక పద్యగద్య గ్రంథములను రచించి కృతార్థులయినారు. వానికి విశేష సహృదయాదరణము కూడ లభించినదనుట వారి ప్రతిభకు నొక దివిటీ.

దేవీభాగవతము ఒక మంత్రశాస్త్రము. బహు సాధక సాధ్య సంప్రదాయ రహస్య సంబంధము. బీజాక్షర నిగళితము. శ్రీ సుబ్బారావుగారు భగవద్గీతాభాష్యమనదగు గీతామృతమును, శ్రీమద్రామాయణాది బహుకావ్యములను వ్రాసిన సమర్థులు. ఇట్టి పవిత్రగ్రంథమును వ్రాయుట కింతకన్న నేమి కావలెను.

ఈ దేవీభాగవత ద్విపద రచన సర్వశాస్త్రసమ్మతముగా పదపదార్థరహస్యప్రయోగమనోజ్ఞముగ సాగినది. దేవ్యనుగ్రహమున వారు చిరాయురారోగ్యైశ్వర్యవంతులు గావలయునని ఆశీర్వదించుచున్నాను—


వ్యాకరణాలంకార చక్రవర్తి, సాహిత్య విద్యాప్రవీణ,
అప్పల్ల సోమేశ్వరశర్మ M. A, P. O. L.

శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు, సహృదయ మిత్రులు సరసకవితా వైభవోపేతులు. సతత సరస్వతీ వరివస్యానిష్ఠాగరిష్ఠులు. వీరు ఇదివరకు గీతామృత వేంకటేశ్వర కర్ణామృతాది గురు లఘుకృతులెన్నియో గద్య పద్యముల రచించి లబ్ధప్రతిష్ఠులయిన సుప్రసిద్ధకవులు. శ్రీమద్రామాయణ భారత భాగవతములు మూడును వీరి చేతిచలువవలన ఒకేమూసలో (ద్విపద కవిత) సకల జనరంజకములుగా వెలుగొందుచున్నవి.

ప్రకృతము శ్రీ సుబ్బారావుగారు భక్తలోకమున ప్రఖ్యాతమైన శ్రీ దేవీభాగవతమును ఆంధ్రమున ననువదించినారు. భాష సరళము, మధురము, భావములు భక్తిపరిపూర్ణములు. ఈ కృతి సర్వసహృదయాస్వాద్యము తప్పక కాగలదని నా అభిసంధి. దేవీభక్తులకు హస్తభూషణమేగాక "సర్వస్వము" కాదగిన కావ్యమిది.

కృతికర్తకు నా అభివందనములు, అభినందనములును, "స్వయంతీర్ణః పరాన్ తారయతి" వారి దీక్షగా తోచుచున్నది. అది సఫలమగుగాక. మహాకావ్యములను మహాపురాణములను రమ్యమైనరీతిలో ఆంధ్రులకందించుచున్న శ్రీ సుబ్బారావుగారు ధన్యులు.

# శ్రీ చక్రమ్



శ్రీచక్రమ్మిది భక్తరక్షణకళాశీలప్రకాశమ్ము, దే
వీచిద్రూప విలాసభాసుర మహోద్వేలప్రభావోల్లసత్
రోచీరాజిత శక్తిసంయుతము, మంత్రోద్దిష్ట బీజాక్షర
శ్రీచైతన్యమహత్త్వశోభితము నాచిత్తమ్మునన్ నిల్పితన్.

# శ్రీ దేవి



అతులప్రాభవ వైభవోన్నతులప్రోవై, విస్ఫురత్చిత్కళా
ద్యుతిసందోహమునై, వాగ్భవప్రథిత మంత్రోపాసనధ్యేయమై,
శ్రితరక్షాచణ వీక్షణాభరణమై, శ్రీచక్రభద్రాసన
స్థితతేజమ్మయి పొల్పుదేవిని మదిన్ సేవింతు నశ్రాంతమున్.

# దండకము

శ్రీమన్మహాదేవదేవీ! త్రిలోకాధినేత్రీ సురానంద రూపా చిదానందదీపా మహామంత్రబీజాక్షరోదీర్ణ దివ్యాకృతీ సర్వభూతాత్మికా వేదవేదాంతసంచారిణీ నిత్యకల్యాణి పాపౌఘ సంహారిణీ శ్రీచక్రసంవాసినీ సంతతధ్యానమౌనీంద్రహృద్గోచరానంతశక్తీ లసత్ సుందరారామముల్ రత్నకుడ్యమ్ములున్ స్వర్ణదుర్గమ్ములున్ పెంపుదీపించు నానామణీ ద్వీపసింహాసనాధ్యక్ష తేజస్వినీ నిత్యవాత్సల్యవర్చస్వినీ విశ్వకల్యాణలోలానురక్తా పరబ్రహ్మతత్త్వార్థపర్యాప్తి చిత్కాంతి రేఖాన్వితా సర్వలోకైకమాతా! త్రిమూర్త్యాదులున్ సర్వదిక్పాలురున్ సర్వదేవాళియున్ నీదు శక్త్యంశచేతన్ గదా వారి కార్యమ్ములన్జేయ శక్తుల్ సమర్థుల్ నిమేషమ్ముమాత్రన్ జగత్సృష్టి సంరక్షణాదుల్ భవల్లీలలై క్రాలగా ఈమహావిశ్వమందెల్ల నీవేమహాశక్తి నీవేమహామాయ నీవే సమస్తంబునై నిండియుండగ వేదాదులే నిన్ను వర్ణింపలేవన్న నేనెంతవాడన్ జగన్మాత నీరూపమూహింప నీకీర్తి వర్ణింపగా తల్లి! షడ్వైరి వర్గమ్మునన్దుంచి మాయాపరిచ్ఛన్న బుద్ధిన్ విశుద్ధము గావించి దుష్కర్మలన్ ద్రెంచి పాపమ్ములన్ బాపి లోపమ్ములన్ దీర్చి మోహాద్యహంకారపంకమ్ము శుష్కమ్ముగాజేసి భక్తాళికిన్ ఆయురైశ్వర్యముల్ భుక్తిముక్త్యాదు లాసక్తితో నిచ్చు తల్లీ దయాంభోనిధీ; నీప్రధానాంశసంజాత లావాణియున్ లక్ష్మియున్ పార్వతీదేవియున్ నీకళామాత్రసంభూత లాకాంతియున్ క్రాంతియున్ తుష్టియున్ పుష్టియున్ బుద్ధియున్ వృద్ధియున్ శ్రద్ధయున్ శాంతియున్ దాంతి మేధాదు లత్యంతసంమాన్యలై మమ్ము నిత్యమ్ము రక్షించుమాతల్ శివా; నీవుకోపిం

చుచో లిప్తమాత్రిన ఈ విశ్వవిశ్వంబెకూలున్ కృపారాశివై
బ్రోచుచో ప్రాణిలోకమ్ముచై తన్యమాన్యమ్ము సంశక్తి యుక్తమ్ము
సౌభాగ్యయోగ్యమ్మునై దీప్తిగాంచున్; త్రిమూర్తుల్ మహేం
ద్రేంద్రు దిక్పాలురాశీతశైలాదిముఖ్యుల్ భవద్దర్శనం బర్థిమైజేసి
నిన్ స్తోత్రముంజేయగా నీస్వరూప స్వభావమ్ములన్ దెల్పి నీతత్వ
ముంజెప్పి నీనామమంత్రోపదేశమ్ము గావించు నీదివ్యరూపమ్ము,
వాత్సల్యలీలన్ సుదర్శాదిసత్యవ్రతాభిఖ్యులన్ పెంపు సొంపార
నీమంత్రబీజమ్ము జేంగించి దీర్ఘాయురైశ్వర్యసత్కీర్తి సంపన్ను
లంజేసి రక్షించు నీశాంత తేజమ్ము; చండముండాదులన్ కాసరా
కారదైత్యున్ మహారోషసంరంభు శుంభున్ నిశుంభాదులన్ రక్త
బీజాదులన్ దుర్గమున్ చండివై కాళివై కౌశికీదేవివై దుర్గవై
భ్రామరీ మూర్తివై దుర్నిరీక్ష్యార్కకోటిప్రభారాశివై సర్వాయు
ధాఖీల శక్తిస్వరూపమ్మువై ద్రుంచు నీభీకరాకార రేఖావికాసమ్ము,
కల్పాంతవేళన్ మహావిశ్వమెల్లన్ లయమ్మైన కాలమ్మునం దీవె
పెన్జీకటుల్ దాటు ఏకాంతమందున్ ప్రకాశించు సర్వప్రమాణోక్తి
సంభావనాతీతవై వెల్గులన్నింటికిన్ వెల్గువై వెల్గు హృల్లేఖ శ్రీంకార
హ్రీంకార క్లీంకార మంత్రాక్షరోదీర్ణ సంపూర్ణశక్తిక్రమంబైన
నీనిర్గుణాకారమున్ మాదుచిత్తమ్ములన్ నిల్పిధ్యానించుసద్భక్తి
వర్తించు వాక్శక్తి పూజించుసంసక్తి మాకున్ ప్రసాదించి దీవించి
యెల్లప్పురక్షింప వేయంచు నిత్యమ్ము ప్రార్థింతుమోదేవి తల్లీ భ
వానీ త్రిలోకైకరక్షాకృతీ ఇష్టకామేశ్వరీ శాంకరీ ఈశ్వరీ రాజరాజే
శ్వరీ విశ్వశక్తీ నమస్తే నమస్తే నమః —

శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

# శ్రీ పరమేశ్వరి

## స్కంధము-1

### నైమిశారణ్యము: సూతుడు శౌనకాదులకు దేవీ భాగవతమును బోధించుట

శ్రీ రమణీయమగు భరతవర్షము వైదికకర్మలకు పేరు గాంచిన పుణ్యదేశము. ఇందు సకల ప్రకృతి సంపదలతో విరాజిల్లు నైమిశారణ్యము నిరత జప తపోవ్రతులైన మునులకు ముముక్షువులకు నివాసము. ఈ మునికులమందు ప్రసిద్ధుల యిన తపోధనులు శ్రీ శౌనకాది ఋషీంద్రులు. వారు సంతత భగవద్ధ్యాన తత్పరులు, నిరంతర పురాణ పుణ్య కథా శ్రవణ కుతూహలులు. లోకకళ్యాణార్థము ఆ ఋషీంద్రులొకప్పుడు సత్ర యాగమును క్రతువొనరించుచుండ ఆ యాగ దర్శనార్థము పరమ పౌరాణికుడగు సూతుడును వచ్చెను. శౌనకాదిమునులా సద్గుణ సముపేతుడగు సూతుని జూచి మహానంద భరితులైరి. వారొన రించు ఆ పుణ్యక్రతుసమయమున సూతమౌనీంద్రు డచ్చటి కేతెంచుట భాగ్యముగా నెంచి శౌనకాదులాతపశ్శాలికి అతిథి పూజలన్నియు యథావిధిగా నొనర్చి సత్కరించిరి.

యాగము ముగించి శౌనకాదులు సూతుని వలన నేదైన పుణ్యకథ వినగోరి వినయవిధేయులై సూతునిజేరి యిట్లడిగిరి. "సూతమౌనీంద్రా నీ మధుర వచోభాగ్యముగ మున్నె న్నియో పురాణ కథలను వింటిమి. నీవు సకల పురాణగాథా పారంగతుడవు. నీవెఱుగని పురాణములేదు. తత్పురాణ కథా

ప్రయోజనము ప్రాశస్త్యమును గూడ శ్రోతలకు కరత లామలక మగు నటుల బోధించగల నేర్పరివి. పుణ్యదాయకము భుక్తి ముక్తి ప్రదమగు దేవీభాగవతము వ్యాసమహర్షి వ్రాసినది ఉన్న దంటివి. దేవీ మహిమను, దేవీభక్తులై తరించిన వారి కథలను వినగోరెదము. మమ్ము కరుణించి ఆ దేవీ కథను వచింపుడు." అని వేడుచున్న మునుల అభ్యర్థనము చెవుల బడగానే సూతు నకు పరమానందము కలిగెను. తత్‌క్షణమే సర్వజగజ్జననియైన యాదేవిని అర్ధనిమీలిత నేత్రుడై మనసార దలచి నమస్కృతు లర్పించి తనయెదుట భక్తిశ్రద్ధలతో వినుటకు గూరుచున్న శౌన కాది మునులను జూచి యిట్లు ప్రసంగించెను.

"ఓ మహామునులారా! నిత్యము పురాణకథాశ్రవణమున కాలము గడుపుచున్న మీరు ధన్యులు, మాన్యచరితులు, మీ వ్రతములు అనుష్ఠానములు లోకోపకారకములు. మీవంటి వారికి దైవగాథలను బోధించుటయే అత్యుత్తమము. ఇట్టి సదవకా శము లభించుట నా భాగ్యము. దేవీచరిత్రము, దేవీమహిమ, దేవీపూజలు, దేవీభక్తులను గూర్చియు మీకు మొదటి నుండియు నుడివెదను వినుడు.

శౌనకాదులు శ్రద్ధాళువులై వినుచున్నారు. సూతుని ప్రవ చన మిట్లు సాగినది.

## దేవి మహిమ

దేవి యనగా నేమియో దేవీమహిమ యెట్టిదో, ఆ పరదేవత జగత్కారణము జగదాశ్రయమునై జగత్తునెట్లు శాసించి పాలించు చున్నదో దేవీ చరిత్రమేవిధముగ ప్రపంచమున ప్రచారమైనదో అదియు మునుముందిట్లు నుడివెను.

సకల చరాచర జగత్తుయొక్క అవిర్భావమునకు కారణము, క్రమబద్ధమైన అజగత్ప్రవర్తనకు అధారమూ దేవియే. తృణమునుండి మహాపర్వతము వఱకు ప్రతి పరమాణువులో నిక్షిప్తమై ప్రకాశించు మహాశక్తి స్వరూపమూ పరదేవత. ఆ శక్తియే పరబ్రహ్మము. సకల ప్రాణికోటులను చైతన్యవంతముజేయు మహాతేజమది. తుదకు త్రిమూర్తులగు బ్రహ్మ విష్ణు మహేశ్వరులుకూడ ఆశక్తి బలము వలననే తమతమ విధులు నెఱవేర్చుచుందురు. ఆ శక్తి కానిది. లేనిది ఏదియులేదు. ఆమె దుష్టశిక్షణ సాధుజన సంరక్షణకై అనేక రూపములతో అనేక నామములతో అవసరము వచ్చినపుడెల్ల అవతరించు సగుణసాకార రూపిణి. ఇట్లు ప్రవర్తించుచు ఆశక్తి నిజమునకు సకలమునకు అతీతమై నిర్గుణ నిరంజన నిర్వికార నిరాకారమై వెలుగు పరబ్రహ్మము; భక్తులకు తపోనిధులకు మనోగోచరమగు పరమాత్మరూపము. కాళి దుర్గ భ్రామరి మనస ఇత్యాది రూపములెన్నియో ఆ శక్తి ధరించినది. గాయత్రి. సావిత్రి శ్రీమహాలక్ష్మి పార్వతీ సరస్వతులామె ప్రధానాంశ కళలే. ఇంకను ఎన్నియో రూపముల అసంఖ్యాకములయిన పుణ్య క్షేత్రములలో మనదేశమున వెలసి పూజలందుకొనుచున్నది.

## మణిద్వీప వర్ణన

జగత్పరిపాలనకై యామె విశ్వగోళమున కావల సహస్ర భానుతేజమున వెలుగొందు మణిద్వీపమున వసించును. ఆ ద్వీప మనేక మణికాంచన సౌధమండితము నవరత్ననిర్మిత బహువప్ర గోపుర దుర్గభాసితము, నిత్య వసంత సురభి సుందరోద్యాన శోభితము, కామితార్థ ప్రదములగు కల్పవృక్షములైదును మణి

ద్వీప వాసమునందు నిత్యపుష్పఫల భాసురములయి యుండును. నవనిధుల కందు కొదువయే లేదు. దేవతలెందరో ఆమె దర్శన మునకచట వేచియుందురు. ఆ కోటలందే సకల ఋతువులు గంధర్వ కింపురుషాదులు దిక్పాలురు దేవీరూపములైన సర్వ శక్తులు మంత్రిణులు సైనికులునుందురు. ఆ మణిద్వీపమంతయు ఇట్లు సర్వవేళల సుభగసుందరమై పరిరక్షితమై యుండును. ఆ దుర్గములందే పరమాత్మ జ్ఞానమును ప్రబోధించుటకు భవనము లున్నవి. భక్తులకు ఆదేవి జ్ఞానభుక్తిముక్తులు ప్రసాదించు మందిరములున్నవి. లోకవ్యవహారములు చూచు సభాగారము లున్నవి. చెలికత్తెలెప్పుడును ఆమె పరిచర్యలో నుందురు. సురలు మునులు భక్తులు ఆమెను స్తోత్రము చేయుచుందురు.

బహువిధ మణిమయములైన దుర్గములు గల ఆద్వీపము ఆదిశేషువునకైన వర్ణనాతీతము అచటివైడూర్య ద్వీపమందు చతురంగ బలములతో దేవిని సేవించుచు తొమ్మండుగురు శక్తు లుందురు. వారు బ్రాహ్మి వారాహి మాహేశ్వరి నారసింహి కౌమారి వైష్ణవి ఇంద్రాణి చాముండ మహాలక్ష్మి. వారందరు బహుసుందరాకారలు. లోక కళ్యాణము గూర్చు సత్కృపా మూర్తులు. ఆద్వీపముననున్న ఇంద్రనీలమణి దుర్గమున మహా ప్రభావముకల షోడశాకారము అను కాంచనపద్మమున్నది. అచ టనే దేవియొక్క సైన్యములను నడిపింప గలిగిన పదారు శక్తులు గలవు. వారు కరాళి వికరాళి ఉమ సరస్వతి శ్రీదుర్గ ఉష లక్ష్మి శ్రుతి స్మృతి శ్రద్ధ మేధ మతి కాంతి రామ ఛాయ. అచటి ముత్యాల కోటయందు ఆపరమేశ్వరియొక్క మంత్రి

ఋలు కుశాగ్రబుద్ధులు సర్వశాస్త్ర విజ్ఞాన విశారదలయిన రెనమండ్రు గలరు. వారు అనంగమదన, అనంగమదనాతుర భువనపాలా, గగనవేగా, శశిరేఖా, గగనరేఖా, అనంగకుసుమ అనంగకుసుమాతురా. అచటి కవలగ మరకత మణిమయ దు మ్మునగల షట్కోణ యంత్రమున గాయత్రియు సావిత్రియ నలరారు చుందురు. ఆదుర్గమందే త్రిమూర్తులతో సహా దిక్పా లాది సర్వదేవతలు జగదీశ్వరి ఆజ్ఞలకు వేచి యుందురు. ప డపు కోటయందు పంచభూతముల కాధిపత్యము వహించ హృల్లేఖ గగనా రక్తా కరాళిక మహోచ్ఛుష్మ యనెడు శక్తుల కలరు. రతనాలకోటయందు దేవియవతారములు, మహావిద్యల సప్తకోటి మంత్రములు తనరారు చుండును.

ఈ దుర్గముల కావల కనక చింతామణి దుర్గము శ్రీ పరమేశ్వరి నెలవయి విలసిల్లుచున్నది. సకల విశ్వమున గల సౌందర్యమంతయు మూర్తి కట్టినట్లా దుర్గము ప్రకాశించుచుండును. అచటి నుండియే ఆ జగదీశ్వరి జగత్పాలనము నెఱపుచుండును. ఆ దుర్గము లోపలి సౌధ శుద్ధాంతమందు పరమ శివుడు ఫలకముగను, హరిహర బ్రహ్మలు ఈశ్వరుడు నాలుగు కోళ్ళుగను ఒప్పు మంచమున కోటి మన్మథులైన సాటిరాని కోమల రూపుడై మహాదేవుడుండును. ఆ మహాదేవుని వామభాగమున లలిత భూషణ వస్త్రాద్యలంకారములతో వెలుగు శృంగార దేవతవలె భువనేశ్వరీదేవి విలుపారు చుండును. వారిరువురు నిత్య యౌవనులు. ఆ నిలయము నుండియే ఆ దేవి యనుగ్రహమున దివ్య నిధుల నుండి యావిర్భావమందిన సంపదలు, అమృత ప్రాయములైన జలప్రవాహములు, సకల ప్రకృతి సంపదలు భూమండలమునకు ప్రసరించును.

ఆ జగదంబ నిలయమైన మణిద్వీపమునకు వేఱొక యాధారము లేదు దానికదియే ఆధారము. కల్పాంతమున గూడ అద్ది యుండును. అది విలయ సమయమున ముకుళించుకొని సృష్టి సమయమున వికాసమందుచుండును. ఆమె అనుగ్రహ మందిన భక్తులు చిరంజీవులై సాలోక్య సాయుజ్య సామీప్య ముక్తిలోలు పులైయచటనే యుందురు. అయంబనుగాని ఆమె మహిమము ను గాని అద్వీప శోభనుగాని వర్ణింప గలవారులేరు. ఆమె కారణ రూపమైనబ్రహ్మము. వేదోపనిషత్తులు, మహావిద్యలు, సప్తకోటి మంత్రములు ఆపరదేవతను స్తోత్రము చేయుచుండును.

ఆమె జగజ్జనని. కరుణాంతరంగ. విశ్వమయి. విశ్వసాక్షి విశ్వకుటుంబిని. భక్తి శ్రద్ధలతో నామెను స్మరించిన జాలు శుభ సంపదలు సర్వము లభించును. తుదకు మోక్షప్రాప్తియు కలుగును. త్రిమూర్తులు సర్వదేవతలు ఆమెను పూజించి ఆమె కరుణకు పాత్రులైనవారే. ఆ జగదంబను ద్వేషించి తిరస్కరించిన మూఢులామె కోపాగ్నికి బలియై భస్మమైరి. మహాఋషులు చక్రవర్తులు మహారాజులు సామాన్యులు ఎందఱెందఱో ఆ శక్తి స్వరూపిణిని పూజించి ధన్యులై మాన్యులై ఇహమున విస్తార కీర్తినంది తుదకు పరమ పదమందిరి. తగిన భక్తియలపడ పల యునే కాని దేవీ సంస్మరణము దేవీపూజ దేవీకృపాప్రాప్తియు అందఱికిని అందుబాటులో నున్నవియే. మీరును అట్లు చేయుడని సూతుడు శౌనకాది మునుల కుద్బోధించి, ఇక దేవీ భాగవత ప్రచారమును గూర్చి వినుడని యిట్లు నుడివెను.

# దేవీభాగవత ప్రచారము.

జగజ్జననియగు పరమేశ్వరి అప్పుడప్పుడనేక రూపముల అవతరించి చేసినపనులు, దేవీవైభవము, దేవీ వ్రతఫలము, దేవీ క్షేత్రములు, దేవీపూజావిధానములు, దేవీభక్తులయి ధన్యులయిన పుణ్య జన్ముల కథలు సవిస్తరముగ దెలుపు పవిత్రగ్రంథమే దేవీ భాగవతము. దీనినెవరువ్రాసిరి, ఇదియెట్లు వెలువడి ప్రచారము లోనికి వచ్చినదియు వినుడు.

పరాశరుడను మహాఋషికి దాశరాజు అనువాని పుత్రిక సత్యవతి యందు, ఆమెకన్యకగా నున్నపుడే, ఉదయించిన మహాత్ముడు వ్యాసుడు. పుట్టుక తోడనే బ్రహ్మతేజోవంతుడు సకలశాస్త్రజ్ఞానియై జననమందిన ఘనుడు ఆ వ్యాసుడు. సర్వజనోద్ధరణకై వేద వాఙ్మయమును నాలుగువేదములుగా విభజించివ్రాసి, పంచమ వేదమనదగు మహాభారతమును గూడ అతడు రచించెను. అవిగాక పదునెన్మిది మహాపురాణములను పదునెన్మిది ఉపపురాణములను గూడ రచించి వ్యాసుడు ప్రఖ్యాతిగనెను. మానవుడు ధర్మాచరణ గలిగి ఇహపరసౌఖ్యములను సాధించగలిగిన నీతులను, దైవమహిమను, మహాత్ముల చరిత్రములను, సకలశాస్త్రములందున్న ధర్మ సూత్రములను సులభగ్రాహ్యముగ బోధింపగలిగిన పవిత్రగ్రంథములే పురాణములు. ఆ మహాపురాణములలో అత్యధికప్రశస్తి నందినది దేవీభాగవతము. దేవభాషయగు సంస్కృతమున పది రెండు స్కంధములుగ పదునెన్మిది వేల శ్లోకములు గల బృహద్గ్రంథమిది.

వ్యాసునకుదేవి విషయమెట్లు తెలిసినది. అదియె తొల్తొల్త వాగ్బీజ రూపమున దేవీస్వరూపము శ్రీమహావిష్ణు తెలిసినది. ఆతడు తన నాభికమలమున జన్మించి సృష్టికర్తయ బ్రహ్మదేవునకు దేవీ మహిమను తెలిపెను. ఆబ్రహ్మయు దానిని తిరిగి తన మానసపుత్రుడు దేవఋషియునగు నా కుపదేశించెను. నారదుడీ దేవీమహత్త్వమును వ్యాసునక వెను. లోకకళ్యాణ కారణమగుననియెంచి వ్యాసమహర్షి వినిన దేవీ చరిత్రమును దేవీ భాగవతమను మహాపురాణ వ్రాసి ప్రబోధించెను. వ్యాసుడీ మహాపురాణమును తనపుత్ర శుకునకు బోధించుచుండగా ఆలించిన సూతుడు ఆ దేవీభా మును శౌనకాది మహామునులకు ఇతరులకు బోధించుచు ప్రచారము గావించెను. యుగయుగముల నుండియు ఈ పురాణమిట్లు ప్రజామధ్యమున మహాప్రచారమంది బహుభాష వెలువడి ప్రజలకు మహోపకారము చేయుచున్నది.

## శ్రీశుకుని జననము - వైరాగ్యము

వ్యాసుని కుమారుడైన శ్రీశుకుడు మహావైరాగ్య స న్నుడు. జగత్పూజ్యుడయిన విజ్ఞాని. వ్యాసుడు సరస్వతీనది మున తపస్సుచేసికొను చుండెను. ఒకనాడు సమీపమున వృక్షముపై విహరించు పక్షిమిథునమును జూచిన వ్యాసు సంతాన వాంఛ కలిగెను. గృహస్థు సర్వవిధముల సౌఖ్యవంతు అతిథి అభ్యాగతుల నాదరించి తానును సుఖపడవచ్చును. స తులు కలుగుటకు పుత్రులుకావలెనను తలపులతో ఆవాం మతింత బలపడి తనకోర్కె యెట్లు తీరునాయని వ్యాసు చింతాకులుడై యుండెను. ఆసమయమున నారదు డటకేతెం

వ్యాసుని విచార కారణము తెలిసికొని 'వ్యాసముఃనీందాౕ సర్వ కామితముల నీడేర్చు జగజ్జననియగు దేవినిప్రార్థింపుము, నీకోరిక లీడేరును అని దేవీమంత్ర ముపదేశించి వెడలెను. వ్యాసుడట్లే దేవినిగూర్చి మహా తపమొనర్ప శక్తిరూపమున శంకరుడు ప్రత్యక్షమై వ్యాసుని కోర్కె కనువైన వరమొసంగెను.

ఘృతాచి యను దేవవేశ్య వ్యాసుని వలచిరాగా ఆ ఋషి వేశ్యలపొందు కూడదని ఆమెను తిరస్కరించెను. కాని ఆమె సౌందర్యమును గాంచిన వ్యాసుని వీర్యము స్ఖలనమై యాతడు మథించుచున్న అరణియందు బడెను. హతాశయయి శుకీ రూపమున ఘృతాచి వెడలిపోయెను. ఆ యరణి నుండి మహా తేజోవంతుడగు మగ శిశువుదయించెను. శుకియైన ఘృతాచి కారణముగా నుద్భవించిన వాడుగాన ఆ శిశువునకు శుకుడను నామము గలిగినది. శుకునికొరకు దివినుండియే బ్రహ్మచారి కనువగు దండకమండలాదులు వచ్చినవి. ఉపనయనమైనది. తండ్రిపంపున దేవగురువు బృహస్పతి వద్దకేగి వేదాది సర్వవిద్యలునేర్చి శుకుడు తిరిగి తండ్రికడకేగుదెంచి 'తండ్రీ నీవు భగవత్స్వముఃడవైన మహాఋషివి, అనేక పవిత్రగ్రంథములు వ్రాసినాడవు, నాకు ప్రాపంచిక విషయములపైనను వివాహముపైనను యిచ్ఛలేదు వైరాగ్యమునుపొందు తత్త్వముపదేశింపుమని కాళ్ళపైబడెను. వ్యాసుడాశ్చర్యపడి "నాయనా నీవింకను చిన్నవాడవు. వైరాగ్యమున సన్యాసమును స్వీకరించు వయసు రాలేదు. జీవనయాత్రయందు తుదకు వైరాగ్యమెంత యవసరమో మొదట గృహస్థ ధర్మము గూడ అంత ముఖ్యమేగాన నీవు వివాహమును జేసికొనుము. గృహస్థాశ్రమమున మనుజుడు

సమాజమునకెంతయో ఉపకారిగ నుండవచ్చును. మనుజునకు సత్సంతతిని బడయుటగూడ ముఖ్యము. పుత్రులు పితరులకొసగు తిలోదకముల మూలమున సద్గతులు కలుగును. శాస్త్రవిధి ననుసరించి మనుజుడెప్పుడే కర్మల నాచరింపవలెనో వానిని చేయక తప్పదు. నేను వ్రాసిన దేవీభాగవతమను పురాణమున్నది. దానిని బోధింతును వినుము అని వ్యాసుడు శుకుని వైరాగ్య చింతమాన్పుటకై తన దేవీభాగవతమును సర్వము బోధించెను. ఆ దేవీభాగవతము నామూలాగ్రముగ వినిన తరువాతకూడ సంసారమునందిచ్ఛలేక మందమతియై శుకుడు వైరాగ్యమునుగూర్చియే ఆలోచించుచుండెను. శుకుని వైరాగ్యమునుండి మరలించుట తనకు సాధ్యముగాక వ్యాసుడాతనికి తగిన యుపదేశమిప్పించుటకై నిష్కల్మషకర్మయోగి మహాజ్ఞానియునగు జనకమహారాజు నొద్దకు బంపెను. శుకుడు మిథిలకేగి జనకమహారాజును జూచి తాను వచ్చిన కార్యమెఱిగింప జనకుడాతని నాదరమున సత్కరించి ఉపవిష్టుని జేసిన తరువాత వారిరువురకీక్రింది విధమున సంభాషణము జరిగెను.

జనకుడు: విప్రవర్యా నీవీచిన్న వయసునందే సంసారమును వదలి సన్యాసిగ వైరాగ్యభావమవలంబింతు ననుచున్నావు. దీనికి కారణమే నెఱుగ వచ్చునా.

శుకుడు: రాజా మాతండ్రి వ్యాసుడు నాకు వివాహమొనరింపవలెననియేమేమియో చెప్పెను. కాని నాకది యిష్టములేదు మనుజునికి జీవనసాఫల్యము ముక్తియేగదా. సంసారము లౌకికమైన సౌఖ్యములకాశ్రయము. ఈ సౌఖ్యవాంఛలు మనుజుని కామ లోభములకధీనునిజేసి తన్మూలమున నెన్నియో దుర్వ్యసనముల పాలుజేసి భ్రష్టుని జేయును.

జనకుడు: అగునయ్యా అగును తొందరపడకుము. మోక్ష ప్రాప్తికి వైరాగ్యము సన్న్యాసము అవసరమే. కాని యాసన్న్యాసము వేదములు బోధించిన నాల్గాశ్రమములలో తురీయమను మాట మఱువకుము. బ్రహ్మచర్య గృహస్థవానప్రస్థములయిన తరువాత సన్న్యాసము. ఈ ఆశ్రమ ధర్మములు వరుసగ పాటింపవలెను. వైరాగ్యమందలి వాంఛయొకటియే చాలదు. సత్కర్మములద్వారా చిత్తము శుద్ధమై తుదకు విరాగము కావలెను. ఈ సంస్కారములు యజ్ఞములు వేదవిహితధర్మములు గృహస్థు ఆచరింపదగినవే. ఆసక్తియుండువా సన్న్యాసి కతని దండకమండలులయిదా సక్తిలేదా. ఆసక్తి మంచిమార్గములందుండవలెను. నేనింకను భూపతినే, ప్రజాపరిపాలన యందాసక్తి కలిగియు రాజపదమునందుండియు నిస్సంగుడనై నిష్కామ కర్మవిధమున నేను విదేహముక్తి నందితిని. ఇట్లే విహితధర్మములు విడువక నెరపి గృహమేధియు ముక్తిని బడయ వచ్చును. చిత్తశుద్ధిలేని సన్న్యాసము కూడ వ్యర్థమే.

శుకుడు: రాజేంద్రా వేదములమాట తెచ్చితిరి. వేదములు వివాహమును గర్హించెను. హింసను బోధించెను. కాంతా సాంగత్యము వలన అరిషడ్వర్గములకు లోబడుటయేగదా. యజ్ఞములు స్వర్గసౌఖ్యవాంఛకే కదా అవి ఉత్తమమగునా? ఈ సందేహములు నన్ను వదలకున్నవి.

జనకుడు: వివాహము విధివిహిత సత్కర్మములకు సత్సంతతి కొఱకును. అవి విషయవాంఛలకు దారితీయరాదు. వేదోక్తకర్మమగు హింస అహింసయేకాని హింసకాదు. హింసయన మారణ కర్మయేకాదు. అన్యాయముగ పరజీవిని బాధించుటయు హింస.

యజ్ఞము దైవప్రీతికిని చిత్తశాంతికిని చేయుదురు. ముక్తికి యొకసాధన. మఱియొక మాటవినుము. నిర్మలమతినై మమతలులేక ఉర్విని పాలించు నాకెట్టిస్వార్థకాంక్షయు లేదు. జితేంద్రియుడనై నియతచిత్తుడనైన నేనెట్టి విషయోపవాంఛలందు బంధితుడనుగాను. ఈనాటికిని లౌక్య సంబంధమయిన రాజపదము నందేయుండి జీవన్ముక్తి నందితిని. నీవునట్లే నీ తండ్రి వాక్యము లాలించి గృహస్థధర్మము స్వీకరించి క్రమముగ మోక్షసాధనకు చిత్తమును మరలింపుము.

జనకుడు నుడివిన యుపదేశమందలి సత్యమును శుకుడు గ్రహించినాడు. జనకుని జ్ఞానసంపదకు శుకుడచ్చెరువంది వీడుకోలుగైకొని గృహమునకు మరలిచని తండ్రియగు వ్యాసుని పాదములవ్రాలెను. వ్యాసుడాతని ననుగ్రహించి, సదాచార సంపన్నమగు నొక విప్రగృహమునుండి గుణశీలవతియైన పీవరియను కన్యనుదెచ్చి శుకునకు యథావిధి వివాహమొనరించెను. ఆమెవలన శుకుడును సత్సంతతిని బడసి గృహస్థ ధర్మముల నెఱపి సత్క్రతులాచరించి కాలక్రమమున మఱి తిరుగులేని నిస్సంగత్వమున సంసారమును వీడి బ్రహ్మతేజస్వియై నిర్వికారుడై దేవిని ధ్యానించుచునేగెను. శుకుని వైరాగ్యస్థితికి కామినులుగూడ ఆశ్చర్యపడిరి. శుకుడట్లు పోయిపోయి వినువీధిని వెలుగులునింపుచు కైలాసము చేరెను. వ్యాసుడు పుత్రప్రేమ విడువలేక వెంటబడి 'నిలువు మోహోపుత్ర' యని దిక్కులు మార్మ్రోగ బలుకుచు కైలాసము చేరుసరికి పరమశివుడు వ్యాసునాపి 'మునీంద్రా తనయునిపై నింత తమక మేల? శుకుడు మనుజదుర్లభమయిన బ్రహ్మభావుడై పరమయోగీంద్రుడై వెలుగుచున్నాడు. నీ మోహ

మును మానుము. అతడు నీ నీడవలె నీ కడనే యుండునని యూరటబల్కి వెనుకకు పంపెను.

## ధృతరాష్ట్రాదుల జననము—కౌరవ భారతయుద్ధము

దాశరాజ పుత్రికయగు సత్యవతికి పరాశర మహాఋషి వలన, కన్యకగా నున్నపుడే వ్యాసుడుదయించెను. పుట్టుకతోడనే వ్యాసుడు మహాజ్ఞాని సర్వశాస్త్ర పారంగతుడు. 'తల్లీ నీవు తలచిన యపుడు నేనువచ్చి నీయాజ్ఞనెఱవేర్తు' నని సత్యవతికి చెప్పి వ్యాసుడు తపస్సున కేగెను. కురువంశోద్భవుడు హస్తినాపుర రాజైన శంతనుడా సత్యవతిని వివాహమాడి చిత్రాంగద విచిత్ర వీర్యులను పుత్రుల బడసెను, చిత్రాంగదుడు గంధర్వులతోబోరి చిన్నతనమందే మడిసెను. విచిత్రవీర్యుడు అంబిక అంబాలిక అను కాశిరాజు పుత్రికలను వివాహమాడి సంతానము కలుగక మునుపే మరణించెను. దేశ మరాజకమగు నను భయమున సత్యవతి వ్యాసుని బిలిచెను. సత్యవతి యానతిని వ్యాసుడు అంబిక యందు ధృతరాష్ట్రుని, అంబాలికయందు పాండురాజును కనెను. ధృతరాష్ట్రుని కుమారులు దుర్యోధనాదులు నూర్వురు కౌరవులు. పాండురాజు కుమారులు దేవాంశ జనితులు ధర్మజాదులు అయిదుగురు పాండవులు. ఆదినుండియు కౌరవులు దుష్టచరితులై దాయాదులైన పాండవులను నానాహింసలపాలు జేసి వారిరాజ్య భాగమును వారికీయ నిరాకరించుటతో కౌరవ పాండవులకు మహా యుద్ధమయ్యెను. ఇరువాగు లందును అనేక అక్షోహిణుల సైన్యము మడిసెను. శ్రీకృష్ణుడు ధర్మవర్తనులైన పాండవుల కనేక విధముల యుద్ధమున సహాయ మొనరించెను పాండవులకు విజయము లభించెను. కౌరవులందఱు మడిసిరి.

యుద్ధమున మృతులైన వీరుల భార్యలు తల్లులు రణ రంగమున కేగి ఆ మృతదేహములను జూచి పరివరి విధముల విలపించి వారినొకపరి సజీవులుగా చూడవలయునను వాంఛను వ్యాసునకు తెలిపిరి. ఇది అపూర్వమైన విషయము ఎట్లు సాధ్య పడునాయని వ్యాసుడు కొంతతడవు చింతించితుదకు జగన్మాతయు కామితార్థఫల ప్రదాత్రియు అయిన, దేవిని మనసార దలచి ప్రార్థించగానే ఆవరాంబికకు అనుగ్రహము కలిగినది. ఆమెకరుణా మయి అనాథలైన స్త్రీలకడగండ్లకు ఆమెహృదయము కరగినది. వెంటనే మృతవీరుల నందఱిని సజీవులను చేసినది. ఒకదినమున వారు వారి తల్లులతోను భార్యలతో గడపి వారికానందము గలుగ జేసిరి. ఆవీరులను వ్యాసుడు మరల ఊర్ధ్వలోకములకు బంపి వేసెను. వ్యాసునితోకలిసి ఆ స్త్రీలందఱు దేవిని స్తుతించి నమస్కృతు లర్పించిరి.

పాండవ మధ్యముడైన అర్జునుని కుమారుడు మహా పరాక్రమశాలి అభిమన్యుడు గూడ కౌరవపాండవ యుద్ధమున మడిసెను. ఆసమయమున అభిమన్యుని భార్య ఉత్తర గర్భవతి. కౌరవ పక్షమున పోరిన అశ్వత్థామ బాణాగ్నికి ఆ గర్భస్థ శిశువు చనిపోకుండ శ్రీకృష్ణుడు తన చక్రముచే రక్షించెను. ఆ శిశువే పరీక్షిత్తు యుద్ధానంతరము హస్తినాపుర సామ్రాజ్యమున కధి పతియై తనతమ్ముల తోడ్పాటుతో ధర్మరాజు న్యాయపరిపాలన సాగించెను. వారి మరణానంతరము వారిమనుమడు పరీక్షిత్తు హస్తినకు రాజయ్యెను.

## 15 శ్రీశుకుడు పరీక్షిత్తునకు దేవీభాగవత ముపదేశించుట

పరీక్షిత్తు సర్వసమర్థుడు. అర్జును సంతతి మహాశూరుడు ధర్మరాజును బోలిన న్యాయమూర్తి. అప్పటికి పాప భూయిష్ఠమైన కలియుగము వచ్చినను తనరాజ్యమున కలి అడుగిడకుండ దూరమొనరించిన మహాత్ముడు. ఒకనాడా పరీక్షిత్తు క్రూరజంతువుల బాధ నణచుటకై అరణ్యమునకు వేట కరిగి దినమంతయు తిరిగి తిరిగి అలసి, ఒక యాశ్రమమున ధ్యాననిష్ఠలోనున్న శమీకుడను మునిని సమీపించి దప్పితీర్చుకొనుటకు జలమడిగెను. ఆముని ధ్యానమగ్నుడై యుండుటచే రాజుమాటలు వినిపించుకొనలేదు. పరీక్షిత్తునకు విసుపు జనించి అముని మెడకు ఒక మృతసర్పమును దగిలించి తనదారిని పోయెను. శమీకుని కుమారు డింటికివచ్చి తండ్రిమెడలో పామును జూచి భయపడి తనతండ్రి నిట్లు చేసిన దుర్మతి యేడుదినములలో సర్పదష్టుడై మరణించునని శాప మిచ్చెను.

పరీక్షిత్తున కాశాపవిషయము తెలిసినది. ముని బాలుని శాప మమోఘము. తనకు మరణము తప్పదు. జలమధ్యమున ఒక మంటపమును నిర్మించుకొని పరీక్షిత్తు భగవద్ధ్యాన తత్పరుడై యుండెను. ఆమహారాజు తుదిగడియలలో దగ్గఱ నుండుటకు అనేక ఋషులు విద్వాంసు లేతెంచిరి. శుకయోగియు వచ్చెను. ఆమహాత్ముని కీర్తి వినిన వారగుటచే పరీక్షిత్తుతోపాటు తక్కిన వారెల్లరు శ్రీశుకునకు స్వాగత మిచ్చి పూజించిరి. పరీక్షిత్తు శ్రీశుకుని పాదములంటి "మునిదేవా, నీవుదైవసమానుడవు నాకు మరణమాసన్నమైనది భవముక్తి మార్గము బోధించి నన్ను ధన్యుని జేయు"మని వేడెను. దేవీసంస్మరణమే భక్తులకు శరణోపాయమని తలచి శుకుడు తాను తనతండ్రి వ్యాసుని

వలన వినిన దేవీభాగవతము సర్వము పరీక్షిత్తునకు బోధించెను. భక్తిశ్రద్ధలతో పరీక్షిత్తు దేవీభాగవతము నాయేడుదినములు వినెను దేవీ నామములు స్మరించెను. దేవీ ధ్యానములో తాదాత్మ్య మంది సమాధిగతుడయ్యెను.

మునిబాలకుని శాపముతప్పలేదు. ఒకవిప్రుడు కానుకగా రాజునకు తెచ్చియిచ్చిన ఒకఫలములో క్రిమిగా జేరియున్న తక్షకుడను మహాసర్పము రాజునుజేరగనే మహోగ్ర రూపము ధరించి కఱచెను. పరీక్షిత్తు విగతప్రాణుడయ్యెను. దేవిదయ వలన పరీక్షిన్మహారాజునకు పుణ్యలోక నివాసఫలమబ్బినది.

## జనమేజయుడు దేవీభక్తుడగుట

పరీక్షిత్తు తరువాత నతని సుతుడు జనమేజయుడు రాజ య్యెను. ఉత్తంకుడనుముని జనమేజయుని కడకువచ్చి 'రాజా నీ తండ్రి సర్పదష్టుడై మరణించెను. సర్పములను నశింప జేసి నీ తండ్రి ఋణమును తీర్చుకొమ్ము' అని పురికొల్పగా జనమే జయుడు సమ్మతించి మునులను పండితులను రావించి సర్వ సర్ప నాశనము కొరకు మహాసర్పయాగ మారంభించెను. ఆయజ్ఞ మంత్రబలముచే ప్రపంచముననున్న సర్పములన్నియు లుంగ లుంగలుగ జుట్టుకొనివచ్చి హోమగుండమునబడి ఆహుతియగు చుండెను, పరీక్షిత్తును కఱచిన తక్షకుడు మరణము తప్పించు కొనుటకు దేవేంద్రుని సాయము నర్థించెనుగాని విఫలుడై హోమ గుండమునకు లాగబడుచుండెను. తక్షకుని మేనమామ ఆస్తీకు డను మహాముని ఆదృశ్యమునుచూచి జాలిపడి జనమేజయుని

కడకేగి జీవహింసకూడదు, పరీక్షిత్తు మరణమునకు విధినిర్ణయ మట్లున్నది దానికి సర్పములు కారణముగాదు అని పలువిధముల బోధించి ఆ సర్పయాగమాపించెను.

జనమేజయు డాయజ్ఞము నితర విధుల బూర్తిగావించి, వచ్చినవారి నందఱను దానధర్మములచే సంతృప్తులజేసి పంపెను. కాని ఆ రాజు మనస్సునందేదియో అశాంతి ప్రబలి మఱింత వృద్ధి కాజొచ్చినది. ఏ యుపాయముచేతను మనశ్శాంతి కుదురుట లేదు. వ్యాసుని శిష్యులవలన భారతగాథనంతయు వినెను. ఫలితము కనిపించక తుదకు తనకొక మార్గము చూపించవలసి నదని వ్యాసునే ప్రార్థించెను. వ్యాసుడాలోచించి యిట్లు నుడి వెను "రాజా చిత్తశాంతి నభిలషించు నీ సంకల్పముత్తమ మైనది. చిత్తశాంతియేగాదు జీవితమునెల్లను చరితార్థమొనరించి ధన్యతనుగూర్చు సాధనమొకటున్నది. అది జగదంబయగుదేవీ ఉపాసనమే. త్రిజగముల కాధారమాదేవియే. ఆమెను పూజించి ఆమె చరిత్రమును మహత్త్వమును విజ్ఞులవలన విని అనేకులు దేవతలు మునులు ప్రజలు ధన్యులైరి. నీవును అట్లుచేయుము అనిచెప్పగనే జనమేజయునికి అమితానందము కలిగినది. ఆ రాజేంద్రుని కోరికపై వ్యాసుడు దేవీభాగవతము నాది నుండియు బోధించెను. జనమేజయుడు దేవీచరిత్రము, దేవీమహిమము, దేవీలీలలు దేవిని భక్తితోగొల్చి తరించినవారి కథలు సర్వము శ్రద్ధతో వినెను. దేవియే సకలార్థములు సమకూర్చు శరణ్య మను గాఢవిశ్వాసమా రాజునకు కలిగినది. దేవీపూజలను యథా విధిగ తానుజేసెను. ప్రజలచే జేయించెను. దేవీమహిమను రాజ్యమెల్లెడ ప్రచారము గావించెను. జగన్మాతయగు ఆమె అనుగ్రహమునకు పాత్రుడై సర్వసంపదలతో మహాచక్రవర్తిగ విల సిల్లి ధన్యుడై చరితార్థుడయ్యెను.

—o—

# శ్రీ పరమేశ్వరి

## రెండవ స్కంధము

వ్యాసుడు తాను నారదునివలన వినిన దేవీగాథలను సర్వము స్క్రింది విధమున జనమేజయమహారాజునకు బోధించెను. వానినే సూతుడు శౌనకాదులకిట్లు వివరించి నుడివెను.

### శ్రీమహావిష్ణువునకు జగదంబ అనుగ్రహము

దేవీమంత్రప్రాప్తి :- పాలసముద్రమున వటపత్రశాయియై బాలుని రూపమున శ్రీహరి యున్నపుడు, "ఈ పాలకడలి యెచ్చటినుండి వచ్చినది ఈ వటపత్రమెచ్చటిది ఈ విశ్వమున కంతకును ఆధారమైన శక్తియేమైననున్నదా"? అను ఆలోచనలు ఆయాలోచనలలో సందేహములనేకములు శ్రీహరికి దోచెను. శ్రీహరి యట్లు చింతించుచుండ దేవి ప్రసన్నయై శ్లోకరూపమున ఒక మంత్రము నుచ్చరించి 'దీని యర్థమును గ్రహింపుము నీవాలోచించుచున్న విశ్వశక్తి రహస్యమునెఱుగగలవు' అని చెప్పెను. ఎంతగా మననము చేసినను శ్రీహరికాబీజ మంత్రమర్థముకాలేదు. అంతలో శ్రీమహాలక్ష్మియే బహుసుందరాకృతిని తన యనుచర శక్తులు రతి మతి శ్రద్ధ కీర్తి స్మృతి మేధ దృష్టి నిద్ర ధృతి పుష్టి జృంభ తంద్ర గతి స్వాహ క్షమ లజ్జ భూతి క్షుధ బుద్ధి యను వారలతో గలిసి అత్యద్భుతకాంతితో ప్రత్యక్షమై 'శ్రీహరీ నీకు విన్పించిన మంత్రమే దేవీమంత్రము. మహాశక్తి సమన్వితమైన దేవీభాగవతమగు పరమమంత్రమది. ఆ దేవియే ఈవిశ్వమునకెల్ల ఆధారము. నీకీమంత్రము మహాభాగధేయముగ దేవీకరుణవలన లభించినది. ఈ మంత్రమునే ఉచ్చరించుచు మననము చేయుచుండుము సర్వసమర్థుడవగుదువు. నేనా దేవి

యంశతో వరలక్ష్మినగుచు అపుడు వచ్చితిని. మాయలో మునిగి నీవు నన్ను గుర్తింపలేకపోతివి. నిన్ను వరించి నేను నీకడనే యుందును, నన్ను స్వీకరింపుము. నీవు సత్త్వగుణస్వరూపుడవు నీ నాభికమలమున రజోగుణముకలిగిన బ్రహ్మ ఉద్భవించును. ఆతడు జగత్సృష్టికార్యము నిర్వహించును. జగములందు ధర్మ సంస్థాపనజేసి నీవు జగముల పోషించుచుందువు. బ్రహ్మఫాల మున తమోగుణప్రాభవుడగు రుద్రుడుద్భవించి ప్రళయకారకు డగును. మీరు ముగ్గురిట్లు సృష్టిస్థితిలయములు దేవి యాన తిని నిర్వహించుచుందురు; అనిచెప్పి యంతర్ధానమయ్యెను. శ్రీహరి కంతయు అద్భుతముగదోచి తనకు లబ్ధమైన దేవీ మంత్రమును మననమొర్చుచు మహాపాటవవంతుడగుచు మధు కైటభులను క్రూరరాక్షసులను వధింపగలిగెను. ఆ రాక్షసుల చరి త్రమునుకూడ వినుడు.

మధుకైటభచరిత్రము:— క్షీరసాగరమున శేషశయనుడైయున్న శ్రీహరి వీనులనున్న మలినమునుండి మధుకైటభులను ఇరువురు మహోగ్రరాక్షసులుద్భవించి తుత్రిటిలో భీకరాకారులై తమచుట్టు నున్న మహాసముద్రమును జూచి ఓహో ఈ విశాలసముద్రమెచ్చ టిది. దీనికి ఆధారమగు శక్తియేదో ఉండి యుండును అని యోచించుచుండ ఒక వాగ్బీజము వినిపించినది. వారిరువురు ఆమంత్రమునే మూఢభక్తితో నుచ్చరించుచుండిరి, అది దేవీ మంత్రము. దేవి కరుణతో వారికి ప్రత్యక్షమై వారుకోరిన స్వచ్ఛందమరణమును వరముగా నొసంగెను. దేవి యిచ్చిన వర గర్వమున వారుమతిఅంత భయంకరులై యెవరిమీదపడి వధింతుదమాయని అటునిటు దిరుగుచు ఆ పరిసరముల తపస్సా నరించుచున్న బ్రహ్మనుజూచి "నీకి దొంగతపమేల"యని బ్రహ్మ మీద పడిరి.

బ్రహ్మ భయపడి శ్రీహరివద్దకు పరువిడెను; శ్రీహరి నిద్రాముద్రితుడై యెంతప్రార్థించినను లేవడయ్యె. బ్రహ్మకిది యంతయు ఆశ్చర్యముగదోచి జగన్నాథుడగు శ్రీహరికి నిద్రయేల ఎంతకును మేల్కొనడు. ఇది యంతయు మాయాశక్తి మహిమ వలెనున్నది అని తలచి దేవిని ప్రార్థింపమొదలిడెను. "ఓ దేవీ నన్ను కరుణింపుము. ఈ రాక్షసులిర్వురు నాపై బడిరి. శ్రీహరి నిద్రలో మునిగియుండెను. నీ మాయాలీలగాకున్న అఖిల రక్షకుడగు శ్రీహరియిట్లు నిద్రామగ్నుడగునా. శ్రీహరియేమి, నేనేమి ఈ యఖిలవిశ్వమును నీ యాజ్ఞాబద్ధమై నడచుచున్నది నీవు రక్షింపకున్న దిక్కులేదు" అనిపలురీతుల దీనుడై ప్రార్థింప, దేవిప్రత్యక్షమై భయము వలదని బ్రహ్మ నూరడించునంతలో శ్రీహరి మేల్కాంచెను. మధుకైటభులంతలో నచటికి పరువు పరువున వచ్చి బ్రహ్మ శ్రీహరివద్ద నుండుటనుజూచి, ఈతడా నిన్ను రక్షించువాడ"ని ఒక్కవిసురున శ్రీహరిపై బడిరి.

మధుకైటభులకును శ్రీహరికిని ఆ సాగరమధ్యమున మహా యుద్ధమయ్యెను. సాగరమల్లకల్లోలమై అయిదువేలయేండ్లు గడచినవి. శ్రీహరికలసట వచ్చినదిగాని ఆ యసురులు లొంగలేదు. శ్రీహరికాశ్చర్యమైనది. "ఎంతోమంది దుష్టరాక్షసులు నాచేజచ్చిరి వీరికింత బలమెచ్చటనుండి వచ్చినది" అని అంతర్దృష్టినిచూడగా ఇది యంతయు దేవివరప్రభావమని తెలిసినది. ఇకవేఱుదారి గన్పడక శ్రీహరి దేవిని ప్రార్థించెను. "తల్లీ నీ సాయము బలములేక ఎవరును ఏమియు చేయలేరు. ఈ రాక్షసులను నిర్జించుశక్తి నాకు నీవే యీయవలెను. నీ వరము దుర్వినియోగమొనర్చి బ్రహ్మను నన్నును లెక్కచేయక వీరింత కావరముతోనున్నారు" అని వేడుకొనెను; దేవి కరుణించినది. మధుకైట

భుల దుర్మార్గము గ్రహించినది. శ్రీహరి కభయముపల్కి, ఒక సుందర కామినీవేషమున ఆ దేవి యా రాక్షసుల యెదుట నిల్చినది. వారిరువురామెను భోగదృష్టితో చూడసాగిరి. ఆ కారణమున వారి బలశక్తులు క్షీణింపనారంభించినవి. శ్రీహరి యినుమడించిన బలముతో వారినెదుర్కొని పోరాడినను వారు లొంగక పోవుటతో వారి శక్తికి ఆశ్చర్యపడి శ్రీహరి 'ఓ రాక్షసులారా మీబలమునకు మెచ్చితిని. మీకేమి వరము కావలెను కోరుకొను' డనగా వారు శ్రీహరిని వెక్కిరించుచు "ఓహో చాలుచాలు! నీవిచ్చువాడవు మేము పుచ్చుకొనువారమునా! మమ్ము వధించుటకుగదా నీ ప్రయత్నమంతయును, ఇచ్చుటంతయు జలమే. జలములేనిచోట మమ్ము నీవు చంపుటకు సాధ్యమగును. శక్తి యున్నచో అట్లు చేయుమనిరి. శ్రీహరి వెంటనే దేవిని స్మరించెను. మనస్సునందొక ఉపాయము తళుక్కున మెఱసినది. వెంటనే లేచి శ్రీహరి ఆ రాక్షసులనిరువురిని తన రెండుచేతులతో బంధించి జలములేని తనరెండు తొడలందు పడవేసి తన సుదర్శన చక్రముచే వారిని ఖండించెను. ఆ రాక్షసుల మెదడే భూమిగ ఆ జలమధ్యమున నిలచినది. అందువలన భూమికి మేదినియను పేరు కలిగినది. రాక్షసుల మెదడగుటచే మట్టినెవరును తినరాదని పెద్దలు నుడివిరి.

దేవి కరుణవలన బ్రహ్మకు మధుకైటభుల భయముపోయినది. శ్రీహరియు వారిని చంపగలిగెను. బ్రహ్మయు హరియు ఆదేవీ మహిమను కీర్తించి నమస్కృతులర్పించిరి.

దేవీభాగవతమున ప్రధానముగ చెప్పబడినది కర్మసిద్ధాంతము. అనగా ప్రాణికోటులుచేయు మంచిచెడ్డకర్మల ప్రభావము. ఎంతటి ఘనుడైనను తన కర్మఫలమును తాననుభవింపకతప్పదు. కర్మపరిపాకమును బట్టియే మంచిచెడ్డలు సంభవించుచుండును. అట్టి కర్మగతిని నిరోధించువారును, జగదీశ్వరి మాయకతీతులయిన వారును లేరు. ఒక సమయమున శ్రీహరి కంఠమునకే అశ్వశిరమతికింపబడెను. ఆ కారణమున అచ్యుతుడు హయగ్రీవుడయ్యెను. ఆ కథా వివరములివి.

దేవతలపై దండెత్తిన రాక్షసగణములతో వేలకొలది వత్సరములు శ్రీహరి పోరి జయించి ఒకచో అలసి పరుండెను సజ్యముచేసిన చాపము చేతులందట్లే యున్నది. విజయోత్సవముగ దేవతలొక యజ్ఞము తలపెట్టి శ్రీహరిని పిలువనేగి శ్రీహరి గాఢనిద్రయుండుట జూచి మేల్కొలుపుట కెవరును సాహసింపరైరి. శంకరుని ఆదేశమున బ్రహ్మ ఒక ఉపాయము నాలోచించి ఒక క్రిమిని సృజించి దానికి యాగహవిస్సు నాశగజూపి శ్రీహరి చాపముననున్న నారినికొఱికి త్రెంపుట కనిపెను. అనారి తెగిన ధ్వనికి శ్రీహరిలేచును గదా యను నూహతో అట్లు క్రిమి యట్లే చేయుగా అనారితెగి విసురుగ శ్రీహరి కంఠమునకు దగిలి శ్రీహరి శిరము తెగి దూరముగపోయిపడెను. దేవతలెల్లరు హాహాకారము లొనర్చిరి. జగన్నాథుడైన శ్రీహరికే యింతటి అపరాధమొనర్చితిమేయని ఘోషించిరి.

ఈ విపత్తు ఎవరివల్లను తీరునదికాదు త్రిభువనమాతయే సాయమై మనకొకదారి చూపవలెను అని బ్రహ్మ వేదములచేతనే దేవినిస్తుతింపజేసెను. దేవినుద్దేశించి వేదములంతట "ఓపరమే శ్వరీ, దేవీ, నీశాసనముచేతనే సర్వమును ప్రవర్తించును. బ్రహ్మాదులైనను నీశక్తి భావింపజాలరు. సురలందఱును చూచుచుండగనే శ్రీహరి శిరమూడిపోయినది. ఎవరిపాపమో ఎవరి శాపమో యెఱుగము. మమ్ముకరుణించి శ్రీలక్ష్మి మాంగల్యమునిలిపి జలజాక్షుని పునర్జీవితునిజేసి మాయాపదనుతీర్పుము. మేము దీనులము. నీకరుణపై విశ్వాసముంచి నీచరణములే శరణములుగా ప్రార్థించుచున్నా"మని వేడుటతో, జగదంబ కరుణాప్రసన్నయై వచ్చిసురల కభయమిచ్చి "బ్రహ్మాదిదేవతలారా, మీరు భయపడకుడు ఈ వేద సంస్తుతి నాకమితముదమును కలుగజేసినది. ఈ స్తోత్రము నికమీద ఎవరువిన్నను చదివినను వారికభీష్టసిద్ధిలభించును. శ్రీహరిశిరము తెగుటకు కారణమున్నది. ఒకనాడు శ్రీహరి లక్ష్మిముఖమునుచూచి హేళనగనవ్వుటచే ఆమెకోపించి శ్రీహరికి నీకు అశ్వముఖము కలుగ గలదని శపించినది. మఱియును హయగ్రీవుడను క్రూరరాక్షసు డిపుడు త్రిలోకములకు పీడగానున్నాడు. హయగ్రీవుడు అనగా గుఱ్ఱపుతలనుగల మహావీరుడే ఆ యసురుని పరిమార్చ గలడు కాన మీరు సందేహింపక ఒక అశ్వశిరము నీ శ్రీహరి కంఠమున కతికింపజేయుడు సర్వకార్యములు కలిసివచ్చు"ననిచెప్పి అంతర్ధానమందినది. దేవికరుణకు మహిమకు బ్రహ్మాదులెల్లరు ఆశ్చర్యపడి ఆమెను మరల పలురీతుల సంస్తుతించి, అమర శిల్పిని రావించి దేవియాదేశించినట్లే చేసిరి. శ్రీహరి హయగ్రీవుడయ్యెను.

ముమ్మొందుగ శ్రీహరి హయగ్రీవాసురుడున్న చోటునకేగి ఘోరయుద్ధముననా రాక్షసునిజంపి లోకముల పీడ వదలించెను. వెంటనే అశ్వశిరమును త్యజించి శ్రీహరి నిజస్వరూపమున దివి కేతెంచి దేవతలొనర్చు యజ్ఞమునందు పూజల స్వీకరించి సుర లెల్లరకు హర్షమునుగల్గించి వైకుంఠమునకేగెను.

శ్రీదేవీమహత్త్వమిట్లు అమేయమై వర్ణనాతీతమై సకలలోక సంక్షేమకరమై విలసిల్లుచుండుటకు బ్రహ్మాదిదేవతలు శ్రీహరి హరులుగూడ ఆ జగదేకమాతను మరలమరల సంస్తుతించిరి.

## శక్తిస్వరూపము

విశ్వశక్తి రూపిణియైన దేవీస్వరూప స్వభావ మహత్త్వముల పూర్తిగనెఱుగక మహనీయులయినవారే అనేకులనేక భంగుల సంశయాస్పదులైనారు.

బ్రహ్మకొక సమయమున మనసులో కొన్ని వాంఛలును వానిని గూర్చిన సందేహములును పొడమి శ్రీహరినిజూచి వానిని నివారించుకొనుటకై వైకుంఠమునకేగెను. చతుర్బాహుడు కౌస్తుభధారి శ్రీవత్సలాంఛనుడు వైజయంతీ విలసితుడు కాంచ నదుకూలధారి అభరణ భూషితుడయిన శ్రీహరి ధ్యానమందు చూచి బ్రహ్మ ఆశ్చర్యభరితుడై ఆ యచ్యుతుడు మేల్కనువఱకు నచ్చటనేయుండి తన ప్రథమసంశయమిట్లు నుడివెను.

దేవా, నీవు త్రిలోకములందును ప్రధానదైవమవు. సర్వ దేవతలు దిక్పాలురేకాదు నేనును హరుడును నీ యాజ్ఞల కెదురు చూచునట్టి పరమదైవమవు త్రిలోకరక్షకుడవు నీవు ధ్యానము

నందుండుటకు నీకంటె పరులెవ్వరు? నీకు సంసేవ్యులైనవా రెవ్వ
రుండగలరు? నాకాశ్చర్యమగుచున్నది పద్మాక్షా, అని నుడువు
చతుర్ముఖునిజుచి శ్రీహరి చిఱునగవుతో నిట్లనియెను.

వినుమయ్యా విరించీ, నీవు, శివుడు, నేను మనము
ముగ్గురమే పరమదైవముల మనుకొనుచున్నాము. కాని ఈ విశ్వ
మునెల్ల తనశక్తిచేదిప్పు ఈశ్వరి కలదు ఆమెయే జగన్మాత
జగదాధారము. ఆమెముందు మనకేమాత్రము స్వాతంత్ర్యము
లేదు. ఆమెయానతికంటు బద్ధులు కావలసినదే ఎవరికర్మ
పరిపాకము వారనుభవింపవలసినదే. ఎవరికైనను అభిమత
సిద్ధికలిగించునది అపరాశక్తియే నేనిపుడాపరమేశ్వరినే ధ్యానిం
చుచుంటిని. నాకేకాదు ఆమెయెల్లరకు ఆరాధ్యదైవమే ఆమెను
పూజించి ఆమెమహత్త్వమెఱుగ జాలినవారి కేలోపమురాదని
శ్రీహరి వాక్రుచ్చిన దేవీప్రశంసవిని బ్రహ్మ ఆజగదీశ్వరిని
స్మరించుకొనుచు తిరిగిచనెను. తాను విష్ణువలన వినిన ఈ విష
యమే బ్రహ్మ తనపుత్రుడగు నారదునకు చెప్పగా నారదుడు
వ్యాసునకు నుడివి వ్యాసుని దేవీభక్తునిగ జేసెను.

పరమేశ్వరిని గూర్చి సూతుడు చెప్పుచున్న ఈ కథలను
వినిన శౌనకాదులకుగూడ మనమునకొన్ని సందేహములుతోచి
యిట్లడిగిరి. పౌరాణికాగ్రణీ! నీవు నుడువు పుణ్యగాథలు మా వీను
లకుపండు వొనరించుచున్నది. కాని ఒక సందేహమున్నది.
ఈజగమ్మున సృష్టిస్థితి లయకారకులు త్రిమూర్తులగు బ్రహ్మ
విష్ణుమహేశ్వరులు; వారిలో హరి సర్వసమర్థుడందురు. ఆ హరి
శక్తియేమైనది. హరికి నిద్రాయోగమేల? హరికి మించినశక్తి
వేఱొండుకలదని చెప్పెదువు ఈ రహస్యమొకింత విశదీకరింప
మనివేడగా సూతుడిట్లు నుడివెను.

మునులారా, మీసంశయము నిజమే, నారదాది దివ్యఋషులకును ఇట్టి సందియములు కలవు. సర్వదేవతలను హరిహర బ్రహ్మాదులనుకూడ మించిన శక్తిరూపిణి ఆ జగదీశ్వరి. త్రిమూర్తులు వారివారి కార్యముల నాశక్తి యొసగిన బలము వలననే నిర్వహింపగలుగుచున్నారు. సరస్వతీ లక్ష్మీ పార్వతులా విశ్వశక్త్యంశసంభూతులై త్రిమూర్తులనుజేరి వారికి వలయుశక్తి సామర్థ్యముల గలుగజేయుచున్నారు. సర్వలోకాశ్రయమైన ఆశక్తి అన్నిప్రమాణముల కతీతమైనది. ఆశక్తి లేకున్న అందఱు అశక్తులే. ఆదేవి నిర్గుణనిరాకార రూపమయ్యు జగములను సాధుజనులను రక్షించుటకు సర్వాయుధాన్విత సగుణరూపమున అవతరించుటకు సర్వసంసిద్ధగనుండును. లోకములకు శ్రేయము గూర్చుటయే ఆమె వ్రతము. ఆమె కరుణాంతరంగ. ఆమె సేవ సర్వాభీష్టము అతిశుభంకరము. హరిహర బ్రహ్మాదులకు గూడ అతర్క్యము అనూహ్యము అయి ఆ జగదంబ మహిమ దైవారుచుండును. ఈ విషయములు స్వయముగ శ్రీహరి బ్రహ్మకు, బ్రహ్మ నారదునకు జెప్పిరి. నారదుడు వ్యాసునకు జెప్పెను. జనమేజయునకు వ్యాసుడు బోధించిన వివియే అని శౌనకాదులకు సూతుడు నుడువ ఆ మునులును సంతుష్టాంతరంగులై దేవిని, దేవీశక్తిని స్మరించుచు సూతుడు నుడివిన తరువాతి బోధల వినుచుండిరి.

## త్రిమూర్తులకు దేవీదర్శనము

దేవీశక్తి, దేవీమహిమ, దేవీపూజ అని మరలమరల నుడువుచుందురు, వీని వివరములు సంపూర్ణముగ వినగోరెదను అని ప్రశ్నించిన జనమేజయునికి వ్యాసుడు బోధించిన విషయములను సూతుడు శౌనకాదులకు వచింప మొదలిడెను.

## త్రిమూర్తులకు దేవీదర్శనము

జలమధ్యముననున్న నారాయణుని నాభికమలమునం దుద్భవించిన బ్రహ్మతానున్న పరిసరములచూచి ఆశ్చర్యమందు చుండగా 'తపతప'యను శబ్దము వినబడెను. అతడు తపశ్చర్యలో నుండగా 'సృజసృజ'యని మరల వినబడెను. బ్రహ్మమఃచింత అచ్చెరువుపడి ఈ జలమధ్యమున సృష్టియెట్లు సాధ్యమగును అని తలచుచుండగా మధుకైటభ రాక్షసులు బ్రహ్మమీదబడుట దేవీ మంత్రబలము వలన శ్రీహరి వారిని వధించునంతలో శివుడును శ్రీహరి సాహసకార్యము నుతించుటకు తత్ప్రదేశమున కేతెంచెను. ఒకరినొకరి చూచుకొనుచు వారున్నక్షణములో ఆకాశమునుండి "మీరు ముగ్గురు త్రిమూర్తులు బ్రహ్మ సృష్టియు, విష్ణువు జగత్పోషణ, శివుడు ప్రళయము కలుగజేయుచు జగత్కార్యము నిర్వహింపవలయును" అని ఒకవాణి స్పష్టముగ వినబడినది. వారాశ్చర్యచకితులైరి. ఇదంతయు జలమయము. ఈవాణి యెచ్చటిది. ఇచట సృష్టియెట్లు పొసగును, పోషించుటకేమున్నది ప్రళయమెట్లు సంభవమగునని హరిహరబ్రహ్మ లాలోచనమగ్నులయియుండ ఒక తేజోరూపిణి దివ్యవిమానముతోవచ్చి ఆముగ్గుర నెక్కించుకొని ఊర్ధ్వలోకములకేగినది. ఆవిమానమెచ్చటిది వారెచ్చటికేగుచున్నారు అనిన విషయములే ఆ త్రిమూర్తులకెఱుకబడుటలేదు. ఆ విమానము జలమునుదాటి, ఆకాశమధిగమించి, నందనవన స్వర్గసీమలనతిక్రమించి, సత్యలోకముజేరినది. అచ్చట వారికొకబ్రహ్మకనుపడెను. మఱియుపైకి విమానమేగినది. అచటనొక కైలాసము అందు గిరిజతోనున్న శివుడు, మఱికొంతపైని వైకుంఠము అచట లక్ష్మీసమేతుడైన శ్రీవిష్ణువు కనుపడిరి. ఈ త్రిమూర్తులెవరు అని విమానము లోనున్న త్రిమూ

ర్తులకంతయు అద్భుతమాయగానున్నది. వారికనులనిట్లుగప్పి వేయు త్రిమూర్తుల జూపినదెవరు? ఏమియు బోధపడుటలేదు. ఇంతలో ఆ విమానమొక క్షీరసాగరమును జేరినది. అందొక దీవి. ఈ ద్వీపమే దేవినివసించు మణిద్వీపమని ముందుగ మీకు నుడివితిని. ఆ దీవినిండ దుర్గములు సౌధములు పూతోటలు ఉద్యాన స్త్రీవనములు క్రీడాసరోవరములు. ఆకట్టడములు కాంచన మణిమయములు ఆ సౌందర్యము వర్ణనాతీతము.

ఆ సౌధములందొక కాంచనమంటపమున దివిజాంగనలు 'భువనేశి' 'హృల్లేఖి' యను నామములనుచ్చరించుచు, శృంగారవతియగు ఒకదేవిని షట్కోణయంత్రమధ్యముననున్న ఒక మహాతేజోరూపిణిని సేవించుచుంటజూచి ముగ్ధులై ఆ త్రిమూర్తులట్లే చూచుచుండిరి. ఇంతలో సహస్రబాహువులు సహస్రముఖము— చేతులందు ఆయుధములుగలిగి భానుకోటిప్రభలతోవెలుగు ఒక మూర్తి వారియెదుటగనున్నది. వారాయద్భుతదృశ్యమును చూచుచుండగా తనకు మనసున మెఱపు మెఱసినట్లుతోచి శ్రీహరి బ్రహ్మ శివులనుజూచి యిట్లనెను. "మీరు భ్రాంతినొందకుడు. ఈమె యెవరునుకాదు మనలను సృజించిన మాత. సర్వజగజ్జనని సర్వలోకాధారమైన శక్తియు అఖిలేశ్వరియునైన దేవియు ఈమెయే. నాచిన్ననాడు తనవ్రేలుకుడిపి నన్ను పెంచినది. ఈమెను భక్తితోసేవింతము రండని ఆ మంటపద్వారము కడకు వారిని తీసికొనిపోవుసరికి ఆ త్రిమూర్తులు మువ్వురకు పురుషాకృతులుపోయి స్త్రీరూపములువచ్చినవి. ఎవరి యాకృతి వారికి గులమి ఆశ్చర్యముగ దోచినది. అచటనున్న స్త్రీలతోకలిసి స్త్రీరూపులయిన ఆ త్రిమూర్తులును ఆ జగదంబను స్తుతించిరి

"తల్లీ నీవు ప్రకృతి రూపిణివి. పరమాత్మికవు. వరదేవివి. పరమేశ్వరివి లోకైకమాతవు. మేమే త్రిమూర్తులమన్న మాగర్వ భావమును అణగించివేసె త్రిమూర్తుల సృష్టింప గలిగిన మహా శక్తివి. మధుకైటభుల జంపుటకు నాకు బలమొసంగిన దైవమవు, నిన్ను ప్రార్థించుటకన్న మాకు భాగ్యములేదు సచ్చిదానంద సంశ్రయ యోగసిద్ధి నామనమ్మున నెలకొనునట్లు చేయుమని" శ్రీ హరి మొదట ప్రార్థించెను.

శివుడు వెన్వెంటనే చేతులు జోడించి "జగజ్జననీ అన్నియు నీవే. విశ్వాత్మికవు, అఖిలైకశక్తియునైన నీవలననే ఈవిశ్వ మంతయు నిలచియున్నది. నీబలములేనిదే మేము ముగ్గుర మేమియు చేయజాలము. నీ నవాక్షర మంత్రశక్తి నాకొసగి మన్నింపుము." అని వేడుకొనెను.

బ్రహ్మయు అట్లే అంజలిబద్ధుడై తల్లీ ఈవిశ్వమంతయు నీమహిమచే ప్రకాశించుచున్నది. నిన్నెఱుంగుటయే నిజమగు జ్ఞానము. మూలబ్రహ్మమగు పురుషుడును, శక్తియుగూడ నీవే మమ్ముకరుణింపుము." అని విన్నవించెను.

## త్రిమూర్తులకు దేవి ఉపదేశము

త్రిమూర్తులు చేసిన స్తోత్రములకు దేవిప్రసన్నురాలై తనరూపమును గూర్చి వారికిట్లుపదేశించినది.

"నాయాకారము అకలంక నిర్గుణాత్మక మయిన రూపము. ప్రకృతి పురుషులనిన భావమునేనె. జగద్వ్యవహారమందె ఇవి రెండుగ తోచును. పరమార్థ స్పృహయందట్టి భిన్నభావము

ఉండదు. ఈ విషయమును యోగులెఱుగుదురు. నేను కానిది ఈ విశ్వమునలేదు. సమస్త విశ్వమున కాధారము ఆశ్రయము నేనే బహు దేవతాస్వరూపమున బహుకార్యములు నెఱవేర్చు చుందును– నాయొక్క అంశలేక మీరు ఏకార్యమును చేయజాలరు. మీకుసహాయముగ నాయంశగల సరస్వతిని బ్రహ్మకు, లక్ష్మిని శ్రీహరికి, గౌరిని శివునకు ఇచ్చుచున్నాను. వీరినిమీరు గౌర వముతో జూచుకొనుడు వీరివలననే మీకువలయు శక్తి సామర్థ్యము లలవడును. నా నవాక్షరమంత్రమును మీ కొసగు చున్నాను. ఆ మంత్రమునే విశ్వాసముతో ధ్యానించుచుండుడు. బ్రహ్మ జగముల సృష్టించును. సరసిజాక్షుడు పోషించును. శంభుడు ప్రళయ కారకుడగును. మీకెల్ల వేళల జయమగును. మీకేదేని కష్టమాసన్నమైన యపుడు నన్ను స్మరింపుడు నేను వత్తును. మీపనులు పూర్తియయిన కల్పాంత వేళ మీరువచ్చి నన్ను కలియుదురు." అని ఆదరమున పలికి అంబ వారిని వెనుక కనిపెను.

ద్వారము కడకు వారుతిరిగి వచ్చుసరికి వనితాకారములు పోయి యాత్రిమూర్తులకు వారివారి పూర్వాకృతులు తిరిగివచ్చి నవి. ఎదుట వారుచూచిన దీవియులేదు. ఆ దేవియులేదు. మఱునిముసములో వారు మొదటగ విమాన మెక్కిన చోటునకు వచ్చివారిలిరి. వారి భ్రాంతి నశించినది, దేవీస్వరూప స్వభావము లర్థముయినవి. అయినను శ్రీహరి మఱియొకమారు బ్రహ్మ శివుల కిట్లు చెప్పెను. "మనము చూచిన దేవియే జగన్మాత. అవసరమైనపుడెల్ల ఆమె సగుణరూపము ధరించును. నిర్గుణ

పురుషుండు నిర్గుణప్రకృతి అమెయే. అదియే పరమాత్మ శక్తుల సమైక్య భావము. సకలభూతములందు సూక్ష్మముగ వసియించు దివ్యతేజ మదియే. ప్రకృతి పురుషభేదము అహంకార దూరులైన విరాగులగు యోగులకే దెలియును. ఈ చరాచరబ్రహ్మాండమంతయు అహంకార పూరితము పరమాత్మ రహస్య మెఱుగుటకు అహంకారము నణచుకొనుట ముఖ్యము." ఇట్లు శ్రీహరి నుడివిన పరమాత్మ స్వరూప రహస్యమును గూడ విని బ్రహ్మయు శివుడు వారి సెలవుల కరిగిరి.

ఈయజ్ఞము లైదు విధములు. పృథ్వికి సర్వవిధముల మేలొనగూర్చు సత్కర్మములివి. మునుల యజ్ఞములు సత్త్వగుణ ప్రధానములు. భూమీశు లొనరించునవి రాజసయజ్ఞములు. దైత్యులు చేయునవి తామస యజ్ఞములు. జ్ఞానులు ముముక్షువులు కూడ ఈ యజ్ఞములొనర్చి ముక్తి బడయుదురు. యజ్ఞ ఫలమునందుటకు యజ్ఞోపకరణములైన ద్రవ్యము వస్తుసముదాయము మంత్రము క్రియావిధానము మున్నగునవన్నియు పవిత్రములయి యుండవలెను. కానిచో ఫలము లభింపదు. పూర్వమీ యజ్ఞముల నొనరించి ఎందఱో పుణ్యాత్ములు కీర్తితోబాటు ఉత్తమ సంపదలు ఉత్తమగతులు పొందిరి.

దేవి దర్శనానంతరము తిరిగి వైకుంఠమున కేతెంచిన శ్రీహరియు దేవీ నవాక్షరమంత్ర జపముసేయుచు దేవీయజ్ఞ దీక్షితుడయ్యెను. ఆ యజ్ఞమును జూచుటకు బ్రహ్మ శివుడు దిక్పాలురు దేవమునులేతెంచిరి. ఇరువదేడ్గురు సర్వశాస్త్రజ్ఞులైన ఋత్విజులేతెంచి శాస్త్రోక్తవిధిగ యజ్ఞకృత్యములు జరుపుచు

హవిసులర్పించుచు దేవీమంత్రముల పఠించుచుండ, యజ్ఞదీక్షితుడై దేవిని ధ్యానించుచున్న శ్రీహరిని మెచ్చి అశరీరవాణియై జగదంబ యిట్లు వలికినది– "నారాయణా, నీవు చేయు యజ్ఞము నాకతిముద మొసగినది. వేదములు శాస్త్రములు బ్రహ్మాది దేవతలెల్ల నిన్ను బూజింతురు. జగములకు దైత్యభయమును బాపి ధర్మమునుద్ధరింప నీవవతరించినపుడెల్ల నేను నీ యందుండి జయమునిచ్చెదను. వారాహి వైష్ణవి మొదలగు నవశక్తులతో గూడిన లక్ష్మి సదా నీ వక్షస్థలముననిల్చి నీకు తోడ్పడును." అని ఆదరమొప్ప అంబ పలికిన పలుకులకు అచటనున్న వారందఱును ఆనందభరితులై ఆ పరమేశ్వరిని జలజాక్షునిగూడ సంస్తుతించిరి. దేవీయజ్ఞ ప్రభావము దేవీమహిమ దశదిశల వ్యాపించినది.

—o—

# శ్రీ పరమేశ్వరి

## స్కంధము—౬

### బ్రహ్మాండోత్పత్తి

బ్రహ్మాండోత్పత్తియు సకల చరాచరభూతకోటి సృష్టియు జరుగవలెనని త్రిమూర్తుల నాదేశించి ఆ కార్యములకు దగిన శక్తియుక్తులనిచ్చి దేవి పంపినది. త్రిమూర్తులు వారివారి కార్యనిర్వహణమున నిమగ్నులై యున్నారు.

### త్రిగుణస్వభావము

ఆ సృష్టికి మూలకారణములిట్లున్నవి. ఈ బ్రహ్మాండమంతయు సత్వరజస్తమోగుణాత్మకము. ఈ త్రిగుణములకు వేర్వేరు శక్తులున్నవి. ఆ శక్తుల వలన శబ్దస్పర్శరూప రసగంధములను పంచతన్మాత్రలు వానిని గలిగిన పృథివ్యాపస్తేజో వాయువాకాశములనబడు పంచభూతములును వీని సమ్మేళమున సకలసృష్టితో బాటు జీవనోత్పత్తియు జరుగుచున్నది.

పరమాత్మ రూపములు స్థూలము సూక్ష్మము అని రెండు విధములు. పరమాత్ముని సంచీకృత సూక్ష్మరూపములనుండి పంచభూతములుత్పత్తి యగుచున్నవి. పరమాత్ముని ఈ స్థూల రూపము ఉపాసనకు యోగ్యమైనది.

సర్వజీవులు బ్రహ్మాండాంశ కలవియే. ఈ జీవరాసులు 84 లక్షలు. జీవులకుగల జ్ఞానేంద్రియములు (త్వక్ చక్షుః శ్రోత్ర జిహ్వ ఘ్రాణములు—) కర్మేంద్రియములు (వాక్ పాణిపాద

వాయూపవస్థలు)- వాయువులు (ప్రాణ అపాన వ్యాన ఉదాన సమానములు)ఇందు గలుగుబుద్ధి శ్రద్ధలు సత్వరజస్తమోగుణముల నాశ్రయించి ప్రకాశించును. సత్వగుణము ధర్మసత్యశౌచ దయాది లక్షణములు గలది. రజోగుణము కోపద్వేషాదులుగలది. తమోగుణము (అజ్ఞానము నిద్ర నాస్తికత్వము మొ॥వి), కలది అన్నిటి కంటె సత్వము ఉత్తమమైనది.

భక్తులుముందు సత్వగుణముపొంది దేవీభావ మనస్కులై క్రమముగ ఆ జగదీశ్వరి పూజలనొనర్చుచు తుదకు త్రిగుణా దేవి సాయుజ్యము నందగలరు.

## దేవీ పూజా విధానము

దేవీ భక్తులకు దేవీపూజా విధానములు సంపూర్ణముగ దెలిసికొనుట ముఖ్యము. దేవియందు భక్తివిశ్వాసములు, పూజాచరణమందు శాస్త్రవిధి ననుసరించిన శ్రద్ధయు కావలెను.

దేవీ పూజకు చైత్ర ఆశ్వయుజ మాసములు శుక్లపక్షమున పాడ్యమినుండి నవమి వరకుగల తొమ్మిది దినములు ముఖ్యము. ఆ తిథులు దేవికిష్టమైనవి. ఆ పవిత్ర దినములందు జరుగు దేవీ పూజలు ఇవి శుభప్రదములు పాపరహితములు పుడమికి మేలొన గూర్చునవి, భక్తసంతతికి ఆయురైశ్వర్యములు విజయము దేవి యనుగ్రహమున గలుగును.

పూజ చేయువారు మొదటినుండియు దీక్షాపరులై ఒకపూట హవిసు మాత్రమే తిని యుండవలెను. పూజా మంటపము

సమతలముగ నుండవలయును. పదునారు చేతుల యెత్తుగల దృఢయుతస్తంభ మమరింపవలెను. పూజావేదికను నాలుగు చేతుల చదరముగ ఒకచేయి యెత్తుగ నిర్మించి వేదికపై పట్టు వలువ పఱచి సింహాసనము నుంచవలయును. వేదశాస్త్రజ్ఞులైన తొమ్మండుగురు విప్రులు, దేవీమంత్ర జపమునకొక పవిత్ర జీవనుడైన బ్రాహ్మణుడు అవసరము. మంటపమునందు ముగ్గులు అలంకారములు విజయ తోరణములు విరివిగ నేర్పరుప వలెను.

హేమకిరీటము, పద్మ గదా శంఖ చక్రములు. ముక్తా రత్నహారములు లలితాంబరములు మోమున మంద హాసము కృపావీక్షణము గలిగిన దేవీ సుందరప్రతిమను శుభమంగళ వాద్యములు. వేదశాస్త్ర ఘోష జరుగుచుండగ తీసికొనివచ్చి సింహాసన మందుంచ వలెను. దేవికి పదునెనిమిది చేతులుండునని కొందరి మతము. దేవీప్రతిమను తేలేని యెడల వేదికయందు దేవీమంత్రముగల యంత్రమును స్థాపించి, అప్రక్క మామిడి మట్టి జువ్వి మేడి పంచపల్లవముల నుంచవలయును. పాడ్యమితో హస్తనక్షత్రము వచ్చిన దినము దేవీపూజకు ప్రశస్తము. పూజా వ్రతులు పగటియందుపవాసముండుట ఉత్తమము-

అర్చనలుత్సాహముగ జరుగవలెను. పూవులు పండ్లు దివ్యాంబరములు ధూపదీపములు ద్రవ్యములు హోమవస్తువులు సర్వము పవిత్రమై ఉండవలెను. కవులు గాయకులు నృత్య గీతములొనర్చువారు పౌరాణికులు వేదపాఠకులు జపముసేయు వారు. వారివారి పనులనుల్లాసముతో సేయవలెను. రుచ్యములు నవీనములునగు చతుర్విధ భక్ష్యభోజ్యములను దక్షిణతాంబూ

లాదులతో అంబకు నివేదనమిచ్చి మంగళహారతులిడి ప్రణతి ప్రదక్షిణలొసలిపి దేవీప్రసాదమును భక్తితోస్వీకరించు వారికి దేవియనుగ్రహమున సకల భాగ్యములు సంపూర్ణముగ గలుగును.

## కన్యా పూజ

దేవీపూజయందు కన్యాపూజ ఒక ముఖ్యభాగము. ఈ పూజకు విప్రవంశీయులు ఆరోగ్యవతులు సుందరరూపులు ఋతులక్షణరహితలు రెండేండ్లమండి పదియేండ్ల వరకు వయస్సుగల బాలికల నాహ్వానింపవలెను అబాలికలను దేవీరూపలగనే భావించి వస్త్రాద్యలంకారములతో సన్మానించి మంత్రతాంబూల దక్షిణ నివేదనలతో మంగళహారతులతో యధావిధిగ పూజసలుపవలెను. జయము గోరువారు రాజకుమారిని లాభముకోరువారు వైశ్యకుమారిని, పూజించుటయు గలదు. కన్యక నామమునుబట్టి పూజాఫలములును వేఱువేఱుగనుండును.

| కుమారివయస్సు సంవత్సరములు | దేవతానామము | పూజాఫలము | |
|---|---|---|---|
| 2 | కుమారి | దుఃఖదారిద్ర్యములు | నశించును |
| 3 | మహిమ | ఆయుర్వృద్ధి | |
| 4 | కల్యాణి | విద్యాభివృద్ధి | |
| 5 | రోహిణి | రోగనాశనము | |
| 6 | కాళిక | శత్రునాశనము | |
| 7 | చండిక | సంపద | |
| 7 | శాంభవి | రాజాశ్రయము | |
| 9 | దుర్గ | సర్వకార్యములందు | జయము |
| 10 | సుభద్ర | వాంఛాఫలసిద్ధి | |

పూజాదినములు తొమ్మిదియు అవి పవిత్రములు దేవికి ప్రీతినిచ్చు సమయములు. దీనినే నవరాత్ర పూజయందురు. తొమ్మిది దినములు పూజచేయలేకున్న అష్టమిదిన పూజ సలిపి ఫలితముల బడయవచ్చును. సప్తమి, అష్టమి నవమి దినముల ఉపవాసమున్నను దేవికిష్టమె.

సర్వభువనములకు కారణము, ఆధారము, ఆశ్రయము, పాలించు శక్తి కలిగి కరుణాంతరంగ అయిన ఆ జగదంబిక నాత్మలో నమ్మి పూజలనొనరించి ధన్యులై సకల కామితసిద్ధి బడసిన వారెందరో కలరు. విష్ణ్వవతారులైన శ్రీరాముడు శ్రీకృష్ణుడును దేవినిపూజించి ఇష్టమనోరథసిద్ధినందినవారే:

పూజావస్తువులు:- ఆయాతిథులయందు, వారములయందు, దేవీ పూజలొనర్చు సమయమున దానమీయదగినవి హోమాహుతి చేయదగిన వస్తువులు ప్రత్యేకముగ నున్నవి. ఈవస్తువుల వినియోగము నందెక్కువ ఫలము కలిదు.

| తిథి | వస్తువు | ఫలము |
|---|---|---|
| పాడ్యమి | నేయి | రోగనాశనము |
| విదియ | పంచదార | అయుర్వృద్ధి |
| తదియ | పాలు | దుఃఖనాశనము |
| చతుర్థి | అప్పాలు | విఘ్నములంతరించును |
| పంచమి | అరటిపండ్లు | బుద్ధిబలము |
| షష్టి | తేనె | తేజస్సు |
| సప్తమి | బెల్లము | శోకనాశనము |

| | | |
|---|---|---|
| అష్టమి | కొబ్బరికాయలు | తాపశాంతి |
| నవమి | పేలాలు | ఇహపరసౌఖ్యములు |
| దశమి | నల్లనువ్వులు | యమభయముండదు |
| ఏకాదశి | పెరుగు | ఏకాంతభక్తి |
| ద్వాదశి | అటుకులు | దేవీకటాక్షము |
| త్రయోదశి | సెనగలు | సంతానము |
| చతుర్దశి | పేలాలపిండి | శివప్రియము |
| పౌర్ణమి | పాయసము | పితృప్రీతి |

ఆదివారమున పాయసము. సోమవారమున పాలు. మంగళవారమున అరటిపండ్లు బుధవారమున వెన్న గురువారమున పటిక బెల్లము శుక్రవారమున చక్కెర శనివారమున ఆవునేయి దేవికి ప్రీతికరమైన పదార్థములు.

## కర్మ సిద్ధాంతము

శ్రీ మహావిష్ణువు ధరణిపై ధర్మ సంస్థాపనకై యెన్నియో యవతారములెత్తెను. మానవ రూపములుగూడ ధరించెను. శ్రీరాముడు శ్రీకృష్ణుడు అట్టి లీలామానుష విగ్రహులే. మహావిష్ణువుయొక్క అవతారములనుకూడ వారు కొన్ని కష్టములపాలు కావలసివచ్చినది. అంతటివారికే కడగండ్లు ప్రాప్తించినప్పుడు సామాన్య నరులమాట యేమి! పాండవులాదినుండియు ధర్మవర్తనులు, న్యాయవర్తనులేగదా. వారనేక హింసలకు లోనైరి. ఇవి యన్నియు పవిత్ర వర్తనులైనవారికి గూడ యెందులకు వచ్చును. వీనివెనుక నేదైన కారణమున్నదా!

ఈ సందేహములు వ్యాసునివలన దేవీ భాగవతమును వినుచున్న జనమేజయుడన్న వతికి వచ్చినవి. అట్లేసుతుని ప్రవచనము వినుచున్న శౌనకాదులకును వచ్చినవి. ఆ మహా ఋషులసమాధానము లివి.

కర్మసిద్ధాంత మొనటియున్నది. ఎక్కువ తక్కువ పెద్ద చిన్న లేకుండ ప్రాణులెల్లరు కర్మకు అధీనులు కావలసినదే; అతీతులెవరునులేరు. కర్మ మూడు విధములు గానున్నది ఆగామి కర్మ వెనుక చేసుకొనినది సంచితకర్మ తటాలున ప్రాప్తించునది ప్రారబ్ధ కర్మము పురాకర్మ హేతువుగనే కష్టసుఖములు జన్మములు కలుగుచుండును. గర్భస్థజీవి కష్టము వర్ణనాతీతము. సంచార జీవనము పాపమూలము బంధహరణము. జీవిని కామ క్రోధ లోభ మోహమద మాత్సర్యము అనుదుర్గుణములు లోగొని దుష్కర్మములు చేయించి తత్ఫల మనుభవింపజేయును, తెలిసియు మాయకు లోబడి మనుజులీ దుర్గుణముల పొలగుదురు. దానము సత్యము దయ శుచి దైవభక్తి మున్నగు ధర్మమార్గములను చిత్తశుద్ధితో నభ్యాసమొనరించి కర్మశుద్ధిని సంపాదించి పాపరహితులై ధన్యులగుట జీవిత లక్ష్యము. మాయామోహము లందు చిక్కి అనుచితము లొనరించి ఆ దుష్కర్మ ఫలితముల ననుభవించుట మహనీయులకే తప్పలేదు. ఇట్టి కథలెన్నియో యున్నవి. జరాసంధు నోడించుటకు శ్రీకృష్ణుడు విప్రవేషమును ధరించియేగెను. కంసునింటి కారాగృహమున భార్యతోబాటు బంధితుడైన వసుదేవుడు పూర్వజన్మమున వరుణుని ఆవుల నపహరించిన కశ్యపుడు. స్వర్గాధిపుడైన దేవేంద్రుడు మోసమున

తన సవతి తల్లియగు దితిగర్భమున సూక్ష్మజీవియయి చొచ్చి గర్భస్థపిండముల ఖండించినందున దితియిచ్చిన శాపముచే రాక్షసులకోడి తన స్వర్గాధిపత్యము పోగొట్టుకొనియెను. హరియంశ సంభూతులయిన నారాయణులు మునులు మహాతపశ్శాలులు అయినను ధనుర్బాణములు ధరించి వీరుల మనుఅహంకారమున మహాభక్తుడగు ప్రహ్లాదుని తడనే యుద్ధమునకు దిగిరి.

తుదకు శ్రీహరియే ఒక అనుచిత మొనరించి శాపగ్రస్తుడై పుడమి ననేక జన్మము లెత్తవలసి వచ్చినది. భూజనుల భాగ్యము వలన ఆ యవతారములు ధర్మోద్ధరణమున కాలంబము లైనవి. ఈకథ వినుడు

## శ్రీవిష్ణువునకు భృగుముని శాపము

దానవులకు గురువగు శుక్రుడు బృగుముని కుమారుడు. ఒకప్పుడా శుక్రుడు తగిన శక్తిసామర్ధ్యముల సంపాదించుటకై తపస్సున కేగెను. ఈసమయము జూచి అమరులు దానవులను బాధింపసాగిరి. దానవులా బాధపడలేక అతిపవిత్రతయు, మహిమాన్వితయునైన శుక్రుని తల్లిసాయమును గోరిరి. ఆమె ఒక నిద్రాశక్తిని సురలపై కనుపగా ఆ శక్తి ప్రభావమున దేవతల సామర్థ్యము మందగించెను. దేవేంద్రుడందునకు భయపడి తానేమియు చేయలేక విష్ణువు సాయమును కోరెను. విష్ణువు తన చక్రమునంపి శుక్రుని తల్లిని వధించెను. ఈఅనుచితము సహింపలేక భృగువు శ్రీహరికడకేగి "శ్రీహరీ అనుచితముని భావింపక అబలను చంపితివిగాన నీవికభూమిపై అనేక యోనుల

బుట్టుచు జనన మరణ దుఃఖ సంతప్తుడ వగుదువని శాప మొసగెను. ఈశాప ఫలమే శ్రీరామాదుల జన్మము. శ్రీహరికే ఈ విధమున కర్మ పరిపాకము తప్పలేదు.

## శ్రీరాముడు దేవి నర్చించుట

లంకాధిపతి యగు రావణాసురుడు బ్రహ్మను తనతపస్సుచే మెప్పించి వరములంది మహాబల దర్పితుడై ముల్లోకముల బాధించుచుండెను. దేవతలా త్రిలోక కంటకుని బాధపడలేక విష్ణువు కడకేగి దేవా నీవిక భూమిపై నవతరించి త్రిలోకకంటకుడు, దశకంఠుడైన రావణుని వధింపనిచో లోకము లాకూర్రుని ముందిక ఆగవు. ధర్మమడుగంటును. ఆ క్రూరరాక్షసుడు వర బలదర్పితుడు శివభక్తుడే యగునుగాక అతడొనరింపని అకృత్యము లేదు - యజ్ఞశాలలు పడగొట్టెను. మునులను బాధించెను స్త్రీలను చెఱపట్టెను. స్వర్గముపై దండెత్తివచ్చెను. ఇంతకన్న ఆగడము లేమికావలెను. నీవురక్షింపనిచో మేమెచ్చటికైన పారిపోవలసినదే" అని మొఱబెట్టిరి - శ్రీహరి వారికభయ మొసగి రావణునెట్లంత మొందించుటాయన యాలోచించెను. సురాసుర గంధర్వోరగాదులచే మరణము లేకుండ రావణుడు వరములందెను గాని, మానవునిచే మరణములేకుండ వరము కోరలేదు. శ్రీహరి యీ రహస్యము నెఱుగును. తాను మానవుడై జన్మించిరావణుని పరిమార్ప వలయును. భృగుమునివలన తాను పొందినశాపము కూడ యిందుల కనుకూలమని శ్రీహరికి దోచినది—

ఆ సమయమున అయోధ్యాధిపుడగు సూర్యవంశనరపతి దశరథుడు మహాధర్మాత్ముడు దేవేంద్ర నిభుడని పేరుగనిన మహాత్ముడు పుత్రుల బడయుటకై పుత్రకామేష్టియజ్ఞ మొనరించుచుండెను. ఆ విఖ్యాత సూర్యవంశమున జన్మించుట సముచితమని చతుర్ముఖుడు నుడువగా శ్రీహరి రావణవధకై తానట్లు పుడమిపై జన్మించుట కంగీకరించెను.

దశరథు డొనర్చు యజ్ఞమున అగ్నికుండము నుండి యజ్ఞపురుషు డుద్భవించి పాయసముతోనున్న పసిడిగిన్నె నా రాజున కిచ్చెను. దశరథుడాపాయసమును తనరాణులు కౌసల్య, సుమిత్ర, కైకేయిల కిచ్చెను. ఆప్రసాదఫలమున శ్రీహరి కౌసల్యా గర్భమున జన్మించి శ్రీరాముడను పేరొందెను. కైకకు భరతుడను కొమరుడు సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్ను లను తనయులు కలిగిరి. వీరును శ్రీహరి యంశలే. సోదరులు నలువురును సునిశిత బుద్ధులు భానునిభతేజులు సకల సద్గుణసంపన్నులు. కులగురువు వసిష్ఠునివద్ద సకలవిద్యలునేర్చిరి చిన్ననాడే శ్రీరాముడు లక్ష్మణునితో గూడి విశ్వామిత్రమునీంద్రుని వెంటనేగి పెక్కురక్కసులను జంపి యామునిచేయు జన్నమును గాచెను. శ్రీరాముని బలసాహసములకు విశ్వామిత్రుడు ముదితుడై, మహాశక్తిసంపన్నములైన మఱికొన్ని యస్త్రము లుపదేశించి అజేయ పరాక్రమునిగ జేసెను.

శ్రీరాముడు, మహాబలవంతులకు గూడ సాధ్యముగాని శివుని చాపము విరిచి మిథిలాధిపతి జనకుని కూతురు సీతను

పెండ్లాడెను. దశరధుడు తనభార్య కైకకిచ్చిన వరపాలనకై శ్రీరాము నతనిభార్య సీతతోగూడ పదునాలుగేండ్లు అరణ్యవాస మున కంపెను. రాముడరణ్యములో నున్నపుడు లంకాధిపుడగు రావణుని చెల్లెలు కామాతురయై తనపై బడగా రాముడామెను త్రోసిపుచ్చి తనవెంటనున్న తమ్ముడు లక్ష్మణునిచే నామె ముక్కు చెవులు కోయించి పంపెను. పదపడి శూర్పణఖ ప్రేరణపై ఖర దూషణాది రాక్షసులు దండెత్తిరాగా రాముడు వారినిగూడ వధించెను. తనబంధుగుల రాము డిట్లవమానించిన వార్త విని రావణుడు మాయవేషమున వచ్చి రామ లక్ష్మణులు లేనిసమయ మున సీతనపహరించి లంకకు గొని పోయెను.

సీతకై అరణ్యముల గుమ్మరుచు రావణుని చంపి తన భార్య సీతనెట్లు దిసికొని వచ్చుటాయని శ్రీరాముడు చింతాకులుడై దుఃఖించు చుండ నారదమహాఋషివచ్చి శ్రీరామా యిటులేలవిచా రించెదవు నీవు రావణవధకై జన్మించిన కారణ జన్ముడవు. పూర్వ జన్మమున వేదవతియను మునిపుత్రి సీత. రావణుడామెను కామించి అవమానింప బోయిన హేతువున రావణుని చావునకై సీతగా జన్మించి నీభార్య యైనది. నీవు రావణుని సంహరించి, నీ భార్యతో గూడి సుఖముగ ధర్మపరిపాలన సేయుదువు. నీకార్యము సుకరమగుటకు ఒక ఉపాయమున్నది. జగదీశ్వరి యైన దేవి కరుణార్ద్ర హృదయ ఆమె పూజలు ఇష్టకామ్యార్థ ప్రదములు. మధుకైటభుల జంపునపుడు మహావిష్ణువును, త్రిపు రాసురుల జంపునపుడు శివుడును, వృత్రుని జంపునపుడింద్రు డును ఆ దేవినే పూజించిరి. నీవును అట్లుచేయుము అని దేవీ పూజావిధానమును నారదుడు సత్యమును బోధించెను- దేవి

నామము వినగనే శ్రీరాముని మనశ్చింత శమించినది. ఇంతలో పుణ్యకాలమైన శరదృతువు వచ్చినది. శ్రీరాముడు నవరాత్ర పూజలు దేవికి బహుభక్తిశ్రద్ధలతో జేసెను. అష్టమినాటి రాత్రి దేవి ప్రత్యక్షమై తన సంతోషమును శ్రీరామునకుదెల్పి రావణుని వధింపదగు బలశక్తులను రామునకు గలుగజేసెను. దేవిని మననున దలచుచు శ్రీరాముడు కపివీరుడగు సుగ్రీవుని మైత్రి నెఱపెను. సుగ్రీవుని మంత్రియగు హనుమంతుడు వీరాగ్రణి సీతకై వెద కుచు వార్ధిని లంఘించి లంకలోనున్న సీతనుజూచి రాముని కుశలవార్తతెల్పి ఆమె వార్త రామునకుదెల్పి ముదముగూర్చెను. రాముడు కపిసేనతో కదలి సముద్రమునకు వారధి నిర్మించి లంకనుజేరి క్రూరుడగు రావణాసురుని సపరివారముగ వధించి, తన భార్యతో పరమసంతుష్టాంతరంగుడయి అయోధ్యజేరి పదు నొకండు వేలేండ్లు ధర్మపాలన నెరపెను-

జగదంబ మహిమను దెలుపు ఈ సీతారాముల కథ ప్రజల కన్ని విధముల శుభదాయకము సంపత్కరము.

## శ్రీకృష్ణావతారము:

## జగదీశ్వరికి భూదేవి మొఱ

కృతయుగమున రావణ వధకై శ్రీరాము డుదయించి దేవి యనుగ్రహమున రావణవధ గావించినట్లే, ద్వాపర యుగ మున శ్రీవిష్ణువు శ్రీకృష్ణునిగా దేవకీవసుదేవుల కుద్భవించి కంస శిశుపాల జరాసంధాది క్రూరులను నశింపజేసెను.

# జగదీశ్వరికి భూదేవి మొఱ

భూమిపై శిశుపాల కంస జరాసంధ దుర్యోధనాదులు చేయు దుష్టచేష్టితముల పాపభార మంతకంతకు అధికమై భూదేవికే దుర్భర మైనది. వారందఱు రాక్షసాంశ సంజాతులే. న్యాయమును, ధర్మమును, విడనాడి భగవంతునే తిరస్కరించు స్థితికి వచ్చినారు. భూదేవి గోరూపిణి యయి ఇంద్రునితో గూడి బ్రహ్మకడ కేగి తన యిక్కట్లు చెప్పుకొనినది. బ్రహ్మ ఆమెను తీసికొని పద్మాక్షుని కడకేగినాడు. పద్మాక్షుడు వారు చెప్పిన దంతయు విని ప్రసన్నుడయి "చతుర్ముఖా నీవెఱుగుదువు గదా ఈ సంఘటనలన్నియు, చేసికొనిన కర్మానుసారముగ విధి నిర్ణ యమ్మున జరుగుచున్నవి. బలీయమైన విధి కందఱు అధీనులు కావలసినదే. శ్రీరాముడనయి జన్మించి నేను పడిన బాధ లెఱుగుదువు గదా. అయినను లోకమున కకారణముగా జరుగుచున్న బాధలు తొలగవలెను. పరమేశ్వరి జగదంబ అయిన ఆ యీశ్వరియే వీనిని తీర్చగల శక్తి" యని నుడువగా, బ్రహ్మ ఇంద్రుడు భూదేవితో గూడి మణి ద్వీపమున నున్న దేవిని భక్తితో దలచి యిట్లు ప్రార్థించిరి —

"అంబా, నీవఖిల కారిణివి. విశ్వమంతయు నీ చేతిలో నున్నది. కంస శిశుపాల జరాసంధాదులవలన నే డిపుడు పుడమిని పెక్కు పీడలు కలుగుచున్నవి. వేఱు దారిలేక నిన్నర్థించు చున్నాము. ఈ దుష్టుల దుండగముల నాపి భూభారము నెట్లు బాపగల్గుదువో నీవయి మమ్ము రక్షింపకున్న లోకమున అధర్మమే తాండవించును. ఓ కరుణామయీ నీవే దిక్కని వేడగా దేవి కరుణాదృష్టితో ప్రత్యక్షమైనది. బ్రహ్మాదులతో పాటు హరియు లేచి అంబకు మ్రొక్కి "జగదీశ్వరీ నీ యాజ్ఞలకు వేచి యున్నా"

మని అంజలి బద్ధుడయ్యెను. దేవి వారిని జూచి "మీరు భయ పడకుడు. మీరు నుడివిన విషయము నా మదిలో ఈ వరకే యున్నది. కంసుని కారాగారమున దేవకీ వసుదేవులకు శేషుడును హరియు, బలరామ కృష్ణులయి జన్మించి వ్రేపల్లెలో నందునింట పెరుగుదురు. యోగ మాయగ ఆ పనిని నేను నిర్వహింతును. అన్ని కార్యములయందు వారికి అండగ నిలచెదను. ఆ దుష్టు లంత మొందెదరు. భారత యుద్ధమున అక్షోహిణులకొలదియు క్షత్రియ వంశ్యులు సైనికులు దుర్యోధనాది కౌరవులు నశింతురు భూభార ముడుగును అని అభయమిచ్చి వారి నని పెను.

శ్రీకృష్ణుడు జన్మించి పెద్దవాడయినాడు. బలరాముడు తనకు తోడు. దేవీ బలము తనయందున్నది. బాలుడై యుండ గనే తనపైకి కంసుని పంపున వచ్చిన పెక్కుమంది రక్కసులను జంపి, మధురకేగి కంసుని అతని సభాగారమునందు వధించి నాడు. ధర్మరాజు చేయు రాజసూయమున తన్నెదిరించిన శిశు పాలుని వధించినాడు. పాండవులకు తోడయి కురుక్షేత్ర యుద్ధ మున దుర్యోధనాదుల నెల్లరను వధింపజేసినాడు. భీమార్జును లను తనకూడ దీసికొనిపోయి, విప్రవేషములతో నేగి జరాసంధుని భీమునిచే జంపించినాడు— క్రూరకర్ములు దుష్టులైన వారిట్లు మడిసిరి. ధరణిని పాపభార మణగినది.

మాయకు లోబడి యెట్టివారైనను వర్తింపవలసినదే. వారి వారి కర్మానుభవములను పొందుచుండవలసినదే, అను సిద్ధాం తమునకు నిదర్శనముగ విష్ణ్వవతారుడై పుడమి ననేక గొప్ప పను లొనర్చిన శ్రీకృష్ణునకును ఇవి తప్పలేదు.

# శ్రీకృష్ణుడు దేవిని ప్రార్థించుట

శ్రీకృష్ణుడు రుక్మిణి సత్యభామ లోనగు ఎనమండ్రు భార్యలతో ద్వారకాపురియందు సౌఖ్యముగ నుండెను. రుక్మిణికి అతిసౌందర్య విలసితుడగు పుత్రుడు ప్రద్యుమ్ను డుదయించెను. ద్వారకావాసులందఱు నిరుపమ తేజోవంతుడగు ఆ శిశువును గని ఆనందభరితులైరి. కాని, పురుటి మంచము మీద నున్న ఆ శిశువు అకస్మాత్తుగ మాయ మయ్యెను. కారణ మెఱుగక అందఱును విషాదగ్రస్తులైరి. వేఱు దిక్కుతోచక శ్రీకృష్ణుడిట్లు దేవిని దలచి ప్రార్థించెను.

"ఓ జగజ్జననీ, జగన్మాయా, దీనులమై నేమను రుక్మిణియు నిన్నిట్లు ప్రార్థించుచున్నాము. సర్వప్రాణులకు నీవే శరణ్యము. ఇంతకన్న వేఱు దిక్కులేదు. భాగ్యమని సంతసించుచుండ బాలకుని మాయమొనర్చితివి. రుక్మిణిని వట్టలేకున్నాము. పాపము లెఱుగని పసికందు ఈ బాలుడు. ఏ పాపము లెఱుగని పడతి రుక్మిణి. మేము నీ దాసులము. అకారణముగ ఈ విపత్తు వచ్చినది. మమ్మెట్లు రక్షింతువో నీదే భారమని వేడగా దేవి ప్రసన్నురాలై ప్రత్యక్షమై 'కృష్ణా నీ భక్తికి మెచ్చితిని. నీ బాలునికి వచ్చిన భయము లేదు' ఒకానొక శాపవశమున ప్రద్యుమ్నుడు శంబరుడను అసురునిచే అపహరింపబడినాడు. పదునాఱవయేట నీ బాలుడు నా యనుగ్రహముచే శంబరుని వధించి మీ కడకు విజయుడై వచ్చును నన్ను నమ్మి యుండుడు అని చెప్పి అంతర్ధానమొందెను". శ్రీకృష్ణుడు రుక్మిణి, ద్వారకావాసులెల్లరు ఆ యంబ దయకు కృతజ్ఞులై నమస్కరించిరి. దేవికి భక్తిశ్రద్ధలతో పూజలొనర్చిరి. ప్రద్యుమ్నుడు పెరిగి పెద్దవాడై శంబ

రుని వధించి ద్వారక కేతెంచి తల్లిదండ్రులకు ముద మొన గూర్చెను—

శ్రీకృష్ణుని కిట్లే మఱియొక సంతాప కారణమైన సంఘటన కలిగెను. కృష్ణుని భార్య జాంబవతి తనకు సంతానము కలుగ లేదని పురపుర పొక్కి విలపించినది. శ్రీకృష్ణుడును సంసార బంధ మున జిక్కి మాయకు లోబడి పుత్రులకై శంకరుని గూర్చి మహా తప మొనరింపసాగెను. శంభుడు పార్వతితో గూడి ప్రత్యక్షమై కృష్ణుని కోరిక దీర్చినాడు. పార్వతి కృష్ణుని జూచి యిట్లు చెప్పినది. “కృష్ణా నీకును ఇట్టి సంసారవాంఛలేల? మాయా మోహమున పుత్రివాంఛలిట్లు సంసార బంధమున బడవేయును. కొలది కాలములో యాదవు లంతఃకలహమున పరస్పరము కొట్టు కొని నశింతురు. నీవును బలరాముడును మీ దేహములు విడచి మీ స్వస్థానములకు రావలసినదే. బుద్ధిని పొరవలె కప్పు ఈ మాయనతిక్రమించు బలము పరదేవి పూజలవలననె కలుగును. ఆ దేవి నర్చించువారి యింట పుట్టుటే పుణ్యము. మాయకతీత మైన ఆదయారూపిణి జగదంబయే శుభములనిచ్చి రక్షించు శక్తి” యని ఉద్బోధించి అంతర్ధానమయినది— పార్వతీదేవి చేసిన యుద్బోధమును విని శ్రీకృష్ణుడు పరమేశ్వరియగు దేవినే తల చుచు ధ్యానించుచు ధన్యత గనెను.

## దేవేంద్రుని బాధలు – దేవి కరుణ

రాక్షస గురువైన శుక్రుడు శివుని గూర్చి మహా తపస్సు చేసి గొప్ప శక్తులు సంపాదించి వచ్చెను. విష్ణు చక్రమువలన

"దేవీ జగజ్జననీ, జగదీశ్వరివి నీవు, నీ పాదభక్తులము మేము. దేవలోకము సర్వము దైత్యుల దౌష్ట్యమునకు లోనయి విపద్దశలో నున్నది- మాయెుుక లేకయే దానవ సైన్యములు దండెత్తి వచ్చినవి. నందనవనము చిందఱ వందఱయైనది. స్వర్గ సౌధములు కూలినవి. దివిజ సైన్యములు దిక్కులబట్టి పారిపో యినవి. యజ్ఞ కర్మములు సాగక నీకు హవిసులర్పణ చేయుట లాగినవి. నా వజ్రాయుధము వమ్మయినది. దానవుల విజృం భణ మితిమించి పోవుచున్నది. నీవు రక్షించకున్న మాకిక దిక్కు లేదు. మేమధోలోకముల కేగవలసినదే. కామరూపిణివి, కామిత దాత్రివి. కరుణాంతరంగవు" అని దీనుడై ప్రార్థించు దేవేంద్రుని యెడ ప్రసన్నురాలై యా పరమేశ్వరి దేవతల కభయమిచ్చి అటనుండి కదలి రాక్షస సైన్యములున్న చోటికేగినది. దానవుల మోసము గ్రహించినది.

అకస్మికముగ తమ యెదుట కతిభయంకరాకృతితోవచ్చి నిలచిన ఆ మహాతేజోరాశిని దనుజులు చూచిరారు ఆమె ఆయుధ హస్త, రక్తవస్త్రధారిణి, రక్తమాల్యాలంకృత, రక్తచందన చర్చి తాంగ, మృగరాజవాహన. ఆ యాకృతి చూచునరికే దానవ సైన్య మునకు గుండెలు నీరయినవి. కొందఱు వృద్ధరాక్షసులామెను పరీక్షగచూచి వెనుకకుబోయి "ఓహో యీ మహాశక్తి నెఱుగు దుము. పూర్వము మహిషాసురుని, శుంభనిశుంభ చండముండు లను, పరిమార్చిన దీయమయే. మనలనింక బ్రతుకనీయదు" అని తక్కిన దనుజసైనికులకు గూడ ఆ విషయముచెప్పి ప్రక్క ప్రక్కలకు తప్పుకొని పారిపోయిరి. మిగిలినవారామె వైపునకే

చూడలేకపోవుచున్నారు. వారి నాయకుడు ప్రహ్లాదుడిది కనిపెట్టి అచట నిలచియుండిన దనుజసైనికులను ప్రోగుచేసి ధైర్య వాక్యములు పలుకుచున్నంతలో కశ్యప దనువుల పుత్రుడు దేవేంద్రునికి అహితుడును అయిన నముచి యను నతడేతెంచి 'ఓ రాక్షసులారా మీరు ధైర్యము వీడి పారిపోకుడు ఒక ఉపాయమున్నది వినుడు. మీరు మీ యెదుట చూచిన శక్తిస్వరూపిణియే జగదంబ. అఖిలేశ్వరి. సత్కృపాంతరంగ. ఆమెనే ప్రార్థింపుడు' మీకు మేలు చేకూరగలదు అని యుద్బోధించి చనెను.

ప్రహ్లాదుడు పరమేశ్వరిని స్తుతించుట:—

ప్రహ్లాదుడు విష్ణుభక్తుడు పరమ భాగవతోత్తముడు దేవి మహిమ నెఱిగినవాడు గావున కొందఱు దానవముఖ్యులను తన వెంటబెట్టుకొని దేవినిట్లు స్తుతించెను—

"ఓ మహాదేవీ నీవు మేమూహింపలేని శక్తిస్వరూపిణివి జగదేకమాతవు. సకల చరాచర భూతకోటికిని అధారము, ఆశ్రయము నీవే. ఈ దానవులు నేడు నీ పాదాల వద్దకువచ్చి ప్రార్థించుచున్నారు. ప్రాణికోటి సర్వము నీ సంతతి. నీ కృపకు అందఱు సమానులేగదా. దానవులేకాదు అమరులు కూడ అనేక దుష్టకార్యములు చేసిరి. దేవేంద్రుడు చంద్రుడు పరభామల నాసించినవారే, సర్వలోకరక్షణకు పేరుగాంచినను జలజాక్షుడెప్పుడును దేవతల పక్షమే. దేవదానవులు సమముగ శ్రమపడి తెచ్చిన అమృతము నమరులకే పంచియిచ్చినాడు. వటురూపముననే వాసుదేవుడు బలిరాజ్యము నపహరించెను. ధర్మపద్ధతులందఱ

వాకేరీతిగ నుండవలయును గదా. నీవైనను పక్షపా
ఈ రాక్షస కులమునకొకదారి జూపుము. నీ కరుణయందు
ముంచి నిన్ను ప్రార్థించుచున్నాను తల్లీ" యని దే
ములపై బడెను–

జగదీశ్వరియగు అంబకు పక్షపాతములు ద్వేషములు
లేవు. ప్రహ్లాదుడు మహాభక్తుడు. అతడు నుడువు వా
లలో కొంత సత్యము గోచరించినది. కరుణార్ద్ర వీక్షణము
ఆ పరమేశ్వరి ప్రహ్లాదునిజూచి "ప్రహ్లాదా నీవు చెప్పిన మా
వింటిని. అనుకూలమగు కాలమరుదెంచువరకు దానవుల నం
రసాతలమునకు గొనిపొమ్ము– లోభ మోహ క్రోధ మదమ
ములు లేకుండ ఎవరెక్కడ నున్నను ఏలోపము కష్టమురాదు.
వాంఛితములును సత్ఫలములగును. అని యాదరమున ప
అదృశ్యయైనది–

దానవులు దేవివచించిన వాక్యములను మనసు నందు
దేవికి నమస్కృతులొసంగుచు వారి దారిని వారేగిరి. దానవ
బాధ దూరమయి నందులకు అమరులందఱు సంతసించి దేవి
కొనియాడి ప్రణతులర్పించుచు వారి స్వస్థానములకేగిరి–

అమరపతియగు దేవేంద్రుడు, అసురపతియగు ప్రహ్లాదుడ
నిట్లు జగదంబ కొనరించిన సంస్తుతులతి పవిత్రములైనవి. ఈ
సంస్తుతుల జదివినను వినినను ఇష్టకామ్యార్థసిద్ధియు ఆయు
రైశ్వర్యకీర్తులు తథ్యముగ లభించును–

—o—

శ్రీ

# పరమేశ్వరి

## నాల్గవ స్కంధము

### దేవినిష్పక్షపాత వాత్సల్యము

సూతపౌరాణి కుడుసుడివిన సురాసురుల గాథవిని శ్రోత లగు శౌనకాదులకు కొంత ఆశ్చర్యము కలిగినది. సూమడది గ్రహించి మరల నిట్లు వ్యాఖ్యానించెను. ఆ పరమేశ్వరి నిష్పక్ష పాతబుద్ధి కీగాథ ఒక మంచి నిదర్శనము. సురలపైబడిన దైత్యులను భీకరాకృతితోవచ్చి పారద్రోలినది: ఇంద్రుని ప్రార్థ నలకు ప్రసన్నతజూపి అభయమిచ్చినది. ప్రహ్లాదుని అభ్యర్థ నమునుగూడ అట్లే సదయహృదయయై వినినది. అసురులకు మంచిమార్గ ముపదేశించినది. ఇదియొక విచిత్రమైన ఘట్టము. రాక్షసులని కేవలము అకారణవైరముగాని, దేవతలని ప్రత్యేక మగు అభిమానముగాని ఆపరమేశ్వరికిలేవు. మాయామగ్న చిత్తు లయి లోభమోహములకు అహంకారమునకు వశులయి వర్తించు వారెట్టివారయినను వారి కర్మఫలము వారనుభవింపవలసినదే. ఆగామి సంచిత ప్రారబ్ధకర్మ విధానములిట్టివే. ఇట్టిదుష్ప్రవర్త లోకకంటకమై దుస్సహముగా నున్నపుడాదేవి స్వయము ఆవిర్భవించి లోకముల నట్టివిపత్తునుండి తప్పించును-

దేవి కరుణవలన దైత్యబాధనుండి తప్పించుకొనిన దేవేం ద్రహంకారవశుడయి తత్కారణముగ కడుహేయమగు బాధ నందెను. ఆకథలను ముందువినుడని సూతుడిట్లు వచించెను-

## దేవేంద్రుని బ్రహ్మహత్యాదోషము వదభ్రింశము

దేవేంద్రుడు చాలగొప్పవాడు. శతాధిక క్రతువులొనర్చి ధర్మవర్తనులైన మహనీయులకే ఆపదవి లభించును. స్వర్గాధిపత్యము త్రిలోకపాలనము ఆ యింద్రుని చేతిలోనున్నవి. దేవేంద్రునిలో ఒక పెద్దలోపమున్నది. వేఱొక మహనీయు లెవరైన తనకంటె గొప్పవాడై తన పదవి నాక్రమించునేమోయను భయముతో వాని కవరోధము గల్పించుటకై అనుచిత కార్యములకు దిగును. ఎంతటివానికైన అట్టి అకృత్యముల ఫలమనుభవింపక తప్పదు.

త్వష్ట ప్రజాపతి కుమారుడైన విశ్వరూపుడు మహాతపశ్శాలి. త్రిశిరస్కుడు. సర్వవేళలయందు వేదపాఠము లుచ్చరించుచు దైవధ్యానమగ్నుడై యుండెడివాడు. విశ్వరూపుడిట్టి మహాతపస్సుచే తుదకు తన పదవికే మోసము దెచ్చునన్న భ్రమలోబడి, దేవేంద్రుడు దేవవేశ్యలనంపి యాతని తపోవిఘ్న మొనర్ప దలచి విఫలుడై, మఱింకెన్నో యత్నములొనర్చియు తన మనోరథమీడేరక, తానే దురాగ్రహమున వజ్రాయుధమూన యేగి విశ్వరూపుని మూడు తలలను ఖండించెను. ఆ మూడు తలలను రేటికిని కపింజలపక్షిరూపముల ధరించియున్నవి.

అకారణముగ దేవేంద్రుడిట్లొక మహామునిని హత్యగావించిన దుష్కృత్యమును మునులందఱు గర్హించిరి.

ఇంద్రునిపై త్వష్టప్రజాపతికి మహాగ్రహమువచ్చినది. తన తపశ్శక్తిచే ఇంద్రుని నిర్జింపగల మహాబలసంపన్నుడు తేజో

వంతుడైన కుమారుని గనెను. అతడే వృత్రాసురుడు. జన్మించిన మఱుక్షణమే వృత్రుడు అరిభీకరమగు ఆకృతినందెను. వృత్రుని పేరుచెప్పిన త్రిలోకములును గడగడలాడును. "నీయన్న విశ్వ రూపుని మహేంద్రుడకారణముగ జంపెను. ఆ యింద్రునిపై పగ తీర్చుకొనవలసిన బాధ్యత నీయందున్నదిసుమా"యని తనసుతు డైన వృత్రుని దీవించి త్వష్టప్రజాపతి పంపెను. దనుజసేనల సాయముతో వృత్రుడు తండ్రి యానతి ప్రకారము అమరలోక ముపై దండెత్తి తిరుగులేని పరాక్రమముతో నానా విధ్వంసము సేయమొదలిడెను. అమరలోక మంతయు అల్లకల్లోలమయ్యెను. దేవేంద్రుడు చేయునదిలేక మునులతో ఆలోచించి విష్ణువుకడ కేగెను. ఈ పరిస్థితులలో జగదీశ్వరియే దిక్కుకాగల దైవమని శ్రీహరియు బోధించిపంపెను. దేవేంద్రుడు ఆ లోకమాతను ప్రార్థించెను. ఇంద్రుని అనాలోచిత కార్యముల నాజగన్మాత కని పెట్టుచునేయుండెను. సత్ప్రవర్తన కలిగియుండుడు మీ యభీష్ట ములు సిద్ధింపగలవని దేవివాక్యములు వినబడినవి. సంతుష్టులై సురలు మునులు వెనుదిరిగివచ్చి ఇంద్రునకు వృత్రునకు సంధి యొనరించి మిత్రులనుజేసిరి. వృత్రునతో స్నేహమునటించుచునే ఇంద్రుడాతనిని పరిమార్పజూచుచుండెను. తడి పొడిలేనిస్థలములో గాని తనకు మరణములేకుండ వృత్రుడు చతుర్ముఖునిచే వర మందెను. ఇంద్రుడది కనిపెట్టి ఒకదినమున వాహ్యాళికని వృత్రుని సాగరతీరమునకుగొనిపోయి తడి పొడికాని కడలినురుగులో నాత నిని పడద్రోసి వజ్రాయుధముతో జంపెను. వృత్రునిబాధ నశిం చినదని నాకవాసులు సంతోషించిరిగాని ఇంద్రుడౌనర్చుచున్న

కార్యములన్నియు కడునీచముగ దోచుచుండెను. విశ్వరూపు నకారణముగ జంపెను, వృత్రుని మోసమున వధించెను. వారి తల్లికివి మహావిషాదకారణమై "దేవేంద్రా నీవుచేసిన యీదుష్కర్మ ఫలముగ పదభ్రష్టుడవై నికృష్ట జీవితమనుభవించెద"వని శాప మిచ్చెను.

దేవేంద్రునకిపుడు దిక్కగువారులేరు. వెనుక తానుబొందిన దితిశాపమున్నది. విశ్వరూపుని జంపిన బ్రహ్మహత్యాపాతకము చుట్టుకొన్నది. ఇపుడు మరల మఱియొకశాపము. మతిపోయి నట్లయినది. వెఱ్ఱివానివలె అటునిటు దిరుగుచు, తుదకెవరికిని దెలి యకుండ మానససరోవరమునకేగి అచట నొకచిన్న నీటిపాము వలె రూపమునొంది దినములు గడపుచుండెను.

ఇంద్రుడెచ్చట నున్నదియు ఏమియైనదియు, నెవరికి తెలియదు. దేవతలకేమియు తోచుటలేదు. మునులకిదియంతయు ఒక పెద్దవిపత్తుగా గనుపించినది. స్వర్గాధిపత్యము శూన్యముగా నున్నచో లోకపాలనము స్తంభించును. యజ్ఞయాగాది ధర్మ కార్యములణగి జగత్సంక్షోభము కలుగును. ఇది జరుగకుండ చూడవలయును.

## నహుషుడు స్వర్గమేలుట

ఇంద్రుడులేని కొఱతయటుండ, ఇంద్రునిభార్య మహాపతి వ్రత శచీదేవి భర్తృవియోగమున సకల భోగభాగ్యములకు దూరమై పడుచున్న దీనావస్థలజూచి యెల్లరును విచారించు చుండిరి.

మునులు సురముఖ్యులును దీర్ఘముగ నాలోచించి తుదకు భూలోకమున శతాధిక క్రతువులు నిర్వర్తించి, ధర్మవర్తనుడని పేరొందిన నహుషుడను చక్రవర్తిని దేవేంద్రపదవియందు నియమించిరి. శ్రమలేకుండ స్వర్గాధిపత్యము లభించిన నహుషునకు అహంకారమదము తలకెక్కినది. కామమోహములు ప్రబలి దేవవేశ్యాలోలుడయి లోకపాలనమును విస్మరించెను. తాను స్వర్గాధిపతి యయ్యెనుగాన ఇంద్రునిసతి త్రిలోకసుందరియని పేరందిన శచీదేవియు తనకువశము కావలెను. అని పలు తెఱగుల ప్రయత్నము లొనరించుచుండెను. ఆమెనులోగొనదలచి నహుషుడు మరల మరల దేవతల నామెకడకంపి తన మనోవాంఛను దెలిపి తోడ్కొనిరమ్మని వివిధప్రయత్నములొనరించెను. నహుషుని వర్తన మసహ్యముగదోచి శచి గురుదేవుడగు బృహస్పతి కడకేగి తన గోడును విన్నవింప ఆతడును నిస్సహాయుడై "దేవీ నీవు మహాపతివ్రతవు. నీసౌశీల్యమే నిన్నుకాపాడగల"దని దీవించి పంపెను.

శచీదేవియే తుదకు ధైర్యముగ నహుషుని కడకేగి, "స్వర్గాధిపా! నీకోరికను నీఅనుచరులు నాకెఱిగించిరి, కాని నేనిప్పుడేదియు తోచనిస్థితిలోనున్నాను. నేను పతివత్నిని నానాధుడెచట నున్నదియు యెట్లున్నదియు దెలిసికొని మరల వచ్చెద"ననగా, "ఈమె కొంతదారికి వచ్చుచున్న"దని నహుషుడు సంతసించి పరేయనెను. శచీకాంత పంపున సురలు నలుమూలలకేగి ఇంద్రుని కొఱకు వెదకి వెదకి విఫల మనోరథులై తిరిగివచ్చిరి. శచికి హృదయావేదన మఱింత యెక్కువై తనదుర్గతిని దలచుకొని

విలపింపసాగినది- ఇంద్రుడేమైనాడో తెలియదు. నహుషుని వర్తన మసహ్యముగ పరిణమించినది. అమరులెల్లరు శచీదేవి దుఃఖమును చూడలేకున్నారు. సురముఖ్యులు కొందరు రహస్యముగ చతుర్ముఖునికడకేగి యీ దుర్భరపరిస్థితులు విన్నవింప నాతడును తనకేదియు పాలుపోక ఆ దేవతల దోడ్కొని శ్రీహరి వద్దకేగెను. శ్రీహరియు వచ్చినవారిని సాదరముగజూచి'' సురలారా, ఈవిపరీత పరిస్థితుల యందెవరికేని చేయకల్గినదిలేదు. దీనికి కారణము విబుధేంద్రుడే, అతని దుష్కర్మముల ఫలమిట్లు రూపుదాల్చినది. అయినను మించిపోయినదిలేదు. సర్వశరణ్య' జగదేకమాత, కరుణాహృదయయగు ఆ పరమేశ్వరి యనుగ్రహమున్నచో అన్ని విపత్తులుపోయి సౌఖ్యములబ్బును. మీకిది యొకటేదారి. ఏపాపమెఱుగని శచీదేవి దీనావస్థనాకను విచారము కల్గించుచున్నది. ఆ జగన్మాత సాయమర్థించి ఆమె పూజలు సేయుడు, ఆమె యజ్ఞము లాచరింపుడు దేవికృప కసాధ్యమనునదిలేదు. మీరట్లుచేయు''డని చెప్పిన శ్రీహరి యుపదేశమునకు సురలు ముదమంది శచీదేవి కీసమాచారము దెలిపి తాము దేవి పూజలు, యజ్ఞమునారంభించిరి.

## శచీదేవిపై పరమేశ్వరి కరుణ

శచీదేవియు భక్తిశ్రద్ధలతో పరమేశ్వరి పూజలారంభించి ౹త్యము యథావిధిగ నిర్వర్తించి తన యభ్యర్థన మాజగజ్జననికి విన్నవించినది- ఆమె దీనస్థితికి దేవిహృదయ మార్ద్రమైనది. మఱొకవంక విలంబనములేక స్వర్గస్థితిని సంరక్షింపవలసిన

యగత్యమేర్పడినది. వెంటనే ఆమె ఒక దూతికను శచీదేవికడ కంపినది.ఆదూతిక శచీదేవిని ఇంద్రుడున్న స్థలమునకుగొనిపోయి చూపినది. శచీదేవి చేతులుజోడించి స్వామీ దేవి దయవలన మీ దర్శనము లభించినది నేను ధన్యురాలను అని పలుకగనే క్రిమి రూపముననున్న ఇంద్రుడు తన నిజకంఠస్వరమున "శచీ! నీ రాకకు చాలసంతసించితిని. కాని నాకింకను మంచిగడియలు రాలేదు. నీవలెనే నేనును దేవిని స్మరించుచుండెదను ఆమెదయ యెన్నటికో" అని యూరటబల్కి శచీ కాంత చెవిలో నేదియో గోప్యముగ నుడివి పంపెను-

'శచి ఇంద్రుని వెదకుటకేగి చాలదినములైనది. ఏమిది యీనాటికిని తిరిగిరాదు' అని నహుషుడు కలతనొందుచుండెను. శచియు స్వర్గమునకు మగిడివచ్చి, బృహస్పతికి జరిగినదంతయు నుడివి ఆ గురుదేవుని దీవనలంది, ఒకనాడు తానే సుందర వేష యయి నహుషునివద్దకేగి, స్వర్గాధిపా ఇంద్రుడింకను తిరిగి రాలేదు. నీ యాలోచన మెఱుగుదునుగదా: కాని ఒకవిషయము విష్ణువునకు గరుడవాహనమున్నది. అట్లే కుమారస్వామి మయూర వాహనుడు. నీవును అంతటివాడవే. అయినను నీకు పక్షుల గతియేమి మునులను బోయీలుగజేసి పల్లకినెక్కి వచ్చినచో బాగుండునని ఆమె యేగినది.

నహుషుని గర్వము పెచ్చితలలు వేయదొడగినది- అతడా మఱు నాడే శచీదేవి యింటికేగుటకు శృంగార వేషభూషణములుదాల్చి మునీంద్రుల రావించి తనపల్లకిని మోయుడని, ఆ మోయుచున్న

వారిని కొరడాతో గొట్టుచు నిందించుచు బాధింపదొడగెను. నహుషుని యాగడములు మితిమీరినవి. అదిజూచి అగస్త్యున కాగ్రహము కల్గి పల్లకినాపించి "నహుషా! నీయనుచితములకంతులేకన్నది. నీదుర్వర్తనము నీవెఱుగకయిట్లు తులువవలె వర్తించుచున్నావు. నీవిక భూమిపై ఒకసర్పముగపడి బ్రతుకుము" అని శపించగా నహుషుడాక్షణమె ఒకపాముగానయి భూమిపైబడెను.

స్వర్గవాసుల కడగండ్లంతమైనవి. అచ్చట ఇంద్రునకు తన పూర్వరూపముకలిగి అమరావతికరుదెంచినాడు. దేవత లొనరించుచున్న దేవీయాగము పూర్తియైనది. సురలు మునులు ఎదురేగి ఇంద్రునకు స్వాగతముపలికి తోడ్కొనివచ్చి మరల స్వర్గరాజ్య పదమున సుస్థితుని జేసిరి - శచియు ఇంద్రుడు దిక్పాలురు తక్కు దేవతలు మునులు దేవిని దలచి, ఆమెకరుణకు మహిమకు సన్నుతులొనర్చి ఆమె పూజలనుదినము సలుపుచుండిరి. ఇంద్రుడును తన యపరాధముల దెలిసికొని పశ్చాత్తప్తుడై సన్మార్గమున వర్తింపసాగెను- శచియు నింద్రుడును పూర్వవైభవమునంచి, దేవిని విస్మరింపక ఆమెపూజలను దినము చేయుచుండిరి.

## దేవీతత్త్వము - కర్మ ప్రభావము

సూతపౌరాణికుడు నుడువు దేవీగాథలను శౌనకాదులు శ్రద్ధతో వినుచున్నారు. వినుచున్నకొలదియు అసక్తితోబాటు అంతరంగమున కొన్ని పెద్దసందియములేర్చచ్చి యిట్లడిగిరి "గురుదేవా నీవు నుడువు గాథలను వినినకొలదియు మనమున శంకలుదయించుచున్నవి మహనీయులయి కీర్తినందిన ఇంద్రునంతటివారికే యిక్కట్లుతప్పలేదు. ఇక మానవులగతియేమి?

కేవలము కర్మాధీనులయి బాధలనందవలసినదేనా, మాబోంట్లకేది యైన దారియున్నదా. దేవి తానై స్వయముగ చేసిన బృహత్కార్యములు కలవంటిరి ఆమె యవతారములుగూడ పెక్కులున్నట్లు వచించిరి వానిని వినగోరెదము" అనినతశిరస్కులై వేడుచున్న శౌనకాదులను జూచి సూతుడు వారి ఆసక్తికి సంతసించి, వ్యాసుడు జనమేజయునకు వచించిన విషయములను మరల వ్యాఖ్యానించి యిట్లునుడివెను-

మునులారా, మీరడిగిన ప్రశ్నలు మంచివే. దేవీతత్త్వము ను గ్రహించుచో ఈసందియములకు తావుండదు. దేవి స్వయముగ ప్రాదుర్భవించి నెఱవేర్చిన పనులు ఆమె యవతారములు పెక్కులున్నవి. సామాన్యులకేదియైన భవతారకమగు మార్గమున్నదా ;అని మీశంక. ఎందఱోధన్యులై చరితార్థులై దేవీభక్తులై పుణ్యలోకముల కేగిన వారున్నారు. ఆ కథలనుగూడ క్రమముగ నుడివెదను ముందు దేవీతత్త్వమునుగూర్చి వినుడు-

ఆమె విశ్వరక్షణ కళాశీలయైన పరమాత్మిక. సాధుజనులను ధర్మవర్తనులను యెట్టిలోపమురాకుండ కాపాడగల కరుణామయి. సగుణాకారయు సాయుధహస్తయునై అవసరము కలిగినపుడెల్ల లోకమున అవతరించుచు దుర్జన నిర్మూలనమునకు ధర్మోద్ధరణమునకును వలయు కరణీయముల నిర్వర్తించుచుండును. నిజమునకు దేవీరూపము నిర్గుణము నిర్వికారము ఆదిమధ్యాంతరహితము ప్రకృతి పురుషైక భావమగు పరమాత్మ తేజము- త్రిమూర్తులు కూడ ఆ శక్తియొక్క ఆజ్ఞాయుత్తులై వర్తింతురని వింటిరికదా దేవేంద్రునంతటి వానికి అన్ని యిక్కట్లేల వచ్చినవి? ఒక

తనయుడై జన్మించిన శిశువు ఏకవీరుడు. యయాతి తనయుడు హరివర్మ అతనిని పెంచెను- హయరూప లక్ష్మీమాధవులు మూల కారణులగుటచే వీరివంశీయులు హైహయులైరి. కార్తవీర్యార్జునుడీ ఏకవీరుని మనుమడే. హైహయ రాజన్యులు, వారి ధనము నంతయు వెచ్చించి ద్రవ్యలోభమున వారి గురువులగు భృగు వంశీయులనే అప్పియడని అడిగి వారీయకపోవుటచే వారిననేక బాధలుపెట్టి గ్రామాంతరములకు తరిమిరి. ఆ గురువుల వనితలు హైహయులకు భయపడి హిమగిరికేగి దేవిని దిక్కుగానమ్మి పూజించుచుండిరి. హైహయులచ్చటికి సయితమేగి, ఆస్త్రీలనుకూడ బాధింపదలపెట్టిరి. వీరిని లెక్కలేయక ఆ బ్రాహ్మణస్త్రీలు దేవి నాశ్రయించి అర్చన లొనర్చుచుండ ఆ పరమేశ్వరికృపచే నొక వనితకు భానుసహస్రతేజోవంతుడయిన పుత్రుడుదయించెను. వానిని చూచుసరికే హైహయు లంధులై తెన్నుతెరువు తోచక పశ్చాత్తాపమంది దీనులై మరల ఆ బ్రాహ్మణ స్త్రీల పాదములపై పడి తిరిగి వారికరుణచే దృష్టికలిగి వెనుకకు మరలిరి.

## పర్వతనారదులు

పర్వతనారదులు దేవమునులు. నిరంతర హరికీర్తన తత్పరులు-వారిప్రసిద్ధి జగద్విదితము. వారికిని మాయాజాల బంధము తప్పలేదు. నారదుడే స్వయముగ తన విషయము వ్యాసున కిట్లెఱిగించెను.

ఆ యిరువురు మునులు చాతుర్మాస దీక్షతో నొకప్పుడు పుడమియందే సంజయనృపతి నగరమున కాలము గడపుచుండిరి.

ఆ రాజు పుత్రిక మదయంతి సంగీత కళాప్రియ. గాననిధియైన నారదుని కీర్తి విని అతని గానమాధుర్యము నాస్వాదించి యాతనిని ప్రేమించినది. నారదుడును తన జీవిత గమ్యమునే మరచి పర్వతునకు తెలియకుండ ఆమెను ప్రేమించి వివాహమాడి సంసార జీవనము గడపెను- నారదునంతటి పరమ భాగవతోత్తమునకు గూడ ఈ మాయాజాలము తప్పినదికాదు.

వేలోకసారి మాయా ప్రభావమెట్లుండునో తెలియజెప్పుటకై శ్రీహరియే నారదునికొనిపోయి మార్గమధ్యమునందొక వనమున నున్న కొలనునుజూపి అందు ముందుగా స్నానమొనరింపుమనెను నారదుడు నీటమునిగి పైకివచ్చుసరి కొక సుందర వనితగామారి పోయెను. తాపధ్వజుడను రాజా సుందరినిజూచి మోహించి పెండ్లాడెను. పెక్కు పుత్రులగనెను. కొంతకాలమునకు శత్రువులారాజుపై బడి వారి పుత్రులను వధింపగా వారు విలపించుచుండిరి. శ్రీహరి ఒక వృద్ధబ్రాహ్మణునివలెవచ్చి మీరు విలపింతురేల ముందు చనిపోయినవారికి తిలోదకములిండు అని ఆ కొలనుదగ్గఱకు దీసికొనిపోయెను. ఆ మహారాణి స్నానమాడి బయటకు వచ్చుసరికి రాజ్ఞీ రూపముపోయి మరల నారదుడయ్యెను. ఆ వృద్ధబ్రాహ్మణుడు శ్రీహరియై తాను దాచియుంచిన నారదుని వీణ మొదలగునవాతనికిచ్చెను. తన శమదమగుణసంపద యేమైనదో హరిభక్తి యేమైనదో నారదుని కవగతముకాలేదు. మాయకు ఇంతప్రభావము కలదు గాబోలునని గ్రహించి సిగ్గుపడి శ్రీహరి ఆ ముని పాదములపైబడి వేడుకొనెను.

## సన్మార్గయుగము - కలియుగము

మునులారా! మీరు గ్రహించియే యుందురు నేనీ వరకు నుడివిన ఉదాహరణములబట్టి కర్మప్రభావము మాయాజాలము

జెట్లుండునో. చేసికొనిన కర్మఫలమేరికైనను తప్పదు. యుగధర్మ మునుబట్టి ప్రాణి కోటి ప్రవర్తనగూడ మారుచుండును. కృత యుగమున నాలుగు పాదముల, నాలుగు పాదముల నడచిన ధర్మము త్రేతా ద్వాపరముల నొక్కొక పాదము క్షీణించి కలికాల మందొక్కపాదమే మిగిలి ప్రపంచమంతయు పాపభూయిష్ట మగును. సర్వము మాయామోహపరికల్పితమై మనసులను భ్రమింపజేయును. మానవులు సంతతము బహుజాగ్రతగ నుండ వలసిన దినములవి.

కలియుగము పాపమునకు అవినీతికి ఎడతగనితావై యుండునుకదాయని తలచి నిరుత్సాహపడ నవసరములేదు. సన్మార్గమవలంబించు త్రోవలున్నవి. భరతవర్షము మొదటి నుండియు వైదిక కర్మభూమి. కాశి గయ ప్రయాగలవంటి పెక్కు పుణ్యక్షేత్రములు దేవాలయములున్నవి. గంగ యమున గౌతమి వంటి పుణ్యనదులున్నవి. మహాఋషుల తపోవనములున్నవి. వారు వ్రాసి మనకందజేసిన పురాణగాథలు ధర్మశాస్త్రములు ఉన్నవి. ఇవి యన్నియు మనకు మార్గదర్శకములే.

దేవి శక్తివలన మనకుకలిగిన మనస్సును బుద్ధిని అప మార్గముల బోకుండ కాపాడగల మార్గము లాపావన క్షేత్రదర్శన ములు గ్రంథ ప్రబోధములు. దేవీ భక్తులై ఆపవిత్ర మార్గముల బోవువారు పుణ్యకర్మలొనరింపగలిగి తత్ఫలితముగ దేవాంశజన్మ ములగూడ నంది ధన్యులగుట తథ్యము. కావున దేవీపూజ లొన రించుచు సన్మార్గమున ప్రవర్తించువారు శమదమగుణసంపత్తి గలిగి దుష్కర్మముల వైపునకు బోకుండ దేవీదయవలన ఇహపర

వింపక తప్ప"దని గురుని పంపుననేగి యెందఱెన్ని విధముల జెప్పినను చంద్రుడు వినలేదు. తుదకు బృహస్పతి మొఱవిని దేవేంద్రుడే తన సైన్యముతో చంద్రునిబట్టి దండింప వేగెను. ఈ పరిస్థితి గమనించి దానవులు చంద్రుని పక్షమూని ఇంద్రునిపై పగదీర్చుకొన సంకల్పించిరి. మఱల నొక దేవదానవ సంగ్రామ మారంభమై జగత్ సంక్షోభము కలుగునట్లుండ చతుర్ముఖు డరు దెంచి చంద్రుని మందలించి తారను తిరిగి యామె భర్త కడ కనిపెను. చంద్రుని కామాంధత, అపకీర్తి కారణమేకాక, జగదుపద్ర వమునకే దారితీసినది. ఈ తారాశశాంకుల సాంగత్యమున నుద యించిన శిశువే బుధుడు.

## ఊర్వశీపురూరవులు

విషయవాంఛోద్రిక్తమగు వేశ్యాలోలత్వ మెట్లుండునో గమ నింపుడు. పురూరవ చక్రవర్తి కథ యిందులకుదాహరణము. కుమారోపవనము శివపార్వతులు విహరించు ప్రదేశము. ఇతర పురుషులెవరయినను అందడుగిడినచో స్త్రీగా మారుదురు సుద్యుమ్నుడను రాజీ శాపమెఱుగక ఆ వనమునకేగి అతివగా మారి ఇళయను పేరుతో కాలము గడపుచుండెను. పరమేశ్వరుని దయుచే నాతడొక మాసము పురుషునిగ ఒకమాసము స్త్రీగ రూప మొందుచు స్త్రీయయినయపుడు వనములందే వసించుచుండెను.

తారాశశాంకుల తనయుడగు బుధుడా ప్రాంతముల కేగి నపుడా యిళనుజూచి మోహించి కలిసి ఆమెవలన నొక పుత్రుని గనెను. అతడే మహాప్రాభవవంతుడగు పురూరవుడు తండ్రినుండి

సకల విద్యలనునేర్పి ప్రాజ్ఞుడయ్యెను. మాస మాసమునకు తన రూపము మారిపోవు దుస్థితికి వగచి సుద్యుమ్నుడేకాంతమున పరమేశ్వరియగు దేవినిదలచి "అమ్మా, ఆపదలోనున్న వారికెల్ల రక్ష నీవేశరణ్యము. మమ్ము గమనించి కాపాడగలదిక్కు వేఱుగ లేరు. ఏ యన్యాయమెఱుగక నారాజ్యమును నేను పాలించుకొను చుండ నాకీ దుర్గతియేల. ఇది యేనాటి కర్మఫలమో. నేడు నీ దాసుడను కరుణింపుమా" పలుతెఱగుల బ్రార్థింప ఆకరుణామయి సుద్యుమ్నుని శాపవిముక్తు జేసి పరమపదము ప్రసాదించెను.

పురూరవుడు పెద్దవాడై రాజ్యపాలన సాగించుచుండెను. లోకైకసుందరియగు దేవకాంత ఊర్వశి ఒకానొక శాపమున వసుధపై జన్మించినది. ఆమెనుజూచి వలచి పురూరవుడు పెండ్లాడ గోరగా ఊర్వశియు సమ్మతించి తానారాజుతో నుండుటకు మూడు నియమముల నేర్పఱచెను. ఒకటి: తనకు ప్రతిదినము మిక్కిలిగ అవునేయి కావలెను, రెండు: తాను పెంచుచున్న గొఱ్ఱెల నేయాపదలేక అతడు కాపాడవలెను, మూడు: కట్టుపుట్టములులేక తనకాతడు కానుపించరాదు. పురూరవు డామె సౌందర్యమునకు వశుడై యానియమముల కంగీకరించి, రాజ్యపాలనముగూడ విస్మరించి. ఊర్వశియే సర్వమనునట్లుగా రేయింబవళ్ళామెతోనే క్రీడించుచుండెను.

ఊర్వశి చాల కాలమిట్లుర్విపై నుండుట ఇంద్రున కిష్టము లేక ఎట్లయిన ఆమెను స్వర్గలోకమునకు రప్పింపవలచి ఒకనాటి యర్ధరాత్రమున రహస్యముగ నామె గొఱియల నపహరించి

కొంద అమరులనంపెను. ఆ సందడికి ఆ గొఱ్ఱె లరచుటతో పురూరవుడు వానిని కాపాడు తొందరలో మేని పుట్టములైన సరిగా ధరియింపక వానిని వెంటాడబోవ ఇంద్రుడా నిముషమున గగనమునుండి పెక్కు మెఱపులు వచ్చునట్లొనర్చెను. ఆ వెలుగులో నగ్నుడైన పురూరవుని ఊర్వశిచూచి తన నియమ మానృపతి భంగమొనర్చెగాన కినుకవహించి లేచిపోయెను.

దేవవేశ్యాసాంగత్యమున లభించు విషయసౌఖ్యములే, శాశ్వతమనుకొని మాయామగ్నుడైన రాజునకా యూర్వశీ వియోగము దుస్సహమైనది. లోకమంతయు శూన్యమైనట్టు లా రాజు దుఃఖించి "ఊర్వశీ ఊర్వశీయని యాక్రోశించుచు ఆమెకై యన్వేషింప మెదలిడెను. దేశ దేశములు తిరుగగా ఆమె కురుక్షేత్ర ప్రాంతమున నా రాజునకగుపడి" ఓరాజా! అన్నియు దెలిసిన వాడ విట్లేల భ్రమలోమునిగి నాకై విలపించెదవు. వేశ్యల పొందు శాశ్వతముగాదని గ్రహింపలేవా. విషయ సౌఖ్యములు ఆత్మసాధన కవరోధములని తోచదా. ఇంతటి నుండియైనను జీవన గమ్యస్థానమును జేర జగదంబను దలచి ధ్యానింపుము. అదియే భవతారకము శాశ్వతానందదాయకము'' అని నుడివి వెడలిపోయినది. పురూరవునకు తనతప్పు తెలిసి పశ్చాత్తప్తుడై దేవీ భక్తుడై ఆమె యనుగ్రహమున చక్రవర్తిపదమంది మహాకీర్తి గనెను.

మునులారా చూచితిరా విషయలోలత్వ మచట చంద్రునికపకీర్తి దెచ్చినది. ఇచట పురూరవు నించుమించుగ మతిభ్రష్టుని

జేసినది. ప్రథమమున జెప్పిన శకుని జననగాథ మీకు జ్ఞప్తియం దున్నదికదా. వేశ్యాసాంగత్య మభిలషించుచో నిట్టి విపత్తులున్న వని యెంచి యే వ్యాసుడు తనను వలచి వచ్చిన ఘృతాచిని తిరస్కరించి నాడని సూతుడు నుడివి, మరల నిట్లారంభించెను-

## వ సు వు ల చ రి త్ర ము

కామ క్రోధ లోభమోహమదమాత్సర్యము లను దుర్గుణము లెంతటివానిచేతనైనను అనుచితములు జేయించును. ఉత్తమ జన్ములే చౌర్యమునకు గడంగి శిక్షితులైన కొన్నిగాథలనుగూడ వినుడు. వసువులు దేవతావర్గములోనివారు, వారెనమండుగురు. వారు వారి భార్యలతోగలసి యొకవరిధరణిపై విహరించుచు, కామితదాత్రియు జనన మరణ రోగభయములు రానీయని మహిమ గలదియునగు వసిష్ఠుని ధేనువు నందినినిజూచి దాని నపహరించు కొని పోవుచుండ ఆ మునీంద్రుడది కనిపెట్టి మీరెనమండుగురును ఇక భూమిపై జన్మించుదురుగాకయని శపించెను. వారు పశ్చాత్తప్తులై వసిష్ఠుని క్షమాభిక్షవేడ ఆతడు కరుణించి మీలో నా హోమదేనువు నపహరించుటకు ముఖ్యుడైన యెనిదవ వసువు భూమిపై చిరకాలముండును. తక్కినవారు పుట్టిన వెను వెంటనే మరణించి పూర్వస్థితి నందుదురని నుడిపెను. ఆ ముని శాపాను సారము వారెనమండ్రును వరుసగ శంతనుని పెండ్లాడిన గంగకు జన్మించిరి. మొదటి యేడ్వురు సుతులను గంగ శంతనుని తాను పెండ్లాడుట కేర్పరచుకొనిన నియమమున కనువుగ పుట్టిన వెంటనే నదీజల గర్భమున బారవైచెను. ఎనిమిదవ శిశువును శంతను డట్లు చేయనీయలేదు. అతడే భీష్ముడు మహాపరాక్రమవంతుడు

సత్యసంధుడు కీర్తిశాలియునై బ్రహ్మచారిగ చాలకాలము ధరణిపై జీవించెను.

## దేవకీవసుదేవులు

దేవకీ వసుదేవుల చరిత్రముగూడ నిట్టిదియే. బ్రహ్మ యొక్క మానసపుత్రుడు కశ్యపుడు. అతనిభార్య అదితి. సూర్యాది దేవతలనుగనిన మహనీయ చరితలువారు. అయిననేమి. లోభమోహగుణ ప్రభావమున వారికి జన్మాంతరమున కారాగృహ వాసము తప్పలేదు. ఆకథను వినుడు.

కశ్యపుడొక యాగమునొనరించుచు అందుల కవసరమగు క్షీరములకై యెవరికిని దెలియకుండ వరుణుని గోవులనవహరించి తెచ్చెను. ఈ అనుచితకార్యమునకు వరుణుడాగ్రహించి, బ్రహ్మకు గూడ కశ్యపుడొనరించిన పనిని దెలిపి కశ్యపునిజూచి "ఓ మునీంద్రా నీ వొనరించినపని అతి నీచమైనది. తల్లులులేక నాకొట్టములందు లేగలు అర్చుచున్నవి. అట్లే నీ ప్రియ భార్యలు పిల్లల చావుకై విలపింతురుగాక మీకు గారాగృహవాసము మఱుజన్మమున కలుగు గాక యని శపించెను. ఆ శాపమే కారణముగ అదితి కశ్యపులు దేవకీ వసుదేవులై మధురలో జన్మించిరి. దేవకి సోదరుడు కంసుడు. దేవకికి గలుగు ఎనిమిదవ శిశువు తనకు మృత్యుకారణ మని యెఱిగి మధురాధిపుడగు కంసుడు దేవకీవసుదేవులను కారా గృహమునందుంచి వారికి బుట్టిన శిశువులను వరుసగ జంపు చుండెను. వారికట్లు కారాగృహవాస కష్టము పుత్రశోకము కలిగినది. యోగమాయ ప్రభావమున ఎనిమిదవ శిశువును వసు

దేవుడు రహస్యముగ నర్ధరాత్రమున గోకులమున నున్న నందు నింట జేర్చెను- ఆ శిశువే శ్రీకృష్ణుడు. విష్ణ్వవతారుడు. పెరిగి పెద్ద వాడయి అన్నయగు బలరామునితోగలసి మధురకేగి తమపై పగ తీర్చుకొన నెంచిన కంసుని వధించెను-

## విష్ణుదేవుని అవతారక్రమము

సూత పౌరాణికుడు శౌనకాది మునులకు మరల తన ప్రవచనము నిట్లుచేసెను.

మునులారా, రాక్షస గురువైన శుక్రునికి జననియు, భృగు మునికి భార్యయునైన వనితను అసురుల భయమునపనయించుటకు శ్రీవిష్ణువు సంహరించెననియు తత్కారణమున భృగువు కోపగించి శ్రీవిష్ణువును నీ వవనిపై ననేకజన్మములంది సంసార బాధనందుదువని శాపమిచ్చెననియు మీకింతకుమున్నే నుడివితిని. శ్రీవిష్ణువాశాపహేతువున యేయే జన్మములెత్తి యేమిసేసినదియు వినుడు. ఆ జగన్నాథునికీ జన్మములు తప్పలేదు గాని ఆ యవతారములు జనులకెల్లరకు మహాభాగ్యములై విలసిల్లినవి. తాను ధరణియందవతరించినపుడెల్ల, లోకకంటకులైన రాక్షసులను దండించుచు సాధుజనుల రక్షించుచు ధర్మోద్ధరణమునకాజలజాక్షుడు సాయమగుచునేయుండెను. తపసి శాపమావిధమున జగత్ శ్రేయముగ విలసిల్లినది-

చాక్షుష మన్వంతరమున నరనారాయణులనిన మౌనులు హరి యంశోద్భవులే. వారు చాపాస్త్రధరులై క్రూరరాక్షసగణమును నిర్మూలించిరి. కపిల నామమున హరి జన్మించి తల్లియగు

దేవహూతికి సాంఖ్యశాస్త్ర తత్వ రహస్యము లుపదేశించెను. వైవస్వత మనువుకాలమున అత్రి అనసూయలకు దత్తాత్రేయుడై హరి యుదయించెను. శ్రుతుల దొంగిలి జలధియందు దాగిన సోమకాసురుని ఆ హరియే మత్స్యావతారుడై వధించి వేదముల నుద్ధరించెను; క్షీరసాగర మథన సమయమున కూర్మమై కొండను తాల్చెను; ధాత్రిని సముద్రమున ద్రోసిన హిరణ్యాక్షుని వరాహ రూపమునవచ్చి వధించి తన కొమ్ముతో ధాత్రిని పైకెత్తెను, నర సింహరూపము ధరించి హిరణ్యకశిపుని సంహరించి ఆ యసురుని కొమరుడు ప్రహ్లాదుని రక్షించి హరిభక్తి ప్రాధాన్యము నిలిపెను; వామనాకృతినేగి బలిచక్రవర్తి గర్వముడిపి త్రివిక్రముడయ్యెను. త్రేతాయుగమందు పరశురాముడై దుర్మదులగు క్షత్రియుల నిర్వదియొక్కమారు విధ్వంస మొనరించెను. తరువాతవచ్చిన శ్రీరామ శ్రీకృష్ణావతారముల కథ మీరు వినియుంటిరి, దేవి నర్చించి వారు సంకల్ప సిద్ధులైన విధమును వివరింపబడినది- శాప కారణమున సంభవించిన హరియవతారము లిట్లు ప్రజలకు మహోపకారములైనవి. శ్రీకృష్ణావతార కాలమున ప్రపంచమున పాపభరముడిగినది. ఆ లీలామానుష విగ్రహుడే జగత్ శ్రేయము సెంచి గీతాధర్మబోధము గావించినాడు-

## దైవదైత్యాంశావతరణము-

అసురాంశలందుద్భవించి అవనికి భారమైన వారెందరో కలరు. కాలనేమియె కంసుడు. హిరణ్యకశిపుడే శిశుపాలుడు ఇట్లే జరాసంధ దుర్యోధనాదులును దైత్యాంశజనితులు. వీరిని రూపు మాపుటకై హరి యవతరింపవలసివచ్చినది- శ్రీకృష్ణునికి సహాయ

మొనరింప వ్రేపల్లెలో జనించిన గోపికలమరులే- పూర్వులగు నరనారాయణులే ద్వాపరమందర్జున శ్రీకృష్ణులు. దేవకీవసుదేవులు నంద యశోదలుగూడ ఉత్తమాంశ సంభూతులే-

## మాయాప్రభావము

వ్యాసుడిట్లు నుడివిన గాథలనన్నిటిని జనమేజయ నృపాలు డాలించి తన సందియములను మరల నుడువగా వ్యాసుడు వాని కన్నిటికిని సంతృప్తికరములగు కారణములను జూపెను. ఆ వివరములను సూతుడు మరల శౌనకాదులకు నుడివెను.

ఆ సందియములిట్లున్నవి. శ్రీహరి యవతారములైన శ్రీరామకృష్ణులే వారికి కలిగిన యనుభవముల నెఱుగక పోయిరా, ఇది యెట్లు పొసగినదని వారి సందియములు. ఈ సందియములు నిజమే. పట్టాభిషేకమునకు సిద్ధముగానున్న సమయమున తాను అడవులబట్టి పోవలయుననియు, అడవు లందున్నపుడు తనభార్య సీతను రావణుడెత్తుకొని పోవుననియు శ్రీరాము డెఱుగునా? శంబరాసురుడు పురిటి మంచముపైనున్న తన తనయుడు ప్రద్యుమ్నునపహరించునని శ్రీకృష్ణుడెఱుగునా? జాంబవతి కోరికపై శ్రీకృష్ణుడు పుత్రులకై తపస్సొనరింపనేల. శంభుడు ప్రత్యక్షముకాగా మోక్షమువిడచి పుత్రులనే కోరెను. ఇవి యన్నియు మాయాకల్పితములు- ఎంతటి ఘనుడైనను వీనిని దాటలేరు. కనలేరు కూడను. అదియంతయు దేవీమహత్త్వము. ఆ తత్త్వమెఱిగి దేవీభక్తులైన వారికిగాని ఈ మాయనుండి వెలు వడుట సాధ్యముకాదు. ఆకలి శోకము మోహము నిద్ర భయము శ్రమ మరణము మున్నగు భావములు దేహసంభవములేకాని

సుస్థిర మనఃకార్యములుకావు. మాయకతీతమైన రూపము ఆ పరాశక్తియే. జీవకోటికి మోక్షసిద్ధి కలుగవలెననియే ఆమె భావము. ఎవరియందును పక్షపాతములేని లోకైకమాత ఆదేవి.

ఎవరికి జన్మము కలిగినను ఆ దేవి నర్చించు పుణ్యవంశమున పుట్టవలయును దేవీపూజలేనియింట పుట్టుట మహాపాపము దేవ్యుపాసనయే పరమపావనము. త్రిమూర్తులు, వారి భార్యలు, శ్వేతాశ్వతర మునివర్యులు మున్నగు మహనీయులు దేవి నుపాసించియే పరమ పదస్థితి నందగలిగిరి. ఆ దేవిని గూర్చిన ధ్యానము పూజ యే ఇహపరములందు శుభదాయకము. మీరు అట్లొనరింపుడని సూతుడు వచించెను.

# శ్రీపరమేశ్వరి

## అయిదవ స్కంధము

### శివకేశవులు

మహాపౌరాణికుడగు సూతమహర్షి నుడివిన కథలను విని మహాకీర్తి నంది మహాత్ములని పేరందిన మానవులేకాక దేవతలు గూడ మాయామోహములకు లోనయి యెట్లు ఆపదలకు పాలయి నదియు గ్రహించిన శౌనకాదులకు ఆముని నుడువుచున్న విషయము లందాసక్తి రెండింతలయి దేవీ మహిమను మఱింత విపులముగ వినగోరి"సూతమునీంద్రా నీవునుడువుచున్న కథలలోని విషయము లన్నియు మాకు కనువిప్పుగా నున్నవి. మాయామోహములనేమియో, తన భక్తులను కరుణాతరంగిత హృదయయయిన దేవి యెట్లురక్షించినదో తెలిసికొనిన మా కా జగదంబ లీలా విలాసములనుగూర్చి, వేర్వేఱు సమయములలో ఆమె తాల్చిన రూపములు తన్మహిమములగూర్చియు విపులముగ వినుటకు కుతూహలముగా నున్నది. అయినను మాకు మఱియొక సందియముకూడ డెందములందున్నది. ఈ సంశయమును ముందు తొలగింపు"మని వినయమున ప్రశ్నించిరి.

మునీంద్రా మాసంశయము మీరు వచించిన శ్రీకృష్ణ చరిత్రమునకు సంబంధించినది. జగత్ సృష్టి పోషణలయములకు వరుసగ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కర్తలుగదా. త్రిలోకారాధ్యులగు ఆ త్రిమూర్తులలో శ్రీహరి గొప్పవాడందురు, ఆ హరి యవతారమగు శ్రీకృష్ణుడు శివునిగూర్చి తపమొనర్చెనని నుడివితిరి. శివునికీ యాధిక్యమెట్లుకలిగినది. ఈ సందియము మమ్మలను

వీడుటలేదు. మహావిజ్ఞానులయిన మీరే యీ సంశయ నివృత్తి చేయ దగువారు" అని అడిగిరి. సూతుడీ సందేహమునువిని మున్ను జనమేజయ మహారాజిట్టి సంశయము నడుగగా వ్యాసుడు నుడివిన విషయములనే యిట్లు వివరించెను.

శ్రీహరి అధికసత్త్వుడను మాట నిజమే. హరి యంశయగు నారాయణుడను మునీశ్వరుడే మరల కృష్ణునిగ నరజన్మము నందెను. మానవాకృతి నున్నవానియందు పూర్వపాటవము సర్వము ఉండదుగదా. మనుజుడై మాయకులోగిన శ్రీకృష్ణునకు తన కర్మఫలము ననుభవింపక తప్పినదికాదు. వేదములందును హరికి కారకుడు హరుడని నుడువబడినది. మూలరుద్రుని అంశతో ఊరు దయాశాలియయిన ఒక రుద్రుడు బ్రహ్మకపాలమునుండి ఉదయించెను. వరదాతయైన హరుడు అందఱికి ఆరాధ్యుడేకదా- శివుని అనుగ్రహమువలననే శ్రీకృష్ణుడు బలయుతుడై పెక్కు గొప్ప కార్యములొనర్చెను.

ఈ త్రిమూర్తులు ముప్వురును ప్రణవమగు 'ఓమ్' నందు గల 'అ' 'ఉ' 'మ' అను వర్ణములే. మూలపురుషులగు శివకేశవు లన్నిటియందును సమానులే; వారిమధ్య తరతమ భేదములులేవు. అట్టి భావమునకును తావులేదు. ఈ విషయమును విశదముచేయు ఒక కథనుగూడ మీరు వినగలరు.

## దేవి శక్తి

ఇప్పుడు మీరు నుడివిన త్రిమూర్తులను మించి మ తేజముతో మహాప్రాభవముతో వెలయుశక్తి ఆ జగదంబదే

వీరొనర్చు సృజన పోషణలయ క్రియల నాయమ ఒక నిముస ములో ఖైబవేర్చగలదు. అఖిలము ఆ దేవి మాయాప్రభావితమే. ఖాండమునందు మృత్తికయున్న రీతిగనే అహంకారము జగ మంతయు నిండియున్నది. దీనిని దాటుటకు త్రిమూర్తులకును వలనుపడదు. ఆ దేవి ప్రభావములు బహుముఖ ప్రజ్ఞాపాటవ శోభితములు. ఆ పరమేశ్వరి యొనర్చిన కార్యములు త్రిజగత్ కళ్యాణ సంధాయకములు.

ఆ దేవిలీలల నిక వినుడని సూతమహర్షి శౌనకాదుల కిట్లు నుడివెను- అవి అత్యద్భుతములు. ఆ పరాంబిక యే సమయమున నెట్లు ప్రవర్తించునదియు ఊహాతీతము.

ఆ జగదీశ్వరి లోకకళ్యాణార్థము, త్రిలోక కంటకులయిన మహిషాసురుడు శుంభనిశుంభులుమున్నగు మహాక్రూర రాక్షసు లను జంపినది. ప్రజలకు శ్రేయమొనగూర్చు ఎన్నియో కార్యము లొనర్చుటకు బహు నామములతో బహు రూపములు దాల్చినది. వ్యాసరచిత దేవీభాగవత గ్రంథస్థములైన యీ గాథలన్నియు ు ఆకర్షణీయములు చాల పుణ్యప్రదములు వినుడని సూతు ు నుడివెను.

## మహిషాసుర వృత్తాంతము

జగదంబ చేసిన బృహత్ కార్యములలో మహిషాసురుని చంపుట చాల ముఖ్యమైనది. ఈ కార్యమువలననే ఆ పరదేవత మహిషాసుర మర్దనియను నామమున త్రిలోకఖ్యాతి గాంచినది.

అదియాదిగ ఎందఱో క్రూరరాక్షసు లామె చేతిలో హతులైరి. లోకములకు దానవపీడ వదలినది-

మహిషాసురుని జననమే ఒకవిచిత్రమగుకథ, దనువు అనుపేరు గల ఒక రాక్షసునకు రంభుడు కరంభుడు అను పుత్రులు కలరు. వారిరువురును బలశక్తులకొఱకు మహోగ్రతప మొనర్చుచుండ ఇంద్రుడు వారివలన తనకెట్టి కీడగునోయని భయపడి తన వజ్రాయుధము గైకొని వారిపైకేగి వారిలో కరంభుని జంపెను. ఇంద్రుపై పగతీర్చుకొనుటకై రంభుడు మఱింత తపోదీక్షతో అగ్నిలో తన శిరమునర్పించుటకు సిద్ధమై అగ్నివలన తనకొక మహాబలవంతుడగు పుత్రుడుదయించునట్లు వరమునుబొంది దర్పముతో ముల్లోకములందు సంచరించుచుండెను. ఆ సంచార ములో రంభుడు యక్షులకు చెందిన ఒక వనములో ఒక సుందర మైన మహిషమునుగాంచి మోహించి దానితో క్రీడించెను. ఆ మహిషము గర్భమును దాల్చగా రంభుడా మహిషమును తనవెంటబెట్టుకొని పాతాళమున కేగెను. అచ్చట నొక యెనుబోతా మహిషమును పైకొనబోగా రంభుడడ్డుతగిలి ఆ యెనుబోతు పోటు లకు జచ్చెను. పతి మరణమునకు జింతించు ఆ మహిషము తిరిగి తన యక్ష దేశమునకేగుచుండగా ఆ దున్నయు ఆ మహిషము వెంటనంటి యేగి యక్షుల చేతులలో జచ్చెను. యక్షులా దున్నను రంభునిగలిపి చితియందుబెట్టి దహించుచుండ పతివియోగము సహింపలేక ఆ మహిషముగూడ ఆ చితియందు బడెను. అగ్ని దేవుడు రంభునకిడిన వరముఫలించి ఆ చితాగ్నినుండి అగ్ని తేజుడు మహాభయంకరుడు, నిరుపమబలుడు పర్వతాకారుడగు

ఒక రాక్షసుడుద్భవించెను అతడే మహిషాసురుడు. వానితో బాటు రక్తబీజుడను మఱియొక రాక్షసుడుగూడ జనించెను, అతడును మహిషునితో సమాన బలవంతుడే. వారి పుట్టుకతో జగము నందెల్లెడ అపశకునములు కల్గినవి. రక్తమాంసములు నింగినుండి కురిసినవి. నక్కలు, గ్రుడ్లగూబలు కూయనారంభించినవి ఈ అశుభశకునములకు త్రిలోకవాసులును తల్లడిల్లి భయకంపితులైరి.

మహిషాసురుడు తీవ్రమైన తపముగావించి బ్రహ్మను మెప్పించి సురాసుర మానవులలో పురుషుల వలన తనకు మరణము లేకుండ వరము గైకొనెను. స్త్రీలు అబలలు, స్త్రీలేమి చేయగలరను భావము మనసులో ప్రబలిన మహిషుడు వరబలమున అజేయుడనను దర్పమున యధేచ్ఛగ విహరించుచు ముల్లోకములందును వీరవిహారము చేయుచు దిక్పతుల నెదిరించి తన సైన్య బలముతో స్వర్గము నాక్రమించెను. దేవేంద్రుడు యమవరుణాది సర్వదిక్పతులను వెంటబెట్టుకొని ఐరావతమునెక్కి వజ్రాయుధము తన చేతిలో మెఱయుచుండ మహిషునెదిరింప వచ్చెను. మహిషుడు మాయావి, ఒకవరి నింగికెగిరి నిప్పులు వర్షించును. ఉర్వికిగి ఉత్పాతములు కల్గించును. దివిజలోకమెల్లను తనబాణాగ్నితో గాల్చెను. మహిషుని విక్రమమునకు అడ్డులేదు. ఆమాయావి వీరవిహారములర్థమేయగుటలేదు. దేవేంద్రుడును, దిక్పతులును తమ బలములు వ్యర్థములగుటచే వెనుదిరిగిపోయి బ్రహ్మను వెంటబెట్టుకొని విష్ణువుకడకేగి మొఱబెట్టిరి. విష్ణువు శివ బ్రహ్మలను వెంటబెట్టుకొని ఆయుధ హస్తుడై మహిషునిపైకి గవిసెను. కాని

ఆ యసురుడు పురుషులచే మరణింపడు; బ్రహ్మయిచ్చిన వరబల మట్టిది. త్రిమూర్తులును విఫలయత్నులై వెనుదిరుగుటతో మహిషాసురుని కెదురాడు వారిక లేరైరి. తన కవరోధములేక మహిషుడు త్రిలోకములను ధ్వంసమొనరింప మొదలిడెను ఎచ్చటివారచ్చట మహిషునికి పాదాక్రాంతులయి ప్రక్కప్రక్కలకు తప్పుకొనుచుండిరి. దేవేంద్రుడు దీనుడై దుర్గతిపాలయ్యెను.

## దేవీ ప్రాదుర్భావము

మహిషాసురుని క్రూరపరిపాలనము ముల్లోకముల నిరాటంకముగా సాగుచుండెను. ఇంకను విలంబన మొనరించినచో ప్రపంచమున దానవులకు తప్ప వేఱొకరికి తావుండదు. శ్రీహరి యిట్లు పరిస్థితుల నాలోచించి దేవిని మనసార తలచి "దేవీ నీవే మాకు శరణ్యము గావలెను వేఱుదారిలేదని" జగదంబను ప్రార్థించి శివుడు బ్రహ్మ, యింద్రుడు మున్నగు దేవతలనుజూచి మనము ఒక మహిళను సృజించి మన తేజములను ఆయుధములనొసంగ వలెను. ఆమెయే మహిషుని వధింపగల"దను నంతలో బ్రహ్మ ముఖమునుండి ఒక మహాతేజస్వినియగు స్త్రీ రూపముద్భవించినది. అమెలో త్రిమూర్తుల యొక్కయు దిక్పాలుర యొక్కయు తక్కుఅమరముఖ్యుల యొక్కయు తేజములు కలసినవి. దేవతలందఱు వారి వారి ఆయుధములను ఒక సింహవాహనము నామెకొసగి దేవీ నీకరుణకై వేచియున్నాము మహిషుని మ్రందింపగల శక్తివి నీవే, అని వేడుకొనగా ఆమె వారికభయమిచ్చి మహిషుడున్న ప్రాంతమునకేగి లోకములను క్షోభిల్లజేయు ఒక మహాధ్వని జేసినది–

## మహిషుడు దేవిని కామించుట

మహిషుని అనుచరులు అధ్వని వచ్చిన ప్రాంతమునకేగి చూచిరి. దుర్నిరీక్ష్య తేజస్విని యయిన యామెను చూచుట తోడనే వారు భయకంపితులై కాలు సేతులు వణకు తొట్రుపాటుతో మహిషునివద్దకేగి పాదములపైబడి కొంతసేపు నోటమాటరాక తుదకు ధైర్యమూని "మహాప్రభూ త్రిలోకైకవీరా దానవేశ్వరా! యేమి చెప్పుదుము, మీరు వినిన ఆ మహాధ్వని నొనర్చిన దొక స్త్రీ రూపము. ఆమె ముఖము దేహమంతయు మా కనులుచూడలేని ఒక మహాతేజముతో వెలుగుచున్నవి. రక్తాంబరములు రక్త మాల్యములు నవరత్నభూషణములు చేతులందు ఆయుధములు కలిగి సింహవాహనమెక్కి ఆమె మహా సుందర భీకరాకృతితో ప్రకాశించుచున్నది. కాని ఆమె అవయవ సౌష్టవము చూడగా చాల సౌందర్యవతి: త్రిలోకములను మోహింపజేయు ముఖ విలాసము లున్నవి మధుకలశము చేతనున్నది" అని చారులు వర్ణించుటవిని మహిషుడు ఆలోచించి, తలపంకించి, మంత్రులను కగ్గఱకు పిలచి యిట్లనెను. "ఈ చారులు చెప్పిన వార్త మీరు వింటిరికదా. ఆమె తప్పక నా కీర్తివిని నాబలప్రాభవము లెఱిగి నన్నే వలచివచ్చిన కాంత. అందుచే నేను వినునట్లు అధ్వనిచేసి మన పరిసరముల దిరుగుచున్నది. మీరేగి మీబుద్ధికుశలత జూపి నా ప్రతాపమును వర్ణించి ఆమెనెట్లయిన కొనివచ్చి ఆమెను నా రాణిగా జేయుడు. స్త్రీల చిత్తములు గ్రహించి మాటలాడవలెను. మొదట చాల బెట్టుగానుందురు. తరువాత వారేయంతట వారే దారికివత్తురు. తామ్రుడు చక్షురుడు ఈ యిరువురునేగి ఈ

కార్యమును సాధింపవలెను." అని మహిషుడంపెను, రాజాజ్ఞ శిర సావహించి ఆ యిరువురు దానవ వీరులుసర్వాలంకార భూషితులై, అధికారదర్పము చూపుచు పరివారమును దూరముగనుంచి, ఆమె దరికేగి నమస్కరించి "ఓ సౌందర్యవతీ, నీవెవరవో మాకు తెలి యదుకాని నీ యదృష్టము పండినది. నీ రూపరేఖావిలాసములు విని మా ప్రభువైన మహిషాసురాధిపుడు నిన్నాహ్వానించి ఈ కాంచన రథముపై నిడుకొని తోడ్కొని రమ్మని మమ్ము పంపెను. ఇవిగో నీకు కానుకలు, కాంచన భూషణాది నవరత్నరాసులు. కనక చేలములు సురభిళ పుష్పమాల్యములు. వలసినంత సురా పానము కలదు. ఆ ప్రభువు కీర్తి వినియే యుందువు. ఆతడే నేడు ముల్లోకముల కధిపతి. అతని యాజ్ఞకు లోబడి సూర్య చంద్రులు, అగ్ని వాయువులుకూడ వర్తింపవలసినదే నీవాతని రాజ్ఞివై ముల్లో కము లేలుము. లెమ్ము ఈ రథమధిరోహింపుము" అని రథమును జూపిరి.

దేవి యించుక చిఱునవ్వి, వారిని కనుగొని "నేనెవరినో యెఱుగక మీరిట్లు మాటలాడుట ఆశ్చర్యముగా నున్నది- మీ మహిషుడకారణముగ స్వర్గముపై దండెత్తి దేవేంద్రుని దేవతల నావలకు పారద్రోలినాడు. మహాపాపి తృణభోజనుడైన ఆనీచునా, నేపెండ్లియాడునది. కామ వికారమంత యెక్కువగా నున్నచో ఒక గేదెనుచూచి పెండ్లాడమనుడు. నామాటలాయసుర నాధునితో చెప్పుడు శీఘ్రముగ దేవరాజ్యమెల్ల దేవేంద్రునకిచ్చి తాను సపరి వారుడై పాతాళమునకేగనిచో, సైన్యసమువేతముగ వానినిజంపుట కేతెంచిన జగదీశ్వరిని నేను మఱిమాటాడు టకవసరములేదు" అని గంభీరముగ పలికిన ఆ కాంతమాటలువిని చక్షురతామ్రులొకింత

చకితులయిరి. ఆమె వదనబింబమునే చూడలేకున్నారు. ఒకింత కాలు నిలువద్రొక్కుకొని వారు "ఓ మదవతీ నీవేదో బెట్టుచేయుచున్నావు. నీవును మహిషుని వలచివచ్చిన కామినివివలె మాకు దోచుచున్నావు. నీపై మరులుగొని మహిషాసురుడు నీకొఱకు వేచియున్నాడు. ఇక నీవాలస్యము చేయవలదు అనుటతో వారి వాచాలత్వమునకు జగదంబ కాగ్రహము కలిగి కండ్లెఱ్ఱజేసినది. ఆ చూపుతో వారిరువురొక్కబిగిని మఱి వెనుకమొగము లేకుండ పరువెత్తి మహిషుని పాదములపైబడి జరిగినదెల్ల నుడివిరి. మహిషునకు కొంత ఆశ్చర్యము కొంత ఆసక్తియు గలిగి "ఆమె మిమ్ము బెదిరించినదంతియే మీరూరక పరువెత్తుకొని వచ్చిరి. అయినను ఈసారి సైన్య సమేతులై వెడలి ఆమెకు నచ్చచెప్పుడు లేకున్న బంధించికొనిరండు. అని మహిషుడు ఆజ్ఞనిచ్చెను. చక్షుర తామ్రులిద్దఱు జంకుచునే మరల నామెకడకుపోయి ప్రయత్నించిరి. చచ్చిన ఈ మహనీయ రూపిణి చేతులలోనే చావవలయును లేకున్న ఊరకే తిరిగి వెనుకకేగినచో క్రూరుడైన ఆ మహిషుని చేతిలో చావవలసివచ్చునని, చక్షుర తామ్రము లా దేవిపైబడి బంధింపబోయి ఆమె శూలనిర్ఘాతములకు హతులయిరి. దనుజ సైన్యములు ల్లాచెదరయ్యెను- ఈ సమాచారము విని మహిషుడు మండిపడి డాలుడు అసిలోముడు బాష్కలుడు దుర్ముఖుడు అను మహా క్రూర రాక్షసులను బంపెను. ఆ రాక్షస సేనాధిపతులందఱు ఒకరొక్కరే వరుసగనేగి వారును "ఓ కామినీ యిక నీ బింకములు మాని ఆ దానవ ప్రభుని చేపట్టుట ఉచితమనిచెప్పి విఫలులై ఆమెనెదిర్చి తుదకా దేవి ఆయుధములకు బలియైరి- దిక్కులబట్టి పారిపోయిన దనుజ సైన్యములను వెంటాడి ఆ దేవియొక్క సింహ

వాహనము తనకు దొరికిన వారిని భక్షించినది-

ఆమె తనను వలచి వరించుటకుగాక నిజముగ తన మృత్యువునకే వచ్చినదని మహిషునకొక భయముదయించినది. కాని కామాంధ్యమింకను కన్నుగప్పియున్నది- మహిషాసురుడే తుదకు శృంగార మంజులాకారుడై వచ్చి తనసైన్యము నొకింత దూరమున విడచి దేవిని సమీపించి "ఓ కాంతామణీ నీవు త్రిలోక సుందరివి నేను త్రిలోక నాథుడను, ప్రచండ బలశాలులైన నా యనుచరుల జంపగల శక్తిశాలినివి నీపైనందులకు సంతసించి తిని. నా కోరిక మన్నించి నా పరిష్వంగమునకు రమ్ము- నీచే త్రిలోకము లేలించెదను. నిన్ను వలచి వచ్చిన భాగ్యమును కాల దన్నకుము" అని తన మదనార్తిని వెల్లడించెను. ''ఇప్పటికయిన బుద్ధికలిగి దేవలోకమును దేవేంద్రునకిచ్చి నీవవలకేగుట మంచి'' దని జగదంబ అనేక విధముల నుడివినది. కామార్తుడైన మహిషునకవి తలకెక్కలేదు. సౌమ్యముగ నామాట విననిచో నిన్ను బలిమిని బంధించి తీసికొని పోదునని మహిషుడుద్రేకమున తన పైకి రాబోవుట గమనించి దేవి ఆగ్రహావేశమున విజృంభించి పైకెగసి యారాక్షసుని వక్షమున ఒక్కపెట్టున దన్నెను. మహిషుడంతతో వెనుదిరిగిపోక మహాహుంకారుడైలేచి తన సైన్యము నా పరాంబికపైకి ప్రేరేచి తాను మాయాయుద్ధమునకు దిగెను- మహిషునికి సాయముగవచ్చి అంబనెదిరింప సమకట్టిన దుర్ధరుడు త్రినేత్రుడు అంధకుడు ఆ శక్తి ధాటికాగలేక క్షణములో మడిసిరి.

అనుచరుల మరణమును కండ్లారగాంచిన మహిషుడు మరింత క్రుద్ధుడై మారణాయుధములతో నామెపైకురికి,

భూమ్యాకాశములమధ్య అదృశ్యుడై తిరుగుచు మాయాయుద్ధమునకు దిగెను. మహిషుని మాయలవలన రక్తమాంసములు కురిసినవి. పిడుగులుపడినవి. ఎచటజూచినను మహిషాకారులే. దేవిపై శరవర్షము కురిపించువారే, ఆ సంక్షోభమునకు త్రిలోకములు తల్లడిల్లినవి.

ఆ మాయలా మహాశక్తి ముందెంతటివి. ఒక రూక్షవీక్షణమునకు చాలవు. తః వితీర మధువాస్వదించి లేచి బ్రహ్మాండమే బ్రద్దలగునట్లు దేవి హుంకరించి మహిషుని పడగొట్టి కాలితో నొక్కిపెట్టి శూలముతో పొడిచి చక్రముతో శిరము ఖండించెను. వాని దేహరక్తము ఏరులై పారినది. రాక్షస సైన్యములు పలుదిక్కులబట్టి పరుగెత్తిరి.

దేవి జగద్భయంకరుడైన మహిషాసురుని వధించి, మహిషాసుర మర్దని యను ప్రసిద్ధ నామము గాంచెను. త్రిమూర్తులరుదెంచి దేవిమహిమ నుగ్గడించిరి త్రిలోకములకు భయముడిగెను. దేవేంద్రుడు దిక్పాలురు మున్నగు అమరముఖ్యులెల్ల దేవికి ప్రణమిల్లి ఆమె చేసిన ఉపకృతికి బహువిధముల ప్రస్తుతించిరి. ఏయే దేవతలనుండి వచ్చిన తేజములు ఆయుధములు దేవినుండి బయల్వెడలి తిరిగి ఆయా దేవతల జేరినవి. దేవి మరల శాంత రూపిణియై ప్రసన్నవదనముతో కరుణావీక్షణములతో వారికభయమిచ్చి అదృశ్యయయ్యెను. ప్రపంచమున తిరిగి మునుల తపసులు ధార్మికుల ధర్మకార్యములు వర్ధిల్లినవి.

### శుంభ నిశుంభుల విజృంభణ.

కొంతకాలమునకు మరల శుంభ నిశుంభులను ఇరువురు

రాక్షస సోదరులు ప్రబలి త్రిలోకములను బాధింప మొదలిడిరి. వారు పది వేలేడులు తీవ్ర తపమొనర్చి బ్రహ్మను మెప్పించి సురాసుర మానవులలో పురుషుల వలన చావులేకుండ వరమందిరి. వీరికి చండుడు ముండుడు రక్తబీజుడు అను మహాభీకర రాక్షసులు వారి సైన్యములతోతోడైరి. ఆ బల గర్వమున శుంభ నిశుంభులు త్రిలోకములను దిక్పాలురను ఓడించి, దేవేంద్రుని దేవతలను స్వర్గమునుండి పారద్రోలి స్వర్గము నాక్రమించు కొనిరి. దేవేంద్రుడు దీనుడై దేవ ముఖ్యులను తోడ్కొని హిమ గిరి ప్రాంతముననున్న దేవిముందు ప్రణమిల్లి తనగోడు విన్న వించెను, "తల్లీ నిన్నెపుడును విస్మరింపము నీవుదక్కమాకు దిక్కులేరని ప్రణతులర్పింప దేవి ప్రసన్నముఖమున దేవేంద్రుని అనుగ్రహించి అభయమిచ్చి వెనుకకు పంపినది-

## కాళికా ప్రాదుర్భావము

రక్కసుల నుక్కడించి, దేవతల రక్షించి మరల ధర్మ మును నిలుపు కార్యము ఆ జగదంబ చేకొనినది- అకారణముగ లోకకంటకులై ప్రవర్తించుచున్న శుంభ నిశుంభులపై ఆగ్రహో ద్రిక్తయైలేచి తన శరీరమునుండి ఆ పరమేశ్వరి కౌశికియను నొక భీకరశక్తి స్వరూపిణి నుద్భవింపజేసినది. ఆశక్తియే జగదా రాధ్యయయిన కాళికాదేవి. ఆమెను తోడ్కొని జగదంబ మృగేంద్ర వాహనయై శుంభుడున్న పరిసరములం దొకయుద్యానవనమున జేరి మధుర సంగీత నిస్వనములను వెలయించినది. ఆమె సౌంద ర్యము వర్ణనాతీతము. సర్వభూషణాలంకృత. సాయుధహస్త మణి కిరీటధారిణి, రక్తమాల్యాంబర విరాజిత. మధుపానము

చేయుచున్నది. ఈ సమాచారము తన యనుచరులవలన విని ఆమె యెవరో దేవకన్య తన బలదర్పము లెఱిగి వలచివచ్చినదని దలచి శుంభుడు కామమోహితుడయి తన మంత్రి సుగ్రీవుడను దానవుని తన బలప్రతాపములు నుడివి ఆ కాంతను సగౌరవముగ దోడ్కొని రమ్మని పంపెను-

ఒక కాంచన రథమునెక్కి పరివారయుతుడయి సుగ్రీవుడేగి కాళికాసమేతముగనున్న కాంతనుజూచి "ఓ లీలావతీ మీరెవరో నేనెఱుగను. నీ సౌందర్యమును విని, నీయందు వలపూని, మీసంగీత మాధుర్యమునానిముగ్ధుడై త్రిలోకాధిపతియైన మా ప్రభువు శుంభుడు నన్నిటకంపినాడు. తిన్నగ మీరిరువురు ఆ శుంభుని క్రీడాసౌధమునకే రావచ్చునుగదా. ఇచ్చట నుండుటెందులకు. అయినను మీభాగ్యము పండినది. నీవాతని రాణివై సింహాసనార్థ భాగమున కూర్చుండి త్రిలోకములేలవచ్చు" అని యేమేమో తన బుద్ధికుశలతజూపి చెప్పుచుండ ఆ జగదంబ యాతనినాపి చిఱు నవ్వుచు "నీమాటలనాపుము. మీ శుంభుని బలప్రభావముల నెఱుగుదును. నన్ను యుద్ధమున గెలువగలిగిన బలవంతునే పరిణయమాడుదుననిన ప్రతిన నాకు కలదు. నీవేగి మీ నాయకునితో ఈ మాటలు తెలుపుము" అని వెనుకకు బంపెను. రమణుల కేల రణవాంఛయని విస్మయమందుచునే సుగ్రీవుడాదేవిచూపులకు భీతిల్లి వెనుకకేగి శుంభునకామాటలను దెలిపెను. శుంభున కామెసందేశము సంభ్రమాశ్చర్యముల గొలిపినది. ఆవేషము ఆ భాషణము వలపుకత్తె విలాసములా? లేక నిజమగు బిభీషికలా? అయినను ఎందుకయిన మంచిదని మహాబల సాహసులైన తన

సేనానాయకులు ధూమ్రలోచనుని పిదప చండుడు ముండుడు అను వారలను సైన్యమునిచ్చి పంపెను. "మున్ముందు మీరామెతో మంచిగానే మాటాడుడు. నా బలప్రతాపములను, ఆమెకు నా రాణిగా నేనీయగల గౌరవమర్యాదలు తెలుపుడు. కార్యము సాను కూలముగాదేని ఆమె చెలికత్తెను పరిమార్చి ఆమెను బలాత్కార ముగ కొనిరండు" శుంభుని ఈ యాజ్ఞలను గొని ఆ రాక్షస వీరు లేగిరి.

## రక్తబీజునివధ

తొల్దొల్త ధూమ్రలోచనుడేగి దేవి అద్భుతాకృతిని గని వెఱ గంది యెట్లో దరిజేరి ఆమె సౌందర్యమును శ్లాఘించి శుంభుని బల పరాక్రమములభివర్ణించి మీ రిరువురు ఒకరికొకరు తగిన దంపతు లని ఏమేమో నుడువబోవుచుండ కాళిక మహాగ్రహమునలేచి 'ఓరీ నీచా! మీవంటి పెక్కు దుష్టరాక్షసులను జంపి ధర్మమును రక్షించి త్రిజగదారాధ్యయయిన ఈ భువనేశ్వరిపై, మీనీచ ప్రలాపములా నిన్నీక్షణములో నంతమొందింతు'నని విజృంభించుటతో తన యాటలు సాగక నిప్పులపొగలు గ్రక్కుచు ధూమ్రలోచనుడామెతో పోరికి సిద్ధమయ్యెను. కాళిక ధూమ్రలోచనుని శిరమొక వ్రేటున నేలగూల్చి వికటాట్టహాసమొనర్చెను. ధూమ్రలోచనుని పతనము జూచి చండ ముండులు విక్రమోద్దీపితులై కాళిపై బడిరి. తమ సైన్యములను పేరేచిరి. ప్రచండభండనవీరులైన వారి ప్రయ త్నము లన్నియు విఫలమయినవి. ఎచట జూచిన తానెయయి కాళిక రాక్షస వీరులను ముట్టుబెట్టినది. రాక్షస సైన్యములు చెల్లా చెదరయినవి. చారులీవార్తను శుంభునకెఱిగించిరి.

చండవిక్రముడయిన చండుని ఖండన కౌశలముగూడ వమ్మయినందులకు శుంభుడు విస్మయమంది మహాభీకరుడగు రక్తబీజునంపెను. సమరమున రక్తబీజుని దేహమందుండి యెన్ని రక్తబిందువుల వనిపైబడునో అన్నివేల రక్తబీజు లుద యించి యుద్ధమొనర్తురు. రక్తబీజుడు తానునేర్చిన మాయారణ విద్యలనన్నిటిని జూపుచుండెను. దశదిశల నెచ్చటజూచినను రక్త బీజులుద్భవించి చటులాస్త్ర శస్త్రముల చేబూని పైబడుచుండిరి. కాళికాదేవి విజృంభించి లేచినది. త్రాచుపాములవలె సహస్ర సంఖ్యాతీతముగ తన నాలుకలను బుసకొట్టుచు నలుదిక్కులకు చాచి రక్తబీజుని రక్తములు నేలబడకుండ ఆస్వాదించెను. దేవి ఒక మహాట్టహాసమొనరించి తన కరవాలముతో పైకెగిరి రక్త బీజుని శిరము ఖండించి సుదూర ప్రదేశమున కెగురగొట్టెను. ఈ వార్త లన్నియు వినిన శుంభునకు ధైరోత్సాహములు సన్నగిల్లి నవి. వాని అనుజుడగు నిశుంభుడది గమనించి "అన్నా నేనుండగా నీకేల విచారము. నేనే స్వయముగనేగి ఆ కాంతను బంధించి కొని వచ్చి నీపాదాక్రాంతగ నొనర్చెద"నవి దర్పముగ బయలుపెడలి తుదకు దేవి చేతులలో జచ్చెను.

## శుంభుని వధ

శుంభునకిదియంతయు భయప్రదముగ గనుపట్టినది; అయి నను జెమలోలతకనులుగప్పి 'ఓహో పొరపడితిని, ఆమె నాతో యుద్ధమొనరించి నాబల సాహసముల జూచి నన్నేగద వరింప వచ్చినదని శృంగార వేషభూషితుడై ఆమెయెదుట కరిగి, కాంతా మణీ నా యనుచరులను జంపితివని నాకుకినుకలేదు. నీసాహసము

మెచ్చితిని, అయినను రమణీమణులకు రాణీవాసములుగాని రణ రంగములేలఅని దేవివి మాటలతో మోసగింపజూచెను. దేవి వాని అంతర్యముగ్రహించి 'ఓహో నీవేనా శుంభుడవు, నాప్రతిజ్ఞ నెఱుగుదువుగదా నీబలావష్టంభముల నొకింత చూచెద'నమటతో తన మాటలు కట్టిపెట్టి యుద్ధసన్నద్ధుడై శుంభుడు అంతకాకృతిని దేవిమీదకు గవిసెను. ఆ రాక్షసుని ధాటికి దిక్కులు భేదిల్లినవి కులగిరులదిరినవి దేవతలు కంపించిరి. ఇంతలో శివుడేగుదెంచి దేవికి సాయముగ నవశక్తుల నిచ్చెను. దేవి యాదేశమున కాళిక మహావిజృంభణముతో చెలరేగి శుంభునిపైబడెను. నవశక్తులు సహస్రమూర్తులై రాక్షససైన్యముల మట్టుబెట్టుచున్నవి. కాలు సేతులు శిరము ఒకదానివెనుక నొకటి ఖండింపబడినను తన మొండెము నెగయించుచు శుంభుడనిసేయ మొదలిడెను. ఆ మొండెమునుగూడ కాళి ముక్క ముక్కలుగ ఖండించిపైచెను. హతశేషులైన అసుర సైనికులు దేవికి ప్రణమిల్లి క్షమాభిక్ష వేడిరి. ఆమె కరుణించి వారిని పాతాళమునకు బంపెను. అక్రూర రాక్షసుల నిటులజంపి మాంసపు బర్వతములు రక్తపుటేరులు నిండిన ఆ భీకర సమరాంగణమున దేవి విజయతాండవము నెఱపినది- నవశక్తులు వారివారి రూపముల నుపసంహరించి నిజస్థానముల కరిగిరి-

దేవి యథాపూర్వము శాంతరూపిణియై కరుణావీక్షణామృత వృష్టి గురియుచు నిలబడినది. త్రిమూర్తులు దిక్పాలురు మునులు దేవతలువచ్చి వందనమాచరించి ఆమెముందు నిలబడి-

"మహాదేవీ, జగన్మాతా నీమహిమలు లీలలు వర్ణనాతీతనాములు చండప్రతాపుడైన చండుని ఖండించిన చాముండేశ్వరివి. మహిషుని మ్రందించిన మహిషాసుర మర్దనివి. రాక్షసపీడ నశింపజేసి త్రిలోకములకు శ్రేయమొనగూర్చి ధర్మప్రతిష్ఠాపన మొనరించిన జగత్కళ్యాణివి. కల్పాంతములగాడ నీ పేరుప్రఖ్యాతులిట్లే యుండును. నీ నామాక్షర జపము ను నీపూజలుసేయు భక్తులకు సర్వసౌభాగ్యములు కలుగును. నీశక్తి ఊహాతీతము. నీ అనుజ్ఞ లేనిదే జగమున తృణమైన కదలదు. నీపేరు మఱవక నిన్ను త్రిలోకవాసులు పూజించుచునేయుందురు; మమ్ము సదాకరుణిరచి కాపాడుచుండుము తల్లీ! యని వారు పేమార్లుమొక్కి ఆజగజ్జనని దీవనలంది వెనుదిరిగిరి-

మునులారా! ఇది శ్రీ పరాంబిక స్వయముగ సాయుధ హస్తయై వచ్చి చేసిన రాక్షసవధ. ఈ గాథలు వినిన, చదివిన భక్తులెల్లరకు ఏభయములులేక సర్వశ్రేయములు కలుగును. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, రాక్షసులైనను సరే ఆశ్రితులైనవారిని ఆదరించుట, ఆమె మహిమలు. ఆమె యవతారములుచాల ఉన్నవి- వినుడని సూతుడు దేవీభాగవత కథలిట్లు చెప్పెను-

## దేవి అవతారములు-వారి మహిమ

దేవి స్వయముగ తన శరీరమునుండి ఉద్భవింపజేసిన కాళి మహిమవింటిరి. దేవీమహాంశశోభితములైన అవతారము లెన్నియో యున్నవి. ఈశక్తి స్వరూపముల మందిరములు దేశమెల్లెడలవెలసి మునులచేత ప్రజలచేత నిత్యము పూజలందు

కొనుచున్నవి. ఈదేవి పూజలు సకల సంపత్కరములు శ్రేయో దాయకములు ప్రధాన శక్తి స్వరూపముల గాథలు కొన్ని వచించెదను వినుండని సూతు డిట్లు నుడివెను.

## దుర్గా ( శతాక్షీ ) దేవి

ఈమెయె జగదంబ. దుర్గముడను మహాదుష్ట రాక్షసు డొకడు వేయేండ్లు తపమొ నర్చి బ్రహ్మచే వరములు పొంది ఆ వరప్రభావమున మహాబలవంతుడై వేదశాస్త్రములను తన వశ మొనర్చుకొని మునులను దేవతలను బాధింప వొచ్చెను. లోకము లాయసురు డొనర్చు భాధలకు తాళలేక సంక్షు బ్ధములైనవి. దుర్భిక్షముచే ప్రజలల్లాడి పోయిరి. తుదకు మునులు దేవతులు హిమగిరి కేగి దేవిని పూజించి మొఱ బెట్టుకొనగా ఆమె ప్రచండ తేజముతో శతాక్షిరూపమున వచ్చి దుర్గముని సైన్య సమేతముఁగ వరిమార్చి లోకములకు మేలు గూర్చెను దుర్గముని దునుమాడుటచే దేవికి దుర్గయను ప్రసిద్ధ నామము కలిగినది. అరిభీకరములు, మహా తేజోవంతము లయిన శతాధిక నేత్రములతో నా జగన్మాత అవతరించుటచే శతాక్షి దేవియను ప్రసిద్ధి కూడ ఆయుంబకు వచ్చినది-

## భ్రా మ రీ దే వి

మనువులు లోకపాలకులు. వారిలో వైవస్వత మనువున కార్గురు కుమారులు, వారందఱును దేవీభక్తులై నిత్యముఁను గౌర వ్రుత్తికతో దేవీప్రతిమనుజేసి భ్రామరీ వాగ్భవ మంత్రజప మొన రించుచు పూజలొనిరించి, దేవీ మహిమచే మహాకీర్తిమంతులై

వారును మనువులై మహినిపాలించిరి. ఈ దేవీ మహిమ దెలుపు నొక కథగలదు.

పూర్వము అరుణుడను రాక్షసుడొకడు గాయత్రీ మంత్ర బలముచే ఏ యుద్ధమందును నరసుర యక్ష రాక్షసాదు లెవరి చేతను మరణములేకుండ వరము నందెను. ఒకవంక తన వర బలముచే లోకములను బాధించుచు మఱొకవంక నిత్యము భక్తి శ్రద్ధలతో గాయత్రీ మంత్రము జపించుచుండెను- సుర లా యసురుని బాధపడలేక భ్రామరీ దేవిని పూజించి ప్రార్థించుచుండ ఒక ఆకాశవాణి "అద్దైత్యుడు గాయత్రీమంత్ర జపమును విడనాడి నప్పుడు బలహీనుడగు"నని వచించెను. ఇంద్రుడొక ఉపాయ మాలోచించి ఆ యరుణాసురునొద్దకు బృహస్పతిని పంపెను. బృహస్పతిని చూడగనే అరుణుడు "నాకు శత్రువులైన దేవతలకు నీవు గురువువు. కాన నాకును నీవు శత్రువే, నాకడకేల వచ్చితివి?" అనగనే బృహస్పతి "దేవతలమాట యెందులకు, నీవు నేను నొక లక్ష్యమునే సాధించుచున్నాము. నేనును నీవలె గాయత్రి మంత్ర మును జపించుచున్నాను మనమిర్వురమును ఒకటే"యని నుడివి నంత అరుణుడు మఱింత కోపముతో "ఓహో అట్లనా, నాశత్రువైన నీవు జపించు గాయత్రి మంత్రము నాకేల? నేనీక్షణమునుండియే జపించను" అని మానుకొనెను. తత్ఫలితముగ అరుణుని బలము నశించినది. భ్రామరీదేవి మహాభీకర ఝుంకారము సేయు తుమ్మె దల సైన్యము నా రాక్షసునిపైకి బంపెను. అవి వానిని వదలక చుట్టుముట్టి కుట్టి చంపివేసెను. భ్రమరము అనగా తుమ్మెద. దేవ తలు సుఖించిరి. లోకముల కా రాక్షసుని పీడవవిలినది-

ఇది భ్రామరీదేవి మహత్త్వమును దెల్పుకథ. ఆమెయే పరమేశ్వరి. తన భక్తుల నెల్ల వేళలను ఎట్టిపీడలులేక కాపాడగల కరుణామయి.

## మ న సా దే వి

ప్రజలకొకప్పుడు కనులకు చెవులకు కడుదీర్ఘములైన రోగములు జనించి ప్రాణములు దీయుచుండ ప్రజల ప్రార్ధన మన్నించి కశ్యపమునీంద్రుడు బ్రహ్మ దీవనలంది తనతపశ్శక్తిచే దేవి అంశగలిగిన "మనస"యను మహితాత్మను సృజించెను. ఆమె కృష్ణమంత్రమును జపించి పరమశివుని పూజించి గౌరీదేవి వలన జ్ఞానబోధలనందిన మహిమాన్విత. ఈమె భర్త జరత్కారుడను ఋషి. ఆస్తీకమహాముని ఈమె కుమారుడు. చక్రవర్తులను గూడ శాసింపగల మహనీయుడీ ముని- మనస నర్చించు భక్తులకు మననునందుగల యిష్టకామ్యార్థము లొనగూడుటేగాక. వారి సంతతికెట్టి రోగములనురావు- మనసాదేవి పూజవలన కర్ణనేత్ర రోగములు నశించినవి; ప్రజలు సుఖించిరి.

## స్వా హా దే వి

బ్రహ్మ దేవతలను సృష్టించి వారికాహారమేర్పాటు జేయుమఱచెను. దేవతలాకవిబాధతో శ్రీకాంతునికడకేగి ప్రార్థింప బ్రాహ్మణ క్షత్రియులొనరించు యజ్ఞయాగములం దర్పణసేయు హవిసులు మీకాహారమగునని శ్రీహరి నుడివెను. బ్రహ్మ ప్రకృతి రూపిణియగు శక్తిని అగ్నిహోత్రునికి సహాయమై దాహకశక్తి నీయవలసినదని వేడెను. ఆశక్తియు తొల్దొల్త సందేహించినదిగాని

పద్మాక్షుని కోరికపై "స్వాహా"యను రూపమున అగ్నిదేవుని సతి యయి హవిసుల ప్రేల్చెడి బలము నగ్నికిచ్చెను. ఆకారణమున 'స్వాహా'యను నామమున మంత్రోచ్చారణచేసి యర్పించు హవిసులు స్వాహాదేవి యనుగ్రహమున పవిత్రముగ ప్రేల్చబడి దేవతలకు స్వీకారార్హమై భక్తుల కోరికలదీర్చు చుండును.

## దక్షిణా దేవి

సర్వవిధముల పూజలందుకొని దక్షిణాదేవియు గౌరవింపబడి భక్తుల ననుగ్రహించును. గోలోకమునను న్న కృష్ణునియెడ ప్రేమ భావము చూపుచు దక్షిణయను గోపసుందరి యెల్లపుడు కృష్ణుని దక్షిణభాగమున నుండగోరెడిదిది. రాధ కాచర్య అహితము గదోచి నీవు గోలోకమందుండ నర్హురాలవుకాదని విందింప, దక్షిణయు హరిని దలంచుచు దీర్ఘ తపమొనరించి మహాలక్ష్మిరూపమందు లీనమయ్యెను- దక్షిణ అదృశ్యమయిన కారణమున సురలు మునులును చేయు యజ్ఞ కార్యములకు ఫలితములు చేకూరక వ్యాకులముతోవారు శ్రీహరిని ప్రార్థించిరి పద్మాక్షుడు దయతో లక్ష్మీదేవి నుండి దక్షిణను రావింపగా ఆమె యజ్ఞపురుషునకు ఫలుడు అను పుత్రుని గని యిచ్చెను. యజ్ఞములందు పూజలందు తప్పక దక్షిణతోగూడిన అర్చనలే చేయవలెను. దక్షిణలొసగిన పూజలే ఫలుని ప్రభావమువలన సత్ఫలములనిచ్చును. ఆనాటినుండియు సురలు మునులేగాదు ప్రజలుగూడ ఏపూజలొనర్చినను దక్షిణ నొసగి ఆదేవి యనుగ్రహమునకు పాత్రులగుచున్నారు.

## షష్ఠి

ప్రకృతియొక్క షష్ఠ్యంశ షష్ఠీదేవి. బహు బలశాలి యయిన దేవసేనానికి దేవేరి. చిన్న బిడ్డలకు మృత్యుభయము లేకుండ రక్షించు దేవీ రూపము. పూర్వము ప్రియవ్రతుడను రాజు తనకు లేక లేక పుట్టిన శిశువు వికలాంగుడై మరణించుటకు జింతించి దేవిని దలచుచు ఆ బిడ్డను శ్మశానమునకు గొంపోవ అచట నాదేవి యొక స్త్రీ రూపమున గన్పించి 'ఓ రాజా నీభక్తికి మెచ్చితిని. నేను స్కందుని పతిని షష్ఠిని. నన్ను పూజింపుము నీ బిడ్డకే యాపదయు రాదనెను. ఆ రాజట్లే యథావిధి షష్ఠిని పూజింపగా అబిడ్డ పునర్జీవితుడై దీర్ఘాయుష్మంతుడై సువ్రతుడను మహారాజై కీర్తిగాంచెను. షష్ఠిని పూజించు ప్రజల బిడ్డలెట్టి అకాలమరణము ఉను. సంభవింపక సంపదలు గలిగి యుందురు.

## మంగళచండి

పూర్వము మంగళుడను నృపతి చండీదేవి నర్చించి సంపదల సర్వమును పొందెను. ఆనాటినుండియు ఈ దేవీరూపమునకు మంగళచండియను నామము ప్రసిద్ధమైనది-

ఈ దేవినే శివుడు పూజించి త్రిపురాసురులను వధింప గలిగెను. కుజుడు బృహస్పతి మున్నగువారెందరో ఈ శక్తి నర్చించి అభీష్టసిద్ధులనందిరి. ఈమెయే దుర్గ ఏమాత్రమును భేదములేదు. ఈ మంగళచండికాదేవికి మంగళవారమున జేయు పూజలతి ప్రియము. భక్తుల అభిమతముల నతిశీఘ్రముగ నెఱవేర్చు కరుణాహృదయ యీదేవి.

## దేవి పూజలకు పుణ్యదినములు-

దేవి పూజలకు ముఖ్యముగ కొన్ని పుణ్యదినములు కలవు. ఆ దినములందొనర్చిన పూజలు దేవికి చాల ప్రియము. జ్యేష్ఠశుద్ధ చతుర్దశి సావిత్రీ వ్రతమున కుత్తమము. భాద్రపద శుక్ల అష్టమి మహాలక్ష్మి వ్రతమున కుత్తమము- ప్రతి మంగళవారము మంగళ చండి పూజ ప్రతి నెల శుక్లపక్ష షష్ఠికి షష్ఠీదేవి పూజ, ఆషాఢ సంక్రమణమున మనసపూజ, ప్రతి దినము దుర్గకుపూజ శుక్లాష్టమినాడు రాధాదేవిపూజ ఉత్తమములు, జనులకు జయప్రదములు, శుభప్రదములు ఇహపరానర్గద ప్రదములునై యొప్పును-

## దేవీ భక్తులు

త్రిలోకైక మాతయు కరుణాంతరంగయునైన ఆ పరమేశ్వరి క్రూర రాక్షసగణమునుకూల్చి దేవతలను మునులను ఆపదలనుండి రక్షించిన గాథలు వింటిమి. దేవీసాహాయ్యమును శ్రీరామ శ్రీకృష్ణులే ప్రార్థించి పొందిరి. దేవీ మహత్త్వమును నారదుడు వ్యాసుడు శుకుడు మున్నగు మహర్షులెరిగి చరితార్థులైన కథలను చదివితిమి. దేవీ భాగవత శ్రవణమున ధన్యులైన పరీక్షిత్తు జనమేజయుడు మున్నగు మహారాజుల చరిత్రములను వింటిరి. వీరేకాదు సామాన్య ప్రజలును దేవీభక్తులై సకల సంపదల నందిన కథలున్నవి. వినుడని సూతుడు శౌనకాది మునులకు సత్యవ్రత సుదర్శనుల కథల నిట్లునుడివెను.

## సత్యవ్రతుడు

పూర్వమొకప్పుడు జమదగ్ని మున్నగు మునీంద్రులొక

చోటజేరి యే దేవతా పూజలభీష్టసిద్ధి శీఘ్రముగ నొసంగగలవను విషయమును చర్చించుచుండ, మునిలోమశుడు దేవీజపమునకు మించిన కార్యసాధకము మఱియొండు లేదని నుడువుచు సత్య వ్రతుని కథనుదాహరణముగ నిట్లుచెప్పెను.

పుత్రులకొరకై దేవదత్తుడను బ్రాహ్మణుడుగోబిలు నుద్గాతగా నియమించి ఒక యాగమొనరించు చుండెను. ఒక చోమంత్రో చ్చారణమందు గోబిలునకు స్వరభంగ మగుటచే దేవదత్తు డాతనిని నిందింపగా గోబిలుడాగ్రహించి నీకుదయించుపుత్రుడు మూర్ఖుడగు నని శపించెను. దేవదత్తుడు తన తొందరపాటునకు పశ్చాత్తాప మంది ప్రార్థింప, గోబిలుడు దయాహృదయుడై "చింతనొంద కుము దేవి దయవలన నీకొమరుడు ప్రాజ్ఞుడగునని" దేవదత్తునికి ధైర్యముజెప్పి యాగము ముగించి వెడలెను.

దేవదత్తునకా యాగఫలముగ నుదయించిన సుతుడు మహా మూర్ఖుడై తిరుగుచుండెను- ఆ బిడ్డకు వడుగుసేయ దేవదత్తుడు తలపెట్టెనుగాని ఒక్క యక్షరమైనను ఆబిడ్డనోట బట్టలేదు. తలి దండ్రులకుగూడ నిర్లాదారణ కలిగి యాతనిని వదలిరి. వదు నాలుగేండ్ల వాడయి ఆ కొమరు డేమి తోచినదో అరణ్యమునకు బోయి యచటి నదీజలములం దనుదినము స్నానము సేయుచు కందమూలములు వనఫలములు తిని దినములు గడపుచుండెను. అతడు సత్యమునే యెల్లపుడు పలుకుటచే సత్యవ్రతుడని యాత నిని అందఱు పిలుచుచుండిరి.

ఒకనాడతడు నదీతీరమున కూర్చునియుండ ఒక అడవి

పందినొక బోయ తరుముచు వచ్చెను. ఆ పంది ఒక విధమగు వింతధ్వని సేయుచు ప్రక్కనున్న పొదలలో దూరెను. ఆ బోయ వచ్చి పంది యెటుపోయినదని ఆ బాలునడిగెను. పక్కపొదలో నున్నదని చెప్పినచో ఆ జంతువు ప్రాణములు పోవును. ఆలోచించి సత్యవ్రతుడిట్లనెను. "మాటాడు నోరు చూడలేదు! చూడగల కనులు మాటాడవు; ఏమి చెప్పవలెయును" అనగా ఇతడెవడో పిచ్చివాడనుకొని బోయడు విసువెత్తి తనదారిని బోయెను.

ఆ వరాహమునుండి వచ్చిన ధ్వని ఐం క్లీం హ్రీంకార స్వరములు కలిగియుండెను. ఆ బాలునకా స్వరము మధురముగ దోచి దానినే విడువక జపించుచు ధ్యానము సేయుచుండెను. అదిదేవి మంత్రబీజాక్షర సమన్వితము: మహాపవిత్ర వాగ్బీజము. దేవి ఆ బాలుని జపమునకు సంతసిల్లి ప్రత్యక్షమై ప్రసన్న మృదుమధుర వాక్యములతో నాబాలుని పలుకరించినది. సత్యవ్రతు డద్భుతమంది ఆమెను జగన్మాతగా భావించి "తల్లీ నన్ను రక్షింపవచ్చిన మహాదేవివి నీవు. నిన్నెటుల ప్రార్థించి స్తుతింపవలయునో ఒక అక్షరమైనను ఎఱుగని అజ్ఞానిని. నాతలిదండ్రులే నన్ను నిరాదరింప నిచ్చటకు వచ్చితిని. నాయందు నీకు దయ యున్నచో నీకు దోచిన విధమున నన్ను కాపాడుము." అని ఆ జగదంబ పాదములపై బడెను. ఆ బాలుని అమాయకత్వమున కా జననికి మఱింత కరుణ జనించినది.

'సత్యవ్రతా లెమ్ము, నీసత్యమే నిన్ను కాపాడును. నీవు జపించుచున్నది నామంత్రము. దానిని విడువక నిత్యము దీక్షతో భక్తి శ్రద్ధలతో జపింపుము. నీవు శీఘ్రముగ మహాపండితుడవు·

కవియునై ప్రఖ్యాతినందెద"వని దీవించి అంబ అదృశ్య యయ్యెను.

అదేవీమంత్రమహిమచే సత్యవ్రతుడు మహాపండితుడు జ్ఞాని కవీంద్రుడై తిరిగివచ్చెను. తల్లి దండ్రులు మహాపండితుడైన తమ కుమారునిజూచి మిగుల సంతసించిరి. సత్యవ్రతుని కీర్తి నలుదిక్కులకు వ్యాపించెను. దేవీ మహిమ దేశమెల్లడల ప్రజ లందఱికి దెలిసినది.

## సు ద ర్శ ను డు

సుదర్శుడను రాజకుమారుడు దేవీభక్తుడై శత్రువులన్యాయముగ నపహరించిన తన రాజ్యసంపదను తిరిగిపొంది దేవీపూజా తత్పరుడై మహాకీర్తి నందెను. ఆతని చరిత్రమీకథ.

ధ్రువసంధి అయోధ్యకు రాజు. మిగుల సద్గుణుడు. ఆతనికి ప్రథమ భార్య మనోరమయందు సుదర్శనుడు, రెండవ భార్యయగు లీలావతియందు శత్రుజిత్తు అను కుమారు లిరువులు కలరు. వారు పెరిగి పెద్దవారైరి. సుదర్శనుడు విద్యావంతుడు సుగుణవంతుడు. ధ్రువసంధి మరణానంతరము ప్రజలు సుదర్శనుని రాజుగా జేయదలచుచుండిరి. సుదర్శునిపై నసూయతో శత్రుజిత్తు యొక్క మాతామహుడైన యుధాజిత్తు ఆకస్మికముగ ప్రబలసైన్య సమేతుడై వచ్చి, సుదర్శనుని మనోరమను వెడలగొట్టి, అయోధ్యా రాజ్యమును తన మనుమడు శత్రుజిత్తునకిచ్చి తానే అధికారము నందుండెను. అంతతో నూరకొనక మనోరమను కుమారునితో సహితము నిర్బంధము నందుంచుటకు యుధాజిత్తు చేయు

చుండిన దురాలోచన లెఱిగి, మనోరమ తనకు కలుగబోవు అవమానము భరించలేక తన కుమారుడు సుదర్శనుని తీసికొని మంత్రితోడను విశ్వసనీయులైన అనుచరులతోడను యెట్లో తప్పించుకొని అరణ్యముల వెంటబడి తుదకు భరద్వాజుడను ముని యాశ్రమమున తలదాచుకొనెను. వారి కథవిని భరద్వాజుడు జాలిగొని వారిని ఆదరించి కాపాడుచుండెను.

మనోరమా సుదర్శనుల నెట్లయిన పట్టుకొని కారాగారమున నుంచు ప్రయత్నములో యుధాజిత్తు సైన్యముతో భరద్వాజు నొద్దకువచ్చి దర్పముఁజూపి, "ఓమునీ నీవన్యాయముగ మనోరమను సుదర్శనుని బంధించి యుంచితివి, వీరిని వదెలెదవా లేదా"యని గద్దించెను. భరద్వాజు డా యుధాజిత్తు దుర్మార్గమునకు కినుకవహించి కనులెఱ్ఱజేసి చూచుచుండ, ఆముని యెచ్చట శపించునోయను భయమున యుధాజిత్తు నాతని మంత్రులు వెనుకకు దీసికొని పోయిరి. "మరల మీరీప్రాంతమునకు వచ్చుచో నిర్మూలమగుదు"రని భరద్వాజుడు నుడివిన పలుకులకు వెఱగంది శత్రుజిత్తు పరివారముతో అయోధ్యకు పరువెత్తెను.

## సుదర్శనునకు కామబీజ ప్రాప్తి :

భరద్వాజుని యాశ్రమమున ముని కుమారుడొకడు మనోరమ మంత్రికి 'క్లీబ' యను మంత్రమునుపదేశించుచుండ సుదర్శనుడు విని యాశబ్దమును 'క్లీం' అగునట్లు మార్చి నిరంతరము ధ్యాననిష్ఠతో జపించుచుండెను. అది దేవీ మంత్రము. సుదర్శనుని సుగుణసంపత్తికి మంత్రజపమునకును దేవి సంతసించి

ప్రత్యక్షమై సుదర్శను నాశీర్వదించి ఒక అశ్వమును మహాశక్తి మంతములగు ధనుర్బాణముల నొసగి, నీకవసరమగునప్పుడెల్ల నేను సాయమొనర్తునని చెప్పి యదృశ్యయయ్యెను. దేవీదయ కద్భుతాశ్చర్యములంది సుదర్శనుడు మనోరమయు దేవీ పూజలను జపమును నిరంతరము దీక్షతో సాగించుచుండిరి. ఒక నిషాదుడు సుదర్శనునకొక రథము కానుకగానిచ్చెను. సుదర్శనుని ప్రఖ్యాతి నలుదెసల వ్యాపించినది.

## శశికలా స్వయంవరము :

కాశిరాజు కూతురు శశికల సౌందర్యవతి. సద్గుణశీల. ఆమె పరిణయమునకు తండ్రి స్వయంవరమును చాటెను కాని, సుదర్శనుని సుగుణ సంపద వినిన శశికల సుదర్శనునేకాని మఱియొక్కని వివాహ మాడనని పట్టుదలతో నుండెను. "మహారాజకుమారులు, రాజ్యసంపన్నులు పెక్కుమంది నీ కరగ్రహణమున కాసించి వచ్చుచున్నారు. నీకి నిలువనీడలేని సుదర్శనుడేల"నని తల్లి దండ్రులు బంధుగులు వేయి విధములచెప్పి చూచిరి. శశికల వినలేదు. స్వయంవరమునకు రాజన్యులనేకు లరుదెంచిరి. శత్రుజిత్తును తోడ్కొని యుధాజిత్తుగూడ వచ్చెను. భరద్వాజముని దీవనలంది తల్లిని వెంటబెట్టుకొని, తనరథమునెక్కి ధనుర్బాణ సహితుడై సుదర్శనుడును వచ్చెను. తక్కిన కొందఱు రాజన్యులు సుదర్శనునిజూచి హేళనగా "నీవేల వచ్చితివి? నీకు రాజ్యమున్నదా, సైన్య పరివారమున్నదా, తినతిండిలేని వాడ"వని వెక్కిరించిరి. "ఈ సుదర్శను నందేదియో గొప్పశక్తి గోచరించుచున్న"దని కొంద రనుకొని మిన్నకుండిరి. సుదర్శనుడేమియు మాఱుపలుకక వినయముతో నుండెను.

కాశీ రాజేమియు తోచక ఒకరోజు రాత్రి తక్కిన రాజకులమునకు తెలియకుండ శశికలా సుదర్శనులకు వివాహము జరిపించెను. మఱునాడు స్వయంవరమున కరుదెంచిన రాజు లాగ్రహించి కాశిరాజుపై బడిరి; యుధాజిత్తు శత్రుజిత్తులు దారి కాచి మనోరమాశశికలలతోసహా సుదర్శనుని వధింపజూచు చుండిరి. కాశిరాజు భయముతో గడగడ లాడిపోయెను. సుదర్శనుడు భక్తిశ్రద్ధలతో దేవీ మంత్రజపమును గావించెను. దేవీపూజ సలిపెను. తల్లి చేతను భార్యచేతను దేవీపూజ చేయించెను. నత శిరస్కుడై దేవీపూజాప్రసాదము స్వీకరించి దేవినే మనసు నందుంచి ధనుర్బాణముల ధరించి రథముపై మనోరమా శశికలల నెక్కించుకొని ఆ రాజకుమారుడు బయలుదేరెను. సుదర్శనుడు రాజసౌధమునుండి బయలువెడలు సమయమునకే, ఆ జగదంబ భీకరాకృతి బూని సాయుధ హస్తయై కాశిరాజుపై దండెత్తిన రాజవంశీయు లెల్లరను కసిమసంగి చిందఱ వందఱ జేసెను. సుదర్శనుని చంపుటకై దారిగాచియున్న యుధాజిత్తు శత్రుజిత్తులను సైన్యసమేతముగా పరిమార్చెను-

కాశిరాజున కంతయు పరమాద్భుతముగ దోచి విభ్రాంతి మగ్నుడయ్యెను. సుదర్శనుడే కాశిరాజునకా లోకజనననినిగూర్చి బోధించెను. కాశిరాజు సుదర్శనుడు మనోరమ శశికల ఆ జగజ్జనినిని సంస్తుతించి ఆమె కాళ్ళబడి మ్రొక్కిరి. కాశిరాజు నెదిరించి చావగా మిగిలినవారు పశ్చాత్తాపులై దేవి దర్శనముఁబొంది "సుదర్శనుని వలనగదా మనకీభాగ్యము లభించిన"దని ప్రశంసించిరి. కాశిరాజు దేవి యనుమతిని ఒక సుందరాలయము దేవికై

కాశిలోకట్టించి దేవీపూజలు తాను జరిపి ప్రజలచేగూడ చేయించు చుండెను-

ACC NO - 1004

తల్లితో భార్యతో వెనుకకు విజయుడై యేతెంచి తనకు మ్రొక్కిన సుదర్శనునిజూచి భరద్వాజముని కడుసంతసించి ఆరాజకుమారుని దీవించి పంపెను. అయోధ్య పౌరులు మహోత్స వములతో మంగళ వాయిద్యములతో సుదర్శనునకు స్వాగత మిచ్చి తీసికొనిపోయి అయోధ్యా రాజ్యమునకు పట్టాభిషేక మొన రించిరి. తన రాజ్యమున దేవి ఆలయములను పెక్కింటిని నిర్మించి సుదర్శనుడు నిత్యము దేవి పూజలను చేయించుచు న్యాయ పరి పాలనము సాగించెను. సవతి తల్లియగు లీలావతినిగూడ తన తల్లి మనోరమతో సమానముగ భక్తితోజూచి సేవలొనరించి- సుదర్శనుడు దేవీభక్తుడైన ధర్మపరిపాలకుడుగ మహాకీర్తి నందెను

294.592 SUB

Oh - 20200

## సురథుడు

సురథుడను భూపాలుడొకడు పూర్వముండెను. మిగుల సద్గుణ వంతుడు. ధర్మమును న్యాయమును లక్ష్యములుగనెంచి పరిపాలనమును సేయుచుండువాడు. కొండజాతులవారు వేలా దిగ గుంపుగుంపులుగ వచ్చి సురథుని రాజ్యమంతయు కొల్లగొట్టి యాతని రాజధానిపై బడిరి. సురథుని మంత్రివర్గములో కొంద ఱును బంధుగులు కొందఱును దండెత్తివచ్చిన కొండజాతులనుండి ద్రవ్యమాశించి కుట్రపన్ని వారితోగలసి సురథుని పదభ్రష్టు నొనరించిరి. సురథుడు దిక్కులేక మహారణ్యములకుబోయి ఒక మహాముని ఆశ్రయముపొంది అచటనే దినములు గడుపుచుండెను.

ఆ మునియు నాతనికి ఆహారనియమములు, దైవ ప్రార్థన బోధించి తనతోపాటు కాలము గడపవలసినదని చెప్పెను.

కొన్ని దినములకాదారినే ఒక వైశ్యుడేగుచు సురథుని కలిసి కొని యచటనే యాగెను. తన కుమారులు తనకున్న యిల్లు ద్రవ్యము ఆస్తి లాగికొని యింటినుండి పొలద్రోలగా యేకాకియై వచ్చినవా డావైశ్యుడు. ఆ వైశ్యుడు సురథుడును దీనులై ఒకరి గోడు నొకరికి చెప్పుచుండుట ఆముని యాలకించి వారి నిర్వురిని ఆదరమున పిలిచి "ఏమిది మీరిచట ఉత్సాహముగ నుండుట మాని జరిగినదానికై విచారింతురు. మీజన్మమున నిక జరుగవల సిన దానికై యత్నింపుడు. కష్టసుఖములు వచ్చుచుండును. మనుజుడు మాయామోహములకు లోబడి కర్మము లొనరించును. ఆ కర్మలయొక్క ఫలితము లనుభవింపవలసినదే. ఈ కర్మాను భవము శ్రీరాముడు శ్రీకృష్ణుడు దేవేంద్రునివంటి వారికే తప్ప లేదు. ఇట్టి మాయాజాలమున పడకుండ నుండు మార్గము చూచు కొనవలెను. ఈ విశ్వమునకంతకు ఆధారము ఆశ్రయమైన శక్తి స్వరూపము దేవి యున్నది ఆమెయే జగదీశ్వరి. లోకైకమాత ఆమెను ప్రార్థింపుడు దేవీ నవాక్షర మంత్రమును జపింపుడు. సర్వసౌఖ్యములకు చిత్తోపశాంతికి సత్కర్మనిరతికి తుదకు మోక్ష పదమునకు మార్గమా దేవీ పూజయే. లోకశ్రేయముకొరకు ఆ పరాంబిక మహిషుడు శుంభనిశుంభులు మున్నగు రాక్షసుల జంపి నది. తన భక్తుల నెల్ల విధముల కాపాడగలిగిన కరుణామయి ఈ జగన్మాతయే.

ఈ విధముగ నుడివిన ముని వచనములను శ్రద్ధగవిని

సురథుడు వైశ్యుడును అనాటినుండియే, దేవీపూజ లారంభించిరి. ఎన్నినాళ్ళకును దేవిదయ కన్పడక పోవుటచే వారిరువురును సాహసమూని తమ శిరములను నఱికి హోమగుండమున కాహుతి నీయదలచుచున్నంతలో దేవి కరుణార్ద్ర వీక్షణలతో ప్రత్యక్షమయి "మీకీ సాహసము తొందరయేల నాభక్తుల నెల్లపుడును కాపాడుట నావిధి. మీకిక ముందేలోటును రాబో"దని దీవించి అదృశ్యయయ్యెను.

వైశ్యుడు తన గృహమునకు తిరిగి వెడలి బంధుమిత్రులందఱి గౌరవమర్యాదలనంది సకల సంపదలుకలిగి దేవీపూజ నిరంతరము చేసికొనుచుండెను.

దేవి దయవలన సురథున కాతని పూర్వ రాజ్యము లభించినది. తాను చేయుచు తన ప్రజలందఱిచే దేవీపూజ చేయించుచు చరితార్థుడయ్యెను. ఈ సురథుడే తన భావిజన్మమున సావర్ణి మనువై జగమేలిన మహాత్ముడు.

## బృహద్రథుడు

దేవిదయకు అంతమనునదిలేదు. తన భక్తుల నెన్నియో విధముల గాపాడుచుండును. దేవి అనుగ్రహము వలన సకలాభీష్ట సంపదలేగాక పూర్వజన్మజ్ఞానముకూడ కలుగుననుటకు బృహద్రథుని చరిత్రమే తార్కాణము. హిమవత్పర్వత ప్రాంతములందుండిన చక్రవాక పక్షియొకటి దశదిశలు తిరుగుచు కాశికానగరము చేరుసరికి ఆకలి దప్పులకు లోనయి అన్నపూర్ణాలయముజేరి అచట మిగిలి అటునిటుపడిన దేవీ పూజాప్రసాదము

తినుచు కాలముగడిపి కొన్నినాళ్ళకచటనే మరణించెను. మరణా నంతరము స్వర్గమున రెండు మన్వంతరములుండి ఆ చక్ర వాకము తరువాతి జన్మమునందొక మహీపతియై జన్మించి, బల శాలిగ ప్రజ్ఞావంతుడుగ ప్రఖ్యాతినంది తన పూర్వజన్మముల విషయము లెన్నో తెలియజేయుచుండినది. ఆనృపాలుడే బృహద్రథుడు.

ఈ రాజునకీప్రజ్ఞా విశేషము లెచ్చటనుండి యేకారణమున లభించినవాయని మహామునులే ఆశ్చర్యపడి ఆ రాజునుజేరి ప్రశ్నింపగా "ఇదియంతయు జగదంబ దయ ఆ తల్లిని గొలుచు సాధుచిత్తులకు సర్వవిద్యలు సర్వసంపద లలవడు"నని నుడివి యా మునీంద్రుల నర్చించి, వారికి తన పూర్వ చరిత్రల నన్ని టినిజెప్పి ఆ జగదీశ్వరి యెప్పుడెప్పుడు తన కష్టముల నివారించి కాపాడినదియును నుడివి పంపెను.

## సుకన్యా చ్యవనులు

సూర్యవంశపు మహీపతియగు ఇక్ష్వాకునరపతికి సోదరు డైన శర్యాతి పుత్రిక సుకన్య. చ్యవనుడను మహామునీంద్రుడు దేవీ భక్తుడై తదేకదీక్షతో తపమొనరించుచు ఆతనిపై పుట్టలు నిలువెత్తున లేచినదిగూడ యెఱుగకుండెను. శర్యాతి తన కుటుంబ ముతో నొకనాడా యడవికేగి యుండగా సుకన్య ఆటపాటల కటునిటుపోయి అచటనున్న పుట్టలో నేవియో మిలమిల మెఱయు చున్నవని ములుకోలతో పొడిచెను. ఆ పుట్టయందున్న చ్యవనుని నేత్రములా పోటులకు గుడ్డిపై పోయెను.

ఆ క్షణమునందే శర్యాతికేదో విపరీతమగు రోగబాధ కలిగి నది. చ్యవను డా ప్రాంతములందె యున్నట్లారాజెఱుగును. తన రాకవలన ఆమునికేదో యపచారము జరిగియుండునని రాజు భయముతో వటకేగుచుండగా మార్గమునందే సుకన్యయెదురై తానొనర్చిన చెడుపనిని తెలిపెను. శర్యాతి చ్యవనునిజేరి క్షమా వేడగా ఆముని అట్లే యని నీపుత్రిక సుకన్యను నాకిచ్చి వివాహము సేయు"మని యడిగెను. అయ్యో లేకలేక కలిగిన బిడ్డను గారా ముతో పెంచితిని అంధునకెట్లిడుటాయని శర్యాతి మనసులో క్రిందు మీదగుచుండ సుకన్య ధైర్యోత్సాహములతో ముందునకు వచ్చి "తండ్రీ చ్యవనుడు మహాభక్తుడైన మునీంద్రుడు. ఆ మహామునినే నేను సంతోషముతో పెండ్లాడెదను"అని నుడువ రాజట్లే యొనరించెను-

సుకన్యా చ్యవనునికి సర్వ పరిచర్య లొనరించుచు ఏ లోపము కలుగకుండ సేవచేయుచు మహాసాధ్వి యనిపించుకొనెను. చ్యవనునితో పాటామెయు దేవీమంత్ర జపము చేయుచుండెడిది. ఒకనాడు సుకన్య ఒంటరిగా నున్నపుడు సుందర రూపములకు ప్రసిద్ధిగనిన అశ్విని దేవత లిరువురు నచ్చటకువచ్చి సుకన్యవంక ప్రేమవిలాస వీక్షణములు జరవ నారంభించిరి. ఆమె వారి భావము నెఱిగి 'మీరు పూజ్యులు దేవ భిషక్కులు మీకిట్టి ప్రవర్తనకూడదు, నేను చ్యవన ఋషీంద్రుని పత్నిని మహాపతివ్రతను నా శాపము నకు మీరు పాలగుదురని గంభీర స్వరమున నుడివెను. అశ్వనీ దేవతలంత కొంత వినయము దెచ్చుకొని "అమ్మా నీ ప్రాతివ్రత్య మును పరీక్షించి నీ భర్తకు కనుచూపు నీయుటకు జగదంబ యా

దేశమున వచ్చితిమి నీ భర్తను వెంటనే మాకడకు తీసికొనిరమ్ము"
అనిరి.

జరిగిన విషయము సర్వము నుడివి సుకన్య తన భర్తను తీసుకొని వచ్చెను- ఆ దేవతలు చ్యవనునితో గలిసి అటనున్న కొలనులో స్నాన మాడగనే ఈ షణ్మాత్రమైనను భేదములేక ఆ ముగ్వురును సమాన రూపములతో ఎదుటనుండిరి. "ఈ ముగ్వురిలో నీభర్త యెవరో తెలిసికొను"మని ఒకవాణి విన్పడగా సుకన్య విహ్వల చిత్తయై తనపతి నెట్లు గుర్తించుటో తెలియక కొంత తడవునకు తన యిష్టదైవమైన జగదంబ నిట్లు స్తుతించెను-

"తల్లీ, జగదీశ్వరీ, విశ్వకుటుంబినీ, మాంగళ్య ప్రదాయినీ నీ దాసురాలను. నిన్నెదనమ్మి అంధుడైనను చ్యవనుని పతిగా స్వీకరించి జీవితము గడుపుచుంటిని. నీదయలేనిచో నాకీ పరీక్ష తీరదు, నేనేమి చేయవలెనో నీ భక్తుడైన చ్యవనుని నాపతిగా నెట్లు పొందుటో నీవే నిర్ణయింపుము"అని కనులు మూసుకొని దేవీ ధ్యానమునందు మునిగెను. సుకన్యకు దేవి దయవలన హృదయమున జ్ఞాన భాసురస్ఫూర్తి కలిగినది. బాహ్యరూపము లెట్లున్నను తనపతి యాకృతి కనులకు స్పష్టముగ గోచరించి సుకన్య పతి పాదములంటినది. అశ్వినీ దేవతలు సంతృప్తులై చ్యవనుని సంపూర్ణ నేత్ర దృష్టిగల సుందర విగ్రహునిగజేసి" మునీంద్రా నీవు భగత్సమానుడవు నీపత్ని మహా పతివ్రత. మాకింత వరకు ఇతర దేవతలతో సమముగ క్రతుసోమపానార్హతలేదు. దానిని కలిగింపగలవను ఆసతో వచ్చితిమి, మమ్ము కరుణింపుము"అని వేడగా చ్యవనుడంగీకరించి మామగారైన శర్యాతి నృపతిచే నొక

మహాక్రతువు జేయించి, ఇంద్రుని ఒప్పించి అశ్వనీ దేవతల కా క్రతుసోమపానార్హత కల్గించెను.

అశ్వని దేవతలు సంతుష్టులై వెడలిరి. చ్యవనుడు సుందరాకారుడగుటకు శర్యాతి కడు సంతసించెను. సుకన్యా చ్యవనుల వలన దేవీ మహిమయు దేశమునందెల్లెడల దెలిసి దేవీ పూజలు వర్ధిల్లెను.

మునులారా యింతవరకు వ్యాసమహర్షి రచితమగు దేవీ భాగవతమునుండి దేవీప్రభావము, దేవీమహిమ. మాయాజాలమునబడి యెంతఘనులైనను వారివారి కర్మానుభవమునకు లోనగుట, దుష్టరాక్షసకథ. దేవి అవతారములు, దేవీ భక్తులగు వారికి లభించిన దేవి అనుగ్రహ భాగ్యము, దేవీ పూజా విధానము వింటిరి. దేవీగాథలనిట్లు భక్తి శ్రద్ధలతో నాలకించుచున్న ధన్యులు మీరు.

ఆ జగజ్జనని కరుణామయి తనభక్తుల నెప్పుడేవిధమునజూచి కాపాడవలెనో అట్లుచూచి, వారి యభీష్టముల నెఱవేర్చు వాత్సల్యరాశి. విద్యల నభిలషించువారు, సంపదలను కోరువారు, ఆపదల నుండి బయల్పడ గోరువారు, మాయాజాల దుష్కర్మములను తప్పించుకొన దలచువారు, భవముక్తి పదము జేరగోరువారు సర్వజనులకు ఆమె ఆశ్రయమే శరణ్యము. ఆ జగదీశ్వరి మహిమ నెంత జెప్పినను తీరదు. లోకకళ్యాణము సాధుజన సంరక్షయము ధర్మసంస్థాపనము ఆ పరమాత్మిక సగుణసాకారముతోనైనను నిరాకార తేజః ప్రభావమున నైనను నిర్వహించు కార్యములు.

దేవీ భాగవతమునుండి మీరు వినవలసిన ప్రధాన విషయములింకను ఎన్నోయున్నవి వినుడని సూతపౌరాణికుడు తన ప్రవచనము మరల సాగించెను.

## స్కంధము - 6

### సృష్టిక్రమము

శ్రీ సూతుడు శౌనకాది మునులకు తన ప్రవచనము నిట్లుచేసెను,

దేవి విశ్వమయి విశ్వరూపిణి, విశాత్మిక మనకు దృగ్గోచర మగు పంచభూతాత్మకము పంచభూతావృతము అయిన ఈ బ్రహ్మాండమంతయు, సూర్య చంద్రాది గ్రహసంచయము, చుక్కలు, సాగరములు. భూమి, నదీశైలకాననములు, సర్వము ఆమె తేజోరూపములే. బ్రహ్మాండోత్పత్తి ని తొల్దొల్తనే వివరించితిని. మానవ నివాసమగు భూమండల మెట్లేర్పడినది? ప్రాణికోటి సృష్టిక్రమమెట్టిది? భూమండలమునకు పైన క్రింద యేయే లోకము లెట్లున్నవి. ఈవిషయముల నాలకింపుడు.

శ్రీమన్నారాయణుని నాభిపద్మమునుండి జనించిన బ్రహ్మ, దేవి యానతిని, సృష్టియత్న మారంభించెను. తొల్దొల్త మరీచి వసిష్ఠుడు అత్రి అంగిరసుడు పులహుడు క్రతువు పులస్త్యుడను మునులను తన మానసపుత్రులుగ బ్రహ్మ ఉదయింపజేసెను. మహిత తేజముతో బ్రహ్మఫాలమునుండి రుద్రుడావిర్భవించెను- తరువాత బ్రహ్మ తొడనుండి నారదుడు, కుడి అంగుష్ఠమునుండి దక్షుడు, ఎడమ అంగుటమునుండి సనకాది ఋషులు యుద్భ వించిరి పిదప వీరిణి యను నామెయు బ్రహ్మనుండి ఉద్భవించి దక్షునివలన పెక్కుమంది సుతులనుగనెను. ఆ పుత్రులు విరాగు లయి దూరముననేగ, ప్రజావృద్ధికై దక్షుడరువది పుత్రికలగని వారిలో కశ్యపునకు పదమూగ్గురిని పదుగురను ధర్మునకు, ఇరువది

యేడ్గురిని సోమునకు, ఇరువురిని భృగునకు, నలువుర నరిష్టనేమికి ఇరువురను కృశాశ్వునకు, ఇరువుర నంగిరసునకు ఇచ్చి వివాహ మొనరించెను. కశ్యపముని వలననే పశువులు పక్షులు మానవులు ఉరగ కిన్నర యక్షులుదయించిరి. బ్రహ్మ మానసపుత్రుడగు మరీచికి కర్దముని పుత్రికయగు కళయందు బుట్టినవాడు కశ్యప ప్రజావతి కశ్యపుని కారణముగ జరిగినదిగాన సృష్టికి కాశ్యపి యను పేరు వచ్చినది. కశ్యపునకు అదితి, దితి భార్యలైరి. అదితి దేవతలను, దితి దైత్యులను కనెను.

## వసుధోద్ధరణము

ఆసించినంతగ ప్రజావృద్ధి కాకపోవుటతో బ్రహ్మ స్వాయంభువు సృజించి శతరూపయను స్త్రీనిగూడ సృజించి వారికి వివాహమొనర్చెను. మనువులలో మొదటివాడు స్వాయంభువు. బ్రహ్మ యుపదేశానుసారము స్వాయంభువు మున్ముందు జగదీశ్వ రిని ధ్యానమందుంచి "ఓదేవీ నీవు విశ్వకారిణివి. నీ యనుగ్రహము లేనిదే యెవరును ఏమియు చేయజాలరు. ప్రజావృద్ధికార్యము నా బుజములపై బడినది? ఏమియు నెఱుగనివాడను. నీ కరుణకై వేచియుంటి"నని వేడగా పరమేశ్వరి ప్రత్యక్షమై యాతని యభీష్టముల నిచ్చి యదృశ్య యయ్యెను.

## శ్వేతవరహావతారము

ప్రజావృద్ధికి తగిన ప్రదేశ మెచ్చటనున్నదని స్వాయం భువు బ్రహ్మనుజేరి ప్రశ్నింప, ఆ బ్రహ్మ యాతనచుట్టునున్న ప్రదేశమంతయు జలమయమగుటజూచి, ఆ విషయముగూర్చి

దీర్ఘాలోచన సేయుచుండ ఆబ్రహ్మ నాసికాగ్రమునుండి అంగుష్ఠ ప్రమాణముగల యొక కిటి జనించి త్రుటిమాత్రమున భీకర కరాళ దంష్ట్రలతో పర్వతాకారము నూని, నలుప్రక్కలనున్న జలార్ణవము సంక్షుబ్ధమై ఆకాశమునుగప్పు నట్లానీరమునందు దూకి ఆ జలగర్భముననున్న భూగోళమును పైకి నెత్తెను. ఇంతలో తనకవరోధముగ మహాభీకరుడైన హిరణ్యాక్షుడను దైత్యు డొక భయంకరమగు పెనుగదబూని నిలువగా వాని నా వరాహము తన కాళ్ళతోతన్ని పడగొట్టి వాడియైన గిట్టలతో చీల్చి వధించి, తనముట్టెతో భూగోళమునెత్తి జలముపై నిలిపెను. శ్రీమన్నారాయ ణుని యవతారమైవచ్చి భూగోళమును పైకెత్తిన యా వరాహ మును బ్రహ్మేంద్రాది సురలెల్లరును వచ్చి సంస్తుతించిరి- వసుధోద్ధరణమగు నీ కథను చదివిన వినిన వసుధావాసులకు వసుభాగ్యసంపదలు సమృద్ధిగ లభించును.

### మనువుల పాలనము - సప్తద్వీపములు

స్వాయంభువుడు మొదటి మనువు. ఈయన వంశమే వసుధయందు నలుదిశలను వర్ధిల్లినది- ఈమనువు కుమారులు ప్రియవ్రతుడు ఉత్తానపాదుడు. ఈయన పుత్రికలు అకూతికి ఋచివలన యజ్ఞుడు దేవహూతికి కర్దముని వలన కపిలుడు: ప్రసూతికి దక్షునివలన పెక్కుమంది పుత్రికలు గలిగిరి. కపిలుడు నారాయణుని యవతారమే. పరమాత్మ తత్త్వమగు సాంఖ్య శాస్త్ర మును తన తల్లియగు దేవహూతికి బోధించిన ఘనుడు-

ప్రియవ్రతుడు తన రాజ్యకాలమునం దేడుదినములు సూర్యదర్శనము లేకపోవుటచే కాంతిమంతమైన తన రథము నేడు మార్లు భూమిచుట్టును త్రిప్పగా అరథ మార్గములు సప్తసాగర

ములుగ నేర్పడి భూమండలమును సప్తద్వీపములుగ జేసినవి. లవణ ఇక్షు సురఘృత దధిక్షీర జల సముద్రములివి యేడు. వీని మధ్య జంబూప్లక్ష శాల్మలి కుశక్రౌంచ శాక పుష్కర ద్వీపములేడు. ప్రియవ్రతుడు తన పుత్రులకీ ద్వీపముల నొక్కొకటి యొక్కొకని కిచ్చి తాను తపమునకేగెను.

## జంబూద్వీపము

ఈ ద్వీపములన్నియు నదీనదములతో మహాపర్వతములతో శాద్వల కేదారములతో కానన సరోవరములతో సకల ప్రకృతి సంపదలతో విరాజిల్లుచుండును. ఈ యేడు ద్వీపములలో ముఖ్యమైనది జంబూద్వీపము. ఈద్వీపము మరల వేర్వేరు వర్షము (దేశము)లుగ విభజింపబడినది. అవి భరత కురు ఇళ హిరణ్మయ రమ్యక హరికింపురుష కేతుమాల భద్రవర్షములు మనము నివసించునది భరతవర్షము- ఈవర్షములందచ్చటచ్చట, ఒక్కొకచో ఎల్లలుగ నేర్పడి, నీల శ్వేత శృంగ నిషధ హేమకూట గంధమాదన మాల్యవంతములను మహాపర్వతములును మహేంద్ర మలయ సహ్య శుక్తి వింధ్య పారియాత్ర గంధమాదనములను కుల పర్వతములున్నవి. ఈ పర్వతములనుండి సహస్రాధికముగ పెక్కు పుణ్యనదు లుద్భవించి భూమిని పవిత్రము, సస్యసమృద్ధము చేయుచున్నవి.

కనకమయమగు మేరు పర్వతము వేఱుగనున్నది. ఇది దేవతలకు నివాసము దీనిచుట్టును సూర్యుడు తిరుగుచు బ్రహ్మాండమునందు సర్వప్రాంతములకు కాంతులు ప్రసరించును. మేరు పర్వతపాదమున మేరు మందరము మున్నగు పర్వతశ్రేణికలదు

## లో కా లో క ప ర్వ త ము

మేరువునుండి మానసోత్తరగిరి వరకు లోకములకంత రాళమైయున్నది. శ్రీహరి, బ్రహ్మ స్వరూపునిగ ఇచట పూజింప బడును. సూర్యుడుండు స్థలమిదియే. దీని నాల్గుదెసలను మూల అను ఐరావతము, పుండరీకము, వామనము, కుముదము, అంజ నము పుష్పదంతము సార్వభౌమము సుప్రతీకము అను నెన్మిది దిగ్గజములు లోకభరము మోయుచుండును.

## ఊ ర్ధ్వ లో క ము లు

భూమికిపైన యక్ష గంధర్వ కిన్నర కింపురుషాది దేవత లుండు ప్రదేశము స్వర్గము. మేరువున దిక్పాలుర స్థానములు ఆపైన క్రమముగ గ్రహ తారకలు శింశుమారచక్రము సప్తర్షి మండలము ధ్రువలోకములున్నవి. ఇవియన్నియు దైవనివాస ములు ఆపైన సత్యలోకము. కైలాసము వైకుంఠము వరుసగ బ్రహ్మ శివ విష్ణుమూర్తుల నివాసములున్నవి. వీనికిపైన గోలో కము రాధా కృష్ణుల నివాసము కలదు. అన్నిటికి మిన్నయై అన్నిటికిని ఆవల విశ్వాధారమగు దేవీ నివాసము మణిద్వీప మున్నది-

మణిద్వీపమునుగూర్చి మీరు ప్రప్రథమమునందే వినిరి.

శింశుమార చక్రమునుగూర్చి రెండు మాటలు వినుడు గ్రహ నక్షత్రములకును మేషాదిరాసులకును ఇది స్థానము. ప్రత్యే కముగ యోగకర్మములకై ఆదిదేవుడు దీని నుద్దేశించెను. ఇది

ఆదినారాయణుని రూపము. "ఓమ్ నమోజ్యోతిర్లోకాలయా"అను ఆదిత్యరూపుని మంత్రము సర్వదుఃఖ నాశకము, శుభకరము. సప్తర్షులు ధాత్ర ధ్రువుడు దిక్పాలురు కశ్యపుడు ఇచ్చట నుందురు. ఈ స్థలమునందుండియే రాహు సప్పుడప్పుడు రవిని పట్టుకొనిన సమయమున హరి తన చక్రమునంపి ఆబాధలుడుపును-

## అ ధో లో క ము లు

ఇట్టే భూమికి దిగువ అతల వితల సుతల రసాతల తలాతల మహాతల పాతాళములను అధోలోకములు గలవు పితృస్థానములును గలవు. ఇవికూడ సర్వసంపదలతో సౌఖ్యములతో సంపదలతో విరాజిల్లు లోకములు. బలుడు బలి మయుడు కాలకేయులు పన్నగులు దైత్యులును వసించు ప్రదేశము లివియే.

## నరకలోకము

ఇవి యిరువది యొకటని కొందఱు, ఇరువదెన్మిది అని కొందఱును నుడువుదురు. జీవులు వారివారి పాపకర్మానుభవ శిక్షల ననుభవించు స్థానములివి. సర్వసముడైన యముడు భగవదాజ్ఞానుసారమున పాపులకీ నరక శిక్షల నిర్ణయించును. పాపవర్తను లందఱీ నరక శిక్షలకు గురి కావలసినదే.

మానవులు పాపములుడిగి నరక బాధలులేని పుణ్యలోక ప్రాప్తినందుట కొకటే సరియైన మార్గము. అదియే జగదీశ్వరీ పూజ. దేవి కృపకు పాత్రులైన భక్తులెల్లరు ఇహపర సౌఖ్యముల నొంది తుదకామె సదసన్నిధి జేరుట తథ్యము-

## జంబూద్వీప వైభవము

సప్త ద్వీపములందిది ప్రధానమైనది. భరతాది వర్షములిందు తొమ్మిది గలవు. మహాపర్వతములు కులగిరులు వెలయుచున్న ద్వీపమిది. మేరుగిరి తన చుట్టును ఇక్షు మధుక్షీర నీర సరోవరములు వైభ్రాజ సర్వభద్ర చైత్రరథోద్యానములు, స్వచ్ఛ నదీవాహములు, సుందరశైల సానువులు గలిగి అమర వాసముల కనుకూలమైయుండును.

ఈ ద్వీపమందు పెక్కుచోట్ల దేవి వేర్వేరు నామములతో సన్నిధిచేసి భక్తుల కభీష్ట సిద్ధుల నొసగుచున్నది- ఈ జగజ్జనని నామములు అరుణోదనదియొద్ద అరుణ, జంబూస్రవంతివద్ద జాంబూనదేశ్వరి, కుముదాద్రి కడనున్న అశ్వత్థ వృక్ష పరిసరమ్ముల మీనాక్షి సుపార్శ్వాద్రి కడనున్న పంచధారలవద్ద ధారేశ్వరి, యజ్ఞాడనుపేర బరగు హరికాలి బొటనవ్రేలి తాకిడికి బ్రహ్మాండ శీర్షము చిల్లుపడి ఆకాశగంగ విష్ణుపాద ప్రదేశమున జన్మించి సీత, చక్షువు అలకనంద, భద్ర, యను నాల్గు పాయలుగ భరతభూమికిదిగి ఉత్తరకురు వర్షముగడచి వారిధింజేరుచున్నది.

## భరతవర్షము

జంబూద్వీపమునగల తొమ్మిది వర్షములందును ఆదిదేవుడైన హరి పూజలనందుచుండును. ఇళా వర్షమునందు సంకర్షణుడై శంకరునిచేతను, హరివర్షమున నరసింహుడై ప్రహ్లాదునిచేతను, రమ్యకమున మత్స్యమై మనువుచేతను భద్రాశ్వ

మున వలయిత గ్రీవుడై భద్రశ్రవాదులచేతను, కేతుమాలను స్మరాకృతిని లక్ష్మిచే, హిరణ్మయవర్షమున కూర్మమై సూర్యునిచేతను, కురువర్షమున వరాహమై ధరచేతను, కింపురుష వర్షమున శ్రీరాముడై హనుమంతునిచేతను శ్రీహరి పూజలందుకొనుచు భరతవర్షమునం దా నారాయణుడు నారదునిచే కీర్తింపబడుచుండును-

వింధ్య సహ్యహిమ శ్రీశైల వేంకటాచలాది పవిత్రగిరులు, గౌతమి గంగా యమునా కృష్ణా కావేరి మున్నగు పుణ్యనదులు, కాశి గయ ప్రయాగ హరిద్వారము శ్రీశైల తిరుపతి దక్షారామాది పుణ్యక్షేత్రములతో సస్యకేదార సమృద్ధమై భరతవర్షము ప్రధానముగ వైదిక కర్మభూమియై దేవీపూజలకు నిలయమై అసంఖ్యాకములగు దేవీ మందిరముల కాస్థానమై యలరుచున్నది-

జంబూద్వీపమువలె తక్కిన ప్లక్ష శాల్మలి కుశ క్రౌంచ శాక పుష్కరములను ఆరు ద్వీపములను సకల సంపదలతో వర్ధిల్లుచు దేవదేవుని పూజలతో అలరుచున్నవి-

## గ్రహసంచారములు

నక్షత్రము లంబరమున చలనములేని సుస్థిర తేజోరూపములై అత్యున్నతస్థానము నందున్నవి. మనకు దూరదూరములందుండి మినుకు మినుకుమనుచు గన్పించు ఒక్కొక్కచుక్క మన భూగోళముకన్న వేలు లక్షలాది రెట్లు పరిమాణమున పెద్దవి- గ్రహమండలమునకు సూర్యుడు కేంద్రస్థానము. సూర్యునుండి ప్రసారమయిన కాంతికిరణములు భూమిని జేరుటకు కొన్ని వేలేండ్లు పట్టును.

వాటికి వేర్వేరుగనున్న ఒకేకక్ష్యయందు బడి శశి శుక్ర రాహు గురు శని బుధ కేతు గ్రహములు భూమియు సూర్యుని చుట్టు తిరుగుచుండును. సూర్యున కుదయాస్తమయములులేవు. భూమి ఒక దినములో తనచుట్టును తాను తిరిగి సూర్యునిచుట్టు తిరుగుచుండుటచే సూర్యునికాంతి పడని కాలము చీకటిగా నుండును. ఏ దినగా రాత్రి యయిన తర్వాత సూర్యబింబము కన్పడునో అది తూర్పు. ఒక పవలు ఒక రాత్రి కలసి అరువది గడియల కాల ప్రమాణము- ఒక దినము. ఏడు దినములు వారము రెండు వారములు పక్షము, రెండు పక్షములు మాసము రెండు మాసములులొక ఋతువు, ఆరు మాసములొక అయనము, రెండు అయనములు సంవత్సరముగా ఏర్పడి కాలము అనంతముగా జరుగుచున్నది. సూర్య చంద్రాది గ్రహముల గమన సమయ మాధారముగ నియమితమైనదే కాలప్రమాణము. గ్రహసంచారము యొక్కయు పంచ భూతముల యొక్కయు ప్రభావమున ప్రకృతి సిద్ధమైన శీతవర్షాతపములు, వానిననుసరించి వృక్ష పరిస్థితులు ఒక వత్సరము పూర్తి కాగానే మరల ఆ పరిస్థితులు ఋతువులే వచ్చు చుండును. మాసమునందుగల రెండు పక్షములలో శుక్ల పక్షమున పాడ్యమినుండి చంద్రుని కలలు క్రమముగ వృద్ధియయి పౌర్ణమి నాడు నిండు చంద్రుడు ప్రకాశించును. వెంటనే ఆరంభమైన కృష్ణపక్షమున మరల పాడ్యమినుండి ఒక్కొక్కకళ తగ్గి అమావాస్యనాటికి అంతయు చీకటి. మరల పౌనః పున్యముగా సూర్య ప్రకాశమువలన తన కళలను వృద్ధిచేసికొనుచు చంద్ర గమనమిట్లే సాగును. చంద్రుడు తరునస్యౌషధ రక్షకుడు భూత హితుడు. సూర్యునికాంతి ఉష్ణము వర్షకారకము ప్రాణికోటికి

జీవనాధారము- భూమి సూర్యుల కడ్డుగ చంద్రుడుండి సూర్యుని కొంత భాగముగాని పూర్తిగగాని కనుపడనియపుడు సూర్య గ్రహణము. అట్లే, చంద్ర సూర్యులకు భూమి అడ్డుగనుండి చంద్రునిపై భూమినీడ పడిన భాగము చంద్రగ్రహణము-

కాలచక్రము మేష వృషభ మిథున కర్కాటక సింహ కన్య తుల వృశ్చిక మకర కుంభ మీనములను పండ్రెండు రాసులుగ విభజింపబడినది. ఒక మాసమున ఇరువదియేడు నక్షత్రములు గడచును. సూర్యాది గ్రహములు తొమ్మిదియు వేర్వేఱు రాసులలో వాని నియమిత కాలముండి ఒక రాశినుండి మఱియొక రాశికి వరుసగ పోవుచుండును. గ్రహముల స్థితి కలయికలను బట్టి భూమిపైనను ప్రజలపైనను విశేష ప్రభావము కలదు. ఈ ప్రభావ విషరముల తెలుపునిది జ్యోతి శ్శాస్త్రము- రవి మకర రాశిని జేరిన సమయము మకర సంక్రమణము. ఆ దినమునుండి ఆరు నెలలు ఉత్తరాయణము మొదలు. రవి కర్కాటకమున జేరిన దినము నుండియు ఆరునెలలు దక్షిణాయనము జరిగి రవి మరల మకరమునకు వచ్చును-

దేవ మనుష్య కాలమానములు

2 అయనములు - 1 మనుష్య సంవత్సరము దేవతల కొకదినము

1 సంవత్సరము - సూర్యునిముందు భూభ్రమణము 12 రాసులలో పూర్తియగు కాలము-

యుగములు 4

మానవ వత్సరములు -

1728000 - కృతయుగము. ధర్మము 4 పాదముల నడచును.

1296000 - త్రేతాయుగము. ధర్మము 3 పాదములు నడచును

864000 - ద్వాపర యుగము ధర్మము 2 పాదముల నడచును

432000 - కలియుగము ధర్మమునకు 1 పాదము

4320000 - ఒక మహాయుగము

1000 - మహాయుగములు కల్పము - బ్రహ్మకు ఒక దినము సృష్టిసమయము

1000 - మహాయుగములు బ్రహ్మకు రాత్రి. ప్రళయ సమయము.

బ్రహ్మ కల్పము - 14 మన్వంతరములు.
బ్రహ్మ నూరు వత్సరములు - పరమాయువు.
పరమాయువు రెండు పరార్ధములు.

శ్రీహరికొక తెప్పపాటు

ప్రస్తుతము శ్వేతవరాహకల్ప, వైవస్వత మన్వంతర కలియుగ ప్రథమ పాదమున 5068 వ వత్సరము.

ప్రజావృద్ధి : సూర్య చంద్ర రాజవంశములు

స్వాయంభువ మనువు శత రూపల వలన పృథ్విపై ప్రజావృద్ధి జరిగినది. గుణకర్మ విభాగములనుబట్టి ప్రజలు

నాలుగు ముఖ్య వర్ణములుగ విభజింప బడిరి. సమాజ క్షేమము నారము ప్రజలకు వర్ణాశ్రమ ధర్మములు చక్కగా సాగుటకు పరిపాలకు లుదయించిరి.

ఈ రాజవంశములలో సూర్య చంద్ర వంశములు ప్రధానములు. అమర ముఖ్యుడైన సూర్యునకు వైవస్వత మనువు కుమారుడు. ఆయన పుత్రుడు ఇక్ష్వాకు. తరువాత ఈ సూర్య వంశము బహు ప్రఖ్యాతి గలిగిన భూపాలురతో విస్తరించినది. ఇందు ఇక్ష్వాకు కకుత్స్థుడు మాంధాత హరిశ్చంద్రుడు సగరుడు భగీరథుడు (గంగను భూమికి తెచ్చినవాడు) దిలీపుడు రఘువు అజుడు దశరథుడు శ్రీరాముడు (విష్ణవతారుడు) కుశలవాదులు ముఖ్యులు.

ఇట్లే చంద్ర వంశమునందు చంద్రని తరువాత పూరు భరతుడు కురు పాండురాజు అతని పుత్రులు ధర్మజాదులు ముఖ్యులు.

## మన్వంతరములు

బ్రహ్మ పుత్రుడైన స్వాయంభువ మనువుతో పృథివీ పాలనము అరంభమైనది తరువాత పదమువ్వురు మనువులు వచ్చిరి. వీరందఱును దేవీ భక్తులై ప్రజల వర్ణాశ్రమ ధర్మముల గాపాడిన మహనీయులు.

స్వాయంభువ మనువు : మేరువును తలదన్ను ఉన్నతిని గోరి విజృంభించిన వింధ్యగిరి అగస్త్యుని ప్రభావము వలన వినమ్ర శిరస్కుడై యుండెను. ఈ వింధ్యగిరి వాసిని యైన దేవిని స్వాయంభుడర్చించి చరితార్థుడయ్యెను.

ఉత్తానపాదుడు : స్వాయంభువ మనుపుత్రుడితడే స్వారోచిష మనువు. యమునాతీరమున దేవినిగూర్చి తపమొనర్చి దివినలంకరించెను.

ఉత్తముడు : స్వాయంభువుని పుత్రుడైన ప్రియవ్రతునికి తనయుడు. గంగాతీరమున దేవి నర్చించెను.

తామసుడు : ఉత్తముని సోదరుడు నర్మదానదికడ నవరాత్ర పూజలొనరించెను.

రైవతుడు : అయిదవ మనువు దేవీ జపా[illegible]రుడు.

చాక్షుషుడు : బ్రహ్మర్షియగు పులహుని శిష్యుడు విమలా నదీతీరమున నిరంతర దేవీమంత్ర జప [illegible]డు.

వైవస్వతుడు : శ్రాద్ధదేవుడు మహాభక్తుడు. మరల ఈ మన్వంతరమే ప్రస్తుతము సాగుచున్నది.

సావర్ణి : పూర్వజన్మమున దేవీకృప నందిన సురథుడు.

వైవస్వతుని పుత్రులాధ్వరు కరూష పృషద్ర నాభాగ శర్యాతి ధృష్ట త్రిశంకు లనువారు, వరుసగా దక్షసావర్ణి మేరుసావర్ణి సూర్యసావర్ణి చంద్రసావర్ణి రుద్రసావర్ణి విష్ణుసావర్ణి నామములతో మనువులై జగత్పాలన సాగించిరి.

## త్రిశంకుడు (సత్యవ్రతుడు) రాజనీతి

సూర్య వంశోద్భవులయిన కొందరు రాజుల పేరులు వింటిరిగదా. వారిలో సత్యవ్రతుడు, హరిశ్చంద్రుడను వారును దేవీ భక్తులై ప్రఖ్యాతి గనిరి. అరుణుడను నృపతికి సత్యవ్రతు

డను సుతుడు కలడు. సత్యవ్రతుడు అవగుణుడయి తిరుగుచు ఒక విప్రుని పుత్రిక నపహరించుటచే తండ్రిచే ఇంటినుండి వెడల గొట్టబడెను. కొంత బుద్ధి తెచ్చుకొని సత్యవ్రతు డరణ్యములందు తిరుగుచుండెను. ఆ సమయముననే విశ్వామిత్రుడా యడవులలో తన భార్యా సుతులను విడచి దూరపుటడవులకు తపస్సున కేగెను. ఆముని భార్య దినవెచ్చము గడవక సుతునిగూడ విక్రయింప బోవు దుస్థితిజూచి సత్యవ్రతుడు జాలిగొని ఆ కుటుంబమున కెట్లో ప్రతి దినము ఆహారము తెచ్చిపెట్టుచుండువాడు. ఒక దిన మేమియు లభించక రహస్యముగ తనయూరికేగి గురువగు వసిష్ఠుని ఆవునుజంపి యా మాంసమును దెచ్చెను. వసిష్ఠునికిది తెలిసి, సత్యవ్రతుడు చేసిన "తండ్రికి అవమానము గూర్చుట' విప్రకన్య నపహరించుట, గోవధ"యను మూడపరాధముల హేతువుగ "నీవు త్రిశంకుడవయి చండాల రూపమున తిరుగుదు"వని సత్యవ్రతుని శపించెను.

త్రిశంకుడట్లు చండాలుడై తిరుగుచు, వినయశీలుడై, ఒక ముని యుపదేశమున దేవీ భక్తుడై దేవీ నవాక్షర జపమును నిరతము దీక్షతో జేయుచుండ దేవి ప్రత్యక్షమై అనుగ్రహించి అతని చండాల రూపమును పోగొట్టెను. ఇంటికట్లు గుణవంతుడై చేరిన సత్యవ్రతునిజూచి తండ్రి అరుణుడు, గురువు వసిష్ఠుడును కడు సంతసించిరి-

### రా జ నీ తి

అరుణుడాదరమున సత్యవ్రతునకు ఈవిధమున రాజనీతి సూత్రములను బోధించి తపమునకేగెను. "నరపతికి న్యాయము

ధర్మము నయవర్తనము ముఖ్యములు. దేవతా పూజ గో విప్రకుల రక్షణము సలుపవలయును. వర్ణాశ్రమ ధర్మములను ప్రజలు పాటించునట్లు చూడవలయును. అన్యతరుణుల పొందు పనికిరాదు. అనుచరులు సైనికులు సచివులు విశ్వాసపాత్రులయినవారే కావలయును. ప్రజలలో అసంతృప్తి కూడదు, శత్రుశేషము కూడదు."

### త్రిశంకు స్వర్గము

సత్యవ్రతుడు పిటినన్నిటిని పాటించి, కీర్తిగడించి దేవీ భక్తుడై పెక్కు జన్నములుజేసి. ఒకనాడు తన గురువగు వసిష్ఠుని బిలచి తాను బొందితో స్వర్గమునకేగు క్రతువు జేయింపు మనెను. మర్త్యులకది అసాధ్యమని వసిష్ఠుడు నిరాకరింప సత్యవ్రతుడా ఋషిని కినుకతో నిందించెను. ముని అందుల కలిగి "నీవు పిశాచమై తిరుగుదువుగాక అని శపించెను. సత్యవ్రతుడట్లే పిశాచరూపమున అడవుల దిరుగుచుండగా, విశ్వామిత్రుని భార్య గుర్తించి ఆతడు తనకు ప్రతి దినము ఆహారముతెచ్చి పూర్వ మొనరించిన ఉపకారమును భర్తకు నివేదించెను. విశ్వామిత్రు డాతని దుర్దశజూచి జాలిగొని నీకేమి కావలయునని యడుగగా స్వర్గమునకేగు తన కోరికను సత్యవ్రతుడు నుడివెను. విశ్వామిత్రుడు గాయత్రీ మంత్రజప తత్పరుడు. మహామహిముడు. తన శక్తిచే ఆరాజు నమరపురికి పంపగా ఇంద్రుడు కోపించి గురుధిక్కారమును జేసిన నీవిచట అనర్హుడవని క్రిందికి ద్రోసెను. క్రిందికి పడుచు ఆరాజు విలపించుట విశ్వామిత్రుడరసి ఆకాశము నందే అతనికొక సర్వసౌఖ్యయుతమగు స్వర్గము సృష్టించి అందు నిలిపెను. అదియే త్రిశంకు స్వర్గము.

ఇతడు త్రిశంకుని కుమారుడు. శతాక్షీదేవినిగూర్చి పూర్వము మీకు నుడివితిని. హరిశ్చంద్రుడా దేవీభక్తుడు సత్యసంధుడు. ఆకథ వినుడని సూతుడు శౌనకాదుల కిట్లుచెప్పెను.

హరిశ్చంద్రుడు తనకు కుమారులులేక చింతించుచు గురునుపదేశమున వరుణుని పూజించి పుత్రభిక్ష పెట్టుమని వరమడిగెను. వరుణుడియ్యకొని 'రాజా నీవు తిరిగి ఆ పుత్రుని నాకు యజ్ఞ పశువుగాని"మ్మనగా రాజంగీకరించి రోహితుడను పుత్రుని గనెను. వరుణుడువచ్చి యెన్నిసారులడిగినను పుత్రమోహముచే రాజీయక కాలయాపనము సేయుచుండెను; వరుణుడాగ్రహించి రాజా నీవు జలోదర వ్యాధివలన బాధ నొందెదవని శపించెను. వెంటనే రాజా వ్యాధిగ్రస్తుడై మంచము పట్టెను. రోహితుడు తండ్రి బాధ చూడలేక తనకెట్లును మృతి తప్పదని గ్రహించి అడవులకు పారిపోయెను. హరిశ్చంద్రుడిక చేయునదిలేక వ్యాధినుండి బయల్పడనెంచి వరుణు నొప్పించి ఒక పేద విప్రుని బాలుడైన శునశ్శేపునిగొని యజ్ఞపశువుగ బలిసేయుటకు స్తంభమునకు గట్టెను. మృతికి భయపడి శునశ్శేపుడు విలపించుచుండ విశ్వామిత్రుడువిని జాలిగొని, తన దేవీభక్తి ప్రభావమున వరుణుని శాంతింపజేసి శునశ్శేపుని విడిపించెను. రాజు వ్యాధియు నశించెను. అడవులనుండి రోహితుడనువచ్చి అందఱి కానందము గూర్చెను.

పెక్కుమంది మహామునులున్న సభలో వసిష్ఠుడొకనాడు నృపతులలో హరిశ్చంద్ర భూవిభుడు అడితప్పని సత్యసంధుడని ప్రశంసించెను. విశ్వామిత్రుడా మాటకు అడ్డువచ్చి 'నేనది అంగీక

రింపను. అధికార మత్తులైన రాజులెక్కడ? సత్యనిరతి యెక్కడ హరిశ్చంద్రుని అనృతము మీకు చూపింతు'నని గట్టిగ వక్కాణించి వెడలెను. విశ్వామిత్రుడు తనమాట నిలుపుకొనుటకై, ఒక నిరుపేద విప్రవేషమునబోయి తనకువలసినంత ధనము నా రాజొసంగునట్లు వాగ్దానము గైకొని, అతని రాజ్యమంతయు గైకొని ఇదిచాలదు ఇంకను కావలెనని పట్టుపట్టెను. హరిశ్చంద్రుడు నిస్సహాయుడై కాశికిపోయి భార్యా పుత్రులను విక్రయించి తానొక కాటికాపరియై లభించిన ధనము నామునికిచ్చెను. అదియును చాలలేదు. తనకు శరణ్యమని నమ్మిన శతాక్షీదేవినే మనస్సున దలచుచు జపించుచు తన సత్యనిరతిని వీడకుండెను. విశ్వామిత్రుని మాయలవల్ల కలుగు నానాబాధల నిట్లు సహించుచు సతీసుతులకు దూరమై ఆ రాజు దినములు గడపుచుండ, ఆముని మాయవలన హరిశ్చంద్రుని సుతుడు పాము కాటుకు ప్రాణములు విడచెను. ఆ బిడ్డని తల్లి చంద్రమతి మహారాణియయ్యు వేరు దిక్కులేక తానే పుత్రుని శవమును గైకొని శ్మశానమునకేగి చితిముందు విలపించుట కాటికాపరి హరిశ్చంద్రుడు చూచి ఆమెను తన భార్యగా గుర్తించి "అహా, సత్యమునకు నిలబడువారి కిట్టి కష్టములా," అని దుఃఖమగ్నుడై దేవిని తలచి ధ్యానించి నీవేయిక మాకు దిక్కని ప్రార్థించి, కుమారుని చితాగ్నియందే తాను తన భార్యతో సహ పడబోవగా బ్రహ్మాది దేవతలు, వసిష్ఠ విశ్వామిత్రులు అచటి కరుదెంచి హరిశ్చంద్రుని సాహసమాపి, ఆ కుమారుని పునర్జీవితు జేసి, అతని సత్యనిరతిని ప్రశంసించి దీవించిరి. ఈ జరిగినదంతయు 'నీ సత్యదీక్షను జగతికి నిరూపించుటకే"యని విశ్వామిత్రుడును హరిశ్చంద్రుని రాజ్యమును ద్రవ్యరాసులను తిరిగి యిచ్చి దీవించి పంపెను.

దేవీప్రభావము - సురగర్వాపహరణము

దేవి అనుగ్రహము వలననే హరిశ్చంద్రుడు డిట్లు తన సత్య వాక్పాలనమును నిలుపుకొని మహాకీర్తి నందెను.

# పరమేశ్వరి

## స్కంధము-7

## దేవీప్రభావము-సురగర్వాపహరణము

దేవీమహిమను దెలుపు మఱికొన్ని గాథలు కలవు. ఇవి అహంకారము గర్వాతిశయముచే వారి దర్పమును జూపబోయిన మానవులకేగాక దేవతలకు, మునులకు గూడ వారి దుష్ప్రవర్తన వారికే తెలియ వచ్చునట్లుగ జేసిన దేవీప్రభావమును స్పష్టము చేయుకథలు.

### సురగర్వాపహరణము

పూర్వము దేవదానవుల యుద్ధమనేక వత్సరములు జరిగినది. పరమేశ్వరి దేవతలకు సాయమై అసుర గణము నెల్లను హతమార్చి స్వర్గరాజ్యము నమరులకు దక్కునట్లు జేసినది. రాక్షసులపై సాధించిన విజయము తమ ప్రతాప పరాక్రమముల వల్లనే వచ్చినదని దేవేంద్రాది సురలెల్లరును గర్వాతిశయముతో విలాసవిహారములందు మగ్నులై దేవి సంస్మరణమే మఱచిరి. గర్వితులై సురలిట్లే పూర్తిగ చెడిపోవుదురేమో నను సంశయమున వారికొక చక్కని గుణపాఠమును నేర్పుటకు దేవి సంకల్పించినది.

మున ప్రత్యక్షమై తన స్వరూపశక్తి సామర్థ్యముల నిట్లు వివరించి చెప్పెను అచ్చట నిలిచిన తేజోరూప మామెయే. ఆమెయే పరబ్రహ్మము "దేవేంద్రా మీరు నన్ను మఱచి నాపూజలుమాని గర్వితులై యున్నారు. త్రిమూర్తులైననునా యిచ్ఛాను సారము వర్తింతురు. తృణమైనను నా మహిమవలన దుర్వారమైన మహా శక్తిమంత మగును నా శక్తిని మఱచిన వారధోగతి పొందుదురు. నన్ను ధ్యానించుచు స్మరించుచు సత్ప్రవర్తనులైన వారికెల్లవేళలను నా రక్షణ కలదు. ఈ వాక్యములను మది యందుంచి యికముందైనను బుద్ధిగలిగి యుండడని" దేవి బోధింపగా ఇంద్రాది దేవతలెల్లరును ఆదేవికి ప్రణతులర్పించి ఆనాటి నుండియు దేవీపూజలను గాయత్రీమంత్ర జపమును నిత్యము సలుపుచు ధన్యులైరి.

## గౌతమముని ప్రశస్తి

గౌతముడు మహర్షిశ్రేణికి జెందిన మహనీయుడు మహా తపశ్శాలి నిత్య గాయత్రీ జపతత్పరుడు. సహ్యపర్వతమున త్ర్యంబకమను చోట ఆ ముని యాశ్రమమున్నది. తన ధర్మ పత్ని అహల్యతోగలిసి ఆ ఋషీంద్రుడచట తపమొనర్చుచు కాలము గడుపుచుండెను. కాని ఆ చుట్టుప్రక్కల నున్న విప్రులు మునులు తమ ధర్మమగు దేవీపూజలను గాయత్రీ జపమును విస్మరించిరి. తత్ఫలితముగ ద్వాదశ వర్షక్షామము ప్రబలి త్రాగుటకు గంజినీళ్ళయినలేక కూప తటాకము లెండిపోయి మహా కష్టముల పాలయిరి. గౌతమునకీ యిక్కట్లనుజాచి గుండె కరగినది. ఈ విపత్తు నెట్లయిన తప్పింప దేవిని మనసార

ప్రార్థించెను. ఆమె కరుణార్ద్ర హృదయ వెంటనే ప్రత్యక్షమై ఒక కనకపాత్రనొసగినది. ఆ జగదీశ్వరి యాదేశమున గౌతముడు వరుణుని వేడుకొనగా. ఆ దేవుడు గౌతము నాశ్రమముకడ ఒక మహాసరోవరమును సృష్టించి జలపూరమొనరించెను. ఆ జలమువలన ఆప్రదేశమంతయు సస్యఫలవృక్ష శోభితమైనది. దేవి యిచ్చిన పసిడిగిన్నెనుండి వలసిన భోజన పదార్థములు భూషణాంబరములు కోరిన వెంటనే కోరినవన్ని వచ్చుచుండెడివి.

క్షామ పీడితులయిన విప్రులను మునులనేకాదు. క్షామపీడితులైన ఇతరులను గూడ తన ఆశ్రమప్రాంతమునకు పిలిచి గౌతమముని ఆశ్రయమిచ్చెను, గృహముల నిర్మించెను. అన్నవస్త్రములనిచ్చి పోషించు చుండెను. గౌతముని కీర్తి నలుదిక్కుల వ్యాపించెను. ఆగౌతమ ఋషీంద్రుని యాదరమున నాతని యాశ్రమమునకువచ్చి ఆకరువు దినములలో సర్వసౌఖ్యములను భవించుచున్న మునులకును విప్రులకును గౌతమునియెడ అసూయ జనించినది. ఎన్నడెఱుగని భోగభాగ్యముల ననుభవించుచు వారహంకార పూరితులైరి. ఎట్లయిన గౌతముని అవమానము చేయదలచి ఆమునులు విప్రులును కలసి కుట్రవన్ని ఒక ఉపాయ మాలోచించి చచ్చుటకు సిద్ధముగానున్న ఒకముసలియావును గౌతముని పంటపొలములలోనికి దోలిరి గౌతముడా గోవు నదలించుట కొరకు గడ్డిపరకను విసరగా ఆ గోవు గిలగిలకొట్టుకొని క్రిందబడి మరణించెను. వెంటనే ఆమునులును విప్రులందఱును చేరి గౌతమునిపై కోపవీక్షణముల బరపుచు నీవు గోహత్య జేసిన

పాపివి నీమొగము చూడరాదు. నీవు భూప్రదక్షిణము చేసి దీక్ష తపము చేయనిదే నీపాతకము నశింపదని యట నుండి పాఱద్రోలిరి. గౌతముడంతర్దృష్టితో ఆమునులు చేసిన ద్రోహము నెఱిగి వినయవంతుడై దేవీమందిరము లన్నియు దర్శించి దేవిని గూర్చి తపమాచరించుచు తన నిత్యగాయత్రీ జప మొనరించు చుండెను. పలువురి యెదుట దేవిప్రత్యక్షమై గౌతముని జూచి మునీంద్రా నీవు నిర్దోషివి నీయుపకారము నంది నీకు కృతజ్ఞు యుండుటమాని, నిన్నవమానింపదలచిన వారు పాషండులు కాపాలికులు నాస్తికులౌ దురని యింకను వారిపై దేవికోపము యుండ గౌతముడే వారిని కరుణించి దేవిని ప్రార్థించి వారియను చిత కార్యమునకు పశ్చాత్తప్తులైన వారిని క్షమించునట్లు జేసెను. పశ్చాత్తప్తులు కానివారు నాస్తికులు పాషండులై చనిరి. మిగిలిన వారు తమతప్పు నెఱిగి గౌతముని మహత్త్వమును వేనోళ్ల శ్లాఘించుచు దేవీభక్తులయి మనిరి.

గౌతముని కోరికపై దేవి యాప్రాంతమున మరల కరువు తలయెత్తకుండ వరమిచ్చినది, సహ్యపర్వత శిఖరమున నున్న గో ముఖము నుండి నిరంతర జలధార లుత్పన్నమై మహానదిగా ప్రవహించుచు ప్రజానీకమునకు సస్య సంపదలు కలుగజేయునట్లు నుగ్రహించినది గౌతముని తపఃఫలముగ వచ్చిన నదియే ఆంధ్ర దేశమును పవిత్రము జేయుచు ప్రవహించుచున్న గౌతమీనది గోదావరియను పేర ప్రసిద్ధికెక్కి ప్రజల పూజలందుకొనుచున్నది ఆనది ప్రవహించినచోటు లెల్లనును బీడులు సస్యఫలవంతములై యలరారు చున్నవి.

దేవిమహిమను విస్పష్టమ్ముగా తెలియజేయుటకు ఈరెండు గాథలను మంచి యుదాహరణములు. అహంకార పూరితులై గర్వితులై వర్తించు దేవేంద్రాదులను గూడ ఆ జగదంబ తన యాగ్రహమునకు గురిచేసి వారు పశ్చాత్తప్తులు కాగానే వాత్సల్యము చూపి సన్మార్గ ముపదేశించినది. ఆజగదంబను ఆమె చేసిన ఉపకృతులను మఱచిన దేవతలకును గర్వభంగమైనది.

గాయత్రీ జపతత్పరుడు పరోపకారియునైన గౌతమ ఋషినే అసూయతో అవమానింప బోయిన వారుమునులైనను వారిగతి యేమైనదో వింటిరి కదా.

ధర్మము మూడు పాదములు నశించి ఒక్కపాదమే మిగిలిన కలియుగము అడుగడుగున భ్రమ ప్రమాదములతో నిండి విలాసజీవన వినోదముల వైపునకే మనుజుల నాకర్షించుచు లోభమోహములకు వశముచేసి పాపమున బంధించున్న. వీని నుండి తప్పుకొనుటకు నిరంతరము దేవీ జపము, దేవీపూజ,సత్కర్మనిరతియే మార్గము. దానిని మాని దుర్గుణములకు వశులైన వా రధోగతి పాలుగావలసినదే. ఇదివరలో నుడివి నట్లు పుణ్యతీర్థక్షేత్ర దర్శనము, ధర్మశాస్త్రగ్రంథ పఠన శ్రవణములు సత్కర్మాచరణము మనుజుని సన్మార్గపథమున బెట్టును దీనికి తోడు దేవిజపము, దేవీపూజలున్నచో జన్మము ధన్యము ఈ దేవీపీఠములున్న స్థానముల గూర్చియు కూడ మీకుతెలిపెదను.

# పరమేశ్వరి

## స్కంధము-8

### సనకాదులకు దేవి దర్శనము

హాలాహలులను క్రూర రాక్షసులు వారికి గల్గిన వరబలము చే మహాభయంకరులై భూమండల స్వర్గమండలముల నాక్రమించి లోక కంటకులగుటచే హరిహరు లిరువురును గలిసి వారిని పరిమార్చిరి. తిరిగి యిండ్లకేతెంచిన హరిహరులు తమ విక్రమాటోపములను తామే శ్లాఘించుచు గర్వపు మాయలో బడుటచే సిరియు గౌరియు వారిని వీడి చనిరి. పరదేవి అంశతో భాసిల్లుచున్న వ్యా భార్యలు వారిని వీడి చనుటచే హరిహరులు పనులయుం దసమర్థులై జగత్ప్రవృత్తి కాటంకములు గలినవి. ఈపరిస్థితికి బ్రహ్మ శోకించి సనకాది మునులను జగదంబ కడకు పంపెను., ఎటులైనను తిరిగి సిరియు గౌరియు హరిహరులను చేరునట్లు చూడుడని. సనకాదులు హిమగిరికేగి దేవీ బీజాక్షర జపము దీర్ఘకాలము సలుప దేవి ప్రత్యక్షమై వారి కోరికల నెఱవేర్చెను.

### లక్ష్మి విష్ణువులు

దేవ దానవు లమృతము కొఱకు క్షీరాబ్ధిని మథింపగా అమృతముతోపాటు సౌందర్యరాశియై యందుడి లక్ష్మి జనించినది. అమరులు మునులు శ్రీహరికడకేగి ప్రార్థింప శ్రీహరిలక్ష్మిని తనయర్థాంగిగా గైకొనెను-

### సతీదేవి యోగాగ్ని కాహుతి యగుట

జాంబూనదేశ్వరి దుర్వాసుని భక్తికి మెచ్చి యొక సురభి

ళ సుమమాల నిచ్చినది. దాని నాతడెంతో గౌరవముగ జూచు చుండ దక్షుడా సుమమాల నడిగి తీసికొని తన సెజ్జపై నుంచుకొని కామదృష్టి గలవాడగుటచే శివుని భార్యయగు సతికా గ్రహము వచ్చెను. ఈ పనికి తోడు దక్షుడొక యజ్ఞము సేయుచు తన పుత్రిక యయిన సతిని, అల్లుడైన శివుని పిలువక పోవుటయేగాక తండ్రి చేయు యజ్ఞమును తనంతట తాను చూడ వచ్చిన సతిని అగౌరవము చేసెను. శివుడందులకు కోపించి తనజట నుండి వీరభద్రుని సృష్టించి దక్షునిపైకి పంపెను. వీరభద్రు డనేక ప్రమథగణములతోనేగి దక్షుని యాగము ధ్వంసమొనర్చెను. తనకు జరిగిన యవమానము భరింపలేక దక్షుని యజ్ఞవాటిక యందే యోగాగ్నిని గల్పించుకొని సతి యాహుతి యయ్యెను. సతీవియోగము భరింపలేక శివుడా యగ్నికుండ మందున్న సతీదేవిచితృళా రూపమును గ్రహించి సతినే తలంచుచు అనేక ప్రదేశములకేగి తిరుగసాగెను. శివుడట్లేగిన ప్రదేశములన్నియు పుణ్యతీర్థక్షేత్రములై శివునకు దేవికిని స్థానములయ్యెను. కాశి మొదలుగ అట్టి దైవక్షేత్రము లెనిమిది వందలు భరత వర్షమున గలవు అక్షేత్రములకేగి దేవీపూజ చేసినవారు ఆపుణ్యపీఠముల దర్శించువారును దేవీకృపకు పాత్రులై సకల సంపదలతో వర్థిల్లెదరు.

ముఖ్యముగ భక్త జనుల నుద్ధరించి భుక్తిముక్తులను ప్రసాదించుటకై యేర్పడిన వీ పవిత్ర దేవీ స్థానములు. కావున ముముక్షువు లెల్లరును ఐహికాముష్మిక సౌఖ్యముల కొరకీ పుణ్యప్రదేశముల దర్శించుట ముఖ్యము – కొన్ని ముఖ్య దేవీపీఠముల నామముల వినుడు.

వారణాసియందు విశాలాక్షి, నైమిశమ్మున లింగ ధారిణి ప్రయాగమ్మున లలిత. గంధమాదనమ్మున కాముకి దక్షిణ మానసమ్మున కుముద, ఉత్తరమానసమ్మున కామకి, హస్తినాపురమున జయంతి, కాన్యకుబ్జమున గౌరి, మలయాచలమ్మున రంభ, ఏకామ్రపీఠమున కీర్తిమతి, కేదారపీఠమ్మున సన్మార్గదాయిని, హిమవత్పృష్ఠ భాగమ్మున మంద, గోకర్ణమ్మున భద్రకర్ణిక, స్థానేశ్వరమ్మున భవాని, శ్రీశైలమ్మున మాధవి, భద్రేశ్వరమ్మున భద్ర, సాలగ్రామమున మహాదేవి, శివలింగమ్మున జలప్రియయు, మాయాపురియందు కుమారి, గయయందు మంగళ, త్రికూటమ్మున రుద్రసుందరి, సహ్యాద్రియందు ఏకవీర, యమునయందు మృగావతి, కోటితీర్థమ్మున కోటవి, గోదావరియందు త్రిసంధ్య, గంగాద్వారమున రతిప్రియ, ద్వారవతి యందు రుక్మిణి బృందావనమున రాధ, చిత్రకూటమ్మున సీత, వింధ్యమ్మున వింధ్యాధివాసిని, పాతాళమ్మున పరమేశ్వరి, మహేశ్వరీ పురమున స్వాహా, సముద్రతటమున పారావార, కిష్కింధమున తార, కాశ్మీరమున మేధ, చంద్రభాగయందు కళ, బదరియందు తులసి, వేదవదనమ్మున గాయత్రి, శివసన్నిధిని పార్వతి, దేవలోకమ్మున ఇంద్రాణి, బ్రహ్మాస్యముల సరస్వతి, సూర్యబింబమున ప్రభ, మాతలయందు వైష్ణవి, సతులయం దరుంధతి, రామలయందు తిలోత్తమ, చిత్తమ్మున బ్రహ్మకళ, సర్వశరీరులయందు శక్తియు ఇత్యాదిగ ఎనిమిది వందల పీఠములును అందఱు శక్తులును విరాజిల్లుచుందురు.

తారకుడను రాక్షసుడు వరబలమున మహాశక్తిమంతుడై లోకములను పీడించుచుండ మునులు దేవతలు విష్ణువు కడకేగి మొఱలిడిరి. "ఎవరికిని ఈరక్షసుడు లొంగడు, శివుని కుమారుడే ఈరాక్షసుని జంప సమర్థుడగును మీరేగి దేవిని ప్రార్థింపు"డని శ్రీహరినుండివి వారిని వెనుక పంపెను. శివుని భార్యసతి అగ్నికుండమున కాహుతి యైనది. శివునికి సుతుడెట్లు కలుగునని చింతించుచు సురలు మునులు దేవీపూజలుసేయ మొదలిడిరి. దేవిప్రత్యక్షమై వారి ననుగ్రహించి "నా యంశతో పార్వతి హిమగిరికి పుత్రియై జన్మించి శివున కర్ధాంగి యగును భయపడకు"డని వారిని దీవించి పంపెను. హిమవంతుని పుత్రి పార్వతి త్రిభువనసుందరి, దేవీరూప, దేవతలు మునులేగి శివుని బ్రార్థింపగా శివుడాపార్వతిని స్వీకరించెను. బ్రహ్మ విష్ణువు ఇంద్రాది దేవతలు మహర్షులు వచ్చిరి. సప్తఋషుల అధ్వర్యమున శివపార్వతుల వివాహమతివైభవముగ జరిగినది. వారికుమారుడు స్కందుడు దేవసేనకు నాయకుడై ప్రచండ సాహసమున నేగి తారకుని పరిమార్చి లోకములకు భద్రతను సమకూర్చెను.

## దేవీ గీతలు

దేవీభాగవతము నందు చాలముఖ్యమైన భాగమిది. తారకాసురుని వధకొరక మార్గమును జూపించిన దేవికి ప్రణతులర్పించుచు సురలుమునులు స్తుతించు చున్నపుడు హిమవత్పర్వతుడును,

అచ్చటికేతెంచి "దేవీ జగదీశ్వరీ నన్ను కరుణించి నీవే నాపుత్రిక గా జన్మించి నాకు ధన్యత జేకూర్చితివి. ఇంతకన్నను భాగ్యమే మి కలదు, ఇందులకు నాకృతజ్ఞతలు హృదయపూర్వకముగ తెలుపుచున్నాను. ఏమియు నెఱుగని అల్పుడను అలసుడను నేను. నాజన్మ సార్థకమగు ముక్తి మార్గము నెఱుగ గోరెదను తల్లీ," యని వేడ దేవి స్వయముగ ఆహిమపర్వతుని. దేవతలను ఉద్దేశించి యొనర్చిన ది తత్వప్రబోధములే దేవీ గీతలుగ ప్రఖ్యాతి నందె ముముక్షువు లకు మార్గదర్శకము లైనవి. అచట జేరిన వారందఱు ఆదేవిచేసిన జ్ఞానోపదేశమును భక్తి శ్రద్ధలతో విని దేవికి నివాళులర్పించి వారి నివాసములకు చనిరి. దేవీగీతలలోని ముఖ్యాంశములను విదుడు.

జీవులకు నిత్యము సత్యమునగు సౌఖ్యమునిచ్చు ఆనంద ము పరబ్రహ్మము, దేవియే. ఇతరములెల్లను మిథ్య. స్వాశ్రయ మంది మిథ్యా జగత్తునగన్పడు మాయా మోహముల జిక్కినరు లు మ్రగ్గుదురు. ఈమాయనుదాటి జీవిత గమ్యమును జేరుటకు దేవీపూజయే మార్గము, ఈ విశ్వమున కాధారమై విశ్వమును నడిపించు శక్తి దేవియే. ఆమెయె హ్రీంకారతత్త్వము. జగమ నందెచ్చట శక్తియున్నను అది దేవీప్రభావమే. దేవీప్రధానాం శతే త్రిమూర్తులకడ వారి పత్నిరూపములుగ నుండి సృష్టిస్థి ప్రళయ కార్యముల నిర్వహింప జేయుశక్తులు ఆపరమాత్మరూప

మతి సూక్ష్మమై ప్రాణిద్వేషహర్షుంల్లదుండుము. ఇంద్రియ వాసనలు ప్రబలి జీవాత్మ పరమాత్మస్థితులు వేఱువేఱనుచు భావింతురు తమ బుద్ధిననుసరించి ప్రాణులొనరించు కర్మములకు కర్తృత్వ పూ పాత్రిణులదేగాని పరమాత్మకాపాదింపదగదు. సర్వచరాచర సంస్థితమైన యాపరమాత్మ శక్తి నెఱిగి భవముక్తు లగుటకు మార్గము యమ నియమాది ఇందిర్రియనిగ్రహశక్తిచే జరుపు జపతపోధ్యానమననములతో గూడిన దేవీపూజయే- తనభక్తుల మంచి చెడ్డల నామెయే చూచుకొనును.

## దేవీ విశ్వరూప దర్శనము

దేవీశక్తి తత్త్వమారీతివినిన హిమాద్రి దేవియొక్క విశ్వ రూపమును జూడగోరి పార్థింప దేవి తను విశ్వరూపము ను చూపెను, ఆరూపము భానుకోటి ప్రభా భాసమానమై పటావహ్ని శిఖాజాజ్వల్యమానాకృతితో ఆయుధాన్వితయయి అతి భీకర ములు అసంఖ్యాకములైన తలలు నేత్రములతో విశ్వము నంతయు ఆక్రమించి యిట్లున్నది.

ఆకాశము శిరస్సు, సూర్య చంద్రులు నేత్రములు, వాయు వు ప్రాణము, ప్రపంచము హృదయము, వేదములు పల్కులు, కటిభాగము భూమి, ఖంబునాభి, భగణము వక్షము, మహర్లోక ము మెడ, జనలోకము మొగము, తపోలోకము లలాటము, ఇంద్రాదులు బాహువులు, నాసగంథము, అశ్వినీదేవతలు నాసికా

రంధ్రములు రేబవలు కనుఱెప్పలు జలము దౌడలు, రసము నాలుక, కనుబొమలు బ్రహ్మలోకము, యముడు దంష్ట్రలు, స్నేహము దంతములు, మాయ మందహాసము, కడకంటి చూపు సృష్టి, సిగ్గుపై పెదవి, లోభము క్రిందిపెదవి, ధర్మమార్గము పృష్ఠము, ప్రజాపతి మేఢ్రము, సముద్రములు కుక్షి, పర్వతములు శల్యములు, నదులు నాడులు, వృక్షములు కేశములు, బాల్యావ్యావృద్ధులు గతులు, మేఘములు రోమములు, సంధ్యలు వస్త్రములు, చంద్రుడు మనస్సు, హరి విజ్ఞానము, రుద్రుడంతఃకరణము, వాడికోరల్గా యుధములుగ సహస్రశీర్షములు సహస్ర నేత్రములు సహస్ర పాదములు కలిగి కోటి సూర్యప్రకాశమానమై యొప్పు అభయంకర తేజోరూపము గని దేవతలు హిమగిరియు "పాహిపాహి" యని భయకంపితులై ప్రార్థింప దేవితన విశ్వరూపము నుపసంహరించి, శాంతరూపముధరించి, ప్రసన్నమూర్తియై మోక్షసంసిద్ధి కనువగు మార్గము లిట్లు తెల్పినది.

## భక్తిజ్ఞాన కర్మయోగములు

జ్ఞానమే ముక్తికి మార్గము. తమకర్మలె హేతువుగ ప్రాణులు సంసార బంధమున జిక్కి పరమాత్మ నెఱుగలేని అజ్ఞానమున అంతులేని జనన మరణములను పొందుచుందురు. శమదమాది సుగుణ సాధనచే ఇంద్రియ నిగ్రహము బడసి కామ క్రోధ లోభ మోహ మదమత్సరములను జయించి వైరాగ్యము పొందవలెను. అందులకు గురుబోధమ త్యావశ్యకము. శాస్త్ర విధ్యవనుష్ఠితము

లైన సత్కకర్మము లొనరించుచు కర్మ ఫలము లందు కాంక్షను వదిలి సర్వకర్మలను దేవికే సమర్పించి దేవినే తనధ్యానము నందుంచు నిష్కామ కర్మ యోగ విధానముచే బ్రహ్మజ్ఞానము సుసాధ్యము, జీవాత్మ పరమాత్మల సంయోగమే పరమార్థసిద్ధి 'హ,ర,ఈ' అను మూడక్షరముల హ్రీంకార రూపమును భావించుచు చూచుచు సిద్ధులైన వారు దేవి యందైక్య మందెదరు.

ధ్యాన, యోగ మంత్రము నీ సిద్ధికి సాధనము. ఇవి రెండును అన్యోన్యాశ్రయములు. యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యానము సమాధి అను అష్టాంగయోగ సాధనచే ఇంద్రియ నిగ్రహము చిత్తశుద్ధి చిత్తోపశాంతి వైరాగ్యము అలవడును. జపహోమములచే నిది బలపడును. ఆస్థితిలో ప్రాణ దేహములకధి నేతయయిన బ్రహ్మమును ఓం అని ధ్యానింప వలయును. బ్రహ్మతేజమును మించినదిలేదు. ఈ తేజము నెఱుగుటయే జ్ఞానము. అట్టిజ్ఞానిని విడిచి జగదంబ వేఱుగ చనదు. దేవీ భక్తులు దేవి కత్యంతప్రియులు. జీవబ్రహ్మైక్య రూపము పంచ భూతాత్మకమయిన విశ్వము శరీరము. ఇందున్న మూడుకోట్ల ఏబది లక్షలనాడులలో సుషుమ్న ఇడపింగళ నాడులు ముఖ్యమైనవి మూడు నాభి దిగువ ప్రదేశమున బయలు దేరును. అచటనే స్వయంభూలింగము కుండలినీ శక్తి దేవ్యాత్మక స్థానమగు మూలాధార చక్రమును ఉన్నవి. మఱియు విష్ణువుచే అధిష్ఠితమైన దశదళ పద్మము రుద్రాధిష్ఠిత మగుద్వాదశదళ పద్మమున్నవి. ఆపైని విశుద్ధమగు షోడశదళ పద్మము పరమాత్మ జ్ఞానమిచ్చునది యున్నది. యోగాభ్యాసమున

వాయు పూరణచే సుషుమ్న నాడియందున్న కుండలినీ శక్తిని మేల్కొల్పి శీర్షమున పరమాత్మ నివాసమగు సహస్రార చక్రమున జేర్చి పరబ్రహ్మభాసము ననుభవించి, తదానంద రసము ను గ్రోలుట యేసిద్ధి. మరల కుండలినీ శక్తిని దిగువకుదెచ్చి మూలాధారమునకు జేర్పవలెను.

భక్తియోగము వైరాగ్యమున నున్నవానికి సులభమగు జ్ఞాన మార్గము. ధాంభికమైనది తామసభక్తి, వాంఛాపూరితమైనది రాజసభక్తి, దేవీకథా శ్రవణము దేవి కీర్తన తీర్థక్షేత్ర దర్శనము దేవీపూజలు సాత్వికభక్తి. భక్తుడు దేవీభావమున తాదాత్మ్యమంది పులకితగాత్రుడై అశ్రుపూరితనయనుడై గొంతెత్తి దేవిని కీర్తింపవలయును.

భక్తిజ్ఞాన కర్మయోగములు పరమార్థ సిద్ధికి ముఖ్యమార్గములు. విధివిహితము, నిష్కామమైన సత్కర్మ జ్ఞానసాధనము. జ్ఞానము ముక్తిప్రదము.

వేదాంత తత్త్వమిట్లు దేవి హిమవంతుని కోరికపైనుడివి దేవీ మహత్త్వ ప్రసిద్ధములైన ఉత్సవములు వ్రతములు పీఠములు స్థానములు తన నివాసమగు మణిద్వీపమును గూర్చియు నుడివి దేవతలను హిమవంతుని సంతృప్తులను జేసినది.

వ్రతములలో శారద, వసంత నవరాత్రవ్రతములు ఉత్తమములు ఇంకను రసకల్యాణి, ఆర్ద్రానంద, శుక్రవార, కృష్ణచతుర్దశి భౌమవార ప్రదోష వ్రతములాదిగ కలవు.

ఉత్సవములందు రథ, జాగరణ, దమన, శీల, శయన మున్నగు పవిత్రోత్సవములు కలవు.

సుప్రసిద్ధములు దర్శనమాత్రమున భుక్తి ముక్తులొసగు దేవీ స్థానములు క్షేత్రములు పీఠములున్నవి. వీని సంస్మరణమె పుణ్యప్రదము వీనిని సేవించి పూజలొనర్చువారు నిజముగ ధన్యులు - ఈస్థానములందు వెలసిన దేవికి వేర్వేఱు నామము లున్నవి. ముఖ్యములైన దేవీ స్థాన నామములును అందున్న దేవీరూప నామములును మీరింతకు ముందే వినియున్నారు, దేవీ పూజావిధానమును గూడ దేవియే హిమవంతునకు జెప్పినది.

బాహ్యము అభ్యంతరము అని పూజరెండు విధములు. బాహ్యపూజ తాంత్రికము వైదికము అని రెండు విధములు. వైదికము ఉత్తమ మైనది. దేవివలన విశ్రుతములైనవి గాన వేదములు ప్రమాణములు. దేవి మహిమనెంచి అన్యచింత లు మాని అర్చించువారి నెల్లవేళల దేవికాపాడును. కేవల కర్మమున కన్న భక్తి జ్ఞానమార్గము లుత్తమములు. చిదానంద రూపిణియగు దేవిని హృదంతరమున జ్ఞానతేజముగ ఆత్మ రూపిణిగ నిలిపి ధ్యానించుట అంతరపూజ. ఈస్థితిపొందనుక సగుణ సాకార నాయుధహస్తయగు దేవిని బాహ్యపూజలొనర్ప వలయును.

ప్రత్యూషమున లేచి శుచిర్భూతుడై జపతపహోమాదికములొన ర్చిన తదుపరి కపటములేని చిత్తశుద్ధితో, విధివిహితముగ నిర్మిం పబడిన వేదికపై దేవీప్రతిమను ప్రతిష్ఠించి వేద పౌర మంత్ర జప మంగళ గీతములో మధ్య పపత్రపుష్పాదు ద్రవ్య వస్త్రములతో

దేవీ పూజలు సలిపి ప్రణతి ప్రదక్షిణ తాంబూల దక్షిణ నివేదనల నిచ్చి ప్రసాదముగొని దేవీధ్యానమున చిత్తము నిలుపువారా జగదీశ్వరి కృపకుపాత్రులై ఇహపర సౌఖ్యములందగలరు. అణువు లో అణువు మహత్తుకంటె మహనీయము పరమము కంటెప రమైనది అశక్తి. అమె ఆత్మరూపిణి, జ్ఞానతేజము ఆదేవీ చరణ సాయుజ్యమే మోక్షపదము -

దేవియే స్వయముగ వచించిన ముక్తిమార్గములను విని దేవతలు ప్రపంచకుడు అద్భుతాశ్చర్యములకు లోనయి ఆమోక్ష సాధనాభ్యాసములను మానసముననిలిపి, మరల మరల దేవిని స్తుతించుచు వారి నివాసములకు జనిరి.

# పరమేశ్వరి

## స్కంధము-౯

### పంచప్రకృతి వివరణము

ప్రకృతి రూపిణియయిన దేవియొక్క పంచ రూపములను నారాయణుడు నారదునకు, నారదుడు వ్యాసునకు వ్యాసుడు జనమే జయునకు వచించిన రీతిగ సూతుడు శౌనకాదిమునుల కిట్లు నుడివెను.

ప్రకృతి స్వరూప స్వభావములను గూర్చి పూర్తిగ విశదీకరించుట యేరికైనను అసాధ్యము. ప్రకృతి పురుషుల ఆకృతులు రెండునుగల పూర్ణస్వరూపము పరమాత్మ. సృష్టికాదియు సృష్టియందు శ్రేష్ఠము సత్వరజస్తమోగుణ యుతమైనది ప్రకృతి ప్రకృతికి ముఖ్యరూపములైదు, శివ ప్రియమగు గణేశమాత, సంపత్ప్రదాత్రి లక్ష్మి, వాగ్బుద్ధి రూపయగు సరస్వతి, వరదాత్రి సావిత్రియగు గాయత్రి, ఆత్మరూపుడగు కృష్ణుని సహచారిణి రాధ ఇవి యైదును పంచప్రకృతి రూపములు

దేవీ కళలు కల్గి త్రిభువనమ్ములందును భక్తసంతతిని కోరుచు మాతృరూపము లనేకములున్నవి- ఇవి గంగ తులసి మంగళచండి నాగమాత అగ్నిభార్య స్వాహాయజ్ఞాగ్నురుషుని భార్య దక్షిణ, పితరుల భార్య స్వధ, గాలి భార్య స్వస్తి గణపతి భార్యపుష్టి అనంతుని భార్య తుష్టి కపిలుని భార్యధృతి సుకృతి భార్యకీర్తి ధర్ముని భార్యవిద్య సుశీలుని భార్యలుత్రప

దాంతి జ్ఞానుని భార్యలు బుద్ధిమేధ పవలు రాత్రి సంధ్యలు ప్రీతి శ్రద్ధభక్తి వైరాగ్యములు అదితిరోహిణి సంజ్ఞ శచితార అరుంధతి దేవహూతి మేనక లోపాముద్ర కుంతి కుబేరి కామిని వింధ్యావళి దమయంతి యశోద గాంధారి ద్రౌపది శైబ్య సత్యవతి రాధాజనని మండోదరి కౌసల్య కౌరవి రేవతి సత్యకాళింది లక్ష్మణ నాగ్నజితి సీత రుక్మిణి యోజనగంధి ఉషప్రభావతి భానుమతి రేణుక యేకనంద దుర్గసతి లక్ష్మి పార్వతి సరస్వతులు వేర్వేఱు నామములుగల గ్రామదేవతలు - వీరందఱును దేవీ కళాంశ గలిగినవారే - స్త్రీలందఱును దేవీ విభవాంశ గలవారే.

రాధాకృష్ణులు : గోలోకవాసియు మురళీధరుడైన కృష్ణుడు పరమాత్మ రూపుడు. భగవతినిగూడి భగవంతుడయ్యెను వారి క్రీడాఫలముగ విశ్వాధారుడగు బాలు డుదయించి సముద్ర జలములందుంచ బడెను. దేవీరూపము నుండి లక్ష్మి సరస్వతులు రాధికయు ఉద్భవించిరి. కృష్ణుడే మరల రెండు రూపముల య్యెను. కృష్ణరూపమునుండి వచ్చిన నాల్గుచేతుల నారాయణు నుండి పార్షదులు. లక్ష్మినుండి వైష్ణవీజనము రాధిక నుండి గోపికలును ఉద్భవించిరి. కృష్ణుని నాభి పద్మమునుండి బ్రహ్మ మరల కృష్ణరూపము నుండి మహాదేవు డుద్భవమైరి.

ఆత్మరూపుడైన కృష్ణుని నివాసము గోలోకబృందావనము రాధాదేవి ఆకృష్ణుని సహచారిణి అకలంక ప్రేమస్వరూపము మునిమనోగోచర యయిన దేవీరూపమే రాధ

సముద్రము నందుంచబడిన బాలుడే సృష్టికిమూలము. కృష్ణశక్తిచే ప్రభావితుడు ఆబాలుని ప్రతిరోమకూపమున బ్రహ్మాండములు కలవు, వానియందు త్రిమూర్త్యాది దిక్పాలురు దేవతలుందురు. భూమికిపైన ఏడూర్ధ్వలోకములు దిగువ ఏడధోలోకములు కలవు. బ్రహ్మ లోకమున కింకను పైనగోలోక వైకుంఠములు గలవు పాతాళము నుండి బ్రహ్మలోకము వరకు బ్రహ్మాండము. ఇది అస్థిరము. గోలోక వైకుంఠములు స్థిరములు.

కృష్ణప్రభావితుడైన ఆశిశువే జనార్దనుడు అతని నాభి పద్మమునుండి బ్రహ్మ బ్రహ్మ ముఖమునుండి రుద్రులు, బ్రహ్మ మానసపుత్రులుగ సనక సనందనాది ఋషులు జనించిరి. పదపడి చరాచర సృష్టినంతయు బ్రహ్మ సాగించెను.

## ప్రకృతి ఆరాధనము

ప్రకృతిరూపారాధనమ్మున నారాయణుడు నారదునకు మున్ముందు నుడివిన పూజ సరస్వత్యుపాసన. రాధవదనమ్ము నుండి వచ్చిన సరస్వతినిజూచి కృష్ణుడు "దేవీసకల సురాసురులకు ప్రజలకు ఆరాధ్య దేవతవు నీవు. నీకృపాలోకనమున సకల విద్యలు లభించును. విద్యారంభ సమయమున నిన్నెల్లరును పూజింతురు. నిన్ను పూజించి నీకవచమును పఠించిన భక్తులు పండితులగుదు" రని పేవిధముల నుతించి సరస్వతిని శ్రీహరి సేవల కనిపెను. ఆమెను స్తుతించుచు ఆమెవెనుకనే దేవతలు మునులుకూడ చనిరి. సరస్వతియు లక్ష్మితోగూడి శ్రీహరి సేవల కేగినది.

మాఘశుద్ధ పంచమి సరస్వతి పూజకుత్తమము. విధి విధానముగ స్థలశుద్ధిసలిపి శారదాప్రతిమ నొకసుందర వేదిపైతెలి వలువలుంచి ప్రతిష్ఠించి షోడశోప చారములతో నర్చించి శ్రీంహ్రీం సరస్వత్యై స్వాహా అను అష్టాక్షరీ మంత్రమాత్మ జపించుచు ఆదేవి పూజలుకావించు వారి మనో౽భీష్టము లీడేరును. విద్యలు సంపదలు యశము విజ్ఞానము నిచ్చుతల్లి ఆదేవియే.

సరస్వతీకవచ మాదేవి స్తోత్రమే ఇదివేద సమ్మతము వేద సారము, ఈకవచమునకు ఛందము బృహతి, ప్రజాపతి ఋషి, సరస్వతియే అధిదేవత, ఈకవచ ప్రభావము వల్లనే వసిష్ఠ పరాశర వాల్మీకి యాజ్ఞవల్క్య వ్యాసాది మహామునులెందరో మహాపండితులైరి. యాజ్ఞవల్క్యుడు గురుశాపమున కోల్పోయిన విద్యల నీ సరస్వతి అష్టాక్షరి మంత్రము వల్లను కవచము వలనను తిరిగి పొందగల్గెను - ఈకవచము వలన సర్వతత్వ పరిజ్ఞాన సర్వార్థసాధన కవితా విద్యలు విని యోగములు.

నాయవయవముల నన్నిటిని నా కార్యముల నన్నిటిని నన్ను సర్వదిశలను సరస్వతి సర్వశక్తి స్వరూపములతో గలసి సర్వవేళల నన్ను రక్షించుగాక అని ఈకవచ కేంద్ర భావము.

" శ్రీం హ్రీం సరస్వత్యైస్వాహా శిరోమే పాతు సర్వదా !
శ్రీం వాగ్దేవతాయైస్వాహా ఫాలమే సర్వదాఽవతు !
ఓం హ్రీం సరస్వత్యై స్వాహేతి శ్రో త్రే పాతు నిరంతరం !
ఓం శ్రీం హ్రీం భగవత్యై సరస్వత్యై స్వాహా నేత్ర
యుగ్మం సదావతు !
ఓం హీం వాగ్వాదిన్యై స్వాహా నాసాంమే సర్వదా వతు !
ఓం హ్రీం విద్యాధిష్ఠాతృదేవ్యై స్వాహాచోష్ఠం సదావతు !
ఓం శ్రీం హ్రీం బ్రాహ్మ్యై స్వాహేతి దంతపంక్తిం సదావతు !
ఐమిత్యేకాక్షరో మంత్రో మమ కంఠం సదావతు !
ఓం శ్రీం హ్రీం పాతుమే గ్రీవాం స్కంధౌమే శ్రీం సదావతు !
ఓం హ్రీం విద్యాధిష్ఠాతృ దేవ్యై స్వాహా వక్ష సదావతు !
ఓం హ్రీం విద్యాధిరూపాయై స్వాహా మే పాతు నాభికాం !
ఓం హ్రీం క్లీం వాణ్యై స్వాహేతి మమ హస్తౌ సదావతు !
ఓం సర్వవర్ణాత్మికాయై స్వాహా పాదయుగ్మం సదావతు !
ఓం వాగధిష్ఠాతృదేవ్యై స్వాహా సర్వవ్వం సదావతు !
ఓం సర్వకంఠవాసిన్యై స్వాహా ప్రాచ్యం సదావతు !
ఓం సర్వజిహ్వాగ్రవాసిన్యై స్వాహాగ్ని దిశ రక్షతు !
ఓం హ్రీం శ్రీం క్లీం సరస్వత్యైబుధజనన్యై స్వాహా
మంత్రరాజోయం దక్షిణేమాం సదావతు !
ఐం హ్రీం శ్రీం త్ర్యక్షరో మంత్రో నైరృత్యాం సర్వదావతు !

ఓం ఐం జిహ్వాగ్రవాసిన్యై స్వాహా మాం వారుణేఽవతు !
ఓం సర్వాంబికాయై స్వాహా వాయవ్యే మాం సదావతు ?
ఓం ఐం శ్రీంక్లీం గద్యవాసిన్యై స్వాహా మాముత్తరేఽవతు !
ఓం సర్వశాస్త్రవాసిన్యై స్వాహాశాన్యాం సదాఽవతు !
ఓం హ్రీం సర్వపూజితాయై స్వాహా చోర్ధ్వం సదాఽవతు !
ఓం హ్రీం పుస్తకవాసిన్యై స్వాహాఽధోమాం సదావతు !
ఓం గ్రంథబీజస్వరూపాయై స్వాహా మాం సర్వతోఽవతు !

ఈ కవచమును విశ్వజయమని యందురు. దీనిని అయిదు లక్షలమార్లు పారాయణచేసిన వారు మహాపండితులు మహాకవులు మహావక్తలు యశోవంతులు జయశీలు రగుదురు గురువును పూజించి ఉపదేశంపొంది కణ్వశాఖోక్తముగ దీనినాచరింపవలెను.

# శ్రీ పరమేశ్వరి

## స్కంధము-10

### లక్ష్మి గంగా సరస్వతుల జన్మకథ

వీరు ముప్పురు శ్రీ హరికడ నుండి సేవలోనర్చుచుండిరి. శ్రీహరి గగంపై నెక్కువ మక్కువ చూపుచుండెనని సరస్వతి కలహమునకు దిగి, తనవైపు మాటాడక తటస్థముగా నుండి తనను వారించుచున్నందులకు లక్ష్మిపైగూడ కినుక చూప నారంభించెను, ఆకలహమును విననలేక శ్రీహరి యావలి కేగెను. కలహము మఱింత వృద్ధియైనది "నీవొకనదివయి చెట్టువయి కూడ జన్మింతు"వని సరస్వతి లక్ష్మిని శపించినది, అదివిని "నీవు గూఢ నదివై పాపులుండిన చోట ప్రవహింతు"వని గంగ సరస్వతిని శపించినది. "నీవుగూడ ఒక దీర్ఘమైన నదివై పాప మును భరించుచుందు"వని సరస్వతి తిరిగి గంగకు ప్రతిశాప మిచ్చినది.

ఇంతలో తనపార్శ్వచరులతో శ్రీహరి యచటి కేతెంచి వారి శాప విషయములను విని సరస్వతిని తన సరసకు జేరదీసి అముగ్గు రను ఓదార్చుచు మీరు మీశాపములను గూర్చి విచారిం పకుడు మీ జలప్రవాహముల వలన భూమి పావనమగును. మీరు ప్రవహించిన చోటులందు పుణ్యక్షేత్రములు వెలయును. మిమ్ము సేవించిన వారి పాపములు హరింపబడును. మీ జలములు తరు లతా సస్య జీవనాధారములై ప్రజల కువకృతి గలుగును. శాపా నంతరము శారద బ్రహ్మనుజేరును, లక్ష్మి తిరిగి నావద్దకు

వచ్చును, గంగ శివుని జటాజూటమున బడి అందుండి భగీరథుని ప్రార్థనల వలన భూమికేతెంచి భస్మములై పడియున్న సగరుని కుమారులను పదివేలగువారికి సద్గతులనిచ్చి పుడమిపైగల నదు లన్నిటిలో అత్యుత్తమముగా గణింపబడి పూజలందుకొను'' నని నుడివి వారి నంపెను, వారుముగ్గురును గూడ తమతొందర పాటునకు. కలహములకు చింతించి పశ్చాత్తాపపడి శ్రీహరిని క్షమా భిక్ష వేడిరి.

తన కకారణముగ శాపము కలిగి నందులకు వగచుచు లక్ష్మీదేవి కన్నీరు గార్చుచు శ్రీహరి పాదములపైబడి "దేవా నిన్నువీడి యెట్లుండగలను. అదియుగాక పాపములుగల, పుడ మిపై ప్రవహింపవలయునా, నాకిట్టి దుస్థితి యేల రావలెను, పుడ మిపై అందఱు పాపులేనా యెన్ని నాళ్లిట్లుం డవలెను" అని విల పించుచుండ శ్రీహరి యామెను లేవనెత్తి "దేవీ, చింతింపకుము శాపముల మోషములు. తప్పవు. నీవు భూమికేగినను నీకళల న్నియు నాకడనే ఉండును. కలియుగమున అయిదు వేలేండ్లు గడచిన వెనుక శాపవిముక్తి కలుగును. పుడమి- పాపము-అను మాట నెత్తితివి. వినుము కలియుగ మత్యంత పాప భూయి మైనది. ప్రజలు దుర్వృత్తులతో దుర్వృత్తములు గాని జీవింతుర

వర్ణాశ్రమాచారములు నశించును. తత్ఫలితముగ రో ములు క్షామములు వృద్ధియగును. ప్రజలనేక బాధలకు లోనగు దురు. తరువాత కృతయుగము ప్రారంభమగును, ఈ యుగ

మున ధర్మము నాలుగు పాదములనడచి ప్రజలు సంపూర్ణ సుఖ శాంతి సంతోషములతో నుందురు. త్రేతా ద్వాపర యుగములలో ధర్మము ఒక్కొక్కపాదము తగ్గి కలియుగము నందొకపాదమే యుండును. మరల కృతయుగ మారంభమగును. ఇవి యుగ ధర్మములు, మొత్తము నాలుగు యుగములు కలిసి 43,20,000 మానవ వత్సరములు.

పుడమినందఱు పాపులుకారు భగవద్భక్తులును కలరు, నా కథలు వినుచు నన్ను పూజించు వైష్ణవ భక్తులును కలరు. వారి స్పర్శయే మీనదిజలములకు పావనతనిచ్చును.

వసుధామహత్త్వము గూడ వినుము. వెనుక వరాహావతార మున జలగర్భము నుండి నేను పైకిలేవనెత్తి నిలిపినదే వసుధ, సకల జీవులకును నివాసస్థానమై తరులతా కానన నదీనద వాపీ కూప తటాక శైల శాద్వల సస్యకేదార శోభితము.

నవరత్న లోహఖని సమన్వితము. పరమపూజ్య మైనది వసుధ. భూదానమొసగు వారికి పుణ్యలోకములు తప్పక కలుగును. పావనమైన వసుధమీద నీవొక నదివై తులసి చెట్టువై నీ శాపకా ౦ము తీరి తులసి యను స్త్రీగా జన్మించి తిరిగి నాకడకు వత్తువు. అంతదనుక నీకళలు సర్వము నాయొద్దనే యుండును, భూమిపై నున్నపుడును నన్ను స్మరించుచు నన్ను కలియవలెనను ధ్యాన ముతో నుందువని ధైర్యము పలికి శ్రీహరి లక్ష్మిని వీడుకొలిపెను.

పుడమిపై నవతరించిన గంగ బహుపుణ్యమూర్తి, జలజ నేత్రుని సతియనియు బ్రహ్మ కమండలమునను, శివుని జటల యందు వాసిగాంచిన భాసుర రూప యనియు గంగను నుతింతురు, దేవా ఈ వివరములు వినగోరెద నని నారదు డడుగ నారాయణు డా గంగా చరిత్రమంతయు నిట్లు నుడివెను-

## గంగాభ్యుదయము

గోలోకమందు రాధాకృష్ణుల అంశయై, మనోజ్ఞాకృతితో గంగ ప్రాదుర్భవించి, కృష్ణుని మోహనాకారమును గాంచి యా దేవుని చెంత చెలిమి పాటించుచు నిలుచున్నది. రాధయు తన చెలికత్తెలతోవచ్చి కష్ణుడు గూడ గంగ వైపు ప్రేమతో తిలకించుట గాంచి కృష్ణుని నింద యొనర్చి అపవాదులాడుట ప్రారంభించి నది. గంగయు రాధ యొనర్చు నిందలను భరించలేక తన రూపమును త్యజించి కృష్ణునే ధ్యానించుచు కృష్ణుని పాదము లందు లీనమైనది.

గంగాభ్యుదయముతో విశ్వమున ప్రసరించిన జలప్రవాహములు, గంగ తన రూపమును త్యజించి నంతనే శుష్కములై జగము సంక్షుబ్ధమయినది- దేవతలు మునులు ఈ విపత్తును భరించలేక మొఱలిడగా శంభుడు బ్రహ్మయుగలిసి గోలోకమునకేగి స్త్రీ పురుషరూపముల కలితుడై ప్రకాశించు కృష్ణుని స్తుతించిరి. కృష్ణుడును వారు వచ్చిన కారణమరసి రాధకు భీతిల్లి గంగ తన పాదములందుడాగుట నుడివి ఆమెభీతిని మాన్పుడని నుడివెను.

బ్రహ్మ అంతట రాధనుజూచి "మహాదేవీ, లోకమాతా, యనుచు వేదపాఠములతో స్తుతించి, అమ్మా నీవును కృష్ణుడు నెఱపిన రాస లీలవేళ మీమేనుల నుండి స్రవించిన స్వేదమే యీగంగ, యీ మెపై దయజూడుమమ్మా"యని, కృష్ణుని పాదములు వీక్షించి గంగాదేవికి రాధామంత్ర ముపదేశించెను. రాధ ప్రసన్నురాలై నది- గంగ రాధామంత్రము జపించుచు కృష్ణుని ధ్యానించుచు పైకివచ్చినది- అపవిత్ర గంగా జలములు కొన్నిటిని బ్రహ్మ తనక మండలువు నందు గ్రహించెను. శంభుడు తన శీర్షము నందు భక్తితో జల్లుకొనెను- విష్ణు పాదమునుండి పైకరుదెంచిన గంగకు విష్ణుపదియను ప్రసిద్ధ నామము కలిగినది.

## గంగావిష్ణు సంబంధము

కృష్ణుని పంపున గంగ వైకుంఠమునకు శ్రీ విష్ణువుకడకు వచ్చినది. ఆమె వెంటనే బ్రహ్మయువచ్చి, దేవా రాధాలక్ష్ముల వలె గంగయు కృష్ణభావమునుండి వచ్చినది- ప్రకృతి పురుష లిరువురు పరమార్థమున ఒకేరూపము. ఈ గంగను కూడ నీవు స్వీకరింప వలసినదని పార్థింపగా విష్ణువామెను స్వీకరించెను.

## పుడమిపై గంగావతణము

సూర్యవశీయుడగు సగరుడను మహారాజశ్వమేధ యాగము జేయుచు తన యాగాశ్వము వెంట రక్షణకై తన అరువది వేల పుత్రులను పంపెను. ఆయశ్వము మహావేగమున పాతాళము

వఱకేగి కపిలమహాముని తపమొనర్చుకొను ప్రాంతమున ఆగి పోయెను. సగరుని పుత్రులాహయమును వెదకుచు పోయికపిలు నాశ్రమమున నాహయమును గాంచి యాతడే మునివేషమున నున్న దొంగయని నిందింప ఏ నేరమును ఎఱుగని కపిలుడు కోపమున కనులు దెఱచినంతమాత్రమున ఆకోపతాపమునకు ఆ యరువది వేలమందియు నచటనే భస్మమయిరి- సవనాశ్వమును గూర్చిన సమాచారము నెఱుగక సగరుడు అసమంజుడను తన తనయుని వేఱొకని బంపెను. అసమంజుడు వినయశీలి, ఆతడును హయమును వెదకుచు కపిలుని కడకేతెంచి తానువచ్చిన పనిని తెలిపెను. ఆమునియు అసమంజుని కరుణించి ఆ ప్రాంతముల నున్న హయమును జూపి ఆతని యన్న లరువది వేలమందియు భస్మరాసులుగ పడియున్న విషయమును దెలిపి అకాశగంగా ప్రవాహ మాభస్మరాసులపై ప్రవహింప జేయగలిగినచో వారికి సద్గతులు కలుగునని నుడివెను. అసమంజుడు గుఱ్ఱమును కొని రాగా సగరుని యాగము పూర్తియైనది. కాని ఆకాశగంగ భూమికి వచ్చుటెట్లు? అది సాధ్యముకాలేదు. తరువాత రెండు తరముల వారికిని సాధ్యముకాలేదు.

గంగను భూమికి దెచ్చుటకు సగరుని మునిమనుమడు భగీరథుడు కడుదీక్షతో విష్ణువును గూర్చి తప మొనర్చినాడు. విష్ణువు లోకకళ్యాణమెంచి గంగానదిని భూమికి పంపుట కంగీకరించెను. విష్ణువును వీడుటకు గంగానది వగచినది. విష్ణు వామె నూరడించి "దేవీ నీవలన భరతవర్షము పుణ్య ప్రదేశమై సస

శ్యామలమై. నీవేగు ప్రదేశములు పుణ్యక్షేత్రములు కావలసియు న్నవి. నిన్ను సేవించినవారి పాపములుతొలగును. నిన్ను గంగా మాతయని ప్రజలు పూజింతురు. సాగరుడు నిన్న త్రిప్రేమతో గైకొనును" అనినుడువగా గంగానది పుడమిపై కేగుటకు సిద్ధ పడినది- కాని మహాతరంగములతో ఆకాశమునుండి ప్రచండ వేగమున పడు గంగ నాపగలవారెవరు! మహాశివుడొకడేయని మునులు పలికిరి. భగీరథుడు మరల శివుని గూర్చి తపస్సొనర్చి మెప్పించెను. గంగా ప్రవాహములు ఆకసమునుండి పడుచుండ శివుడు ముందు తన జటలయం దాప్రవాహమును ధరించెను.

భగీరథుడు గంగను పూజించి "గంగాంబికా, కలుషహారిణీ కృష్ణాంశసంజాతా కృష్ణతుల్యా త్రిపథా" యని నుతించుచు ముందు నడువ గంగానది మహాప్రవాహముతో నతని వెంటనేగుచు మార్గ మధ్యమున జహ్నుడను మహాఋషి ఆశ్రమప్రాంతములు నింపి, ఆతని చెవినుండి పైకివచ్చి జాహ్నవియను పేరు గాంచినది. మరలభగీరథుని వెంటనేగిఆగంగ సగరతనయుల భస్మరాసుల పై ంతి వారికి సద్గతుల గల్గించి ఉత్తర భారత మెల్లను గడచి నేక ఉపనదులను గల్పుకొనుచు సాగరుని జేరినది-గంగామాత దేశీయుల కెల్లరకును ఆరాధ్య దేవి.

ఈ గంగా వతరణ కథ చదివినను వినినను సకల సంప త్కరము శుభప్రదమగును

శ్రీమహాలక్ష్మి అంశయై భువిని జన్మించిన తులసి మరల వద్మాక్షు నెట్లు జేరెను. ఇట్టి అంశలు మఱేమైన ఉన్నవాయని నారదుండడుగ నారాయణుడిట్లు వచించెను-

తులసి కథవలె వేదవతి సీత కథలును స్మరింప దగినవి. వారును శ్రీలక్ష్మి అంశలే.

### వేదవతి

దక్ష సావర్ణిమనువు, అతని వంశీయులును విష్ణు భక్తులు. కాని వారిలో వృషధ్వజుడను నృపాలుడు శివభక్తుడై యితర దైవములు లేరని వాదించుచు హరి సేవలు మానెను. సూర్యుడిందుల కాగ్రహించి సిరిసంపదలులేని దరిద్రుడ వగుదువని యారాజును శపించెను. వృషధ్వజుడు క్రమముగ తన రాజ్యము పోయి హీనస్థితికి వచ్చెను. శివుడు తన భక్తుని దీనస్థితికి విచారించి సూర్యుని మీదికి శూలముతోరాగా సూర్యుడు భయపడి శ్రీహరి వద్దకేగెను. ఇంతలో శివుడును సూర్యుని వెంటాడుచు శ్రీహరిని జేరెను. శ్రీహరి శివుని ముందుగ సత్కరించి కుశల ప్రసంగము జరిపి, శివా మనమిట్లు సంభాషించుటలో ఒక గడియ గడచినది. నీవు సాయమొనర్ప దలచిన వృషధ్వజుడు మరణించెను. అయినను ఆ వంశీయులకెట్టి లోపమురాదు. వారిని మఱవక లక్ష్మి ఆదరించు'నని చెప్పి తదుపరి శ్రీహరి సూర్యుని జూచి "రవీ నీకేల తొందరపాటు, నాకును శివునకును భేదము లేదు, ఇరువురము ఒకేరూపమని యెఱిగి చరింపు''మని మందలించెను. శివుడును శ్రీహరి మాటలకు తృప్తుడై వెనుక కేగెను.

శ్రీహరి నుడివినట్లు వృషధ్వజుని వంశమందు కుశధ్వజ ధర్మధ్వజులను నృపతులు జనించి తపశ్శాలులై శ్రీహరిని పూజించి సిరిసంపద లందిరి.

వారిలో కుశధ్వజు డనువానికి లక్ష్మి యొక్క ప్రధానాంశతో ఒక పుత్రిక జన్మించినది. ఆమె జనించిన క్షణమున వేద పాఠములు వినిపించుటచే ఆ బిడ్డకు వేదవతి యను నామమిడిరి. చిన్న నాటినుండియు వేదవతికి శ్రీహరి భక్తి యలవడి శ్రీహరినే ధ్యానించుచు శ్రీహరినే తాను పెండ్లాడవలయునను పట్టుదలతో నున్నది. ఒకనాడామె శ్రీహరిని గూర్చిన తపోదీక్షలో నుండగా ఆ దారిని బోవుచు లంకాధిపతి యగు రావణాసురు డామెసౌందర్యమున కలరి కామాంధుడై యామెను బలాత్కరింప నుత్నించి శిరోజములు పట్టుకొని లాగెను. వేదవతి రావణు నొక్కయూపున ఆవలకు పడగొట్టి "ఓరీ మూర్ఖా నీ కామాంధ్యమే నీకు మరణ కారణ మగును, నీ చావునకై నేను మఱియొక జన్మము ధరించి నిన్ను జంపింతును. నీవు తాకిన ఈ శరీము నొల్ల" నని యోగాగ్ని కల్పించుకొని అచటనే అగ్ని కాహుతి యై శ్రీ లక్ష్మిని కిరెను. రావణు డామెమాటలకు భయ కంపితుడై వెనుక కేగెను.

## సీత

ఆవేదవతియే మిథిలాధి పతియగు జనక మహారాజునకు యజ్ఞ భూమిలో నాగలి చాలున పద్మాసనయై దొరకిన శిశువు. ఆబిడ్డకు సీత యని పేరిడి జనకుడు అమిత ప్రేమాదరములతో

పెంచుచుండెను. రావణుడాది దుష్టరాక్షస వధకై దేవతలు వేడగా విష్ణువు అయోధ్యాధీశుడగు దశరథునికి కౌసల్యగర్భమున శ్రీరాముడై యుదయించెను. శ్రీరాముడు బాల్యముననే సకలవిద్యావంతుడు మహాపరాక్రమ వంతుడునై విశ్వామిత్ర మహర్షి యాగ సంరక్షణార్థ మేగి విశ్వామిత్రునివలన అమోఘములగు శస్త్రాస్త్రములను మంత్రోపదేశములతో బొందెను. తనయొద్దనున్న పర్వతతుల్యభారమగు శివధనుస్సు నెత్తి మోపెట్టిన బలశాలికి సీత నిచ్చెదనని జనకుడు చాటుట విని విశ్వామిత్రమహర్షి శ్రీరాముని మిథిలకు తీసికొని పోయెను. పెక్కు మంది మహావీరాధివీరులే పైకెత్తలేని, ఆ మహాధనుస్సును జనకుని సభామధ్యమున శ్రీరాముడవలీలగ నెత్తి భగ్నమొనర్చి సీతను పెండ్లాడెను. తండ్రి దశరథుడు తన చిన్న భార్య కైక కిచ్చిన వాక్యానుసారము శ్రీరాముడు భార్యసీతతో అరణ్యముల కేగవలసి వచ్చెను. అచ్చట పెక్కుమంది రక్కసులు శ్రీరామునిచే వధింపబడిరి. ఆ యరణ్యములందు తిరుగు శూర్పణఖ యను రక్కసి శ్రీరాముని కామించి తిరస్కరింపబడి యెట్లయిన తన పగ తీర్చుకొన దలచి సీత సౌందర్యమును గూర్చి తనయన్న రావణునకు జెప్పి తనకు గలిగిన పరాభవమును గూడ నుడివెను. శ్రీరాముడాశ్రమమున లేని సమయమున రావణుడు మునివేషధారియై మోసమున వచ్చి సీత నపహరించి లంకకు కొనిపోయెను. శ్రీరాముడు మిత్రుడైన సుగ్రీవుడను కపిరాజు సాయమున హనుమదాది కపివీరుల సేనతో సముద్రమునకు వారధి గట్టి లంకను జేరి దుష్టరాక్షసుడైనరావణాసురుని సపరివారముగ పరిమార్చి సీతను గొని

వచ్చెను. సీతారాములకు కుశలవులను పుత్రులు కలిగి ఆ వంశము తామర తంపరగ అభివృద్ధి నందినది. తానుదయించిన హేతువగు రావణవధ పూర్తియగుటతో సీత శ్రీరాముడొనర్చు ఒక యాగ సమయమున భూగర్భమున జేరి వైకుంఠమున కేగినది. పదపడి శ్రీరాముడును ధర్మపాలకుడై రాజ్యమేలి వికుంఠధామమునకు తన విష్ణురూపముతో ప్రస్థాన మొనరించెను.

## తులసికథ

కుశధ్వజుని తరువాత ఆవంశమున ధర్మధ్వజుడను సుగుణాత్ముడు నృపతియయ్యెను. అతడు నిరంతర విష్ణుపూజా తత్పరుడు. తనదేవేరియైన మాధవినిగూడి అరణ్యములందే నివసించుచు శ్రీహరిపూజలు సేయుచు కాలముగడపుచుండెను. మాధవి గర్భవతియై స్త్రీ శిశువును గనెను. నిరుపమ సుందరియగు అశిశువు సౌందర్యమునకు తులయగు వారిలవయు లేరని ఆబిడ్డకు తులసి యను నామమును మునులందఱును ఒసగి ఈమె మహాలక్ష్మిసమాన యగు నని దీవించిరి.

తులసి చిన్ననాటి నుండియు గోలోక కృష్ణునే మనసు నందుంచి తపమాచరించు చుండెను. ఆబాలిక తపమునకు సంతసించి బ్రహ్మ ప్రత్యక్షమై వరమడుగు మనగా తులసి యానరసిజభవుని చరణము లంటి "దేవా నేను పూర్వజన్మమున గోలోకమం దొకగోపికనై కృష్ణునెడ అనురాగముగ కలిగియుండ రాధకోపించిపృథివిపై జనియించునట్లు నన్ను శపించినది కృష్ణుడు

నా విచారమును గ్రహించి "నీవీ శాపమునకు దుఃఖింపవలదు. నాఅంశతో పుడమిపై చతుర్బాహుడొకడు జన్మించుచు. నీవాతనిని వివాహమాడుము. తరువాత నాకడకు తిరిగి వచ్చెద వనెను', నా మనస్సంతయు ఆకృష్ణుని యందె ఉన్నది దేవా" అని ఆమె వచింప బ్రహ్మ "కుమారీ, ఆచతుర్ముఖుడు శంఖచూడు డనుదైత్యుడే గాని కష్ణాంశ సంభూతుడు. నీవాతనిని వివాహమాడుముతరువాత పవిత్రమైన తులసి మొక్కగ పుడమిపై నీవు పెలయుదువు, తులసి దళములతో శ్రీహరిని భక్తులు నిత్య మర్చింతురు. అ దళముల రూపమున కృష్ణుని మేన నిరంతరము నీవు ప్రకాశించుచునే యుందువు" అని నుడివి రాధవలన నికముం దే అవరోధము రాకుండ రాధా మంత్రమును తలసికి ఉపదేశించి బ్రహ్మ అదృశ్యుడయ్యెను.

తులసియు కృష్ణునే మనసునందుంచి, రాధాక్షర పవిత్ర మంత్రమును జపించు చుండ ఒకనాటి రాత్రి యామెకు కలలో ఒక సుందరాకారుడు కనుపించి యామె మనసు హరించెను మరునాడు తులసి తపమొనరించుచున్న స్థలమునకు కష్ణమంత్రో పదేశమంది యోగ్యుడైన సిద్ధులు బడసిన శంఖచూడుడు చతు ర్బాహుడై యేరుదెంచి తులసిని వరించి పెండ్లాడ గోరెను. ఈతడెవరాయని తులసి శంకించుచుండ సరసిజాసను డేతెంచి "కుమారీ మున్ను నీవు గోలోకమందొక గోపికగా నున్నపుడు నిన్ను గోపబాలుడొకడు ప్రేమ భావమున జూడ, రాధ కోపించి శపించిన యతడే కృష్ణాంశసంభూతు డీశంఖచూడుడని యా యిరువురను ఒకరినొకరికి పరిచయముజేసి వెడలెను. తులసీ

శంఖచూడుల రతివైభవముగ వివాహమయ్యెను. తనకు లభించిన కృష్ణమంత్రప్రభావము, బలసిద్ధులేకాక తాను వలచిన స్త్రీని వివాహమాడ గల్గితిని గదా యని శంఖచూడుడు గర్వితుడై మునులను దేవతలనుగూడ లెక్కచెయక మహాభయంకరుడై విహరించుచుండెను- దిక్పాలాది సర్వదేవతలు శక్తులు శంఖచూడుని పైకరుదెంచిరి గాని విజయము సాధింపలేకపోయిరి- బ్రహ్మయు శివుడును కలిసి విష్ణువు కడకేగి శంఖచూడుని దుష్కార్యములను వివరించిరి. శ్రీహరి వారిని జూచి "శంఖచూడుని భార్య మహాపతివ్రత. ఆమె పాతివ్రత్యమునకు లోపము కల్గినపుడు గాని ఆయసురుడు బలహీనుడు గాడు. ఆపని నేను చూచెదను. ఆతడు నాభక్తుడుగాన నేను శంఖచూడుని చంప నొల్లను నా శూలమును గైకొని మహాశివుడు ప్రమథగణసమేతుడై శంఖచూడుని పైకేగవచ్చును." అని నుడువగా బ్రహ్మయు శివుడును సంతృప్తులై తత్కార్య నిర్వహణకై యరిగిరి.

ప్రమథగణములు దేవతలు తనవెంట నడువ మహాశివుడు శంఖచూడుని పైకరుదెంచెను. శంఖచూడుడును యుద్ధసన్నద్ధుడగుట చూచి తులసి "మహారాజా! మహాశివునితో మీకు యుద్ధము తగదు. స్వర్గరాజ్యమును తిరిగి అమరులకిచ్చి, మనరాజ్యముతో తృప్తిపడి మనము శాంతముగ కాలము గడుపుట ఉచిత"మని వారింప జూచెనుగాని శంఖచూడుడు వినక ఆమెనెట్లో ఒడంబరిచి మఱునాడు రణసీమ కరిగెను. యుద్ధమునకు ముందు శంఖచూడుడు భక్తితో కృష్ణమంత్రము జపించెను. శివుని పూజించెను

విప్రులకు దానధర్మము లొసగెను. ఆపిమ్మటనే అసుర సైన్యములతో గలసి యతడు అనిమొన కేగెను.

శంఖచూడుని తేజమును గాంచి మహాశివుడే యాశ్చర్య పడెను. ఇంతటి భక్తుని పరిమార్ప వలసి వచ్చినది గదా యని యోచించుచుండెను. దానికి తోడు శంఖచూడున కొక కవచము న్నది. దాని నతడు ధరించి యున్నంతవరకు అత డజేయుడు. శివున కిదిగూడ తెలియును అంతలో శ్రీహరి ఒకవృద్ధ విప్రుని వేషమున శంఖచూడుని సమీపించి 'నాకు మిక్కిలి చలిగానున్నది నీకవచము నాకు దానమిమ్ము నీవు యుద్ధము నందున్నపుడు అడుగు చున్నాను, నా చలిబాధ అట్లున్నది'' అని అర్థింపగానే నిశ్చింతగా శంఖచూడుడు తన కవచము నావిప్రునకిచ్చి యుద్ధ రంగమునకేగెను. శ్రీహరి తన విప్రవేషము నుజ్జగించి శంఖ చూడుని కవచము ధరించి అతని యాకారముతో యుద్ధమున విజయము గొనినట్లు తన సౌధమునకేగెను. తులసియు పరి వారములును శంఖచూడుడు విజయుడై వచ్చెనని తలచి తగిన స్వాగతనివాళులిచ్చి యాతనినిలోనికి గొనిపోయిరి.

దయతో స్వర్గరాజ్యము తిరిగివారలకిచ్చితిని, యుద్ధమున నాకేవిజయము లభించినది అని శంఖచూడుని వేషములో నున్న శ్రీహరి తులసిని నమ్మించి నంతఃపురిలోనికి గొంపోయి యామెతో గూడి యుండగా తులసి కా రూపమునందేదో కొంత భేదము గోచరించి "నీవెవరవు నాభర్త శంఖచూడునివలె నటించుచున్నావు గాని శంఖచూడుడవు కాదు నిన్ను నేను శపింతు'' ననుచుండగా

కృష్ణుడు తన నిజరూపమున తులసి యెదుట నిలచి "కాంతా నీ వెవరిని మనసునందిడుకొని ఇన్నినాళ్ళు తపస్సొనరించుచుంటివో అకృష్ణుడను నేను. నీవు నీపూర్వస్థానమునకు లక్ష్మీరూపమున వచ్చు సమయ మాసన్నమైనది. నీకీర్తి లోకమున చిరస్థాయిగా నుండును. జనులకు సంపదలిచ్చు తులసి మొక్కగ నీవవతరింతువు. నేను ద్వాపర యుగమున నందునింట గోప కృష్ణుడనై తులసి వనమునందే విహరింతు" నని యదృశ్యు డయ్యెను. తులసికిది యంతయు అద్భుతముగ గోచరించెను. ఆమెయు తన తనువును చాలింప ఆమె యాత్మ శ్రీహరిని జేరెను. ఆమె శరీరము నుండి గండకి యను పుణ్యవాహిని పుట్టి ప్రవహించినది, ఆమె శిరోజములు బృందావనమున తులసి మొక్కలుగ జన్మించి పుడమి నెల్ల వ్యాపించెను. ఆ తులసి మొక్కనే త్రిభువనములు లక్ష్మీరూపముగ నెంచి పూజించి యా తులసీ దళములతో శ్రీహరి ప్రతిమల గూడ పూజింతురు,

శంఖచూడుడుబలిని మించిన వదాన్యుడై తనకమరత్వ మొసగగల కవచమును నిర్విచారుడై దానమొసగెను, అట ులసితో శ్రీహరి కూడుట కూడ తటస్థించినది. శంఖచూడుని లము సన్నగిల్లినది. తనకు జరుగనున్నది సర్వము గ్రహించ గలిగి శంఖచూడుడు మున్ముందు యుద్ధరంగమున మహాశివుని పాదములకు ప్రణమిల్లి యాతనిచేత శూలహతికి ప్రాణములు విడిచెను. గోలోకమునుండి వచ్చిన దివ్యవిమానమొకటి గోపాల బాలు నాకృతిని పడియున్న శంఖచూడుని గోలోకమునకు

గొంపోయెను- స్వర్గరాజ్యము మరల దేవేంద్రాది సురలకు దక్కెను.

శంఖచూడుని శరీరమునందలి యస్థికలె పుడమిని శంఖము లైనవి. శంఖములతి పవిత్రములు, పూజనీయములు. శంఖము నందలి జలము జలజాక్షున కతిప్రియము.

వేదవతి, సీత, తులసి, యిట్లు లక్ష్మీదేవి అంశను పుడమినుద్భ వించిన మహాపతివ్రతలు. వీరికథ లత్యంత పుణ్యప్రదములు, వీరిచరిత్రములను చదువుటయు వినుటయు శ్రీమహాలక్ష్మిని పూజించుటేయయి భక్తజనులకు శ్రీకరములు శుభకరములు సర్వసంపత్కరములై విరాజిల్లు చున్నవి.

## సావిత్రికథ

ఈమెయు మహాపతివ్రత పాతివ్రత్య మహత్వమున కీమె చరిత్రమొక చక్కని ఉదాహరణము- ఈమె అశ్వపతియను భూపాలుని పుత్రిక. సత్యవంతుని భార్య సత్యవంతుడు యౌవన మునందే మృతుడయ్యెను. ఆ రాజకుమారుని ప్రాణములను తీసికొని పోవుటకే తెంచిన యముని కడుధీరతతో సావిత్రి అడ్డగించి సతికి పతియేదైవము, ఏ పాపమెఱుగని రాజకుమారు నింత చిన్నవయసులో మరణము పాలుచేయుట యేమి పాడి"యని యమునితో వాదించినది. తనజిజ్ఞాసతో జ్ఞాన విషయములన్నియు యమునితోచర్చించి ఆత్మప్రబోధము లందినది. యముడెంత చెప్పినను వినక తనవిభుని ప్రాణములకై యముని వెంటనంటి తనపాతివ్రత్య మహిమచే ఊర్ధ్వలోకమునకు గూడ సావిత్రి చేరు

టచే యముడామె దీక్షకును పాతివ్రత్య మహిమకును మెచ్చి వరములడుగ మనెను. సావిత్రి తన పతిప్రాణములను, అంధులై అరణ్యములపాలైన అత్తమామలకు నేత్రదృష్టియు, రాజ్య ప్రాప్తియు, తండ్రికి పుత్రసంతానము వరములుగాగోరి తన భర్తతోగూడి గృహమున కరుదెంచెను,

## ఇంద్రుడు లక్ష్మిపూజ సేయుట

ఒకనాడు దుర్వాసమునీంద్రుడు వైకుంఠమున శ్రీహరి పాదపూజల నొనరించి వెనుదిరిగి వచ్చుచు, పూజాప్రసాదముగ నొక పారిజాతసుమమును దేవేంద్రునకిచ్చెను, దేవేంద్రుడా సుమమును గౌరవింపక దానినొక యేనుగు తలపై బెట్టెను. ఆ సుమస్పర్శచే ఆ యేనుగు మహిమకలదయి అరణ్యములకేగి పుణ్యలోక ప్రాప్తి గాంచెను శ్రీహరి పాదపూజాపుష్పము నగౌరవ పరచిన పాపమునకై దుర్వాసుని శాపమున ఇంద్రునికి సర్వ భాగ్యములు నశించి స్వర్గరాజ్యముగూడ దానవుల వశమయ్యెను.

తన తప్పుగ్రహించి యింద్రుడు దుర్వాసుని పాదములపై బడి పశ్చాత్తప్తుడై ప్రార్థింప ఇట్టి యనుచితముల నిటు తరువాత చేయువలదని మందలించి ముక్తిమార్గ విధానమును తెలిపెను. ఇంద్రుడు దీనుడై తనదుస్థితిని మాన్ప యత్నమున బ్రహ్మను శివుని విష్ణుని ప్రార్థించి వారి యాదేశాను సారము లక్ష్మీదేవిని మనసునందు ధ్యానించుచు సురలను వెంటబెట్టుకొని దానవులతో కలిసి క్షీరసాగరమును మధించి అందుద్భవమైన అమృతమును గైకొనెను. అమృతముపెంట జనించిన లక్ష్మీదేవిని యథావిధిగ పూజించి యెట్టకేలకామె దయవలన తన రాజ్యసంపదల తిరిగి సంపాదించెను-

రాధ అధిదేవత. తారమును శక్తియు బీజములు. ఈమంత్ర జపము ఆయుర్మహనీయ భాగ్య విభవోదయ కారకము. రాధాకృష్ణులొకే భావము రాధకృష్ణుని ప్రాణముగాన రాధను విడిగ అర్చింపరాదు.

రాధా మహత్త్వమును దెల్పుచు నారాయణుడే "రాధ సృష్టికాది, లక్ష్మి, షష్ఠి, మంగళ చండిక, గౌరి, గంగ, గాయత్రి శారద, తులసి, సావిత్రి, దుర్గ, ఆమెయే' యని బహురీతుల స్తుతించెను' రాధా దురిత హారిణి సర్వసంపత్కారిణి. ఈ రాధాస్తోత్రము సర్వులకు శుభదాయకము శక్తిపూజా వృత్తిచే షడంగములు చేసి సామవేదోక్త విధమున రాధాదేవిని ధ్యానింపవలెను.

## దుర్గ

జగన్మాత దురితహరిణి, దుర్గానామ జపము ఇష్టకామ్యార్థ సిద్ధి నొసగును. సర్వభూషణ, సర్వాయుధ, సర్వశక్తి సమన్విత యయిన దుర్గను హరి హర బ్రహ్మలు నిరతము పూజింతురు. దుర్గయె శాంభవి లక్ష్మి శారద, ఆదుర్గను సకల శక్తిరూపముగ నెంచి షట్కోణ యంత్రమున నుంచి ఆరాధాన సలుపవలెను. దుర్గానవాక్షర మంత్ర జపమును సలుపుచు సప్తశతీస్తుతి యుతముగ దుర్గారాధన సలుపుట శాస్త్రవిధి.

వాగ్భవము శంభు వనితయు కామబీజము పిదప 'చాముండాయై' పదము నమః పదముతోగూడి దుర్గానవాక్షర మంత్రరాజమయ్యె, దీనికి ఋషులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఛందములు గాయత్రి ఉష్ణికే అనుష్టుప్పులు, అధిదేవతలు మహా

కాళీ మహాలక్ష్మీ మహాసరస్వతులు, బీజములు క్షీరక్త దంతిక దుర్గ భ్రామరులు నంద శాకంబరి భీమాదేవులు, వినియోగము చతుర్విధ పురుషార్థములు.

ఇరువది నాల్గు పత్రములు ఆరుకోణములుగల అష్టదళ పద్మమును నిర్మించి దుర్గాప్రతిమను సింహవాహన యుక్తముగ మహిషాసురునిగూడ బెట్టి ఆయాస్థానముల సర్వశక్తులను గణేశాది ధిక్పాలురను భావించి పూజించుచు దుర్గానవాక్షర మంత్ర జపముతో పాటు సప్తశతీస్తుతిని గావించుచు షోడశోప చారములతో దుర్గార్చన యథావిధిగ గావింపవలయు.

సప్తశతికి మించిన స్తవములేదు. శైవవైష్ణవులనెడు భేదములేక దుర్గనందఱును పూజింపవచ్చును. త్రిమూర్తులు సర్వదేవతలు మునులు యక్షకిన్నెర కింపురుష గంధర్వాదులు నరులు దానవులు సర్వుల నుండియు పూజలందుకొను మహాశక్తి దుర్గ. దుర్గాపూజ సర్వాభీష్టప్రదము చతుర్విధ పురుషార్థప్రదము శ్రీకరము శ్రేయస్కరము.

శ్రీ — శ్రీ — శ్రీ

## స్కంధము 11

### సదాచారములు

మానవాళికి శ్రేయము గూర్చు సదాచారము లెట్టివని నారదుడడుగ నారాయణుండిట్లు బోధించెను-

సదాచారములు వేదములందున శాస్త్రములందున ప్రవచింబడినవి. ఈరెంటి యందును భేదమున్న యెడల వేదవిధులు ప్రధానము- వేదములలోనే రెండు రీతులుగ నున్నచో ఆరెండును ఆచరణీయములే.

సదాచారములు శుభప్రదములు, సత్కర్మప్రవర్తనము గలుగజేసి జ్ఞాన సముపార్జనమునకు దారిజూపును. జ్ఞానము మోక్షసిద్ధికి తెరువు. ఆచారవంతులనినచో అంబకు మిగులప్రీతి దురాచారములు రోగములకు దుఃఖములకును కారణములు దేశకాలానుగుణముగ ధర్మపద్ధతులలవడ జేసికొనుట యుక్తము. గురుప్రబోధమువలన ఆచారవిధులను సక్రమముగ నేర్వవచ్చును ఎన్నివిద్యలనేర్చి ఎన్నిశాస్త్రములు చదివినను జన్మమునతుదకు ఉపయోగకరమైనది సదాచారవర్తనమే-

నిశలందు రెండవ యామము ప్రాణాయామమునకు తరువాత దేవీధ్యానమునకు నాల్గవ జాము బ్రహ్మముహూర్తము వేదాధ్యయనమునకు చాల అనుకూలముగ నుండును-ప్రత్యూష కాలమందలి స్నానము అవయవ శుద్ధియు, చిత్తశాంతి నొసగును.

శుచిత్వము అతిముఖ్యము. గాయత్రి మంత్రమును పఠించుచు చేసిన స్నానము ఫలప్రదము-స్నానజలము నిర్మలమై యుండ వలయును, జలమునందు గాని పచ్చికయందు గాని మలవిసర్జన నిషిద్ధము-జపసమయమున గురువు ముందు మౌనము పాటించుట ముఖ్యము.

ఇట్లెన్నియో ఆచార విధులున్నవి. ముఖ్యముగ విప్రులు గాయత్రి జపము, పితృతర్పణములు, విభూతి ధారణము తప్పక పాటింప వలయును. సదాచారములు లేని గృహము సకల దుఃఖములకు నిలయమగును-

## రుద్రాక్షమహిమ

రుద్రాక్ష చాలపవిత్ర మైనది. జపతపోవిధి సాధనములందు రుద్రాక్షధారణ చాలఉపయోగపడును. రుద్రాక్షలను ధరించు ఉత్తమాచారము, దేవతాప్రియము, శివజ్ఞాన ప్రదము రుద్రాక్ష ధారిముక్తికర్తుడు,

రుద్రుడు త్రిపురాసురులను సంహరింపగల అయుధముల కొఱకై తపస్సు చేయుచుండ శివుని నేత్రములు వ్యాకులములై అందుండి తొనకిన నీటి బిందువులనుండి రుద్రాక్ష తరువులు పుట్టి వాని ఫలములు రుద్రాక్షలైనవి. రుద్రాక్షలలో ముప్పదెన్మిది భేదములున్నవి. మాలయందున్న రుద్రాక్షల సంఖ్యను బట్టి ఆమాలలకు వేర్వేఱునామములున్నవి. శిరమున గళమున జబ్బల

యందుననుః రుద్రాక్షమాలలు ధరింతురు. పదిరెండు, పదునాలు, ఇరువది యైదు ఇరువది యారు ఇరువది యేడు ఏబది నూట యెనిమిధి రుదురాక పూసలున్న దుద్రాక్షమాలలు వాడుదురు. జపతపములు జన్నములు రుద్రాక్షమాలను ధరించి చేయు వారికి పరిపూర్ణ ఫలము లొనగును- రుద్రాక్ష ప్రక్కనున్న చాలును శుభప్రదమనియు ఏకీడును పిడను రానీయదనియు శాస్త్రములు వచించుచున్నవి.

రుద్రాక్ష ఫలములందున్న విభాగములను బట్టి వివిధ రుద్రాక్షలున్నవి. ఏకముఖము గల రుద్రాక్ష మొదలు పండ్రెండు ముఖముల వరకు గల రుద్రాక్షలున్నవి, అన్నియు ధరించుట కర్హములే, అన్నియును శుభప్రదములే, సందేహము లేదు.

ఆరుముఖములున్నవి పరమేశ్వరి స్వరూపములు, పది ముఖములున్నవి విష్ణు స్వరూపములు. ఎనిమిది ముఖములున్నవి వినాయక స్వరూపములు పదునొకండు ముఖములున్నవి రుద్ర స్వరూపములు. పండ్రెండు ముఖములు గలవి దేవతాపూజ్యములే నునియు ప్రసిద్ధి, అట్టివిలభించుట యేకష్టము.

రుద్రాక్ష మహిమనుగూర్చి ఎన్నియోకథలున్నవి

## గాడిదకథ

ఒక గాడిద తన జీవిత కాలమంతయు ఒకవ్యాపారియొక్క రుద్రాక్షమూటలను మోయుచు ఒకనాడు భారము భరించలేక

నెమ్మదిగా నడచుచుండెను. ఆవ్యాపారి గాడిద మందగమనము నకు కోపించి దానిని తాడించ మొదలిడగా ఆబాధపడలేక ఆగాడిద దారిలోబడి మరణించెను. ఆ ఖరము క్షుద్రజంతువే అయినను రుద్రాక్షలను మోసిన సత్కర్మఫలముచే మరణానంతరము కైలాసమున శివుని సన్నిధి జేరెను.

## గుణనిధి కథ

**గుణనిధి** సద్ధర్మవర్తనులగు బ్రాహ్మణవంశమున బుట్టియు దురాచారపరుడై తిరుగుచు తనగురువు పుత్రికనే కామించి ఆమెతో విలాసముగ గడుపుచుండెను, తన దుశ్చర్యను గర్హించిన తల్లి దండ్రులపైగూడ పగబూని గుణనిధివారిని విషమిచ్చి చంపెను. తుద కాగుణనిధి రోగముల పాలయి అరణ్యమున మరణించగా యమకింకరులాతని ప్రాణములుతీసికొని పోవుటకువచ్చిరి, ఇంతలో శివగణములు కూడవచ్చి వారి నడ్డగించి "ఇతడు మరణించి పడిన నేలక్రింద రుద్రాక్షలున్నవి ఆకారణముచే నీ బాలుని పాపములు నశించినవి, శివునాజ్ఞచే వీనిని కైలాసమునకు తేసికొని పోవు చున్నా"మని తీసికొనిపోయిరి. యమకింకరు లాస్థలమును త్రవ్విచూడగా అందు పవిత్రములయిన రుద్రాక్ష లగుపించినవి. మఱిమాటలేక వారు వచ్చిన దారిని వారేగిరి.

## శిరోవ్రతము-విభూతి మహిమ

రుద్రాక్షవలె విభూతియు చాల మహిమకల వస్తువు. స్నానశుద్ధి యొనర్చి శుచియై దేవిని దలచుచు విభూతి భస్మము

ఫాలమందు దాల్చుట శిరోవ్రతము. విభూతి భస్మమును మూడు రేఖలుగ ఫాలమున భుజములందు ఉరమున ఉదరము నందును దాల్తురు. విభూతి ధారణ కందఱును అర్హులే. బ్రాహ్మణులకిది అతి ముఖ్యము. విభూతిధారణ సర్వ కర్మాధికార మొసగును.

ఆఱువిధములుగ విభూతిభస్మమును తీయుదురు. హోమాగ్ని కుండమునుండి, విరజానలమునుండి, ఉపాసన అగ్నినుండి దావానలమునుండి, సమిదగ్నినుండి, పచనాగ్నినుండియును, సర్వవర్ణములకు ఆచరణ యోగ్యమైన దీ భస్మధారణము. విద్యార్థుల కిది అతి ముఖ్యము.

"త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్! ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ ముక్షియ్య మాఽమృతాత్"!!

అను అగ్ని మంత్రమును పఠించుచు దాల్చిన విభూతి పూర్ణఫలముల నొసగును. హస్తమునందు భస్మమును తడిచేసి, తీర్చిన రేఖలవలె, విభూతిని ధరింపవలయును. విభూతిధారణ మున ప్రతిభ, విద్య, ప్రఖ్యాతి, తేజము, శివజ్ఞానము, భోగభాగ్యములు, కలుగును.

## దుర్వాసునికథ

ఈ కథవలన విభూతి ధారణయందున్న మహిమ ప్రస్ఫుటముగ తెలియును,

దుర్వాస మహాముని యొకనాడు విభూతి రుద్రాక్షలను ధరించి శివుని పూజలను పూర్తి గావించి వచ్చుచు కుంభీపాక

నరకలోకము వైపున కరిగెను. అటనున్నవారు నానాశిక్షలకు లోనయి ఆక్రోశించు చుండిరి, వారి ఆర్తనాదమువిని యాముని అనుకంపతో వారివద్దకేగెను. ఆమునిపై సోకిన వాయు వీచికలకు యాతని ఫాలమునందు మేను నందునను ఉన్న విభూతి రేణువులు రేగి ఆనరక వాసులపై బడగా వారిపాపములు నశించి స్వర్గసుఖములు లభించినవి. దిక్పాలురకు బ్రహ్మకును ఆసంఘటన మాశ్చర్యము గొలిపినది. ఈ పాపుల కొక్కసారిగ సుగతులెట్లు వచ్చినవో కారణ మూహింపలేకపోయిరి. శివు డరుదెంచి ఇది యంతయు దుర్వాసుడు ధరించిన రుద్రాక్ష విభూతుల మహిమము ఈ ప్రదేశమిక పుణ్యప్రదమగు పితృతీర్థమగును అనిచెప్పెను శివ పార్వతుల విగ్రహములట బ్రతిష్ఠించి దేవతలు పూజించిరి. కుంభీపాకనరకము దూరమునకు పోయినది

విభూతి రుద్రాక్షలు ధరించు వారికి కుంభీపాక నరక భయము ఉండదు.

## ఊర్ధ్వ పుండ్రము

ఫాలమున ఒకప్రక్కనుండి మఱియొక ప్రక్కకు రేఖలుగ భస్మము తీర్చినచో అదిత్రిపుండ్రమను పేరుగలిగి యుండును. వైష్ణవులు ఫాలమున నిలువుగ భస్మరేఖలను తాల్తు రది ఊర్ధ్వ పుండ్ర మనఁబడును, పుట్టమట్టి, కొండమొగమట్టి నదియొడ్డుమట్టి, తులసి మొక్క మొదలునగలమట్టి, ఊర్ధ్వపుండ్రములకుత్తమము. ఈమృత్తిక లనేకవర్ణములు గల్గియుండును.

ఎఱుపు నలుపు పసుపు రంగులలో నుండును. త్రిశూలాకృతిగ

గాని మీనాకృతిగ గాని, వెదురాకువలె సన్నని రేకగా గాని ఈ ఊర్ధ్వ పుండ్రమును వైష్ణవులు ధరించుట ఆచారము. ఫాలము నందేగాక శిరసునందు చేతులయందు ఉరమున ఉదరమున గూడ నియమముతో కేశవనామములను చదువుచు నిష్ఠపరులీ యూర్ధ్వపుండ్రములను ధరింతురు.

నిలువు రేఖలతో నెగడు ఊర్ధ్వపుండ్రములందు లక్ష్మీ విష్ణువులు జతగూడి యుందురు గాన అది పవిత్రమై శుభకరమై శ్రీకరమై రాజిల్లును.

## వైశ్వదేవము

వండిన వంటకములను కొలది కొలదిగ తీసి మున్ముందు మండుచున్న అగ్నిహోత్రమున కాహుతి సేయుటయే వైశ్వదేవము. వస్తువులందుగాని వంటయందుగాని యేమైన దోషములున్నచో ఈయాచారము వలన అవి నశించి, ఈ యాచారమును పాటించువారికి ఆయు రారోగ్యములు, విద్యతేజస్సు సమృద్ధిగ లభించును, వైశ్వదేవ మునకు ముందు అతిథులు వటువులు అభ్యాగతులేతెంచినచో వారికి భోజనమిడి సత్కరింప వచ్చును. వైశ్వదేవ మొనర్చిన పిదప గోపూజ యొనర్చి గోవునకు గ్రాసమొసంగుట ఉత్తమము.

అన్ని ధర్మములలో సదాచార ధర్మము అతిప్రధానము దేవి సదాచార రూపిణి యగుటచే, సదాచారములు సకల సంపత్ప్రదములు-

సదాచారములలో అతిముఖ్యము అత్యుత్తమము అయినది సంధ్యోపాసన. దీనినే సంధ్యావందన మందురు. దినమునకు మూడుసార్లు అనగా సూర్యోదయమునకు పూర్వమే ప్రత్యూష మున ప్రాతఃసంధ్య, సరిగా మధ్యాహ్న కాలమున మధ్యాహ్న సంధ్య, సూర్యాస్తమయమునకు ముందుగా సాయం సంధ్య విధ్యుక్తముగ సదాచారపరు లీ సంధ్యోపాసనను పాటింతురు. ఇట్లు త్రికాల సంధ్యావందనము పాటించు బ్రాహ్మణునిదే సార్థక జన్మము. సంధ్యావందన సమయము దాటినచో మనువును జపించి అధికార్ఘ్య మిచ్చినచో ఆలస్య దోషము పోవును. విప్రుడు ధార్మికాచార వృక్షము వంటివాడు. ఈవృక్షమునకు సంధ్యోపాసన మూలము, వేదములు శాఖలు, ధర్మకర్మములు పత్రములు. దేవాలయములు, నదీతీరములు సంధ్యోపాసనకు పవిత్రస్థలములు.

సంధ్యోపాసనలో అనేక విధులున్నవి. అవి ఆచమనము కేశవనామములు, ప్రదేశ తిథివార యుక్తమైన సంకల్పము ప్రాణాయామము అర్ఘ్యములు. తర్పణములు, గాయత్రీ జపము పూజ ముద్రలు సూర్యోపస్థానములు, దిగ్దేవతా ఋషిగురు పితృ నమస్కారములు, గాయత్రీ ప్రస్థానము, ఈశ్వరధ్యానము మొదలగునవి అయిన పిమ్మట ఆ యాచారపరుని ప్రవరతో గూడిన అభివాదముతో సంధ్యోపాసన ముగియును.

ఋషులు మొదలు సామాన్యుల వరకు బ్రహ్మపదలబ్ధి అనువైన మార్గము సంధ్యోపాసనయే, ఇందు చెప్పబడిన ప్రాణాయామము ఆయురారోగ్య దేహ మనోబలములు ప్రసాదించి

సాధకుని యోగాభ్యాసమునకు మిక్కుటముగ అనుకూలించు ప్రక్రియ. ఇట్టి అభ్యాసమున అష్టాంగ యోగములుగ నిర్దేశింప బడిన, యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధి మార్గము లెనిమిది.

ప్రాణాయామము మూడు విధములు 1. పూరకము వాయువును లోపలికి పీల్చుట 4; సెకనులు 2. కుంభకము వాయువును శరీరములో నిశ్చలముగా నుంచుట 36; సెకనులు 3. రేచకము. లోపలివాయువును పైకి నెమ్మదిగా వదలుట 8. సెకనులు. ప్రాణాయామమును చేయుటకు రెండు విధము లైన ముద్రలు కలవు.

1. ప్రణవముద్ర : కుడిచేయి అయిదువ్రేళ్ళతో నాసిక చివరను పట్టు కొనుట గృహస్థులకు వాన ప్రస్థులకు ఉద్దేశింప బడినది,

2. ఓంకారముద్ర : కుడి బొటన వ్రేలితో కుడినాసి ను, ఉంగరపు వ్రేలు చిటికెనవ్రేలుకలిపి ఎడమ నాసికను పట్టుకొనవలయును - ఇది బ్రహ్మ చారులకు సన్యాసులకు ఉద్దేశింప బడినది,

కుంభకము నందు శ్వాసను బంధించినపుడు గాయత్రీ మంత్రము లోలోపలనే ఎన్నిసారులు చేసిన అంతమంచిది.

### యోగభ్యాసము

జీవాత్మ పరమాత్మల సంయోగమును సాధించు యోగా భ్యాసమునకు ధ్యానసమాధులు పరమావధులు. కుండలినీ శక్తి

రూపిణియగు దేవికి, మనుజుల నాభిప్రాంతముల నున్న మూలా ధార చక్రము నెలవు. ఆశక్తియే పృథివి అగ్నిజలము పవనము ఆకాశము అను పంచభూత తత్వములతో ప్రకాశించు మూలాధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత విశుద్ధ చక్రములందు వరుసగా వ్యాపించి ఆరవదియగు మనస్తత్వమను అజ్ఞాచక్రమున (భ్రూమధ్య ప్రదేశమున) సదా శివునితో కలసి పరమాత్మ రూప మున సహస్రారమున క్రీడించుచు సాధకులకు జ్ఞానచైతన్యానంద ప్రసారము నొసగును. ఆ దివ్యానందానుభూతియే పరమేశ్వర భావము. సాధకుని దేహము నందున్న డెబ్బది రెండువేల నాడు లకు పుష్టి కలిగించి తిరిగి ఇడా(చంద్ర) నాడిద్వారా స్వస్థానమగు మూలాధారమును జేరి సుషుమ్న ద్వారమున కుండలినీ శక్తి విశ్రాంతి గైకొనును-కుండలినీ శక్తి ఆధార కుండము నందున్న రంధ్రమున తామర దారము పోటి ఆకృతి గలిగి యుండును- నిశ్చల ధ్యానసాధనచే ఈశక్తిని మేల్కొలిపి సహస్రారము వరకు వ్యాపింప జేసి తిరిగి ఆ శక్తి మూలాధారము చేరువరకు గల దివ్యానందామృత మాస్వాదించ గలిగిన సాధకుడే యోగి.

ఆచరింపదగిన సదాచారములలో సంధ్యోపాసన ఛాల ముఖ్యమైనది పవిత్రమైనది శక్తిమంతమైనది, సంధ్యోపాసన ముగించిన తరువాతనే తదుపరి జపములు పూజలు నిర్వర్తింప వలయును. దినాంతము వరకు జీవనమును సన్మార్గములకు ద్రిప్పి సత్ఫలితముల నిచ్చునది గాయత్రీజపసహిత సంధ్యోపా

సనమే, గాయత్రీమంత్ర మహిమ వలననేగదా గౌతమ ఋషి తానున్న ప్రాంతముల దుర్భిక్షమును తప్పించి జనులకు శాశ్వతోపయోగ కరములగు జలాధారములను సృష్టించెను. శౌనకాది మహామునులారా మీకి గౌతమ ఋషికథను, గాయత్రీ మంత్ర ప్రభావమును ఈ వరకేనుడివితిని- మీరెన్నడును సంధ్యోపాసనను విడువకుడు గాయత్రీ మంత్ర విశిష్టతను గూర్చి మఱికొంత వివరముగ నుడివెదను వినుడని సూత మహర్షి తన ప్రవచనమును సాగించెను:

## మితాహారము

సదాచార నిర్వహణములో సాధకునకు తోడ్పడునది దేహస్వాస్థ్యము, స్వాధీనమున నున్న చిత్తశుద్ధియు. మితము పరిశుద్ధము కాలనియమము కలిగిన ఆహారపద్ధతుల వలన ఆరోగ్యము కలుగును. పూజాతత్పరులకే కాదు సర్వజనులకును మితాహారము చాల ప్రయోజనకరము. గృహస్థున కెనిమిది కబళములు, వానప్రస్థునకు నాలుగు కబళముల అన్నము చాలునని శాస్త్రవచనము. దీనికితోడు ప్రవర్తనము కూడ ధర్మవిహితమై సర్వకార్యముల యందు సాగినచో సదాచారముల సత్ఫలితములు అతిశీఘ్రముగనె లభించును,

శ్రీ — శ్రీ — శ్రీ

# శ్రీపరమేశ్వరి

## స్కంధము-12

### గాయత్రి మంత్రము, స్తవము, సహస్రనామములు

నారదుడు వేదగానారాయణుడు సాధకునకు బ్రహ్మసాక్షాత్కారము, మత్స్యం జయత్వము భుక్తిముక్తులు, దీవి అను గ్రహమును కలుగ జేయు గాయత్రి ప్రశస్తిని సవిస్తరముగ వివరించెను. ఆవిషయములనే సూతపౌరాణికుడు శౌనకాదులకిట్లు నుడివెను.

దేవీ నవాక్షర మంత్రమువలె గాయత్రి గురూపదేశమువలననే పొందదగినది. గురు శిక్షణ ననుసరించి సలిపిన జపతపాదులే సత్ఫలప్రదములు - అతి పవిత్రములైన ఈ మంత్రములు అతి శక్తిమంతములు సర్వాభీష్ట ప్రదములుకూడ. గాయత్రి ఉపాసన తరువాతనే ఇతర మంత్రానుష్ఠానములు ఆచరణీయములు. సంధ్యా వందనము గాయత్రీ జపవిధానము వేదమంత్రములతో కూడి యున్నది-వేదశాస్త్రములనుండి బ్రహ్మదేవుడు గాయత్రి స్తోత్రమును సహస్ర నామములను రచించెను. ఈ పదముల స్వర సంధానమునందే పరిపూర్ణ మహత్త్వమున్నది. ఈ స్వరముల ఉచ్చారణ ఆరోహణ అవరోహణములు, మంత్రసహోచితమైన హస్తముద్రలు పరిపూర్ణముగ గురువువద్దనేర్చి అను సరింపవలయును.

గాయత్రి ఋష్యాదికములను వర్ణములను ఛందములను శక్తులను కవచమును హృదయమును తెలిసికొని, పూర్ణదీక్షా పరుడై జగదంబను ధ్యానమందుంచి పూజించు చుండవలెను. గాయత్రీ స్తవమునకు, బ్రహ్మఋషి, అనుష్టుప్ ఛందము, దేవి గాయత్రి, హల్లులు బీజములు, అచ్చులు శక్తులు, మాతృకాక్షరములు అంగన్యాస కరన్యాసములు,

బ్రాహ్మణునందధిష్ఠాన దైవమై గాయత్రి విలసిల్లును. ఇతర జపముల యందుకన్న గాయత్రి జపమున పాటింపవలసిన విధులెక్కువ-యథావిధిగ సంధ్యోపాసన, గాయత్రీస్తవ జపములు 'ఆదిత్యం విష్ణుం అంబికాం గణనాథం మహేశ్వరం' అను పంచాయతన పూజలు ముగించి, దేవీపూజగావించి తక్కు దేవతా పూజలు గావించుట విధ్యుక్తము.

గాయత్రి కవచపఠనము, సహస్రనామ పఠనము గాయత్రి మంత్ర జపముపలనను యజ్ఞ యాగాదులొనర్చిన ఫలము, సుఖ జీవనము బ్రహ్మ సాక్షాత్కారాది పరమార్థ ప్రాప్తియు లభించును.

## గాయత్రి స్తవము

"దేవీ జగన్మాతా గాయత్రి నీకిదే వందనము. సర్వజగదారాధ్యవు సర్వశరణ్యవు సర్వజగముల రక్షించు జననివి నీవు. లోకుల కవశ్యకములయిన భుక్తిముక్తులు నీ ప్రసాదములు. నీ వాత్సల్యమును, నీమహిమను నీప్రభావమును వర్ణింప బ్రహ్మాది దేవతలకే అసాధ్యము. మనోనిమనోగోచరమగు నీ చిత్కళా స్వరూపమును ధ్యానించుచు నీకు మరల మరల ప్రణతులర్పింతుము, జగజ్జననీ అరుణపీత శ్వేత హరి నీల ధవళ వర్ణరమణీయగుమ వదన పంక్తియు, చంద్ర సూర్యుల బోలు చక్షూయుగము నవరత్న రాజిత కిరీటముగల మహనీయ రూపతేజఃకిరణముగు సర్వజగములు నిండు నటుల హంసవాహనవై అబ్జపీఠమున వెలుగు శ్రీగాయత్రీ! విశ్వసవిత్రీ! నీకివే సత్కృతి పూజలు. మానమస్కారములు స్వీకరింపుముతల్లీ! నీ శ్రీకర కరుణార్ద్రమృదు నీక్షణముల మమ్ము వాత్సల్యమొలుక చూచి నిత్యమును రక్షింపుముతల్లి "

గాయత్రి స్తవమునిట్లు హృదయ పూర్వకముగ సల్పి, గాయత్రి నామములను పారాయణ జేయవలెను.

ఓం అచింత్య లక్షణా, అవ్యక్తా, అర్ధమాత్రా అమృతార్ణవ మధ్యస్థా, అజితా, అపరాజితా, అణిమాది గుణాధారా, అర్కమండల సంస్థితా, అజరా అజా, అపరా, అధర్మా, అక్షసూత్రధరా, అధరా, అకారాదిక్షకారాంతా, అరిషడ్వర్గభేదినీ, అంజనాద్రి ప్రతీకాశా, అంజనాద్రినివాసినీ, అదితీ, అజపా, అవిద్యా, అరవిందనిభేక్షణా, అంతర్బహిస్థితా, అవిద్యాధ్వంసినీ, అంతరాత్మికా, అజా అజముఖావాసా, అరవిందనిభాననా, అర్ధమాత్రా అర్థదా, అనఘా, అరిమండలమర్దనీ, అసురఘ్నీ, అమావాస్యా, అలక్ష్మీఘ్నీ, అంత్యజార్చితా, ఆదిలక్ష్మీ, ఆదిశక్తిః ఆకృతిః, ఆయతాననా, ఆదిత్యపదవీచారా, ఆదిత్యపరిసేవితా, ఆచార్యావర్తనా, ఆచారా, ఆదిమూర్తినివాసినీ ఆగ్నేయీ అమరీ ఆద్యా ఆరాధ్యా, ఆసనస్థితా ఆధారనిలయా, ఆధారా, ఆకాశాంతనివాసినీ, ఆద్యాక్షరసమాయుక్తా అంతరాకాశరూపిణీ ఆదిత్యమండలగతా అంతరధ్వాంతనాశినీ ఇందిరా, ఇష్టదా ఇష్టా, ఇందీవరనిభేక్షణా, ఇరావతీ, ఇంద్రపదా, ఇంద్రాణీ, ఇంద్రరూపిణీ ఇక్షుకోదండసంయుక్తా, ఇషుసంధానకారిణీ, ఇంద్రనీలసమాకారా ఇడాపింగళరూపిణీ, ఇంద్రాక్షీ, ఈశ్వరీ, ఈహాత్రయవర్జితా, ఉమా ఉషా, ఉడునిభా, ఉర్వారుకఫలాననా, ఉడుప్రభా, ఉడుమతీ ఉడుపా, ఉడుమధ్యగా, ఊర్ధ్వచారిణీ, ఊర్ధ్వకేశా, ఊర్ధ్వాధోగతి భేదినీ, ఊర్ధ్వబాహుప్రియా, ఊర్మిమాలా, వాగ్గ్రంథదాయినీ, ఋతా ఋషిః, ఋతుమతీ ఋషిదేవనమస్కృతా, ఋగ్వేదా, ఋణహర్త్రీ ఋషిమండలచారిణీ, ఋద్ధిదా ఋజుమార్గస్థా, ఋజుధర్త్రీ

ఋతుప్రదా, ఋగ్వేదనిలయా, ఋజ్వాలుప్తా ధర్మప్రవర్తినీ. ౙతా రివరసంభూతా ౙతాదివిధవిహారిణీ,ఏకా, ఏకాక్షరా ఏకమాతా ఏకైకనిష్ఠితా ఐంద్రీ ఐరావతారూఢా, ఐహికాముష్మికప్రదా, ఓంకారా ఓషధీ, ఓతా, ఓతప్రోతనివాసినీ, ఔర్వా, ఔషధ సంపన్నా, ఔపాసనఫలప్రదా, అండమధ్యస్థితా అఃకారమనురూపిణీ కాత్యాయనీ కాళరాత్రి, కామాక్షీ, కామసుందరీ, కమలా' కామినీ, కాంతా, కామదాకలకంఠీ, కరికుంభస్తనభరా, కరవీరసువాసినీ, కల్యాణీ, కుండలవతీ, కురుక్షేత్రనివాసినీ, కురువిందదళాకారా. కుండలీ, కుముదాలయా, కాలజిహ్వా, కరాళాస్యా, కాళికా, కాలరూపిణీ, కమనీయగుణాకాంతిః, కళాధారా, కుముద్వతీ, కౌశికీ, కమలాకారా కామచారప్రభంజనీ, కౌమారీ, కరుణాపాంగీ, కకుబంతా, కరిప్రియా కేశరీ, కేశవనుతా, కదంబకుసుమప్రియా, కాళిందీ కాళికా, కాంచీకలశోద్భవసంస్థితా, కామమాతా, క్రతుమతీ, కామరూపా. కృపావతీ, కుమారీ, కుండనిలయా, కిరాతీ, కీరవాహన, కైకేయీ, కోకిలాలాపా, కేతకీసుమప్రియా, కమండలుధరా, కాళీ, కర్మనిర్మూలకారిణీ, కలహంసగతిః, కక్షా, కృతకౌతుకమంగళా, కస్తూరీతిలకా, కమ్రా, కరింద్రగమనా, కుహూః, కర్పూరలేపనా, కృష్ణా కపిలా, కుహరాశ్రయా, కూటస్థా, కుధరా, కంప్రా, కుక్షిస్థాఖిల దిష్టపా, ఖడ్గఖేటకరా, ఖర్వా, ఖేచరీ, ఖగవాహనా, ఖట్వాంగధారిణీ,

ఖ్యాతా, ఖగరాజోపరిస్థితా, ఖలఘ్నీ ఖండజరా, ఖండాఖ్యానప్రదా
యినీ, ఖండేందుతిలకా, గంగా, గణేశగుహపూజితా, గాయత్రీ,
గోమతీ, గీతా. గాంధారీ, గానలోలుపా, గౌతమీ, గామినీ, గాధా,
గంధర్వాప్సరసేవితా, గోవిందచరణాక్రాంతా, గుణత్రయవిభా
వితా, గంధర్వీ, గహ్వరీ, గోత్రా, గిరిశా, గహనాగమీ, గుహావాసా,
గుణవతీ, గురుపాప, ప్రణాశినీ, గుర్వీ గుణవతీ, గుహ్యా,
గోప్తవ్యా, గుణదాయినీ, గిరిజా, గుహ్యమాతంగీ, కరుణధ్వజ
వల్లభా, గర్వాపహారిణీ, గోదా, గోకులస్థా, గదాధరా, గోకర్ణనిల
యాసక్తా, గుహ్యమండలవర్తినీ. ఘర్మదా, ఘంటా, ఘోరదాన
వమర్దినీ, ఘృణిమంత్రమయీ, ఘోషా. ఘనసంవత్తిదాయినీ,
ఘంటారసప్రియా, ఘ్రాణా, ఘణిసంతుష్టికారిణీ, ఘనకారిమండలా
ఘూర్ణా, ఘృతాచీ, ఘనవేగినీ, జ్ఞానధాతుమయీ చర్చా, చర్చితా,
చారుహాసినీ, చటులా, చండికా, చిత్రా, చిత్రమాల్యవిభూషితా
చతుర్భుజా, చారుదంతా, చాతురీ, చరితప్రియా, చూళికా, చిత్ర
వస్త్రాన్వితా చంద్రమఃకర్ణకుండలా, చంద్రహాసా. చారుదాత్రీ
చకోరీ, చంద్రహాసినీ, చంద్రికా, చంద్రధాత్రీ, చౌరీ చోర
చండికా, చంచద్వాగ్వాదినీ, చంద్రచూడా, చోరవినాశినీ
చారుచందన లిప్తాంగీ, చంచచ్చామరవీజితా, చారుమధ్యా

మార్గస్థా, డమడ్డమరునాదినీ, డిండీరవవహాడింభిల సత్రీక
డాపరాయణా, ఢుంఢివిఘ్నేశజననీ. ఢక్కాహస్తా, ఢిల్లివ్రజా,
నిత్యజ్ఞానా, నిరుపమా నిర్గుణా, నర్మదా, త్రిగుణా, త్రిపధా
తంత్రీ, తులసీ, తరుణా, తరుః, త్రివిక్రమపదాక్రాంతా,
తురీయపదగామినీ, తరుణాదిత్య సంకాశా, తామసితుహినా,
తురా, త్రికాలజ్ఞానసంపన్నా, త్రివళీ, త్రిలోచనా, త్రిశక్తిః,
త్రిపురా తుంగా, తురంగవదనా, తిమింగిలగిలా, తీవ్రా,
త్రిస్రోతా, తామసాదినీ, తంత్రమంత్రవిశేషజ్ఞా, తనుమధ్యా,
త్రివిష్టపా, త్రిసంధ్యా త్రిస్తనీ, తోషానంస్థా, తాలప్రతాపినీ,
తాటంకినీ, తుషారాభా, తుహినాచలవాసినీ, తంతుజాలసమా
యుక్తా, తారహారానళిప్రియా, తిలహోమక్రియా. తీర్థా తమాల
కుసుమాకృతిః, తారకా, త్రియుతా, తన్వీ త్రిశంకుపరి వారితా,
తలోదరీ, తిలా, భూషా, తాటంకప్రియవాహినీ, త్రిజటా, తిత్తిరీ,
తృష్ణా, త్రివిధా, తరుణాకృతీ, తప్తకాంచనసంకాశా, తప్తకాంచన
భూషణా, త్ర్యంబకా, త్రివర్గా, త్రికాలజ్ఞానదాయినీ, తర్పణా.
తృప్తిదా, తృప్తా, తామసీ, తుంబురుస్తుతా, తార్క్ష్యస్థా, త్రిగుణా
కారా, త్రిభంగీ, తనువల్లరీ, థాత్కారీ, థారవా, థాంతా,
దోహిని, దీనవత్సలా, దానవాంతకరీ, దుర్గా, దుర్గాసుర నిబర్హిణీ
దేవరీతిః, దివారాత్రిః, ద్రౌపదీ, దుందుభిస్వనా, దేవయానీ
దురావాసా దారిద్ర్యభేదినీ దివా దామోదరప్రియా దీప్తా

దిగ్వాసాః దిగ్విమోహినీ దండకారుణ్యనిలయా దండినీ, దేవపూజితా. దేవవంద్యా, దివిషదా, ద్వేషిణీ,, దానవాకృతిః దీనానాథస్తుతా దీక్షా దైవతాదిస్వరూపిణీ ధాత్రీ ధనుర్ధరా ధేనుః ధర్మచారిణీ, దురంధరా, ధరాధారా, ధనదా, ధాన్యదోహినీ, ధర్మశీలా, ధనాధ్యక్షా. ధనుర్వేదవిశారదా, ధృతీ ధన్యా ధృతపదా, ధర్మరాజప్రియా, ధ్రువా, ధూమవతీ, ధూమకేశీ, ధర్మశాస్త్రప్రకాశినీ, నందానందప్రియా, నిద్రా, నృనుతానందనాత్మికా నర్మదా నళినీ నీలా నీలకంఠసమాశ్రయా నారాయణప్రియా నిత్యా నిర్మలా నిర్గుణా నిధిః, నిరాధారా నిరుపమా నిత్యశుద్ధా నిరంజనా, నాదబిందుకళాతీతా, నాదబిందు కళాత్మికా, నృసింహినీ, నగధరా నృపనాగవిభూషితా, నరకక్లేశశమనీ, నారాయణపదోద్భవా, నిరవద్యా నిరాకారా, నారదప్రియకారిణీ, నానాజ్యోతిస్సమాఖ్యాతా, నిధిదా, నిర్మలాత్మికా, నీతిః నవసూత్రధరా, నిరుపద్రవకారిణీ, నందజా, నవరత్నాఢ్యా, నైమిశారణ్య వాసినీ, నవనీతప్రియా, నారీ, నిమేషిణీ, నీలజీమూతనిస్వనా, నదీరూపా, నీలగ్రీవా, నిశీశ్వరీ, నామావళిః, నిశుంభఘ్నీ నాగలోకనివాసినీ, నవజంబూనదప్రఖ్యా, నాగలోకాధి దేవతా, నూపురాక్రాంతచరణా నరచిత్తప్రమోదినీ, నిమగ్నా, నిర్ఘాతసమనిస్వనా, నందనోద్యాననిలయా, నిర్వ్యూహోపచారిణీ, పార్వతీ, పరమోదారా, పరబ్రహ్మ

త్మికా, పరా, పంచకోశవినిర్ముక్తా, పంచపాతకనాశినీ, పరచిత్త విధానజ్ఞా. పంచికా, పంచరూపిణీ, పూర్ణిమా పరమా, ప్రీతిః, పర తేజ: ప్రకాశినీ, పురాణీ, పౌరుషీ పుణ్యా. పుండరీకనిభేక్షణా, పాతాళతలనిర్మగ్నా, ప్రీతా, ప్రీతివివర్ధనీ, పావనీ, పాదసహితా, పేశలా వనాశినీ, ప్రజావతీ, పరిశ్రాంతా పరతస్తమండలా పద్మప్రి యా పద్మసంస్థా, పద్మాక్షీ, పద్మసంభవా, పద్మపత్రా, పద్మపదా, పద్మినీ, ప్రియాభాషిణీ, పశుపాకవినుర్ముక్తా, పురంధ్రీ, పురవాసినీ. పుష్కలా, పురుషావర్వా, పారిజాతసుమప్రియా, పతివ్రతా, పవిత్రాంగీ, పుష్పహాసా, పరాయణా. ప్రజ్ఞావతీసుతా, పౌత్రిపుత్ర పూజ్యా, పయశ్వినీ, పట్టిపాశధరా, పంక్తిః పితృలోక ప్రదాయినీ పురాణీ, పుణ్యశీలా, ప్రణతార్తి వినాశినీ, ప్రద్యుమ్న జననీ, పుష్టా పితామహపరిగ్రహా, పుండరీక, పురావాసా, పుండరీకసమాననా, పృథుజంఘా పృథుభుజా, పృథుపాద, పృథూదరి ప్రవాళశోభా, పింగాక్షీ, పీతవాసా, ప్రచాపలా, ప్రసవా, పుష్టిదా, పుణ్య, ప్రతిష్ఠా ప్రణవాగతిః పంచవర్ణా. పంచవాణీ, పంచిక, పంజరస్థితా, పరమాయా పరంజ్యోతిః, పరప్రీతిః పరాగతిః పరాకాష్ఠా, పరేశానీ, పావనీ, పానకద్యుతిః, పుణ్యభద్రా, పరిచ్ఛేద్యా, పుష్పహాసా పృథూదరా, పీతాంగీ, పీతవసనా, పీతశయ్యా, పిశాచినీ, పీతక్రియా పిశాచఘ్నీ, పాటలాక్షీ. పటుక్రియా, పంచభక్ష్య, ప్రియాచారా

పూతనాప్రాణ ఘాతినీ, పున్నాగవనమధ్యస్థా, పుణ్యతీర్థనిషేవితా, పంచాంగీ, పరాశక్తిః, పరమాహ్లాదకారిణీ పుష్పకాండస్థితా, పూషా పోషితాఖిల విష్టపా, పానప్రియా, పంచశిఖా, పన్నగోపరిశాయినీ పంచమాత్రాత్మికా, పృథ్వీ, పదికా, పృథుదోహినీ పురాణన్యాయ మీమాంసా, పాటలీ, పుష్పగంధినీ, పుణ్యప్రజా, పాదదాత్రీ, పరమార్గయికగోచరా, ప్రవాళశోభా, పూర్ణాశా, ప్రణవాపల్లవోదరీ, ఫలినీః ఫలదా, ఫల్గుః, ఫూత్కారీ, ఫలకాకృతిః, ఫణీంద్రభోగ శయనా, ఫణిమండలమండితా, బాల బాలా, బహుమతా, బాలా తపనిభాంశుకా, బలభద్రప్రియా, వంద్యా, బడబా, బుద్ధిసంస్థితా, బందిదేవీ, బిలవతీ, బడిశఘ్నీ, బలిప్రియా, బాంధవీ, బోధితా బుద్ధిః బంధూకకుసుమప్రియా, బాల భాను ప్రభాకారా, బ్రాహ్మీ బ్రాహ్మణదేవతా, బృహస్పతిస్తుతా బృందా, బృందావన విహారిణీ, బలాకినీ, బిలా హారా, బిలావాసా, బహూదకా, బహునేత్రా, బహు పదా, బహుకర్ణావతంసికా, బహుబాహుయుతా, బీజరూపిణీ, బిందు నాదకళాతీతా, పద్ధగోధాంగుళిత్రాణా, బదర్యాశ్రమవాసినీ, బృందా కా, బృహత్స్కంధా బృహతీ, బాణపాతినీ, బృందాధ్యక్షా. బహు ంతా, బహువిక్రమా, బద్ధపద్మాసనాసీనా, బిలపత్రతలస్థితా బోధిద్రుమనిజావాసా, బడిస్థా బింబదర్పణా, బాలా బాణా

సనవతీ, బడబానలవేగినీ, బ్రహ్మాండ బహిరంతస్థా, బ్రహ్మకంకణ సూత్రినీ, భవానీ, భీష్ణవతీభామినీ, భయహారిణీ, భద్ర కాళీ, భుజంగాక్షీ, భారతీ భారతాశయా భైరవీ, భీషణా కారా, భూతిదా, భూతిమాళిని భావినీ, భోగనిరతా, భద్రితా, భూరివిక్రమా, భూతవాసా, భృగులతా, భార్గవీ భోగినీ, భాషా, భూరిదక్షిణా, భర్గాత్మికా, భీమవతీ, భవబంధవిమోచనీ, భజనీయ, భూతధాత్రీ, రంజితా, భువనేశ్వరీ, భీమా భుజంగవలయా, భేరుండా, భాగధేయినీ, మాతా, మాయా మధుమతీ, మధుజిహ్వా, మధుప్రియా, మహాదేవీ, మహాభాగా, మాలినీ, మీనలోచనా, మాయాతీతా, మధుపతీ, మధుమాంసా, మధుద్రవా, మానినీ' మధుసంభూతా, మిథిలాపురవాసినీ, మధు కైటభసంహర్త్రి మేదినీ మేఘమాలినీ, మందోదరీ. మహామాయా మైథిలీ, మసృణప్రియా, మహాలక్ష్మి మహాకాళీ, మహామాహే శ్వరీ, మహేంద్రి, మేరుతనయా. మందారకుసుమార్చితా, మంజుమంజీరచరణా, మోక్షదా, మంజుభాషిణీ, మధురవాసినీ, ముద్రామలయా, మలయాన్వితా, మేధా మరకతశ్యామా మాగధీ, మేనకాత్మజా, మహామారీ, మహావీరా మహాశ్యామా మనుస్తుతా, మాతృకా, మిహిరాభాసా, ముకుందపదవిక్రమా, మూలా ధారస్థితా, ముగ్ధా మణిపూరకవాసినీ, మృగాక్షీ, మహిషారుఢ మహిషాసురమర్దనీ, యోగాసనా, యోగగమ్యా, యోగా

యౌవనగాత్రశయా యౌవనీ, యుద్ధమధ్యస్థా, యమునా యుగధారిణీ, యక్షిణీ, యోగయుక్తా, రాజప్రసూతినీ యక్ష యాత్రి. యానవిధానజ్ఞా, యదువంశసముద్భవా, యకారాదిహకారాంతా, యజుషి యజ్ఞరూపిణి, యామినీ, యోగనిరతా, యాతుధానభయంకరీ, రుక్మిణీ, రమణీ రామా, రేవతి, రేణుకా, రతి, రౌద్రీ రౌద్రప్రియాకార, రామమాతా, రతిప్రియా, రోహిణీ, రాజ్యదా, రేవా, రమా రాజీవలోచనా, రాకేశీ రూపసంపన్నా, రత్నసింహాసన స్థితా, రక్తమాల్యాంబరధరా, రక్తగంధానులేపనా, రాజహంససమారూఢా రంభా రక్తబలిప్రియా. రమణీయ యుగాధారా, రాజితాఖిలభూతలా, రురుచర్మపరీధానా, రథినీ. రత్నమాలికా, రోగేశీ, రోగశమనీ, రావిణీ, రోమహర్షిణీ, రామచంద్ర పరాక్రాంతా, రావణచ్ఛేదకారిణీ, రక్తవస్త్రపరిచ్ఛన్నా, రథస్థా, రక్తనయనా, రుక్మభూషణా, లజ్జాధిదేవతా, లోలా, లలితా, లింగధారిణీ. లక్ష్మీలోలా, లుప్తవిషా, లోకినీ, లోకవిశ్రుతా, లజ్జా లంబోదరీ, లలనా లోకధారిణీ, వరదా, వందితా, విద్యావైష్ణవీ, విమలాకృతిః, వారాహి, వీరజా, వర్షా, వరలక్ష్మీ విలాసినీ, వ్యోమమధ్యస్థా, వారిజాసన సంస్థితా, వారుణీ వేణుసంభూతా, వీతిహోత్రా, విరూపిణీ, వాయుమండలమధ్యస్థా, విష్ణురూపా, విధిప్రియా, విష్ణుపత్నీ; విష్ణుమతీ విశాలాక్షీ, వసుంధరా; వాసుదేవ ప్రియా; వేళా! వజ్రిణీ; వసుదో

హినీ; వేదాక్షరపరీతాంగి; వాజపేయఫలప్రదా; వాసవీ; వామ జననీ; వైకుంఠనిలయా; వరా; వ్యాసప్రియా; వర్మధరా; వాల్మీకిపరిసేవితా, వనితా, శాకంబరీ, శివా శాంతా; శారదా; శరణాగతిః, శాతోదరీ, శుభాచారా, శుంభాసుర మర్దనీ, శోభావతీ, శివాకారా, శంకరార్ధ శరీరిణీ, శాణా, శుభాశయా, శుభ్రా, శిరస్సంధానకారిణీ, శరావతీ శరానందా, శరజ్జ్యోత్స్నా, శుభాననా, శరభాశూలినీ, శుద్ధా, శబరీ, శుకవాహనా, శ్రీమతీ శ్రీధరా నందశ్రవణానందదాయినీ, శర్వాణీ, శర్వరీవంద్యా, షడృతుప్రియా, షడాధారస్థితా, షణ్ముఖప్రియకారిణీ, షడంగరూపా, సుమతీ, సురాసుర నమస్కృతా, సరస్వతీ, సదాధార, సర్వమంగళకారిణీ సామగానప్రియా, సూక్ష్మా, సావిత్రీ, సామసంభవా, సర్వవాసా, సదానందా, సుస్తనీ, సాగరాంబరా, సర్వైశ్వర్యప్రియా సిద్ధిః, సాధు బంధు పదక్రమా. సప్తర్షిమడల గతా, సోమమండలవాసినీ, సర్వజ్ఞా, సాంద్రకరుణా, సమానాధివర్జితా. సర్వోత్తుంగా సంగహీనా, సద్గుణా సకలేష్టదా, సరఘా, సూర్యతనయా, సుకేశీ సోమసహంతి, హిరణ్యవర్ణా, హరి హ్రీంకారి, హంసవాహినీ క్షౌమ వస్త్రపరీతాంగి, క్షీరాబ్ధితనయా, క్షమా, గాయత్రీసావిత్రీ పార్వతీ, సరస్వతీ, వేదగర్భా వరారోహా శ్రీ గాయత్ర పరాంబికా నమస్తే నమస్తే నమః.

తాను నుడువు ప్రతివాక్యమును శ్రద్ధగా వినుచు చిత్తము లందు అవగాహన మొనరించు కొనుచున్న శౌనకాది మునులను జూచి సూతుడిట్లు నుడివెను.

ఓ మహామునులారా, దేవీభక్తులారా, దేవీభాగవత కథ నింత శ్రద్ధాభక్తులతో వినిన మిమ్ములను జూచిన కొలదియు, మీకు దేవీ మహిమను గూర్చి బోధించుచున్న కొలదియు నా సంతోషమునకు మేరలేదు, ఇంత ఉత్సాహము సంతోషము కలిగించు చున్నది. ఆ దేవియే. ఆపరమేశ్వరి పూజలు జపములు మీరు యథావిధి చేయుచుందురు గాక, ఆ దేవి అనుగ్రహము మీయందు పరిపూర్ణముగ నుండును గాక.

ఆ జగదంబ పూజావిధానము, స్థలనిర్దేశము, పూజాంగణ నిర్మాణము పూజాదినములు, పూజాద్రవ్యములు, కన్యకాపూజలు మున్నగునవెన్నియో విషయములు మీరితఃపూర్వమే వినియున్నారు. దేవిని విస్మరించి ద్వేషించిన వారికి వారి కర్మానుఫలముగ ప్రాప్తించిన బాధలు, దేవిని పూజించి దేవీ భక్తులైన వారికి గలిగిన లాభములను గూర్చియు గూడ వినియున్నారు. దేవీ మహిమ, దేవీ వైభవము, దేవియొనర్చిన సత్కార్యములు దేవిఅవతారములను గూర్చియుఎంత చెప్పినను తరుగదు. మరల మరల వానిని తలచుకొనుచు ఆ జగజ్జననిని ధ్యానించుచు ఆ పరమేశ్వరి నామ సంస్మరణానందము ననుభవించి ఆమె కృపకు పాత్రులగుట మనవిధి.

ఇక ఆ దేవదేవి పూజాఫలములను గూర్చి మఱి రెండు మాటలు వినుడు.

దేవీపూజకు పాటించవలసిన ముఖ్యవిధులను విస్మరింప తాదు. భక్తులు ప్రత్యూషముననే స్నానాదిది కాలకృత్యములు నిర్వర్తించి సంధ్యోపాసన ప్రప్రథమమున సలుపవలయును ఆచమనము, సంకల్పము, సలభూతశుద్ధులు, దేవీ ప్రతిమను పీఠమునందుంచుట, దేవీ ధ్యానము శంఖపూజ ఆవాహనము అర్ఘ్యపాద్యములు పరిమళసుమములు పంచామృతములు మాల్యములు శుభ్రవస్త్రములు తొడవులు గంధములు ధూపదీపములు విడెము దక్షిణ నైవేద్యము మున్నగు సర్వ షోడశోపచారములు నృత్య గీత కీర్తనలు నీరాజనము ప్రదక్షిణము సాష్టాంగనమస్కృతి పూజా ప్రసాద స్వీకృతి దేవీకథా శ్రవణము-కావింపవలయును.

దేవికి పూవులపూజ చేయుచో శివలోక ప్రాప్తియు, పట్టుబట్టల నిచ్చిన వాయులోక సౌఖ్యము, కోటి దీపార్చన వసుధేశ పద ప్రాప్తి, కోటి మాలతిపూలతో పూజ వలన బ్రహ్మతో సామ్యము, పదికోట్ల పూలతో పూజ విష్ణువుతోసాటి, కర్పూర దీపార్చన వలన భానులోక ప్రాప్తియు ఫలములని శాస్త్రములు ఘోషించుచున్నవి. అది నుండి పూజాంతము వరకు వేదపారాయణము చేయించ వలయును.

ఇది సంపూర్ణ పూజావిధానము, ఆ పరాంబిక దయ అపారము. భక్తులను రక్షించుట, వారికి వలయు ఇహపర సౌఖ్యానందము లొసగుటయు అ పర దేవత కమితప్రియము సదాచారములుగల గృహమే దేవికి నిలయము. సదాచారము నందే దేవి రూపమున్నది. సదాచారములు అనందదాయకములు శుచిత్వ శోభితములు కావున సర్వులకు ఆచరణీయములు. ఒకరిని చూచి నేర్చుకొనగల్గిన సులభవిద్యలు సదాచారములు-సదాచారములు దైవభక్తికి మూలములై జీవనమును ధన్యమొనర్చును

శ్రీ పరమేశ్వరీ గాథల నిట్లు వ్యాసుని వలన వినిన జనమే జయుడు, సూతుని వలన వినిన శౌనకాదిమునులు సంతుష్టాంతరంగులై ఆ జగన్మాతను యథావిధిగ పూజించి చరితార్థులైరి. దేవీకథా శ్రవణ ఫలమును గూడ ఆ ఆచార్యవర్యుడిట్లు విశదీకరించి నుడివెను.

పాలకడలిలో వటపత్రశాయి యైన పద్మాక్షునకా పరమేశ్వరియే దేవీ భాగవతమును శ్లోకార్థభణితి నుపదేశించినది. శ్రీహరి వలన దేవీ చరిత్రము వినిన బ్రహ్మయే దానిని తొల్త కోటి గ్రంథములుగ వ్రాసెను. అమరులా చరిత్ర మనను దినము పఠింతురు వేద విద్యాతత్త్వ విపుల సూత్రార్థ బోధనాత్మకమైన యీ పురాణమును ప్రజాశ్రేయమునకై వేదవ్యాస మహర్షి వ్రాసిప్రచారముగావించెను.

ఆ దేవి, ఆపరమేశ్వరి, హ్రీంకారిణి, అఖిల రూపిణి సర్వలోకైకమాత, అతిదయాహృదయ, సచ్చిదానంద రూపలక్ష్మి ఈ జగదంబకు పూజలొనర్చినను, ఈ దేవీ చరిత్ర గంధమును భక్తులకు దానమిచ్చినను సంపూర్ణఫలము లభించును.

ఈ దేవీ చరిత్రము పూజింపబడు గృహము లక్ష్మి సరస్వతులకు శ్రీవిజయా భ్యున్నతులకు నిలయమగును, ఈగ్రంథమందనుదిన మొక్క భాగమైనను పఠించి అందలి ధర్మ విషయము గ్రహించి ఆచరింప గలిగిన సహృదయులు పరమేశ్వరీకృపకు అర్హులై శాంతి సౌఖ్యము లందగలరు.

దేవీకథా పఠన శ్రవణాదులవినియోగము, ఇష్టసంసిద్ధి కార్యవిజయము సర్వతోముఖాభ్యున్నతి జ్ఞానసము పార్జనము పుణ్యప్రవర్తన దీర్ఘాయురైశ్వర్యములు తుదకు మోక్షప్రాప్తియని వచింపబడినది. 294-592 SUB

ఈ ఆశయములకనుకూలముగ ఈ పవిత్రగ్రంథము ప్రజల బుద్ధులను ప్రేరేచి పరమేశ్వరీ భక్తుల నొనరించి అజగన్మాత వాత్సల్యాను గ్రహములకు పాతులను జేయుగాక.

ACC NO -1004

ఇట్టి మహనీయ పురాణముల బోధించువారును కడుపూజనీయులు శౌనకాది మునులా విధముగనే సూతపౌరాణికుని అనేక రీతులను తించుచు ఆయన పాదపూజలగావించి దీవనలందిరి.

పరమేశ్వరినే ధ్యానము నందుంచి సూతుడు ఆ మునుల ఆశ్రమమునుండి బయల్వెడలి ఆమునులు చూచు చుండగనే అంతర్ధానుడయ్యెను. ఆ దేవిని ధ్యానించుచు ఆ శౌనకాది మునులును దేవీ తపమొనరించుట కుద్యుక్తులైరి - మంగళమ్ మహత్ శ్రీ శ్రీ శ్రీ Ch. 20200

ఓమ్ తత్ సత్